Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: బహుళ ఏకాదశి సా. 6.21 వరకు, అనంతరం ద్వాదశి; నక్షత్రం: మూల రా. 12.01 వరకు, అనంతరం పూర్వాషాఢ; అమృతకాలం: సా. 4.55 నుండి 6.40 వరకు; వర్జ్యం: ఉ. 8.07 వరకు, రా. 10.15 నుండి 12.01 వరకు; దుర్ముహూర్తం: సా. 4.24 నుండి 5.12 వరకు; రాహుకాలం: సా. 4.30 నుండి 6.00 వరకు; యమగండం: మ. 12.00 నుండి 1.30 వరకు;

సంపుటి:56 • సంచిక:301 • ఆదివారం 11 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల:6.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

రూ.650 కోట్లతో బిల్డింగ్ మెటీరియల్ పార్క్



• ముందుకొచ్చిన దుబాయ్ కంపెనీ కేఈఎఫ్ • ప్రత్యక్షంగా 10వేల మందికి.. పరోక్షంగా మరో 10వేల మందికి ఉపాధి • ఐటీ, పరిశ్రమల మంత్రి కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ నగర శివార్లలో మరో భారీ పార్క్ రానుంది. సుమారు 250 ఎకరాలలో రూ. 650 కోట్ల పెట్టుబడితో పార్క్ ఏర్పాటు చేసేందుకు దుబాయ్‌లో ప్రసిద్ధి చెందిన కెప్ ఇన్‌ఫ్రా సంస్థ ముందుకు వచ్చింది. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి ఈ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు పరిశ్రమల శాఖ మంత్రి కె. తారకరామారావుతో కలిసి కెఫ్ ఇన్‌ఫ్రా, హోల్డింగ్స్ వ్యవస్థాపకులు, ➪ 9వ పేజీలో...



ప్రధాని మోడీకి పాలస్తీనా అత్యున్నత పురస్కారం అందజేస్తున్న అధ్యక్షుడు అబ్బాస్

ఇజ్రాయిల్, పాలస్తీనా భారత్‌కు మిత్రదేశాలే

పాలస్తీనాలో శాంతి చేకూరాలి

- ఇజ్రాయిల్‌తో దోస్తీ పాలస్తీనాకు లాభం: మోడీ
- 50మిలియన్ డాలర్ల ఒప్పందాలపై సంతకాలు
- గ్రాండ్ కాలర్‌తో ప్రధానికి అబ్బాస్ సత్కారం
- బరాసలో భారత్ సహకారం మరువలేనిది: అబ్బాస్

11 లో

కాలంతో పోటీపడుతున్న కాళేశ్వరం

దేశానికే మణిహారం

నీటి ప్రాజెక్టుల నిర్మాణంతోనే వ్యవసాయం అభివృద్ధి, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధ్యమవుతోంది. సమగ్ర గ్రామీణాభివృద్ధితో జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ద్వారా సాకారమవుతుంది.

– 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా

మిషన్ భగీరథ అద్భుతం.. దేశానికే ఆదర్శం • తాగు, సాగు నీటి పథకాలతో తెలంగాణ అగ్రగామి • 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా • అన్నారం బ్యారేజీ సందర్శన • గజ్వేల్‌లో మిషన్ భగీరథ పరిశీలన



క్షేత్రస్థాయిలో కాళేశ్వరం ప్రాజెక్టు పనులు తనిఖీ అనంతరం మ్యాప్‌ను పరిశీలిస్తున్న 15వ ఆర్థిక సంఘం ప్రతినిధులు

మహాదేవపూర్, ప్రభన్యూస్: తెలంగాణ రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం నిధులు వెచ్చిస్తున్న తీరుపట్ల కేంద్ర ఫైనాన్స్ కమిషన్ సంతృప్తి వ్యక్తం చేసింది. కాళేశ్వరం పనుల వేగాన్ని చూసి 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా వాఖ్యానించారు. ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటి సరఫరా చేసే మిషన్ భగీరథ పథకం , భారీ సాగునీటి ప్రాజెక్టు కాళేశ్వరం దేశంలోని అన్నీ రాష్ట్రాలకు మోడల్ కానున్నట్లు 15వ ఫైనాన్సు కమీషన్ కార్యదర్శి అరవింద్ మెహతా అభిప్రాయపడ్డారు. రైతులకు సాగునీరు, ప్రజలందరికి సురక్షిత తాగునీరు అందించే ప్రభుత్వ సంకల్పం గొప్పదని ఆయన అన్నారు. కాళేశ్వరం పనులను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు పరివీలించామని అతి తక్కువ వ్యవధిలో ఇంత అద్భుతంగా పనులు జరుగటం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. మరో నాలుగు నెలల్లో 15వ ఆర్థిక సంఘం ప్రతినిధులందరం వస్తామని అరవింద్ మెహతా తెలిపారు. నిర్మాణంలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం బ్యారేజీ పనులను సందర్శించారు. పనులు జరుగుతున్న ➪ 3వ పేజీలో...



పురుషోత్తం రెడ్డి అక్రమాస్తులు 300 కోట్లు?

ఏసీబీ దర్యాప్తులో రోజురోజుకు వెలుగుచూస్తున్న అవినీతి చిట్టా • మరో ఇద్దరు బినామీలు గుర్తింపు • ఈడీ, ఐటీ విభాగానికి అక్రమాస్తుల వివరాలు అందజేత • పురుషోత్తం రెడ్డిపై లుక్ ఔట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి అక్ర మాస్తులు తవ్వేకొద్దీ వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఇప్పటి వరకూ సుమారు రూ.50 కోట్లు అధికారికంగా గుర్తించిన ఏసీబీ ఇంకా ఆయన బంధువుల ఇళ్లల్లో సోదాలు ➪ 7వ పేజీలో...





హొస్పేట బహిరంగ సభలో రాహుల్ గాంధీ అభివాదం. చిత్రంలో కర్ణాటక సీఎం

అభివృద్ధి - సంక్షేమ కార్యక్రమాలకు చేయూతనివ్వండి

15వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వ నివేదన • తెలంగాణపై ప్రత్యేక దృష్టి • సారించి ఉదారంగా నిధుల విడుదలకు సిఫారసు చేయండి: ఈటల, జోషి

3 లో

రాఫెల్ కుంభకోణం...

మూడు ప్రశ్నలకు మోడీ జవాబివ్వాలి

- కావాలనే స్నేహితుడికి 'రాఫెల్' కాంట్రాక్ట్
- వ్యక్తిగతంగా ఫ్రాన్స్ వెళ్లి మరీ అప్పగింత
- ఎన్డీయే సర్కార్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ధ్వజం
- కర్ణాటకలో జన్ ఆశీర్వాద్ యాత్ర ప్రారంభం

11 లో



ఆర్మీ క్యాంప్‌పై ఉగ్రదాడి

• అమరులైన ఇద్దరు జవాన్లు • అధికారి కుమార్తె సహా ఆరుగురికి గాయాలు • బలగాలు అప్రమత్తం • దాడి వెనక జైషె ఈ మహ్మద్ ఉగ్రసంస్థ హస్తం..? • ఇద్దరు ఉగ్రవాదుల కాల్చివేత

11 లో

4 జోన్లు 3 కేడర్లు

సీఎంకు చేరిన జోనల్‌పై నివేదిక • ఢిల్లీ నుంచి రాగానే కీలక నిర్ణయం • రాష్ట్రపతి ఉత్తర్వుల పరిధిలోకి హైదరాబాద్, సెక్రెటేరియట్, కార్పొరేషన్లు, సొసైటీలు • మల్టీజోనల్‌కు నిరాకరణ • స్థానికతకు అధిక ప్రాధాన్యత • ఇంకా తేలని ఉద్యోగాల పంపకాలు

ముల్కీ విధానంలో భాగంగా 4నుంచి 10వ తరగతి వరకు ఏ ప్రాంతంలో చదివితే అక్కడి స్థానికుడిగా గుర్తించడం ఆరంభమైంది. వారి తల్లిదండ్రులు 15 ఏళ్లుగా ఇక్కడ స్థిర నివాసం పొంది ఉంటే చాలనే నిబంధన అమలయ్యేది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఈ విధానాన్ని సవరించాల్సిన అవసరం ఏర్పడింది. రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించాలంటే అసెంబ్లీలో సవరణలు ప్రతిపాదించాల్సిన ఆవశ్యకత ఉంది.

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జోనల్ వ్యవస్థ ఏర్పాటుపై తుది ముసాయిదా సీఎం కేసీఆర్‌కు చేరింది. ఆయన ఢిల్లీనుంచి రాగానే దీనిపై చర్చించి కీలక నిర్ణయంతీసుకునే అవకాశం కనిపిస్తున్నది. ఇప్పటికే తీవ్ర జాప్యం నెలకొని, ఉద్యోగ ప్రకటనలకు జఠిలంగా మారిన ఈ సమస్యను త్వరగా పరిష్కరించి రాష్ట్రపతి ఉత్తర్వులకు చిన్నపాటి సవరణలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యమంత్రి ఆమోదంతో రాష్ట్రపతి ఉత్తర్వులకు స్వల్ప సవరణలు చేసి కేంద్రానికి పంపాలని యోచిస్తోంది. 4 జోన్లు, మూడు ఉద్యోగ క్యాడర్లను కొనసాగించాలని హైలెవల్ కమిటీ తేల్చినట్లు సమాచారం. మల్టీ జోన్‌ను ఎత్తివేసి స్టేట్, లోకల్, జోనల్ పోస్టులను కొనసాగించాలని డ్రాఫ్ట్‌లో పేర్కొన్నట్లుగా తెలిసింది. స్టేట్ క్యాడర్ పోస్టులను పూర్తిగా కుదించి వేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేస్తున్నట్లుగా సమాచారం. రాష్ట్రపతి ఉత్తర్వుల పరిధిలోకి సచివాలయాన్ని చేర్చడంద్వారా హెచ్ఒడి పోస్టులు, అన్ని ప్రభుత్వ శాఖలకు, జోన్లకు ఉద్యోగుల సమాన బదిలీల వెసులుబాటు కల్గుతుందని ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ప్రధానంగా ఫ్రీజోన్‌గా ఉన్న హైదరాబాద్‌ను ప్రత్యేక జోన్‌గా ప్రకటించడంతోపాటు ఉమ్మడి రాష్ట్రంలో తీవ్ర డిమాండ్ ఉండి స్థానికేతరులకు అడ్డగా మారిన హైదరాబాద్‌ను సైతం రాష్ట్రపతి ఉత్తర్వుల పరిధిలోకి తేవాలని కమిటీ పరిశీలిస్తున్నట్లుగా తెలిసింది. తద్వారా కాలేజీ విద్య, పోలీస్ శాఖ నియామకాల వంటి అంశాల్లో హైదరాబాద్‌కు ఇదివరకు ఉన్న వెసులుబాటును కట్టడి చేయడం ద్వారా నియామకాల్లో స్థానికులకు 80 లేదా 70శాతం దక్కేలా ప్రయత్నాలు ➪ 2వ పేజీలో...

ఏప్రిల్ 27న కాలా రిలీజ్

ప్రపంచవ్యాప్తంగా ఒకేరోజు

10





టెన్త్ విద్యార్థులకు ఉచితంగా టిఫిన్

• హైదరాబాద్‌లో 180 స్కూళ్లలో కలెక్టర్ యోగితా శ్రీకారం • అన్ని జిల్లాల్లో అమలుకు ఆదేశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదవ తరగతి (ఎస్ఎస్‌సి) వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు రెండు నెలలపాటు ఉచితంగా అల్పాహారాన్ని అందజేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఎక్కువ మంది విద్యార్థులు హడావుడిగా ఇంట్లో అల్పాహారం తీసుకోకుండానే తరగతులకు హాజరవుతున్నారన్న విషయాన్ని గుర్తించిన అధికారులు ఈ సమాచారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో వచ్చే రెండు మాసాలపాటు విద్యార్థులకు ఈ సౌకర్యం కల్పించాలని ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. అల్పాహారానికి సంబంధించి ఎంత ఖర్చవుతుందో ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపించాలని ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ ఆయా జిల్లాల కలెక్టర్లను, విద్యాశాఖాధికారులను కోరినట్టు సమాచారం. అయితే హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితారాణా ఇప్పటికే ఈ పథకాన్ని జిల్లాలోని 180 స్కూళ్ళలో అమలు చేస్తున్నట్టు చెబుతున్నారు. తన దగ్గరున్న ➪ 9వ పేజీలో...

• తిరుమలలో మంత్రి హరీష్...



కందులకు మద్దతివ్వండి

• కేంద్రానికి మంత్రి హరీష్ రావు లేఖ • మరో లక్ష మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని వినతి • మార్కెట్‌లో పడిపోయిన ధరలు

వివరాలు 2లో...



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న మంత్రి కేటిఆర్, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రి తలసాని తదితరులు

మురికివాడలు లేని నగరంగా హైదరాబాద్

• 'డబుల్' ఇళ్లకు రూ. 18వేల కోట్లు • ఏడాదిలోగా ఇళ్లను నిర్మిస్తాం: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్‌ను దేశంలోనే అతి సుందరమైన నగరంగా, విశ్వనగరంగా తీర్చిదిద్దు తున్నామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఇందులో భాగంగా నగరంలో మురికివాడలు కనిపించడ కూడదన్న లక్ష్యంతోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఉచిత డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణానికి పూనుకుం దన్నా రు. పేదలపై ఎలాంటి భారం లేకుండా మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ఇలాంటి పథకంలో దేశంలో మరెక్కడా...ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా చేపట్టడం లేదన్నారు.

శనివారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళనిర్మాణ పనులకు మంత్రి కేటీఆర్ శంకు స్థాపన చేశారు. ముందుగా సిక్‌విలేజ్‌లోని మడ్‌ఫోర్డులో 536 ఇళ్ళ నిర్మాణాలకు రూ.41,54 కోట్లతో జీ ప్లస్ 3 పద్ధతిలో 25 బ్లాకుల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మారేడుపల్లిలో 260 ఇళ్ళకు రూ. 28.52 కోట్లను వెచ్చించి జీ ప్లస్ 3 పద్ధతిలో పది బ్లాకుల నిర్మాణ పనులను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో బ్రతకాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయమన్నారు. అందుకే గత ప్రభుత్వాల కంటే భిన్నంగా పేదలకు ఉచితంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ పనులను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. ఈ డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళపై రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.18వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. జీహెచ్‌ఎంసీలో సంవత్సర వ్యవధిలోగా లక్ష ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. స్థల సమస్యల కారణంగా కొన్ని చోట్ల ఇబ్బందులు తలెత్తినప్పటికీ గడువులోగా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళ పనులను పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కేవలం ఇళ్ళ నిర్మాణమే కాకుండా వాటిని అభివృద్ధి చెందిన కాలనీలతో సమానంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇళ్ళ నిర్మాణాలు పూర్తి అయిన ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా పెద్దఎత్తున మొక్కలను నాటుతున్నామన్నారు. అలాగే కాలనీ పార్కులను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. డ్రైనేజీ, నీటి వసతులతో పాటు ప్రకాశవంతమైన వీధిలైట్లను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం నగరంలో రెండువేలకుపైగా మురికివాడలు ఉన్నాయని అన్నారు. వాటిన్నింటిలో ఇళ్ళనిర్మాణాలు చేపట్టి హైదరాబాద్‌ను మురికివాడలు లేని సుందరమైన నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. కేవలం ఇళ్ళ నిర్మాణాలే కాకుండా విశ్వనగరానికి అవసరమైన అన్ని రకాల హంగులను కల్పిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. ఇందులో భాగంగా జేబీ ఎస్ నుంచి శామీర్‌పేట్, ప్యాట్నీ నుంచి బోయిన్‌పల్లి వరకు ఉన్న స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తే వెంటనే స్కైవేల నిర్మాణ పనులు చేపడతామన్నారు.

ఈ మేరకు కేంద్ర రక్షణ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేసినట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. అలాగే కంటోన్మెంట్ హాస్పిటల్‌ను ప్రభు త్వానికి అప్పగిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే పూణే తరహాలో ఇక్కడే ఆర్మడ్ ఫోర్స్ మెడికల్ కాలేజీ వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ, మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు, ఎమ్మెల్యే సాయన్నతో పాటు పలువురు జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

పెట్టుబడుల ఆకర్షణలో మేమే నంబర్ వన్

• ఐటీ ఎగుమతుల్లో 14 శాతం వృద్ధి • ఉపాధి కల్పనలో 14 రంగాల గుర్తింపు • రాష్ట్రంలో మ్యానుఫ్యాక్చరింగ్ ఎక్సలెన్స్ సెంటర్ • సీఐఐ సదస్సులో కేటీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పెట్టుబడులు ఆకర్షించడంలో తెలంగాణ ప్రపంచ స్థాయిలో పోటీ పడుతోందని, పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. సులభతర వ్యాపా రంలో మొదటి స్థానంలో నిలిచామని, ఆర్థికాభివృద్ధిలో కూడా అగ్రస్థానంలో దూసుకుపోతున్నామని ఆయన చెప్పారు. దేశ మొట్టమొదటి ఐటి ఎగుమతుల్లో 14 శాతం వృద్ధితో జాతీయ సగటుకన్నా 5 శాతం అధికంగా సాధిస్తున్నామని ఆయన చెప్పారు. భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) దక్షిణాది ప్రాంతీయ మండలి శనివారం నిర్వహించిన చర్చాగోష్టిలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, నూతన పారిశ్రామిక విధానం టిఎస్-ఐపాస్ వ్యాపార సంస్కరణల రూపకల్పనలో గత మూడేళ్ళుగా ఎంతో కృషి చేశామని, దీని ఫలితంగానే పారిశ్రామిక పెట్టుబడులు, ప్రగతి లో ముందు వరుసలో నిలిచామని అన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి, ఉపాధి కల్పనలో కీలకపాత్ర పోషించే 14 రంగాలను గుర్తించి వాటిని ప్రోత్సహించి విస్తరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో లైఫ్ సైన్సెస్, బల్క్‌డ్రగ్, కెమికల్స్, ఫార్మా, న్యూ ఏజ్ మెడికల్ డివైసెస్, ఐటి తదితర రంగాలు ఉన్నాయని ఆయన తెలిపారు. 18 శాతం వృద్ధి నమోదు చేస్తూ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని కేటీఆర్ చెప్పారు. సాంకేతికతలో వస్తున్న మార్పులు, ఆధునికత కొత్త అవకాశాలు కల్పిస్తుందని ఆయన అన్నారు. టి-హబ్ దేశం లోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్స్ కేంద్రంగా అభివృద్ధి చెందిందని, రెండవ దశకు విస్తరిస్తున్నామని, ఇది ప్రపం చంలోనే అతి పెద్దదిగా నిలుస్తుందని మంత్రి అన్నారు. అతి పెద్ద ప్రోటోటైప్ ల్యాబ్‌తో టి-వర్క్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఇది కూడా దేశంలోనే మొదటిదని ఆయన అన్నారు. ఎలక్ట్రిక్ వాహన విధానాన్ని రూపొందిస్తున్నామని, ఈ రంగంలో పెట్టుబడులు రాబట్టేందుకు అనువుగా ఈ విధానం ఉంటుందని చెప్పారు. ఏరోస్పేస్, రక్షణ రంగంలో హైదరాబాద్ పెట్టుబడుల కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని కేటీఆర్ అన్నారు. గూగుల్, ఫేస్‌బుక్, యాపిల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ సంస్థలు వాటి కేంద్ర కార్యాలయంలో కాకుండా రెండవ యూనిట్లను హైదరా బాద్‌లోఏర్పాటు చేయడం తెలంగాణకే ఆ గౌరవం దక్కిందని ఆయన అన్నారు.

పారిశ్రామిక రంగానికి అవసరమైన నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేసి ప్రోత్సహిస్తున్నామని అన్నారు. మాన్యుఫ్యాక్చరింగ్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేయడంలో సిఐఐ రాష్ట్ర ప్రభుత్వం భాగ స్వామ్యం కావడాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. తెలంగాణ పెట్టుబడులకు స్వర్గధామంగా ఉంటుందని, జపాన్ కు చెందిన అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయని అన్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి, కరీంనగర్ జిల్లాలో గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్లు మంజూర య్యాయని, ఇవి ఏర్పాటైతే ఉత్పత్తి రంగానికి ఎంతో ప్రయోజ నకరంగా ఉంటాయన్నారు. జపనీస్ మ్యానుఫ్యాక్చరింగ్ ఇనిస్టిట్యూట్ రాష్ట్రంలో అడ్వా న్స్‌డ్ లెర్నింగ్ మ్యాను ఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు త్వరలో రాష్ట్రానికి వస్తుందని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐఐ సదరన్ రీజియన్ చైర్మన్ విక్రమ్ కిర్లోస్కర్, తెలంగాణ చైర్మన్ వి.రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రదీప్ ట్వీట్‌కు స్పందించిన కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నటుడు, బుల్లితెర యాంకర్ ప్రదీప్ ట్వీట్‌కు మంత్రి కేటీఆర్ స్పందించారు. చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సమస్యలను మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా తెలియజేశారు. ప్రదీప్ చేసిన ట్వీట్‌పై స్పందించిన మంత్రి కేటీఆర్ విద్యార్థుల సమస్యకు పరిష్కారం చూపాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు సూచించారు. అలాగే వారి సమస్యలను పరిష్క రించి తనకు తెలియజేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కాగా చర్లపల్లి పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్లు, మూత్రశాలల సౌకర్యం సరిగ్గా లేదని, మం చి నీటి సౌకర్యం కూడా లేదని యాంకర్ ప్రదీప్ మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. కాగా తన ట్వీట్‌పై స్పందించిన కేటీఆర్‌కు ప్రదీప్ ధన్యవాదాలు తెలిపారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌పై కేబినెట్ సబ్‌కమిటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఫుడ్‌ప్రాసెసింగ్ విధానంపై కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటుచేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కమిటీ అధ్యక్షునిగా రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యులుగా ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, కెటిఆర్, హరీష్‌రావు, జూపల్లి కృష్ణారావులను నియమించింది. రాష్ట్రంలో సాగుపరిస్థితులు మెరుగైన నేపథ్యంలో.. వ్యవసాయ పద్ధతుల్లో రావాల్సిన మార్పులు, కొత్తగా ఏర్పాటు చేయాల్సిన ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమలపై సలహాలు, పలు రకాల పంటలు, మార్కెటింగ్ సదుపాయాలపై కమిటీ సూచనలు చేయనుంది. మూడునెలల్లోగా నివేదిక అందించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మరోవైపు కేబినెట్ సబ్‌కమిటీ కన్వీనర్‌గా వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

కందులకు మద్దతివ్వండి

• కేంద్రానికి మంత్రి హరీశ్ లేఖ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కందిరైతులను ఆదుకోవాలని కేంద్రప్రభుత్వాన్ని మంత్రి హరీష్‌రావు కోరారు. ఈమేరకు కేంద్ర పౌరసరఫరాల శాఖా మంత్రి రాంవిలాస్‌పాశ్వాన్‌కు లేఖ రాశారు. కందుల కొనుగోళ్ళ పరిమితిని పెంచాలని కోరారు. ఈ సీజన్‌లో కందులు 2.84లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కందుల దిగుబడి రానుందని హరీష్‌రావు చెప్పారు. అయితే 75వేల మెట్రిక్ టన్నులు కొనేందుకు మాత్రమే కేంద్రం అంగీకరించడం పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలని, కంది రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ మంత్రి కోరారు. కనీసం మరో లక్ష మెట్రిక్ టన్నులు కంది కొనుగోలుకు సంబంధిత ఏజెన్సీలను ఆదేశించాలన్నారు. మార్కెట్‌లో కందిరైతులకు మద్దతు ధర లభించడం లేదని, దీంతో కందిరైతుల్లో అశాంతి నెలకొంటున్నదన్నారు. మద్దతుధర క్వింటాలుకు రూ.5,450 ఉండగా, మార్కెట్‌లో రూ.3,800నుండి రూ.4,200కు కంది రైతులు అమ్ముకోవాల్సి వస్తున్నదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కందిపంటపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. రైతులు నిరాశ, నిస్పృహలతో కందిపంటను వేసేందుకు నిరాకరిస్తున్నారన్నారు. దీనివల్ల పప్పుధాన్యాల ఉత్పత్తి తగ్గి ద్రవ్యోల్బణం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

భాగ్యనగరంలో అధునాతన బస్‌స్టాపులు



• మార్చిలోగా 800 నిర్మించాలని నిర్ణయం • గడువులోగా పనులు పూర్తవ్వాలి • అధికారులకు మంత్రి కేటీఆర్ ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భాగ్యనగరానికి అధునాతనమైన బస్సుస్టాపులు రానున్నాయి. ఇప్పటి వరకు అరకొర సౌకర్యాలతో ప్రయాణికులను అనేక ఇబ్బందులకు గురి చేసిన ప్రస్తుత బస్సు షెల్టర్లతో పాటు అందమైన డిజైన్లతో రూపొందించిన వాటిని ఏర్పాటు చేయబోతున్నారు.

హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా బస్సు స్టాపుల నిర్మాణంలోనూ సరికొత్త డిజైన్లతో కూడిన వాటిని ఏర్పాటు చేయాలని తలపెట్టారు. ఈ నేపథ్యంలోఅభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్న బస్సు స్టాపులకు దీటుగా నగరంలో కొత్త బస్సుషెల్టర్లను ఏర్పా టు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం సంబంధిత అధికారులతో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహిం చారు. ప్రస్తుతం నగరంలో ఉన్న బస్టాపులకు కంటే అత్యుత్తమ డిజైన్లు, సౌకర్యాలతో కూడిన వాటిని ఏర్పాటు చేయాలని మంత్రి కేటీఆర్ ఆదేశిం చారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ దాదాపుగా పూర్తి అయిన నేపథ్యంలో మార్చి నెలాఖరు వరకు కొత్తగా 800 బస్సు షెల్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతమున్న బస్సుషెల్టర్ల సౌకర్యాలను బట్టి ఏ,బీ, సీ గ్రేడ్లుగా విభజించి నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఏ గ్రేడ్ బస్సుస్టాపుల సంఖ్యను మరింతగా పెంచాలని మంత్రి కేటీఆర్ సూచించారు. బస్సు స్టాపుల నిర్మాణంలో ఉన్న సమస్యలను తెలుసుకునేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో కూడా పర్యటన చేయాలని మంత్రి ఆదేశించారు. రోడ్డును ఆనుకుని ఉన్న ప్రభుత్వ సంస్థలు, కార్యా లయాలతో చర్చించి ఆయా ప్రాంతాల్లో బస్సుబేలను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం ఆయా ప్రభుత్వ శాఖల కార్యదర్శులతో వచ్చే వారం ఒక సమావేశాన్ని ఏర్పాటు

చేయాలన్నారు. అలాగే మెట్రో కారిడార్లలో బస్సు స్టాపుల ఏర్పాటు కోసం మెట్రోరైలు ఎండీతో సమన్వ యం చేసుకోవాలన్నారు. ఈ పనులు గడువులోగా పూర్తి చేయాలని, లేనిపక్షంలో సదరు ఏజెన్సీలపై చర్యలు తీసుకునందుకు కూడా వెనుకాడవద్దని మంత్రి కేటీఆర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, అదనపు కమిషనర్ అద్వైత్‌కుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

'పల్లె వెలుగు'ల్లో సమాచార వ్యవస్థ

• తొలిదశలో 8500 బస్సుల్లో ఏర్పాటు
• ఆగస్టు నాటికి సిటీ బస్సుల్లో విటీపీఐఎస్
• 2,100 బస్సుల్లో అమలుకు చర్యలు
• బస్‌స్టేజీల్లో ఎల్‌ఈడీ స్క్రీన్‌లు
• బస్సుల్లో డిజిటల్ బోర్డులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పల్లెవెలుగు బస్సు లను లాభాలబాట పట్టించడానికి ఆర్టీసీ సరి కొత్త సాంకేతికతను ప్రవేశపెట్టబోతుంది. గ్రామీణ బస్సు ప్రయాణికులు ప్రైవేటు రవాణాను ఆశ్రయించకుండా బస్సుల రాకపోకలను కచ్చితంగా తెలియచేయడం ఈ సరికొత్త సాంకేతికత ప్రధాన ఉద్దేశం. ప్రయాణికులు వేచి ఉన్న స్టేజీకి తాము ప్రయాణం చేయవలసిన బస్సు ఎంత దూరంలో ఉంది, ఎన్ని నిమిషాల్లో స్టేజీ వద్దకు చేరకుంటుంది అనే సమాచారాన్ని ఎప్పటి కప్పుడు తెలియచేయడం ద్వారా ప్రయాణికులను ఆకట్టుకోవాలని ఆర్టీసీ భావిస్తుంది. దీని కోసం వెహికిల్ ట్రాకింగ్ అండ్ ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (విటీపిఐఎస్) వ్యవస్థను అందుబాటులోకి తేబోతుంది. ఈ అత్యాధునిక సాంకేతికతను తొలి విడతలో 8,500ల పల్లెవెలుగు బస్సులకు అనుసం ధానం చేయబోతున్నారు. మార్చి తొలివారంలోనే విటిపిఐఎస్‌ను పల్లె వెలుగు బస్సుల్లో ప్రయోగా త్మకంగా అమలు జరిపి ఆగస్టు నాటికి గ్రేటర్ హైద రాబాద్ బస్సులకు ఈ సాంకేతికతను అందుబాటులోకి తేవడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ విధానం అమలులోకి వచ్చిన తర్వాత అన్ని బస్ స్టేజీలలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తారు. బస్సుల్లో కూడా డిజిటల్ బోర్డులను అమర్చడం జరుగుతుంది. ఈ [illegible] వివరాలు, వాటి రాకపోకల సమయం, స్టేజీకి బస్సు ఎంత దూరంలో ఉంది, ఎంత సమయంలో స్టేజీ వద్దకు చేరుకుంటుంది, గమ్యం చేరడానికి ఎంత సమయం పడుతుందనే సమాచారం ప్రదర్శించ బడుతుంది. బస్సు లోపల ఉన్న ప్రయాణికులకు కూడా ఈ సమాచారం తెలియచేసే విధంగా డిజిటల్ బోర్డు పై ప్రదర్శించబడటంతో పాటుగా వాయిస్ ద్వారా ప్రకటించడం జరుగుతుంది. బస్సుల రాకపోకలను కేంద్రీకృత వ్యవస్థ ద్వారా ఉన్నతాధికారులు సంబంధిత కార్యాలయాల నుండి పర్యవేక్షించే వెసులుబాటు ఉండటంతో బస్సులు కచ్చితంగా



సమయపాలన పాటించే అవకాశం ఉంది. ఇక మీదట స్టేజీలో బస్సును ఆపకుండా వెళ్లే పరిస్థితి ఉండబోదని ఉన్నతాధికారులు తెలిపారు. ప్రయాణికులు కూడా సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సు కోసం స్టేజీలో వేచి ఉండే అవకాశం ఉంటుందన్నారు. రాబోవు కాలంలో బస్ స్టేజీలలో వైఫై, మంచినీరు, మరుగుదొడ్డి సౌకర్యం కూడా కల్పించే ఆలోచన ఉందన్నారు. విటిపిఐఎస్ కోసం ఇప్పటికే కొన్ని రూట్లను గుర్తించారు. బస్ స్టేషన్లు, స్టేజీల్లో ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేయబోతున్నారు. బస్సుల్లో డిజిటల్ బోర్డులు అమర్చడం జరుగుతుంది. పల్లెవెలుగు బస్సుల్లో ఈ సాంకేతికతను పరిశీలించిన తర్వాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సిటీ బస్సుల్లో ప్రవేశపెట్టడానికి ప్రణాళిక రూపొందించారు. గ్రేటర్‌లో కూడా సుమారు 2,100 బస్సుల్లో విటిపి ఐఎస్‌ను అమలు జరపాలని సంకల్పిం చారు. గ్రేటర్ మున్సిపల్ అధికారులతో సంప్రదించి అత్యాధునిక బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలని ఇప్పటికే కోరడం జరిగింది. అన్ని బస్ స్టాప్‌లో పాటుగా బస్సుల్లో కూడా డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తామని అధికారులు వివరించారు. రాబోవు కాలంలో సిటీ బస్ ప్రయాణికుల కోసం బస్ యాప్‌ను అందుబాటులోకి తేవడానికి కూడా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. సిటీలో నష్టాలను అధిగమించడంతో పాటుగా ప్రయాణికులకు మెరుగైన బస్ సౌకర్యం అందించడంలో భాగంగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొనే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు. బస్సుల రాకపోకలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వల్ల ప్రయాణికుల అవసరాల మేరకు బస్సులు తిప్పడం జరుగుతుందన్నారు. ఏ స్టేజీలో ఎంతమంది ప్రయాణికులు బస్సు కోసం వేచి ఉన్నారనే సమాచారం కూడా ఎప్పటికప్పుడు తెలుసుకొని అవసరమైన పక్షంలో అదనపు బస్సులు వేయడం, అదే సమీప మార్గంలోని బస్సులను అందుబాటులోకి తేవడం లాంటి ప్రత్యామ్నాయాల పై కూడా అధ్యయనం జరుగుతుందని తెలియచేశారు. విదేశాల్లో విటిపిఐఎస్ విజయవంతంగా అమలవుతుందని, తమ సమీప స్టేజీకి వస్సు వచ్చే సమయం తెలుసుకొని ప్రయాణికులు స్టేజీ వద్దకు వస్తున్నందున స్టేజీల్లో ప్రయాణికల రద్దీ కనిపించడం లేదని వెల్లడించారు. నగరంలో సుమారు 2100ల బస్‌షెల్టర్లు ఉండగా తొలి దశలో 1300 బస్ షెల్టర్లను విటిపిఐఎస్ పరిధిలోకి తీసుకురవాడానికి [illegible]



రూ. 250 కోట్లివ్వండి

• దేవాదాయశాఖ బడ్జెట్ ప్రతిపాదన
• సమీక్షించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేవాదాయశాఖకు 2018-19బడ్జెట్‌లో రూ.250కోట్లు కోరాలని గృహనిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన సమీక్షా సమావేశంలో నిర్ణయించారు. శనివారం దేవాదాయ శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో బడ్జెట్ ప్రతిపాదనలు, ఖర్చులు, అంచనాలపై చర్చించారు. ఆలయ ఉద్యోగులు, అర్చకుల వేతనాలు, ధూపదీప నైవేద్యం, నూతన ఆలయాల నిర్మాణాలను దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ఎంచుకున్న ప్రాధాన్యతల మేరకు ఈ సంవత్సరం కావాల్సిన బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు మంత్రికి అధికారులు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.250కోట్ల అంచనా వ్యయంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. కొత్తగా మూడువేల ఆలయాలకు ధూపదీప నైవేద్యపథకం వర్తింపుప్రక్రియపై జిల్లాస్థాయిలో త్వరితగతిన నివేదికలు సిద్ధం చేసి దేవాదాయ శాఖ కమిషనర్‌కు సమర్పించాలని మంత్రి ఆదేశించారు. మరోవైపు ఆలయాల్లో ప్రసాదాల మీద జిఎస్టీ విధించడంపై సంబంధిత అధికారులతో అవగాహనాసదస్సు ఏర్పాటుచేసి చర్చించి పరిష్కారం చూడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ శివశంకర్, అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, జాయింట్ కమిషనర్ కృష్ణవేణి, ఈఎన్‌సి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

4 జోన్లు.. 3 కేడర్లు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తోంది. మల్టీ జోనల్ పరిధిలో హైదరాబాద్‌ను, సచివాయలయం, శాఖాధిపతులను చేర్చేలా కార్యాచరణ చేస్తున్నట్లు సమాచారం. ఇదివరకు సచివాయం, హెచ్‌వోడిలు, హైదరాబాద్ పరిధిలోని ఉద్యోగాలు ఫ్రీజోన్‌గా ఉండటంతోనే అనేక సమస్యలు వచ్చాయని ఉన్నతస్థాయి కమిటీ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే నాలుగంచెల వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేసి జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి క్యాడర్ పోస్టులను కొనసాగించాలని కమిటీ ముసాయిదాను రూపొందించింది. సీనియర్ ఐఏఎస్ అధికారులు అధర్‌సిన్హా, శివశంకర్, సురేష్ చందా, నిరంజన్‌రావులు ఇప్పటికే నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. కొత్త వ్యవస్థ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖల బదలీలకు మరింత వెసులుబాటు కల్గనుంది. అదేవిధంగా సొసైటీలు, కార్పొరేషన్లను కూడా రాష్ట్రపతి ఉత్తర్వుల పరిధిలోకి తెచ్చే అంశం కమిటీ పరిశీస్తోంది.

స్థానిక వాటానే...

ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగ నియామక విధానంలో భాగంగా జిల్లా క్యాడర్‌లో 80 శాతం ఉద్యోగాలు స్థానికులకు, స్థానికేతరులకు 20శాతంగా, జోన్ క్యాడర్‌లో 70శాతం స్థానికులకు, 30శాతం స్థానికేతరులకు, మల్టీ జోనల్ క్యాడర్ పోస్టుల్లో 60శాతం స్థానికులకు, 40శాతం స్థానికేతరులకు రిజర్వ్ చేశారు ఆ విధానం ప్రకారమే ఇప్పటివరకు నియామక ప్రక్రియ కొనసాగిస్తూ వచ్చారు. కీలకమైన రాష్ట్ర స్థాయి క్యాడర్ నియామకాల్లో స్థానిక, స్థానికేతర అనే విభజన లేకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ రిజర్వేషన్లను మాత్రమే ప్రతిపాదించారు. ఈ విధానంతోనే ఏపీకి చెందిన స్థానికేతరులు తెలంగాణ ఉద్యోగాలను కొల్లగొట్టారని ఆందోళనలు చెలరేగాయి. స్థానికేతరులైన ఏపీకి చెందిన వారి పిల్లలు హైదరాబాద్‌లో చదువుతూ లోకల్ కేటగిరీని సాధించారని ఫిర్యాదులు తెలంగాణ ఉద్యమానికి పూర్వమే వెల్లువెత్తాయి., ముల్కీ విధానంలో భాగంగా 4నుంచి 10వ తరగతి వరకు ఏ ప్రాంతంలో చదివితే అక్కడి స్థానికుడిగా గుర్తించడం ఆరంభమైంది. వారి తల్లిదండ్రులు 15 ఏళ్లుగా ఇక్కడ స్థిర నివాసం పొంది ఉంటే చాలనే నిబంధన అమలయ్యేది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఈ విధానాన్ని సవరించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించాలంటే అసెంబ్లీలో సవరణలను ప్రతిపాదించాల్సిన ఆవశ్యకత ఉంది.

తేలని పంపకాలు..

రాష్ట్రంలో దాదాపు 3.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో లక్షమందికిపైగా సెలెక్ట్ క్యాడర్(జూనియర్ అసిస్టెంట్‌కు మించిన స్థాయి)లో ఉన్నారు. కాగా రాష్ట్ర ఆవిర్భావం నుంచీ ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగ బదలీలను పూర్తి స్థాయిలో చేపట్టలేదు. అయితే రెవెన్యూ శాఖలకు చెందిన స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్ వంటి శాఖల్లో ముమ్మరంగా బదలీలు పూర్తి చేశారు. మరోవైపు ఇరు రాష్ట్రాల మధ్య ఉద్యోగ పంపిణీ ఇంకా పూర్తి కాకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగుల పంపకాలు, పోస్టుల గుర్తింపుపై కొంత అనిశ్చితి నెలకొంది. రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 31కి పెరిగిన తర్వాత కొన్ని శాఖల్లో కీలక వివాదాలు నెలకొన్నాయి. కొందరైతే ఏకంగా టూటైర్ విధానంతో లాభం కంటే నష్టమే ఎక్కువని ప్రభుత్వానికి వినతులు చేశారు. కొన్ని శాఖల్లో టూటైర్ విధానంతో నూతన నియామకాలు, పదోన్నతులు, సీనియార్టీకి గండి పడుతుందని ఉద్యోగ సంఘాల నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

మల్టీ జోనల్ పోస్టులలో 600 పోస్టులను రాష్ట్రస్థాయిలో అప్‌గ్రేడ్ చేయాలని నివేదికలో సూచించినట్లు తెలిసింది. అదేవిధంగా మరో 162 పోస్టుల ర్యాంకులను ఎల్‌డిసి(క్లర్క్) కేటగిరీలో నిర్దేశించాలని, రికార్డు అసిస్టెంట్లు, ఉపాధ్యాయులను జిల్లా కేడర్‌లో కొనసాగించాలని నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. జోనల్, మల్టీ జోనల్ పోస్టుల విభజనను జిల్లా, రాష్ట్ర స్థాయిలో పూర్తి చేసిన అధికారుల బృందం పదోన్నతులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అప్పగించనున్నారు. స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, అత్యున్నత పాలనా ప్రభావాలను సమన్వయం చేసుకుంటు రాష్ట్ర, జిల్లా స్థాయి కేడర్‌లను కూర్చినట్లు తెలిసింది. డాక్టర్లు, ఇంజనీర్లు, కళాకారులను జిల్లా స్థాయి కేడర్‌కు పరిమితం చేస్తే ఇబ్బందులు వస్తాయని, స్థానికుల ఉపాధి అవకాశాలను విస్తృతం చేయాలంటే జిల్లా కేడర్‌లో అత్యధిక పోస్టులుంటేనే మేలని ఈ కమిటీ అభిప్రాయపడింది. అయితే అధ్యనంలో భాగంగా జరిపిన భేటీల్లో మెజారిటీ ఉద్యోగ సంఘాలు 80 పదోన్నతుల పోస్టులను జిల్లా కేడర్‌లోనే ఉంచాలని, 20శాతం పోస్టులను రాష్ట్ర కేడర్‌లో నిర్ధేశఉంచినట్లయితే నిరుద్యోగ యువతకు భారీ అవకాశాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. అయితే ఈ నిర్ణయం అమలు చేసినట్లయితే రాష్ట్రస్థాయి కేడర్‌లో సమర్థులైన అధికారుల కొరత ఎదురవనుందని కమిటీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. 80శాతం కోటాను జిల్లాస్థాయి కేడర్‌లో చేర్చినప్పటికీ వారు స్టేట్ లెవల్ పదోన్నతులకు అర్హులేనని నివేదికలో పేర్కొన్నట్లుగా తెలిసింది. అయితే కీలకమైన వైద్య, పశు సంవర్ధక శాఖ, ఐటీ శాఖల్లో తీవ్ర కొరత ఎదురవనుందని ఈ కమిటీ అభిప్రాయపడింది.

శైవ క్షేత్రాలకు టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మహాశివరాత్రి సందర్భంగా హైదరాబాద్ జంటనగరాల నుండి వివిధ శైవ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిస్తుంది. శైవ క్షేత్రాలకు సమీప డిపోల నుండి కూడా ప్రత్యేక బస్సులను నడిపించడానికి ఏర్పాట్లు చేశారు. నగరంలోని పలు ప్రాంతాల నుండి శ్రీశైలం, కీసర, ఏడుపాయల, బీరంగుట్ట జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ తెలిపింది. శ్రీశైలం మహా క్షేత్రానికి 200లు, కీసరకు 288, ఏడుపాయల, బీరంగుట్ట జాతరకు 64 ప్రత్యేక బస్సులను హైదరాబాద్ నుండి ఏర్పాటు చేయడం జరిగింది. భక్తుల అవసరం మేరకు అవసరమైన పక్షంలో అదనపు బస్సులను తిప్పడం జరుగుతుందని ఆర్టీసీ పేర్కొంది. ఈ నెల 11 నుండి 14 వరకు శ్రీశైలం, 12 నుండి 14 వరకు ఏడుపాయల, బీరంగుట్టకు ప్రత్యేక బస్సులను నడిపించబోతున్నారు. కీసరగుట్టకు ఈ నెల 12న 34 ప్రత్యేక బస్సులు, 13న 113 బస్సులు, 14న 117, 15న 24 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. శ్రీశైలం మహా క్షేత్రానికి నగరంలోని మహాత్మాగాంధీ బస్ స్టేషన్, జూబ్లి బస్ స్టేషన్, దిల్‌సుఖ్‌నగర్ బస్ స్టేషన్, ఐ.ఎస్. సదన్, కె.పి.హెచ్‌బి పాయింట్స్ నుండి ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయి. వజ్ర, సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్‌లకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేయడంతో పాటుగా సమీపంలోని ఏటిబి ఏజంట్ల వద్ద, బస్ స్టేషన్లలో టికెట్లను బుక్ చేసుకొనే వెసులుబాటు కలిగించారు. ఈ నెల 11న 28 బస్సులు, 12న 85 బస్సులు, 13న 72 బస్సులు, 14న 15 బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయన్నారు.

అభివృద్ధి - సంక్షేమ కార్యక్రమాలకు

చేయూతనివ్వండి

- 15వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వ నివేదన
- కొత్త రాష్ట్రమైనా.. దేశానికి ఆదర్శంగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం
- ప్రపంచంలోనే అద్భుతంగా చేపట్టిన కాళేశ్వరానికి జాతీయ హోదా ఇచ్చేలా చూడండి
- పల్లెపల్లెకూ మంచినీటి పథకం మిషన్ భగీరథకు నిధులు ఇప్పించండి
- తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించి ఉదారంగా నిధుల విడుదలకు సిఫారసు చేయండి
- ఆర్థిక మంత్రి ఈటల, సీఎస్ జోషిల విజ్ఞప్తి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: దేశంలో ఏ రాష్ట్రం చేపట్టని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సాగుతున్నాయని, వాటిని దృష్టిలోఉంచుకుని ఉదారంగా నిధులు విడుదలకు సిఫార్సు చేయాలని 15వ ఆర్థికసంఘానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. పోరాటాలతో సాధించుకున్న కొత్త రాష్ట్రం అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరింది. మూడు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రా నికి వచ్చిన 15 వ ఆర్థిక సంఘం ప్రతినిధి బృందానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషీ ఈ మేరకు విన్నవించారు. తొలిరోజైన శుక్రవారం నగరంలోని ఎంసిఆర్ హెచ్ఆర్డిలో ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా అధ్యక్షతన జరి గిన దక్షిణాది రాష్ట్రాల సమావేశంలోనూ ఆ తర్వాత శనివారం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన సందర్భంగా కూడా సీఎస్ ఇదే విషయం వివ రించారు. ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ కూడా ప్రతినిధి బృందానికి శుక్రవారం ఇచ్చిన ప్రత్యేక విందు సందర్భంగా కూడా ఇదే విషయం ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ బృందం ఇచ్చే నివేదిక 2020 ఏప్రిల్ నుంచి అమలు కానుంది. వారి సిఫార్సుల మేరకే కేంద్రం నిధులు విడుదల చేస్తుంది. 15 వ ఆర్థిక సంఘం ఏర్పాటయ్యాక తొలి సమావేశం హైదరాబాద్‌లోనే నిర్వహించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులు ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథతో పాటు రాష్ట్ర రాబడులు, వ్యయాలు, ఆర్థిక స్థిరత్వం, నిధుల వినియోగం, కేంద్ర పన్నుల వాటా, కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను గూర్చి కూడా సీఎస్ ఆర్థిక సంఘానికి వివరించారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రా నికి నిధుల కేటాయింపు అంతంత మాత్రంగానే ఉందని, రూ. 40 వేల కోట్ల ప్రతిపాదనలను కేంద్రానికి పంపగా కేటాయింపుల్లో అన్యాయం జరిగిందని కూడా వివరించారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించే మిషన్ భగీరథకు రూ. 19,205 కోట్లు, మిషన్ కాకతీయకు రూ. 5000 కోట్లు ఇవ్వాలని అభ్య ర్థించామని, ఒక్క పైసా కూడా కేటాయించలేదన్నారు. దేశంలోనే అద్భుతంగా కొనియాడబడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదాను కోరామని, ఆ విషయంలో కూడా కేంద్రం నుంచి సరైన ప్రకటన రాలేదని తెలిపారు. ఎంసిహెచ్ఆర్డిలో జరిగిన దక్షిణాది రాష్ట్రా ల సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రా లతో పాటు మహారాష్ట్రకు చెందిన అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం వంతు వచ్చినప్పుడు సీఎస్ శైలేంద్రకుమార్ జోషీతో పాటు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి కె రామకృష్ణారావు కూడా మాట్లాడారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గూర్చి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇద్దరు అధికారులు కూడా సౌమ్యంగానే తమ వాదనలు వినిపించారు. రాష్ట్రా నికి నిధులను ఎలా రాబట్టాలనే కోణంలోనే వారు మాట్లాడినట్లు తెలిసింది. వివాదాలు, విమర్శలకు తావివ్వకుండా మాట్లాడి ఆర్థికసంఘం అధికారులతో శభాష్ అనిపించుకున్నారు. రాష్ట్ర అధికారులు ఇచ్చిన ప్రజెంటేషన్‌కు ఆర్థిక సంఘం కార్యదర్శి మెహతాతో పాటు ఇతర సభ్యులు కూడా ముగ్ధులయ్యారు. కాళేశ్వరం పథకం ద్వారా 18 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వదల్చామని, ఇది దేశంలోనే అద్భుతమైన ప్రాజెక్టుగా అధికారులు వివరించారు. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ. 88,000 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.22,000 కోట్లు వెచ్చించామని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదాతో పాటు బడ్జెట్‌లో రూ.10,000 కోట్లు కేటాయిరేచాలన్న తమ అభ్యర్థనను కేంద్రం మన్నించలేకపోయిందని వివరించారు. వాటితో పాటు ఈజ్ ఆఫ్‌డూయింగ్ బిజినెస్‌లో సాధించిన ప్రగతి, జీఎస్టీ అమలు, దీని పరిధిలోకి అర్హులైన వ్యాపారులను తీసుకురావడంలో ప్రభుత్వం చేస్తున్న కృషి, జనాభా నియంత్రణకు చేపడుతున్న చర్యలు, నగదు బదలీని ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలు, కేంద్ర పథకాల అమలు, స్వచ్ఛభారత్ అమలు ఇస్తున్న ప్రాధాన్యత, మౌళిక సదుపాయాల కల్పనకు తీసుకుంటున్న చర్యలను గూర్చి కూడా జోషీ , రామకృష్ణారావు వివరించారు. అంతేగాక పలు సూచనలు కూడా చేశారు. కమిషన్ ఫార్మాట్‌పై తెలంగాణ రాష్ట్ర అభ్యంతరాలను కూడా వారు వివరించారు. ప్రగతిశీల విధానాలు అమలు చేస్తున్న తమకు నిధులు రాకుండా అడ్డుకునే అంశాలను తొలగించాలని అభ్యర్థించారు. ఆర్థిక సంఘం విధించిన గడువు మేరకు ఏప్రిల్ 15 లోగా పూర్తి స్థాయి నివేదికను సమర్పిస్తామని చీఫ్ సెక్రెటరీ చెప్పారు.

నేడు వివిధ వర్గాలతో ఆర్థిక సంఘం భేటీ

మూడురోజుల పర్యటనలో భాగంగా హైదరాబాద్ వచ్చిన 15 వ ఆర్థిక సంఘం సభ్యులు ఆదివారం పలు వర్గాలతో సమావేశమవుతారు. ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతాతో పాటు సీనియర్ అధికారి సందీప్ భాటియా కూడా వినతిపత్రాలు స్వీకరిస్తారు. ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు, ఆర్థిక నిపుణులతో కూడా సమావేశమవుతారు. ప్రజలు కూడా నేరుగా వినతులు సమర్పించవచ్చని అధికారులు చెప్పారు.



గజ్వేల్ కోమటిబండలోని మిషన్ భగీరథ ప్లాంటును సందర్శించిన ఆర్థిక సంఘం సభ్యులు

జీవన ప్రమాణాలు పెంచుతున్న మిషన్ భగీరథ

గజ్వేల్, ప్రభన్యూస్: తెలంగాణ రాష్ట్రంలో ఇంటింటికి సురక్షిత మంచినీరు అందించాలనే సంకల్పంతో చేపట్టిన మిషన్ భగీరథ పథకం అద్భుతంగా వుందని 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్‌మెహతా కితాబిచ్చారు. శనివారం సిద్దిపేట జిల్లా, గజ్వేల్ మండలం కొమటిబండ గుట్టపై వున్న మిషన్‌భగీరథ సంప్‌హౌజ్‌ను పరిశీలించారు. ఈ పథకం అమలు అవుతున్న తీరును మిషన్ భగీరథ ఇఎన్‌సి సురేందర్‌రెడ్డి ఆయనకు వివరించడం జరిగింది. అనంతరం అరవింద్‌మెహతా మాట్లాడుతూ మిషన్ భగీరథ అమలు చేయాలన్న ఆలోచన రావడమే తరువాయిగా పనులను త్వరితగతిన పూర్తిచేసి ఇంటింటికి రక్షిత నీరు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఆర్థిక సంఘం నుంచి పథకాలను ప్రోత్సహించేందుకు ప్రోత్సాహకాలను అందివ్వాలని నిర్ణయిస్తే ఆ ప్రోత్సాహకం మొత్తం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్తుందన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాలు కూడా ఈ పథకాన్ని అమలుచేసే తీరును చూసి ప్రేరణ పొందాలన్నారు. చాలాచోట్ల పౌష్టికాహారలోపంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, పౌష్టికాహారలోపం అంటే తిండికి కొరత కాదని, స్వచ్ఛమైన నీరు దొరకకపోవడమేనన్నారు. కలుషిత నీటిని తీసుకుంటే ప్రజలకు అస్వస్థతకు గురవుతున్నారన్నారు. స్వచ్ఛమైన నీరు ప్రజలకు అందివ్వడం వల్ల మెడికల్ పారా మీటర్స్‌పైన కూడా ప్రభావం చూపుతుందన్నారు. ఇటువంటి పథకాల అమలులో ప్రజలందరికీ సురక్షిత మంచినీరు అందించే అవకాశం కలుగుతుందన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమానికి మిషన్ భగీరథ ఒక అలంబనంగా నిలుస్తుందన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ కేవలం మంచి వాతావరణం నెలకొల్పడమే కాకుండా స్వచ్ఛమైన జలాన్ని ప్రజలకు అందించడం కూడా ఆ కార్యక్రమంలో భాగమేనన్నారు. మిషన్ భగీరథ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టి గ్రామాల్లో వివిధ ఆవాసాలకు నీరందించేందుకు కృషిచేసిన అధికారులకు, ఇంజినీరింగ్ సిబ్బందికి ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రం సస్యశ్యామలం:ఘంటా చక్రపాణి

మహాదేవపూర్ , ప్రభన్యూస్ : కాళేశ్వరం ప్రాజెక్టు అత్యంత అధ్భుతంగా ఉందని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రాపాణి అన్నారు. శనివారం ఐదు జిల్లాలకు చెందిన ప్రొఫెసర్లు, సీనియర్ జర్నలిస్టులతో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారు. మేడిగడ్డ , అన్నారం బ్యారేజీలు , కన్నేపల్లి పంప్ హౌజ్‌లు సంద ర్శించి పనుల పురోగతి పై తెలుసుకున్నారు. సీ వెంకటేశ్వర్లు, డీఈలు సూర్య ప్రకాష్, ప్రశాష్‌లు మ్యాప్ ద్వారా ప్రాజెక్టు వివరాలను వివరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్ర భుత్వం దృఢ సంకల్పంతో నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు తాగు, సాగు నీరుతో ఉమ్మడి ఏడు జిల్లాలు సస్యశ్యామలంగా ఉంటాయని అన్నారు. ఐదు జిల్లాలకు సంబంధించిన ప్రొఫెసర్ల బృందం కాళేశ్వరం ప్రాజెక్టు పై పూర్తి అధ్యాయనం చేస్తుందని అన్నారు.



గుండెకు దన్నుగా గుండె

- అపోలో ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

కరీంనగర్ క్రైం, ప్రభ న్యూస్ : ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్ ఆయిన ఒక యువకుడి గుండెను రోడ్డు మార్గంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు కేవలం రెండు గంటల వ్యవధిలో చేర్చి మరోవ్యక్తి ప్రాణాలు కాపాడారు. ఈనెల 8న జగిత్యాల జిల్లా, కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లికి చెందిన మేకల నవీన్‌కుమార్(17) ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఆర్‌టీసీ బస్సుకు ఢీకున్నాడు. ఈ ప్రమాదంలో గాయపడిన నవీన్‌ను కరీంనగర్‌లోని అపోలోరీచ్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించక శుక్రవారం రాత్రి బ్రెయిన్‌డెడ్ అయింది. అయితే హైదరాబాద్‌లో అపోలో ఆసుపత్రిలో ప్రాణాపాయస్థితిలో ఉన్న ఒక వ్యక్తికి గుండె మార్పిడి అవసరం ఉందని తెలిపారు. దీంతో నవీన్ గుండెను హైదరాబాద్‌కు తరలించేందుకు ట్రాఫిక్‌కు ఎక్కడా ఆటంకం కలుగకుండా గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేశారు. అపోలో ఆసుపత్రిలో ప్రముఖ హార్ట్, లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ శస్త్ర చికిత్సా నిపుణుడు డాక్టర్ అల్ల గోపాల కృష్ణగోఖలే నాయకత్వంలోని వైద్యబృందం 56 సంవత్సరాల వయస్సు కలిగి గుండె జబ్బుతో చివరిదశతో బాధపడుతున్న రోగికి హెటిరోటోపిక్ అనబడే అరుదైన గుండె మార్పిడి శస్త్ర చికిత్సను శనివారం విజయవంతంగా నిర్వహించారు. దీనికి గాను అపోలో సంస్థల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి కరీంనగర్ సీపీ కమలాసన్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డిలను అభినందించారు.

హైకోర్టు సీజేను కదిలించిన చిన్నారుల లేఖ

- 15 రోజుల్లో 11 లక్షల నిధుల మంజూరు



కోరుట్ల, ప్రభన్యూస్ : తమ పాఠశాలలో వసతులు కల్పించాలని జగిత్యాల జిల్లా విద్యార్థులు రాసిన లేఖ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కదలించింది. కల్లూరు ఎస్సారెస్పీ క్యాంప్ జడ్పీ హైస్కూల్ కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాసిన లేఖతో ఆ పాఠశాలకు నిధుల వరద మొదలైంది. హైకోర్టు ఆదేశాలతో 11 లక్షల నిధులను విద్యాశాఖ మంజూరు చేసింది. ఎస్సారెస్పీ క్యాంప్ జెడ్పీ హైస్కూల్‌లో 500 మంది విద్యార్థులు ఉండగా, అందులో 320 మంది బాలికలే ఉన్నారు. ఈ పాఠశాలలో సరిపడ మూత్రశాలలు, మరుగుదొడ్లు, నీటి వసతి, తాగునీరు కూడా లేకుండా నానా అవస్థలు పడుతున్నారు. తాగునీరు లేకపోవడంతో విద్యార్థులు బయట కొనుక్కొనే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యల పట్ల అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న కూడా ఎలాంటి స్పందన లేకపోవడంతో పాఠశాలకు చెందిన విద్యార్థులు తమ 9వ తరగతి సాంఘీక శాస్త్రంలో బాలుల హక్కులు పరిరక్షణ అనే పాఠంలో బాలుల సమస్యలు ఉంటే నేరుగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సమస్యలను లేఖ రూపంలో రాసీ విన్నవించుకుంటే పరి ష్కరిస్తారని తెలిపారు. దాంతో 15 రోజుల క్రితం శ్రీయుత గౌరవనీయులైన హైకోర్టు న్యాయమూర్తికి నా మనవి ఏమనగా మా పాఠశాలలో సమస్యలు అధికంగా ఉన్నాయి కాబట్టి ఈ సమస్యకు పరిష్కారం చూపాలంటు లేఖ రాసారు. విద్యార్థులు రాసిన లేఖను స్వీకరించిన హైకోర్టు న్యాయమూర్తి విద్యార్థులు రాసిన లేఖపై వెంటనే వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ప్రిన్సిపాల్, కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ఎమ్ ఎస్ఎ ఇంజనీర్లతో కలిసి పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో ఉన్న వసతు లను అవసరాలపై నివేదిక తయారు చేయ్యమని ఆదేశించారు. అవసరమైన వసతులు వెంటనే కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, విద్యాశాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి ద్వార హైకోర్టుకు తెలిపారు.

గోతిలో పడ్డా.. హెల్మెట్ కాపాడింది



హైదరాబాద్, ఆంధ్రప్రభ: బైక్‌పై వెళుతోన్న ఓ యువకుడు భూగర్భ పైప్‌లైన్ కోసం తీసిన పెద్ద గోతిలో పడిపోయిన ఘటన హైదరాబాద్‌లోని సచివాలయం ఎదుట చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలీవిధంగా ఉన్నాయి. సుమారు 20 అడుగుల లోతున ఆ గొయ్యి ఉండటంతో ఆ యువకుడు తీవ్రగాయాలపాలై ఉండొచ్చని అంతా అనుకున్నారు. ఇంతలో లోపలి నుంచి సదరు యువకుడు కేకలు వేశాడు. దీంతో, ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు ఆ యువకుడిని బయటకు తీశారు. ఆ యువకుడు హెల్మెట్ దరించి ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. ఆ గుంతను తవ్వి అలాగే వదిలిపెట్టారని, అందుకే ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. రహదారుల పక్కన గుంతలను వెంటనే పూడ్చివేయాలని స్థానికులు ఈ సందర్భంగా కోరుతున్నారు.

బతికొచ్చిన బానయ్య!



బెల్లంపల్లి, ప్రభన్యూస్ : మరణించాడ నుకుని భావించిన ఓ వ్యక్తి తిరిగి ఇంటికి రావ డంతో ఆ కుటుంబం ఆనందానికి హద్దులు లేవు. గుర్తు తెలియని మృతదేహం తమ ఇంటి యజ మానిదే అని అనుకుని సంప్రదాయ రీతిలో అంత్యక్రియలు జరిపారు. ఆ తర్వాత బంధు వులు అందరినీ పిలిచి పెద్ద కర్మ చేశారు. తాజాగా పోలీసులు ఇచ్చిన సమాచారంతో బతికే ఉన్న బానయ్యను చూసి కుటుంబ సభ్యులు అవాక్క య్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత యేడాది ఏప్రిల్ నెలలో మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లి మండలం చిన్నబూద గ్రామంలోని ఇందిరానగర్‌కు చెందిన గద్దల భానయ్య (55) మతి స్థిమితం కోల్పోయి ఎక్కడికో వెళ్లిపోయాడు. బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పుడే తాండూరు మండలం బోయపల్లి మండలంలో గుర్తు తెలియని మృత దేహం పోలీసులకు దొరకగా కుటుంబ సభ్యులు లుంగి, చెప్పులు చూసి ఇది బాన య్య మృతదేహం అని భావించి అంత్యక్రియలు, ఆ తర్వాత దశదిన కర్మ కూడా చేశారు. తాజాగా శుక్రవారం తాళ్ళ గురిజాల ఎస్సై కిరణ్‌కుమార్ హైదరాబాద్‌లోని అమ్మ-నాన్న అనాథ ఆశ్రమం, బలికొండ క్రాస్ రోడ్ చౌటుప్పల్‌లో బానయ్య ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బానయ్య కొడుకు వెంకటేష్, భార్య లక్ష్మిలు, తల్లి గంగమ్మ అక్కడికి వెళ్లి బానయ్యను గుర్తించి ఇంటికి తీసుకువచ్చారు.

చెల్లెలు కవితకు అభినందనలు

- జనసేన అధ్యక్షుడు పవన్ ట్వీట్



అమరావతి, ఆంధ్రప్రభ : పార్లమెంట్ లో ఆంధ్రా ఎంపీల ఆందోళనకు మద్దతుగా మాట్లా డిన తెలంగాణ ఎంపీ కల్వ కుంట్ల కవితను కూడా అభినం దిస్తూ జనసేనాని ట్వీట్ చేయ డం గమనార్హం. చెల్లెలు కవితకు నా ధన్యవాదాలు అంటూ పవన్ ట్వీట్ చేయ డం చర్చనీ యాంశమైంది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలపై పార్లమెంట్‌లో మాట్లాడిన చెల్లెలు కవితకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ట్వీట్ చేశారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా కవిత మాట్లాడుతూ ఏపీకి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రప్రయోజనాల సాధన కోసం ఎంపీలే ఆందోళనలు చేపడితే ,దేశ ప్రజలకు నెగిటివ్ మెసెజ్ వెళుతుందని, హామీలను నెరవేర్చే ప్రయత్నం చేయాలని ఆమె కేంద్రాన్ని కోరిన విషయాన్ని ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ గుర్తు చేశారు.

విభజన హామీలపై నిజ నిర్ధారణ కమిటీ వేయాలి

విభజన హామీల సాధనకు జనసేనాని పవన్‌కల్యాణ్ తనదైన శైలిలో ఉద్యమిస్తున్నారు. ఒక వైపు జేఏసీ ఏర్పాటుకు ప్రయత్నిస్తూనే మరోవైపు తాజా అంశాలపై ట్విట్టర్ ద్వారా స్పందిస్తున్నారు. విభజన హామీల పరిష్కారానికి సంయుక్త నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేయాలని పవన్‌కల్యాణ్ శనివారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఆర్థిక వేత్తలు, ప్రభుత్వ మాజీ అధికారులు, విద్యావేత్తలు, సామాజిక ,రాజకీయనేతలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తాజాగా తలెత్తిన అంశాలపై కూడా విస్తృతంగా చర్చించాల్సిన అవసరాన్ని అయన గుర్తు చేశారు.

కాలంతో పోటీపడుతున్న కాళేశ్వరం

దేశానికే మణిహారం

(మొదటిపేజీ తరువాయి)

తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అన్నారం బ్యారేజీ వద్ద ఏర్పాటు చేసిన చేసిన ఫొటో ఎగ్జిబిషన్ , కాళేశ్వరం ప్రాజెక్టు మ్యాప్‌ల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు గురించి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సునీల్ జోషి , రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ప్రాజెక్టు సీఈ వెంకటేశ్వర్లు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, దానికి అవసరమైన నిధులు , ఖర్చు వివరాలను అరవింద్ మెహతాకు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న పనుల పై 15వ ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టుదల , రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావు కృషితో దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఈ ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతున్నట్లు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జోషి అన్నారు. ఈ ప్రాజెక్టు షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసేందుకు అహర్నిషలు శ్రమిస్తున్నామని యస్‌కే. జోషి అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారానే వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని , తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధ్యమవుతుందని 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా అన్నారు. కేంద్ర ఆర్థికసంఘం ముఖ్య ఉద్దేశం కూడా సమగ్ర గ్రామీణ అభివృద్ధి అని తెలియజేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణ రంగంలో జాతీయ , అంతర్జాతీయ ప్రమాణాల రిత్యా కూడా కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎన్నో ప్రత్యేకతలుఉన్నట్లు 15వ ఆర్థిక సంఘం వాఖ్యానించింది. స్ట్రక్చర్ల నిర్మాణాలు, ప్రణాళిక , పనుల వేగం, పనులు జరుగుతున్న తీరు తమను ఆకట్టుకున్నాయని అన్నారు. రేయింబవళ్ళు మూడు షిఫ్టుల్లో భారీగా జరుగుతున్న పనుల వేగాన్ని బట్టి వచ్చే వానాకాలం నాటికల్లా కాళేశ్వరం ప్రాజెక్టు మొదటి మైలు రాయి దాటుతుందనే విషయంలో తనకు సందేహం లేదని అరవింద్ అభిప్రాయపడ్డారు. ఈ తరహా వేగవంతమైన పనులు ఎక్కడా చూడలేదని వాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని, 18 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు మరో 18 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే బృహత్తర ప్రాజెక్టు అని ఆయన ప్రశంసించారు. 15వ ఫైనాన్స్ కమిషన్‌కార్యదర్శి వెంట తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ యస్ కె. జోషి, రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రామకృష్ణరావు, సిద్దిపేట , కలెక్టర్ వెంకటరామ్ రెడ్డి , జయశంకర్ భూపాలపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ డి. అమయ్ కుమార్, కాళేశ్వరం సీఈ వెంకటేశ్వర్లు, ఎస్ఈ సుధాకర్ రెడ్డి, జిల్లా ఏఎస్పీ రాజమహేందర్ నాయక్, కాటారం డీఎస్పీ కేఆర్‌కే ప్రసాద్ రావు, మహాదేవపూర్ సీఐ రమేష్, ఎస్సై శ్రీనివాస్ తదితరులున్నారు.



కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన ఆర్థిక సంఘం సభ్యులు

శంషాబాద్‌లో భూమాయ

- కొత్వాల్‌గూడలో ఊరినే తాకట్టు పెట్టిన వైనం
- రూ. 300 కోట్లకు పైగా అప్పు
- 3 నెలలుగా కొత్వాల్‌గూడలో రిజిస్ట్రేషన్లు నిలిపివేత
- బాధితులకు న్యాయం చేస్తామంటున్న రెవెన్యూ యంత్రాంగం
- చిన్నగొల్లపల్లిలో లేని సర్వేనంబర్లతో భూమి కబ్జా
- మాజీ ప్రజాప్రతినిధుల అండదండలు


రంగారెడ్డి, ప్రభన్యూస్ : హైదరాబాద్ మహానగరానికి అత్యంత చేరువలో ఉన్న శంషాబాద్‌లో రోజుకో భూభాగోతం వెలుగులోకి వస్తోంది. చట్టంలో ఉన్న లొసుగులను, లేని డాక్యుమెంట్లు సృష్టించి భూములుమాయం చేస్తున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఉండటంతో అక్కడ భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. క్యాచ్‌మెంట్ ఏరియా ఉన్నా అక్కడ భూముల క్రయావిక్రయాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. దీన్ని ఆసరగా చేసుకున్న అక్రమార్కులు విలువైన భూములను స్వాహా చేస్తున్నారు. వీరికి రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులు సహకరించడంతో వారి అక్రమాల పర్వం మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోంది. అక్రమాలు జరిగాక గాని రెవెన్యూ అధికారులు మేల్కొనడం లేదు. శంషాబాద్ మండలంలోని కొత్వాల్‌గూడ గ్రామాన్నే తనఖా పెట్టి ఏకంగా రూ. 300కోట్లకు పైగా బ్యాంకులో అప్పు తీసుకున్నారు. నాలుగేళ్ల క్రితం తీసుకున్న అప్పు ప్రస్తుతం రూ. 600కోట్లు దాటిపోయింది.దీంతో బ్యాంకు అధికారులు వచ్చి రిజిస్ట్రేషన్లశాఖకు ఫిర్యాదు చేయడంతో గత మూడుమాసాలుగా కొత్వాల్‌గూడ గ్రామ పరిధిలో ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయకుండా నిలుపుదల చేశారు. కొత్వాల్‌గూడ గ్రామంలో 3వేల ఎకరాలకు పైగా భూములున్నాయి. దేశం నుంచి పాకిస్థాన్ విడిపోయినప్పుడు ఇక్కడి ముస్లింలు తమ భూములను వదిలిపెట్టి వెళ్లారు. వాటిని ఎనిమి భూములంటారు. ఆ భూములు కేంద్రం ఆధీనంలో ఉంటాయి. వారి వారసులను సృష్టించి ఏకంగా భూములను తమపేరుపైన చేయించుకున్నారు. ఆ భూములను తనఖాపెట్టి రూ.300కోట్లకు [illegible] 2014 సంవ త్సరంలో అప్పు తీసుకున్నారు. అ[illegible] నేడు [illegible] 600[illegible] దాటి [illegible] మూడు మాసాల క్రితం బ్యాంకు ఉన్నతాధికారులు వచ్చి సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి భూముల రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో గతమూడు మాసాలుగా కొత్వాల్‌గూడలో ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయడం లేదు. కొత్వాల్‌గూడ గ్రామాన్నే తనఖా పెట్టిన వైనం దినపత్రికల్లో రావడం తో స్థానికుల్లో ఆందోళన నెల కొంది. ఇప్పుడు రెవెన్యూ శాఖ దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది.



చిన్నగొల్లపల్లిలో లేని సర్వేనెంబర్ల సృష్టి...

అంతర్జాతీయ విమానాశ్ర యానికి ఆనుకుని ఉన్న చిన్నగొల్లపల్లి గ్రామంలో లేని సర్వేనెంబర్లు సృష్టించి ఏకంగా 10 ఎకరాల విలువైన భూమిని బుట్టలో వేసేందుకు ప్రయత్నించారు. చిన్నగొల్లపల్లి గ్రామంలో దాదాపుగా 3వేల ఎకరాల భూమి ఉంది. ఇక్కడ వ్యవసాయమే ప్రధానం. గ్రామం మొత్తం 260సర్వేనెంబర్లు ఉన్నాయి. 261 సర్వే[illegible]బరను సృష్టించి ఏకంగా పది ఎకరాల విలువైన భూమికి[illegible] [illegible] ఉంది. ఆ భూమి తమదేనంటూ అమ్మకానికి పెట్టారు. ఇప్పటికే పది ఎకరాల భూమి ప్రభుత్వ భూమిగా గుర్తించి 2014లో అప్పటి తహసీల్దార్ బోర్డు కూడా ఏర్పాటు చేశారు. ఆ భూమి తమదేనంటూ మాయగాళ్లు అమ్మకానికి పెట్టడంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ భూమి తమ ఆధీనంలోనే ఉందని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. భూమాయగాళ్లకు మాజీ ప్రజాప్రతినిధులు సహకరించినట్లు ప్రచారం సాగుతోంది. లేని సర్వేనెంబర్లు సృష్టించడం.... ఎనిమి భూములుగా నకిలీ డాక్యుమెంట్లు వారసులను సృష్టించడం వంటి కార్య క్రమాలకు శ్రీకా రం చుడు తు న్నారంటే వారికి రెవె న్యూ, సబ్ రిజిస్ట్రార్లు సహక రిస్తు న్నారనే ప్రచారం సాగు తోంది. రెవె న్యూ లోని లొసు గులను పూర్తిగా అవగాహన చేసుకుని భూమాయకు పాల్పడు తున్నారు. శంషాబాద్ మండలం పూర్తిగా క్యాచ్‌మెంట్ ఏరియాలో ఉంది. అయినా నిర్మాణాలు [illegible] పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోంది.

ఎంతెంత దూరం?!





ఆంధ్రప్రదేశ్ వినీలాకాశంలో మబ్బులు కదిలిన సంకేతాలు...మందగమనంలో..బలవంతంగా కదులుతున్న వైనం.. ఎవరో వెనకనుంచి నెడుతుంటే కదులుతున్నట్టు..! అది కదలికా..లేక కుదుపా?..ఆ మబ్బుల మాటున ఓ అస్పష్ట దృశ్యం. ఆంధ్రప్రదేశ్ విభజన సమస్యల అంశం! హస్తినలో ఆంధ్రుల గొంతుకల జోరు పెరిగింది. నిరసనలు నినాదాలై.. ఉద్యమమై..పోరాటమై..చట్టసభల్లో సంక్షోభంలాంటి పరిస్థితి. ఆద్యంతాలు ఊహకందని స్థితిలో పార్లమెంటు తాత్కాలిక విరామ చివరి ఘట్టంలో ఉన్నట్టుండి ఆటవిడుపు! ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గొంతులో మార్పు. సుదీర్ఘ వివరణ..అంశాలవారీ విశదపరిచే ప్రయత్నం..నచ్చజెప్పే ధోరణి..భరోసా ఇచ్చే ప్రయత్నం..దాని వెనక బోలెడు లాబీయింగ్. ఎందుకిలా? ఎందుకింత? సాగతీతా? తాత్సారమా? చట్టప్రకారం అమలు కావాల్సిన పాలనాపరమైన ప్రక్రియ రచ్చరచ్చయి..రాజకీయమై..చివరకు మొక్కుబడిగా మారి..అంతమనేది మరో తేదీకి జారి..ప్రస్తుతం వెయిట్ అండ్ సీ స్థాయి వద్ద ఆగింది! ఇది మిత్రధర్మమా? మిత్రభేదమా? మిత్రలాభమా? రేపటి రాజకీయానికి సంకేతాత్మక సదృశ్యమా?



చెట్టు నుంచి కాయలు రాలాలంటే రాళ్లతో ఎంత కొట్టినా కష్టం. కాయ పండి పక్వానికి వచ్చినప్పుడు దానంతట అదే రాలుతుంది. దీనర్థం దేనికైనా సమయం రావాలని. ఆంధ్రప్రదేశ్ ఈ పోలికకు దగ్గరగా ఉంది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమయం కోసం చూశారు. అదీ..బలమైన అవకాశం కోసం వెతికారు. మధ్యమధ్యలో చిన్నచిన్న రాళ్లతో కాయలు కొట్టేందుకు ప్రయత్నించారు. కాయ పచ్చిదైనప్పుడు..సమస్య ముదరనప్పుడు..అలాగే ఉంటుంది. ఓవైపు సమయం మించిపోతోంది. ఇన్నాళ్లూ గట్టి ఆయుధం దొరకలేదు. చివరకు ఆ సమయం వచ్చింది. ఆయుధం దొరికింది. ఆ సమయమే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు!..ఆ ఆయుధమే కేంద్ర బడ్జెట్! చంద్రబాబుకి బలమైన అవకాశం ఈ రూపంలో చేతికి అందివచ్చింది. అసలే రగులుతున్న అగ్నిపర్వతంలా ఉన్నారేమో..చంద్రబాబు ఏమాత్రం ఆలస్యం చేయలేదు. శంఖారావాల ప్రతిధ్వనులు లేకుండానే..గిరిగీయని బరిలోకి సైన్యాన్ని దుమికించారు. మిత్రులు ఇలా కత్తులు దూస్తారని మోడీ ఊహించి ఉండకపోవచ్చు. ఒకవేళ ఊహించినా తన రాజకీయ చాణక్యం ముందు ఆ అస్త్రాలు నిరస్త్రాలవుతాయన్న ధీమాతో ఉండిఉండొచ్చు.

న్యాయాన్యాయాల ధర్మకాటాలో అటు ప్రధానమంత్రి మోడీ, ఇటు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబడితే తరాజు తనవైపే మొగ్గేలా చంద్రబాబు శ్రద్ధ తీసుకున్నట్టు తాజా పరిస్థితులను బట్టి స్పష్టమవుతోంది. చంద్రబాబు ధర్మపోరాటాన్ని సమర్థిస్తున్న వాళ్లే గాని విమర్శిస్తున్నవాళ్లు ఇసుమంతైనా లేకపోవడం మోడీ బృందానికి ఆశ్చర్యం కలిగించింది. అయినా అది బైటపడకుండా చూడటం రాజధర్మం అని మోడీ నమ్మకం. అందుకే ఇంత జరుగుతున్నా ఆయన మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. అందులో భాగంగానే సభంతా నినాదాల హోరుతో ప్రతిధ్వనిస్తున్నా ప్రసంగించడానికి ఉద్యుక్తులయ్యారు. ఒక మిత్రపక్షం పార్లమెంటులో ప్రధానమంత్రి ప్రసంగాన్ని అడ్డుకునే వ్యూహానికి రావడం అరుదైన విషయం. విషమస్థితిని పసిగట్టి మోడీ ప్రసంగానికి కొద్దిసేపు ముందు కేంద్ర మంత్రులు చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడి ప్రసంగం అయ్యేంతవరకు నిరసన ఆపించాలని అడగడం దేనికి సంకేతం?

అంతటి సందర్భం వచ్చిందంటేనే పరిస్థితి పరాకాష్టకు చేరినట్టు లెక్క. మరోవంక ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మాట్లాడుతుంటే కేంద్ర మంత్రులు వెళ్లి రక్షణగా నిలబడాల్సిరావడం మిత్రధర్మపు భారతీయంలో ఏ అధ్యాయాన్ని సూచిస్తోంది? ఒకసమస్యని పరిష్కరించడానికి సమయం మించిపోతున్నదని ఇలాగేనా తెలుసుకోవాల్సింది? ఇది పాలకపక్షం వైఫల్యం కిందికి రాదా? ఇంతా చేస్తే..ఇదేమీ దాయాదుల ఆస్తుల తగాదా కాదు. పంతాలకు పట్టింపులకు పోవడానికి వ్యక్తిగత రాగద్వేషాల వైషమ్యపు చిక్కుముళ్లు కాదు. విభజన చట్టం ప్రకారం విభజిత రాష్ట్రానికి దక్కాల్సినవి సకాలంలో దక్కేలా చేయడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. ఇక్కడే చిక్కుముడి పడింది. కేంద్రానికి రాష్ట్రాలకు మధ్య నిధులు, పథకాల విషయంలో నానాటికీ అంతరం పెరుగుతున్నది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ బలహీనతను తన బలమైన అస్త్రంగా మలుచుకుని అధికారంలోకి వచ్చారు. అప్పట్లో ఆయన చెప్పిన మాటలు రాష్ట్రాలన్నింటికీ, ముఖ్యమంత్రులందరికీ తేనెలూరించాయి. జాతీయ రాజకీయ యవనిక మీద మోడీ అప్పట్లో కొత్త నీరుకింద లెక్క.. సహజంగానే భారతీయులు మార్పుని ఆహ్వానిస్తారు. కొత్త రక్తాన్ని ప్రోత్సహిస్తారు. కొత్త ఆలోచనలను హర్షిస్తారు. మోడీకి ఇదే కలిసొచ్చింది. అప్పట్లో ప్రణాళికా సంఘం కర్రపెత్తనం ఎక్కువగా ఉండేది. రాష్ట్రాలకు నిధులిచ్చే విషయంలో దాని నియమ నిబంధనలు ఒక్కోసారి ఒక్కోవిధంగా ఉండేవి. రాష్ట్రాల ముఖ్యమంత్రులు నిధుల కోసం దాని ముందు మోకరిల్లే పరిస్థితి ఉండేది. అందుకే దానిమీద సర్వత్రా వైముఖ్యం..వైరాగ్యం వ్యక్తమయ్యేవి. ప్రధాని అయ్యాక మోడీ వేసిన తొలి వేటు దానిమీదే. అయినా పెద్దగా నిరసన వ్యక్తం కాలేదు. మోడీ కొత్తగా నీతిఆయోగ్‌ని రంగం మీదికి తెచ్చారు. దానిమీద అందరికీ ఆశలు పెరిగాయి. రాష్ట్రాల స్వయం నిర్ణయాధికారానికి ప్రతీకగా నీతిఆయోగ్ ఉంటుందని మోడీ చెప్పిన మాటలు తీయగా వినిపించాయి. రాష్ట్రాల స్వయం నిర్ణయాధికారానికి నీతిఆయోగ్ పరిరక్షకురాలిగా ఉంటుందని మోడీ చెప్పిన మాటలు నీటి మూటలని తెలుసుకోవడానికి రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఎంతోకాలం పట్టలేదు. నీతిఆయోగ్ ప్రణాళికా సంఘానికి జేజెమ్మ అయి కూచుంది. అది మోడీ జేబులో బొమ్మగా మారిందన్న విమర్శలు ప్రబలమయ్యాయి. అధికారంలో ఉండే పార్టీలు మారొచ్చు గాని ప్రభుత్వ వ్యవస్థ శాశ్వతం. కిందటి ప్రభుత్వం ఇచ్చిన హామీలను లేదా చట్టాలను కొత్త ప్రభుత్వం గౌరవించాలా వద్దా అన్న మీమాంస ఏపీ విభజన చట్టంతో కొత్తగా తెరమీదికొచ్చింది. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం ఈ సందేహానికి శాశ్వత పరిష్కారం ఇచ్చే ఆలోచనలో ఉన్నట్టు లేదు. దీనికి పరాకాష్టే ఆంధ్రప్రదేశ్ వ్యవహారం. కేంద్ర-రాష్ట్రాల ఫెడరల్ వ్యవస్థలో ఒక రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని నిధులు అడగడం..సాయం కోరడం రాజ్యాంగ పరిధిలోని పాలనాపరమైన సాదాసీదా ప్రక్రియే. కేంద్రం ప్రతికూలంగా స్పందించినా అదేదో నేరమన్నట్టు భావించనక్కర్లేదు. నియమ నిబంధనల ప్రకారం ఆస్కారం లేనిచోట కుదరదని చెప్పడాన్ని ఎవ్వరూ ఆక్షేపించరు. ఒక్కోసారి ఆ రాష్ట్ర స్థితిగతులను బట్టి కేంద్రం ఉదారంగా వ్యవహరించాల్సి వచ్చినా దాన్నీ తప్పుపట్టాల్సిన పనిలేదు. ఆంధ్రప్రదేశ్ విషయంలో ఢిల్లీలో తాజా నిరసనల పర్వం ఈ కోవలోకి రాదు. కొత్త రాష్ట్రాలు ఏర్పాటయ్యాక..విభజన చట్టం ప్రకారం అమలవుతున్నాయా లేదా అన్నది పర్యవేక్షించేందుకు సర్వస్వతంత్ర వ్యవస్థంటూ ఏదీ లేదు. ప్రధానమంత్రి కనుసన్నల్లోనే నీతిఆయోగ్ నిర్వహిస్తున్న తంతుగానే మిగిలిపోతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. విభజన చట్టం ప్రకారం రావాల్సిన నిధులు ఇవ్వడానికి కేంద్రం చెబుతున్న సాకులు సవ్యంగా అనిపించడం లేదు. ఇచ్చిన నిధులకు లెక్కలు చెప్పడం పాలనాపరమైన అంశం. దానికి వ్యవస్థలో బోలెడన్ని నియంత్రణ సంస్థలున్నాయి. వాటికి నిర్దిష్ట బాధ్యతలున్నాయి. ఎక్కడికక్కడ ఎవరి బాధ్యతలు వారు నిర్వహించేలా సువ్యవస్థ ఉంది. అయినా చట్టప్రకారం రావాల్సిన వాటికోసమే ఇంత పోరాటం చేయాల్సి రావడమంటే ఇక చట్టాలకు విలువేమున్నదన్న మౌలిక ప్రశ్న ఉదయించక మానదు. తమ వాటాల కోసం ప్రతి రాష్ట్ర ప్రభుత్వమూ ఇలా ఈ స్థాయిలో పోరాటాలకు దిగితే దేశ ఫెడరల్ వ్యవస్థ ఏమవుతుంది? దాన్ని ఫ్యూడల్ వ్యవస్థ అనాల్సి వస్తుంది. ప్రభుత్వాల అస్థిత్వాల సంగతేమిటి? ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వ విషయమే తీసుకుంటే..ఇంతటి పోరాటం తర్వాతి పరిణామాల గురించి ఆలోచించగలమా? చంద్రబాబు అక్కడికీ ఆచితూచి అడుగేస్తారని పేరుంది. అయినా ఆయనకు ఇంతదాకా రాక తప్పలేదు. ఇందులోనే ఆయనకు ఒక ఇబ్బంది కూడా ఉంది. ఒకసారి మొదలుపెట్టాక దాన్నిక అర్థవంతమైన ముగింపునకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఆయనపైనే ఉంటుంది. కేవలం అర్థవంతమైన ముగింపు కాదు. విజయవంతమైన ముగింపు కావాలి. అది కావాలంటే అమీతుమీకి వెళ్లక తప్పకపోవచ్చు. ప్రస్తుతం కాల్పుల విరమణ స్థాయిలో ఉన్నట్టా? వచ్చేనెల అయిదో తేదీదాకా గడువు ఉంది. ఉభయపక్షాలు వాళ్లకు వాళ్లే అలా పెట్టుకున్నారు. ఈలోగా మధ్యేమార్గంలో వెళ్లాలన్న అవగాహనకు వచ్చినట్టు కనిపిస్తున్నది. చిట్టచివరి రోజు చిట్టచివరి క్షణాల్లో కేంద్రం రాజీ ధోరణిలో వెళ్లాలని నిర్ణయించుకున్నట్టు కనిపించింది. అందుకే సుదీర్ఘ చర్చలు.. మంతనాల తర్వాత జైట్లీ రాజ్యసభలో సుదీర్ఘ ప్రకటనే చేశారు. వివరణాత్మక సందేశం అందులో ఇమిడి ఉంది. తెలుగుదేశం సభ్యుల చేత సరేనని బహిరంగంగా చట్టసభలోనే తలలూపించేందుకు ప్రయత్నించారు.

అయినా ఇక్కడ ఒక విషయం గమనించాలి. అవతల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విదేశీ పర్యటనకు విమానం ఎక్కే సమయంలో ఇవతల ఈ తతంగం నడిచింది. ఇదంతా ఆయనకు తెలీకుండా జరిగుంటుందని అనుకోవడానికి ఆస్కారం లేకున్నా ఆయన నుంచి నూటికి నూరుపాళ్ల అంగీకారం ఉందా అన్నది ప్రశ్న. ఎందుకంటే ఇప్పుడు కొత్తగా పథకాలు రూపకల్పన చేయాల్సిన అవసరాలేమీ లేవు. చట్టంలో ఉన్నవే సత్వరం అమల్లోకి తెచ్చి కార్యరూపం దాల్చేలా చేయడమే మిగిలిఉంది. నిజానికి ఇదొక ప్రతిష్టంభన. ఇందులో చట్టపరమైన అడ్డంకులేమీ లేవు. అందువల్ల దీనిమీద ప్రధానమంత్రి స్థాయిలో రాజకీయ నిర్ణయం జరగాల్సుంది. ఈ చర్చల్లో ఎంతమంది ఎంతసేపు తలమునకలైనా అంతిమంగా ఆయన నిర్ణయమే శిరోధార్య మన్న సంగతిని మరువకూడదు. మోడీ రాజకీయ వ్యూహ ప్రతివ్యూహాలను అర్థం చేసుకోవడం చాలా కష్టం. ఆయన మొన్న లోక్‌సభలో తన ప్రసంగంలో తెలుగు ప్రజల ఆత్మ గౌరవ నినాదం గురించి ప్రస్తావించారు. కేంద్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు అవమానించినందునే ఎన్టీరామారావు తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో పార్టీ పెట్టారని అన్నారు. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం నిధుల కోసం, నిర్మాణాల కోసం ప్రాధేయపడుతుంటే..తెలుగు ఆత్మగౌర వాన్ని నిలబెట్టాలన్న ఆలోచన మోడీకి రావాలి కదా! ఆయన అన్యాపదేశంగా అన్నారో లేక చంద్రబాబుని కవ్వించేందుకు అన్నారో గాని చంద్రబాబు మాత్రం పునరాలోచించాల్సిన అగత్యమైతే కనిపిస్తున్నది. ఆత్మగౌరవ నినాదమే ముమ్ముందు అస్థిత్వ నినాదమైనా ఆశ్చర్యపోనక్కర్లేదు.

అయిదు రోజుల ఆందోళన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఎంపీలకు ప్రస్తుతం పార్లమెంటరీ వేదిక లేకుండా పోయింది. పార్లమెంటు ఉభయసభలు శుక్రవారంతో వాయిదా పడ్డాయి. మళ్లీ మార్చి 5 నుంచి నెలపాటు జరుగు తాయి. అంటే ఈ 25 రోజుల పాటు ఉద్యమాన్ని ఏ బాటలో తీసుకెళ్లా లన్నది ఒక ప్రశ్న. కేంద్ర మంత్రి సుజనాచౌదరి పదిహేను రోజుల గడువు పెట్టింది ఏ ఉద్దేశంతోనో అర్థం కాదు. అలాగే మళ్లీ మార్చిలో పార్లమెంటు మొదలయ్యాక ఉద్యమ అవ సరం ఉంటుందో లేదో తెలీదు. ఉంటే నెలపాటు ఉద్యమం ఈ రీతిలోనే సాగించాలా లేక మరో మార్గమేదైనా ఉందా అన్న వ్యూహాన్ని రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. మరోవంక చంద్రబాబు ఈ బిగువుని ఏమాత్రం సడలించే ఆలోచనలో ఉన్నట్టు లేరు. కేంద్ర మంత్రుల ప్రకటనల్లోని అంతరార్థాన్ని జాగ్రత్తగా గమనిస్తూ ఎక్కడా తొణక్కుండా శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఢిల్లీలోని తన అనుచరులకు సూచించారు. దీన్నిబట్టి కేంద్రం తమ డిమాండ్లు మొత్తాన్ని తీర్చేదాకా ఇదేరీతిలో పోరాటం చేయాలనే ఆయన కృతనిశ్చయంతో ఉన్నట్టు స్పష్టమవుతున్నది. జైట్లీ ఇచ్చిన వివరణ తనకు ఆమోదయోగ్యమా లేదా అన్న విషయాన్ని మాత్రం చంద్రబాబు తన గుప్పిట్లోనే ఉంచుకున్నారు. దీన్నిబట్టి తొందరపడి తన మిత్రపక్షానికి లోకువ కాదల్చుకున్నట్టు లేరని అర్థమవుతున్నది. మిత్రపక్షంగా ఉన్న తెలుగుదేశం కేంద్రం మీద ఈ స్థాయిలో ఉద్యమించడం ఎలాంటి సంకేతాలనిస్తుందన్నది బీజేపీ నేతలకు ఏమాత్రం పట్టినట్టు లేదు. మిత్రపక్షం ఇంత దాకా వచ్చేలా తాత్సారం చేయడమే ఎన్డీయే వ్యూహాత్మక తప్పిదం. తెలుగుదేశం ప్రభుత్వానికి రాష్ట్రంలో ఇతర పక్షాల నుంచి నైతిక మద్దతు లేదని, అది ఒంటరి పోరాటం చేస్తున్నదని భావించి ఉండొచ్చు. పార్లమెంటులోను, వెలుపల వైకాపా, కాంగ్రెస్ పార్టీలు తెలుగుదేశంతో కలవకుండా ఎవరిదారిన వారు ప్లకార్డులతో నిరసన ప్రదర్శనలు చేయడం తమకు కలిసొచ్చిన అంశంగా ఎన్డీయే భావించి ఉండొచ్చు. కాని వైకాపా గాని కాంగ్రెస్ గాని ఎన్డీయేకు మిత్రపక్షం కాదు. ఇంతటి సూక్ష్మ విషయాన్ని నరేంద్ర మోడీ ఎలా మరిచారన్నది విస్మయపరిచే అంశమే!!

• వయ్యెస్సారెస్


ఏమిటి చెప్మా! ఆ ఉప్మా!

గురుభక్తి కలిగినవారు ఆ రోజుల్లో కన్నా ఈ రోజుల్లోనే బాగా పెరిగారు. ఇది ఎంతో ఆహ్వానించతగ్గ విషయం. ఎందుకంటే దైవభక్తి కూడా తోడై, జనంలో భయభక్తులు, మిక్కుటంగానే వున్నయ్. అందుకు కారణం ఒక్కటే! 2018 లోనే కలియుగం అంతమవుతుందని, కొందరు కాలజ్ఞాన జిజ్ఞాసువులు చెప్తున్నట్లుగా, చూస్తున్నాం, చదువుతున్నాం. అందువలన ఎటువంటి ప్రళయం వచ్చినా, మొత్తం కొట్టుకుపోయినా, తామూ, తమ కుటుంబ సభ్యులు మాత్రం ఆనందంగా జీవించే ఉండాలన్న ధ్యాసతో గుళ్ళచుట్టూ, గురువుల చుట్టూ, దక్షిణలతో, ప్రదక్షిణలతో ఉన్న జనసమూహాలతో, ఎక్కడ చూసినా, కోలాహలంగా వుంది.

తామే కాదు, తమ వారసులు, వాళ్ళ వారసులూ, ఎన్ని వేల సంవత్సరాలైనా, తిండికి తిప్పలు పడకుండా వుండేలా సంపాదించడమే ధ్యేయంగా, తాము వేళ్టికి తిన్నా తినకపోయినా, తమల్నెవరూ పట్టించుకోకపోయినా, ఏ రోజుకారోజు ఎంత సంపాదించింది లెక్కచూసుకొంటూ, బ్యాంకుల్లోనూ, బీరువాల్లోనూ, దాచుకొంటూ, పట్టీపట్టని నిద్రతో, బిపి, షుగర్ల బిళ్ళలతో, అతికష్టం మీద ప్రాణం నిలుపుకొంటూ, కాలక్షేపం చేయడం, అత్యవసర పరిస్థితిని తలపిస్తోంది.

తిలకించగా, తిలకించగా, కనిపించిన మరో విషయం ఏమిటంటే, చదువు సాంతం పూర్తికాకుండానే కొందరు పిల్లలకు సంపాదన పైనా, జల్సాల పైన మోజు పెరిగి, చదువుపైన శ్రద్ధతగ్గింది. అందువలన దురాలోచనలతో, దుర్మార్గమైన, మార్గాలలో ధనార్జన చేయాలన్న ఆసక్తి, శక్తిమంతమైంది. విత్తనం వేసి, చెట్టు వచ్చి కాయలు కాసేదాకా, ఆగలేని దుస్థితి దాపురించింది. మరికొందరు ఆర్థిక ఇబ్బందులవలన, మధ్యలోనే చదువుకు స్వస్తి చెప్పి, ఏదో ఒక చిన్న ఉద్యోగంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఏతావాతా అందరి మనసుల్లోనూ, స్త్రీ పురుష బేధం లేకుండా, డబ్బు డబ్బు అంటూ గుండెకొట్టుకోవడం మొదలైంది. ఈ గుండె దడను తట్టుకోలేక, ఇంకోరకంగా ఆలోచించి, తమ పిల్లల్ని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను చేయాలని, ఆరాటపడుతూ, వాళ్ళ ఇష్టాయిష్టాలతో పనిలేకుండా, వాళ్ళపై ఒత్తిడి పెంచుకున్నారు. ఆ కారణంగా ఆత్మహత్యల వంటి అకాల మరణాల బారిన పడుతున్నారు. ఇది ఎంతో హృదయ విదారకమైన సన్నివేశం. అందరూ సాఫ్ట్‌వేర్లే అయితే, మిగతా వేర్వేరు ఉద్యోగాలు ఎవరు చేస్తారు? చేస్తేనేం చెయ్యకపోతేనేం, వాళ్ళు మాత్రం నీరుగారి పోకుండా, వాళ్ళ పిల్లలు ఇంజినీర్లే కావాలని ఆకాంక్షిస్తున్నారు.

ఏది ఏమైనప్పటికీ, అందరికీ కావాల్సింది సుఖశాంతులు, ధనరాసులు, దానికోసం ఏం చేయడానికైనా వెనుకాడని, ఆన్‌లైన్ విజ్ఞానం విశ్వవ్యాప్తమైంది. ఇలాంటి వాటిల్లో నైపుణ్యం లేనివాళ్ళు పుణ్యం కోసం ఒకరు, నిధి నిక్షేపాలకోసం మరొకరు కఠోర నియమ నిష్ఠలతో, శక్తిమంతమైన, పూజలూ, పునస్కారాలు చెయ్యడానికి ఉవ్విళ్ళూరుతుంటారు.



వీళ్ళల్లో సద్గురువులు లభించినవారు ధన్యులవుతూ, మోక్షమార్గాన్వేషణార్థులై, సద్బుద్ధులతో జీవితాన్ని ధన్యం చేసుకుంటున్న వారు కొందరైతే, విధిలేక, తెలిసీ తెలియక దొంగ బాబాల డాబాలపైన తిరుతూ, అంతులేని సంపదలు కలిగి సలహాలకోసం, నిద్రానిప్పులు లేక జుట్టుపీక్కుంటున్న వారు మరికొందరు. దేనికైనా సరైన దారిచూపే వాళ్ళు కావాలి కదా!

ఒకానొకసందర్భంలో, ఒక ప్రాంతానికి వేం చేసిన ఓ వ్యక్తి వేషభాషలకూ, వస్త్రధారణకూ, తిలకధారణకూ, పులకాంకితులై తమ తమ గృహంబులకు గొనిపోయి, పలు సపర్యలను చేసి, ఫలపుష్పాదులనూ, ఫలహారములనూ సమర్పించి, సర్వాంగాలింగిత మహీతలంబగు (సాష్టాంగ) నమస్కారములు చేసి, తదుపరి వారిలో కొందరు, అత్యంతాసక్తులై స్వామీ! ఇక ఉపనిషత్తును సెలవిస్తారా? అని అడుగగా, ఆ వ్యక్తి అమితానంద భరితుడై, ఇదేదో ఈ ఊళ్ళో నా కొరకై వండబడిన, మధురమైన ఉప్మా వంటి మరోరకమైన పదార్థమైయ్యుంటుందని భావించి, తనలో తర్జన భర్జన పడి, తడబడుతూ ఏమిటీ మీ ఊళ్ళో ఉప్మాకు మరో నామధేయము కలదా! బాగు బాగు లెస్సగ బల్కినారు. శీఘ్రముగా తెండు. అదియును ఆరగించి నా దారిన నేనూరెగుదును. మీదారిన మీరు వెళ్ళి తిరిగి రేపు రావచ్చును. మీ సందేహములను అడుగవచ్చును. ఇవాళ్టికి ఈ సమావేశము ముగిసినట్లే! అంటూ వారివైపు చూడగా, వారందరూ నివ్వెరపోయి, నోటమాట రాక, ఎవరి దారిన వారు ఒకరి ముఖాలొకరు చూసుకొంటూ వెళ్ళారు. ఇంతకూ! ఏమిటి చెప్మా! ఆ ఉప్మా! అనుకొంటూ, చేసేది లేక, వాళ్ళ ప్రవర్తనలో వచ్చిన మార్పుకు తట్టుకోలేక క్షణమాలస్యం చేయకుండా తనూ, అక్కడ నుండి తప్పుకోవడం మంచిదని పలాయనం చిత్తగించాడు. ఆ మోసకారి. ఆ మాటకారి. ఇలాంటి వారి వలన సరైన దారి ఎడారే కదా!

నివాళి

ఘంటసాలది గాడ్స్ ఓన్ వాయిస్

ఒక ఫకీర్ తత్వాలు పాడుకుంటూ పోతూవుంటే, ఆ గానానికి ముగ్ధుడైన ఓ బాలుడు ఆ పాటలు వింటూ, ఆ ఫకీర్ వెనక తిరిగేవాడు. ఆ ఫకీర్ ఓనాడు అల్లా నిన్ను కాపాడుతాడు. నీకు తన భాషని సంపూర్ణంగా నేర్పుతాడని దీవించాడు ఆ బాలుణ్ణి. ఆ కుర్రాడిది ఉత్తర భారతదేశం. ఆ బాలుడు దైవాన్నే నమ్ముకుని తన గానాన్ని సాధన చేశాడు. జగత్ప్రసిద్ధుడైనాడు. ఆయనే మొహమ్మద్ రఫీ. హిందీ చలన చిత్ర పరిశ్రమలో ఆయన మనిషి కాదు సాబ్.. దేవదూత (ఫరిస్తా) అంటారు. ఈ సృష్టిలో ఆయనకు సాటి, పోటీ ఎవ్వరూ లేరు.. ఉండరు.

నా జోలెలో ఏతల్లి మొదటి కబళం వేసిందో.. ఆ ముద్దే నాకు జీవితమనే, అద్భుతమైన వరాన్ని ప్రసాదించింది. ఆ ముద్దే కోట్ల అభిమానుల్ని నాకు ఇచ్చింది అన్నారు మరో దైవం.. పోనీ... మరో దేవదూత (ఫరిస్తా). ఆయనది దక్షిణ భారతదేశం ఆయన పేరు ఘంటసాల వేంకటేశ్వరరావు.

ఇద్దరూ సంస్కారమూ, సౌజన్యమూ మూర్తీభవించిన వారే. ఇద్దరూ వినయశీలురే. ఇద్దరూ కోపతాపాలు ఎరుగని శాంతమూర్తులే. ఇద్దరూ భగవంతుని భాషని సంపూర్ణంగా భగవంతుడి నించే నేర్చుకున్న స్వరసామ్రాట్టులే. చిత్రంగా ఇద్దరూ పిన్న వయసులోనే భగవంతుని సన్నిధికి చేరినవారే.

రఫీసాబ్ ఎప్పుడు మద్రాసు వచ్చినా ఘంటసాల గారింట్లోనే మకాం అనేవారు. ఘంటసాల గారి పేరెత్తితే రెండు చేతులూ జోడించే మహానుభావుడు మహమ్మద్ రఫీ. ఢిల్లీ రవీంద్ర రంగశాలలో నాకళ్ళతో నేను చూశాను. సాక్షిని నేనే.. ప్రత్యక్ష సాక్షిని. (మహమ్మద్ రఫీ నైట్‌లో) ఒకరికొకరు.. ఒకరిలో ఒకరు.. సంగీత సరస్వతి ఏకకాలంలో రెండు పురుష రూపాలు ధరించి ప్రకాశించింది. ఉత్తరాన రఫీగా, దక్షిణాదిన ఘంటసాలగా.



మహానటులు ఎన్టీఆర్, శివాజీ గణేశన్‌లతో ఘంటసాల వెంకటేశ్వరరావు...

నేడు అమర గాయకుని వర్ధంతి

చదువరులు మన్నించాలి. ఘంటసాల గురించి చెప్పబోతూ రఫీగారి సంగతి ఎత్తినందుకు. ఆర్యా, బొమ్మని తల్చుకున్నప్పుడు బొరుసూ వుంటుంది. నిజానికి అక్కడుండేది నాణెమే తప్ప - బొమ్మ బొరుసులు కాదు.

మీ వారసుడెవరండీ? అని ఘంటసాల గారిని అడిగితే ఆయన ఎస్పిబి అన్నారు. ఆ బాలుడు 50,000 పైగా పాటలు పాడి ఆకాశాన్ని ఆక్రమించాడు. కానీ, అడుగులుండేది నేలమీదేగా - ఆ అడుగు జాడలు ఘంటసాలవీ, రఫీవీ.

ఎస్పిబి కోదండ పాణి ఆడియో లాబ్ (ఎస్పిబి స్టూడియో) లో రఫీగారి ఫొటో వుండేది. లలితకళా తోరణంలో ఘంటసాల విగ్రహాన్ని ప్రతిష్ఠించిన ఘనతా, ప్రేమా ఎస్పి బాలసుబ్రహ్మణ్యం గారిది. ఇంతకీ ఎవరీ ఘంటసాల?

ఏమిటీ ఆకాశం? ఏమిటీ భూమీ? ఏమిటీ నీరూ నిప్పూగాలీ? అంటే సమాధానం చెప్పగలమా? తెలుగు పాటకి చిరునామా ఘంటసాల. తెలుగు భాషకి ప్రతిరూపం ఘంటసాల. తెలుగు హృదయపు సవ్వడి ఘంటసాల. ఆయన పాట పాడేది గొంతులోంచి కాదు, నాభిలోనించి, గుండెలో నుంచి. విష్ణువు నాభినించీ ఓ పద్మం ఉద్భవించి అది బ్రహ్మకీ (సృష్టికి) మూలస్థానమైనట్టు, ఘంటసాల నాభినుంచి ఓ సుడిగాలి వెలువడి, గుండెలో సుడిదిరిగి, గొంతులో సర్వశృతులనూ లయలనూ సమకూర్చుకుని, శ్రోతల హృదయ పద్మాల్లో శాశ్వత నివాసం ఏర్పరుచుకుంటుంది - పాటలా! మాటకి ప్రాణం పోసి పాటగా మార్చిన దైవజ్ఞులు ఘంటసాల, ఆయన పాటలు పాడలేదు.. పాటల్లో జీవించారు.

మది శారదాదేవి మందిరంగా, సంగీత సాహిత్య సరస్వతులను ఏకకాలంలో కొలిచిన పాటల పూజారి ఘంటసాల. అబ్బాయ్ ... యీలోకంలో చిట్టచివరి తాగుబోతు ఉన్నంత వరకూ నిశ్చలంగా వెలిగేపాట ఏమిటో నీకు తెలుసా?

జగమే మాయా, బ్రతుకే మాయా పాట. ఎందుకు ఆ పాట కాలాన్ని ఎదిరించి నిలబడుతుందో. తెలుసా? దాన్ని అజరామరం చేసింది ఘంటసాల గాత్రం. గుర్తుంచుకో. అది హిజ్ మాస్టర్స్ వాయిస్ కాదు. గాడ్స్ ఓన్ వాయిస్. అన్నాడోకవి/ రచయిత. ఆయనెవరో కాదు, సాక్షాత్తూ సీనియర్ సముద్రాల గారి మేనల్లుడు అప్పలాచార్య (సినీ గీత/ హాస్య/ సంభాషణల రచయిత). ఓ శతజయంతి ఉత్సవంలో అక్కినేని నాగేశ్వరరావు గారు అన్నారు. ఆర్టిస్టు అనేవాడు కెమెరా ముందు నటిస్తే, సింగర్ (గాయకుడు) మైక్‌ముందు నటించాలి. మాకు ఎక్స్‌ప్రెషన్ ఇవ్వడానికి మొహమూ, శరీరమూ అన్నీ వుంటై. కానీ గాయకుడికి ఉన్నది గాత్రం ఒకటే అన్నారు. ఎంత సునిశిత పరిశీలన. ఎంత గొప్పమాట. ఆ దృష్టితోచూస్తే ఘంటసాల గారు పాడిన, 5000 పైచిలుకు వున్న పాటలూ, మనకి పాత్రల్ని సృష్టించి ఇచ్చినవే. అహో ఆంధ్రభోజా.. శ్రీకృష్ణదేవరాయ అంటే మన మనసులో రూపుకట్టేది కృష్ణరాయలు కదూ? ముక్కోటి దేవతలు ఒక్కటైనారూ పాట వింటూంటే దేవతలందరూ మన మనోదర్పణంలో ప్రత్యక్షం కారూ? ఓ బాటసారి, ఓ దేవదాసు, ఓ పిచ్చి పుల్లయ్య, ఓ జగదేకవీరుడు, ఓ బడిపంతులు, సాక్షాత్తూ భగవద్గీతను మనకిచ్చిన శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, అడవి రాముడు, తెనాలి రామకృష్ణుడు ఆఖరికి కలియుగదైవం వేంకటేశ్వర స్వామి కూడా ఘంటసాల గళంతో మనగుండెల్లో చిరాయువులు అయినవారే.

విచిత్రం ఏమంటే, ఎవరి కంఠాన్ని ఎవరు అనుసరించినా మిమిక్రీ అని నవ్వుతాం. ఘంటసాల స్వరాన్ని అనుసరిస్తే మాత్రం అబ్బ... అచ్చు ఘంటసాల గారిలా పాడుతున్నాడ్రా అని పొంగిపోతాం ఇదీ... భగవంతుడు మన జాతికిచ్చిన వరం. ఆ వరం పేరే ఘంటసాల.

త్యాగయ్యకి, అన్నమయ్యకీ ఆరాధనోత్సవాలు కొన్నిచోట్ల మాత్రమే జరుగుతాయి, జరుగుతున్నాయి. ఘంటసాల ఆరాధనోత్సవాలు ప్రతివూళ్ళోనే గాదు ప్రతి గుండెలోనూ జరుగుతాయి. ప్రతిరోజూ జరుగుతాయి. అందుకే, ఆంధ్రుల భాష, ఆంధ్రుల శ్వాస, ఆంధ్రుల యాస అన్నీ ఘంటసాలే.తెలుగు మానవుడి మనోప్రస్తానం కూడా ఘంటసాల గీతామృతంతోనే మొదలవుతోంది ప్పుడు. భగవంతుడికి మేల్కొలుపు పాడి లేపుతున్న దెవరూ? భగవంతుడిని శేషశైలా వాస అంటూ జోలపాడి నిద్రపుచ్చుతున్న దెవరూ? జవాబు మీకూ, నాకూ అందరికీ తెలుసు. అలా భగవంతుణ్ణి మేల్కొలిపేదీ, నిద్రపుచ్చేదీ కూడా భగవంతుడే. ఆ భగవంతుడి పేరే ఘంటసాల.

ఇంకేం చెప్పనూ... మాస్టారికి సాష్టాంగ నమస్కారాలతో...



భువనచంద్ర
9840170646

హోంశాఖ సీఎస్‌తో మేజర్ జనరల్ భేటీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మాజీ సైనికుల సమస్యలపై చర్చించేందుకు తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా కమాండింగ్ జనరల్ మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాసరావు రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేదిని శనివారం కలిశారు. అమర సైనికుల పిల్లలకు సైనిక్ స్కూళ్ళలో ప్రస్తుతం ఇస్తున్న ప్రవేశాల కోటను పెంపు, మాజీ సైనికుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ అసెంబ్లీలో ఇచ్చిన హామీలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడని అంశాలపై చర్చించారు. అదే విధంగా మాజీ సైనికులు ఇతర రాష్ట్రా లలో వాహనాలను కొనుగోలు చేస్తే పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు. మేజర్ జనరల్ లేవనెత్తిన అంశాలపై ముఖ్య కార్యదర్శి సానుకూలంగా స్పందించారు. మేజర్ జనరల్‌తో పాటు రిటైర్డ్ కల్నల్ పి. రమేష్ కుమార్, తెలంగాణ రాష్ట్ర సైనిక సంక్షేమ విభాగం సంచాలకులు కల్నల్ శైలేంద్రసింగ్ తదితరులున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఇంధన పొదుపు వారోత్సవాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆయిల్ కంపెనీలు ఇంధన సంరక్షణ క్షమత మహోత్సవాలను నిర్వహిస్తున్నాయి. ఈ నెల 11 నుండి 18 వరకు ఈ వారోత్సవాలు వివిధ ప్రాంతాల్లో నిర్వహించడం జరుగుతుందని ఉభయ తెలుగు రాష్ట్రాల హెచ్‌పిసిఎల్ చీఫ్ మేనేజర్ జె.ఎం. నాయక్ తెలియచేశారు. ఇంధన పొదుపు, కాలుష్య నివారణ తదితర అంశాలపైన వాహనదారుల్లో అవగాహన పెంపొందించేకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పట్టణాల్లో వాహన కాలుష్యం నివారించవలసి ఉందని, దీని కోసం అనుసరించవలసిన మెలకువల పైన టాక్సీ డ్రైవర్లకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని వివరించారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం పై కూడా వాహనదారుల్లో అవగాహన పెంపొందవలసి ఉందన్నారు. సహజసిద్ధమైన ఇంధన వనరులను పరిరక్షించుకొనవలసి ఉందని, కేంద్ర ప్రభుత్వం ప్రత్యా మ్నాయ ఇంధన వనరుల వినియోగం పై ప్రధానంగా దృష్టికేంద్రీ కరించిందన్నారు. రెండు మూడు సంవత్సరాల్లో మార్పులు చూడబోతున్నామని వివరించారు.

ఆలస్యంగా నడుస్తున్న పలు రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సికింద్రాబాద్ నుండి ఈ నెల 11న ఉదయం 10 గంటలకు బయలుదేరవలసిన సికింద్రాబాద్ - దానపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరనుందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ రైలు ప్రయాణం చేసే మార్గంలోని పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున రెండు గంటలు ఆల స్యంగా సికింద్రాబాద్ నుండి బయ లుదే రబోతుందన్నారు. తిరువనంతపురం - గోరక్‌పూర్ రాపాటి సాగర్ ఎక్స్‌ప్రెస్ రైలు తిరువనంతపురం నుండి ఉదయం 6.15 గంటలకు బదులుగా 20.00 గంటలకు బయలుదేరనుందని పేర్కొన్నారు. రాబోవు రెండు రోజుల పాటు వివిధ రూట్లలో రైళ్లు ఆలస్యంగా బయలుదేరడం, అలస్యంగా నడవడం జరుగుతుందని వెల్లడించారు.

లిక్కర్ ఫిర్యాదులకు సరికొత్త యాప్

- ఉల్లంఘిస్తే యాప్‌లో ఫిర్యాదు
- అబ్కారీ శాఖ అధునాతన ప్రయోగం
- పర్మిట్ రూం పరిసరాలూ ముఖ్యమే
- పాతస్టాకు అమ్మినా బుక్కవుతారు
- సమయం దాటిన తర్వాత అమ్మకాలకూ కేసులే

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మద్యం కొనుగోలుదారులుతాము కొనుగోలు చేసిన మద్యం ధరను (ఎంఆర్‌పి) తనఫోన్‌లోనే చూసుకోవచ్చు. ఎక్కువ ధర తన దగ్గర తీసుకుంటే వెంటనే అదే ఫోన్‌లో ఫిర్యాదునూ చేయవచ్చు. సమయం ముగిసిన తర్వాత విక్రయాలపై కూడా కంట్రోల్ రూంకు ఫిర్యాదును చేయవచ్చు. మద్యం దుకాణాల్లో అపరిశుభ్ర పరిసరాలు, సమయం దాటిన విక్రయాలు, పాతస్టాక్ అమ్మకాలు, పర్మిట్ రూంల నిబంధనల ఉల్లంఘున వంటివన్నీ ఒక్క ఫోన్ యాప్‌తో సమూలంగా ఎదుర్కోవచ్చు. లిక్కర్ ప్రైస్ మొబైల్ యాప్, వాట్సాప్ ద్వారా 7989111222, ఉచితఫోన్ రూపంలో కాల్ సెంటర్‌కు 1800425 25 23కి కూడా ఫిర్యాదు చేసే అవకాశం కల్పిస్తోంది. శనివారం ఈ యాప్‌ను ఆబ్కారీ కమిషనరేట్‌లో ఆబ్కారీ శాఖ మంత్రి పద్మారావుగౌడ్, ముఖ్య కార్యదర్శి సోమేష్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్‌లు ఆవిష్కరించారు. మద్యం దుకాణం పేరు, గెజిట్ నెంబర్‌ను వెంటనే యాప్ గుర్తిస్తుంది. వినియోగదారుడి ఫిర్యాదును స్టేట్ టాస్క్‌ఫోర్స్ విభాగానికి పంపుతుంది. ప్రతీఫిర్యాదుకు ఒక ప్రత్యేక నెంబర్‌ను కేటాయిస్తారు. ఆ తర్వాత టాస్క్‌ఫోర్స్ కీలక చర్యలు తీసుకుంటుంది. సంబంధిత దుకాణానికి, ఆ దుకాణం పరిధిలోని ఎక్సైజ్ స్టేషన్‌కు సమాచారం చేరుతుంది. మద్యం విక్రయాలపై నిఘాను పెంచేందుకు ఆబ్కారీ శాఖ అధునాతన విధానాలను అందిపుచ్చుకుంటోంది. అక్రమాల నిరోదానికి సాంకేతికను విరివిగా వాడుకునేందుకు యాప్‌లతో ముందుకెళుతోంది.

అధిక ధరలకు మద్యం విక్రయాల(ఎమ్మార్పీ ఉల్లంఘుణ)ను, సమయం మించిన తర్వాత మద్యం విక్రయాలు, మైనర్లకు విక్రయం, కల్తీ మద్యం వంటి వాటిపై సమరం పూరిస్తోంది. ఇందుకు గానూ సాంకేతికంగా వినియోగదారులకు మరింత చేరువవుతోంది. వీటి కట్టడికి శనివారం తెలంగాణ లిక్కర్ ప్రైస్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.రాష్ట్రంలో దాదాపు 880 రకాల మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. అయితే వీటి ధరలను మద్యం దుకాణాలు తమ షాపుల ఎదుట ప్రదర్శించాలని నిబంధన ఉంది. కాగా వీటన్నింటినీ అక్కడ ప్రదర్శించడానికి ఉన్న ఇబ్బందుల నేపథ్యంలో వ్యాపారులు ఈ నిబంధనను పక్కన పెట్టారు. ఇక మద్యం దుకాణాల్లోని సీసీటివీలు కూడా కంట్రోల్ రూంకు అనుసంధానం



చేయాలన్న నిబంధన అమలులోకి రాలేదు. ఈ నేపథ్యంలో ఆబ్కారీ శాఖ రెండు అధునాతన విధానాలను తెరపైకి తెచ్చింది. ప్రామాణిక మద్యం ధరల పట్టికలను అమలులోకి తెచ్చింది. ఒక ప్రాంతంలో ఏ మద్యమైతే గరిష్టంగా వినియోగమవుతుందో ఆయా బ్రాండ్లు దాదాపు 25 రకాలతోపాటు, 5 బీర్ బ్రాండ్ల ధరలను ముద్రిస్తారు. గత 12 నెలల అమ్మకాల ప్రామాణికత ఆధారంగా వీటిని గుర్తించి 2 అడుగుల వెడల్పు, 3 అడుగుల పొడువుతో ప్రతీ మద్యం దుకాణాం ముందు ఏర్పాటు చేస్తారు. ఇది ఇప్పటికే అమలులో ఉండగా ఎవరూ పెద్దగా పరిగణలోకి తీసుకోవడంలేదు. దీంతో ఎమ్మార్పీ ఉల్లంఘునలు తరచుగా జరుగుతున్నాయి. కల్తీ మద్యం, రాత్రి 11 తర్వాత అమ్మకాలు యధేచ్ఛగా జరుగుతున్నాయి. దీంతో వీటిపై దృష్టిసారించిన యంత్రాంగం తెలంగాణ లిక్కర్ ప్రైస్ యాప్‌ను అభివృది చేసింది. మద్యంలో రకాల వారీగా విస్కీ, బ్రాండీ, రమ్, వోడ్కా, బీర్ వంటివి ఉంటాయి. ఈ యాప్‌లో వాటి ధరలూ ఉంటాయి. వినియోగదారుడికి అనుమానం వచ్చినా, రుచిలో తేడా వచ్చినా, ధర ఎక్కువైనా వెంటనే యాప్‌లో చూసుకుని నివృత్తి చేసుకోవచ్చు. అనుమానం నిజమైతే అదే యాప్‌లో ఫిర్యాదు రిజిస్టర్ చేయవచ్చు.

రాష్ట్రంలో బార్లు, మద్యం దుకాణాలపై కఠిన నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని స్రాకర్ భావిస్తోంది. గతంలో ఉన్న అనేక అవకతవకల కారణంగా ఎదురైన ఇబ్బందులను అధిగమించేలా కఠిన చట్టాలను అమలు చేయనుంది. నూతన మద్యం విధానంలో భాగంగా షాపింగ్ మాల్స్, హైదరాబాద్‌లో రాత్రి 11గంటల వరకు మద్యం విక్రయాలకు అనుమతించిన నేపథ్యంలో ఆబ్కారీ శాఖ కఠిన వైఖరి అవలంభిస్తోంది. ప్రధానంగా 21 ఏళ్లలోపు మైనర్లకు మద్యం సరఫరా, సమయం మించిన తర్వాత మద్యం విక్రయాలు, పర్యవేక్షణ లేమి, ఎమ్మార్పీ ఉల్లంఘున వంటి వాటిని కట్టడి చేయాలన్న యోచనతో ఆధునిక ఏర్పాట్లు చేస్తోంది. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సుల రద్దుతోపాటు పీడీ యాక్టు కేసులను నమోదు చేయాలని కూడా యోచిస్తోంది. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం విక్రయించరాదని ఆబ్కారీ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడంలేదని గుర్తించారు. ప్రతీ బార్, వైన్ షాపు తప్పనిసరిగా 21 ఏళ్లలోపు మైనర్లకు మద్యం విక్రయించేదిలేదని బోర్డును ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ బార్, మద్యం దుకాణానికి చెందిన సిట్టింగ్ ఏరియాలో ఇకపై సీసీ(క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరా)లను ఏర్పాటు చేయనున్నారు. మద్యం దుకాణం రాత్రి 10 గంటలకు, బార్ 11 గంటలకు మూసివేసేలా పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లో దీనిని 11 గంటలవరకు పొడిగించారు. రాష్ట్రంలో మద్యం విక్రయాలు, ఏ సమయంలో ఎక్కువగా జరుగుతున్నాయని పరిశీలించారు. ప్రధానంగా ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటలలోపు 60 శాతం విక్రయాలు సాగుతున్నాయని, రాత్రి 7 తర్వాత 12 గంటలవరకు ఒక్కసారిగా 40 శాతం వినియోగం జరుగుతున్నట్లు గుర్తించారు. తాజాగా ట్రాక్ అండ్ ట్రేస్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎక్కడ ఎలా విక్రయాలు జరుగుతున్నాయని గుర్తించడం సులువవుతోంది.

వ్యాపారులపై కూడా పీడీ యాక్టు...

పీడీ యాక్టు...ప్రివెన్షన్ ఆఫ్ డిటెన్షన్ యాక్టు, దీనిని పార్లమెంటు చట్టంతో 1950లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1), 21(2) ద్వారా అమలులోకి తెచ్చారు. ఇందులో 34 సెక్షన్లు ఇమిడి ఉన్నాయి. దీనిని మరింత విస్తరించి మైనర్లకు మద్యం విక్రయించే వ్యాపారులపై కూడా మోపాలని నిర్ణయించారు.

పీడీ, బైండోవర్‌లకు లొంగని వైనం...

ఇప్పటికే పీడీ యాక్టు, బైండోవర్‌లను అమలు చేస్తున్నా ఆశించిన ఫలితాలు రావడంలేదని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో చట్ట సవరణద్వారా కఠిన శిక్షలకు ఉపక్రమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1968లో ఉమ్మడి రాష్ట్రంలో రూపొందించిన ఏపీ ప్రొహిబిషన్ యాక్టులో కాలానుగుణంగా అనేక మార్పులు చేర్పులు తేవాలని పరిశీలిస్తున్నారు.

దేశంలోనే ఆదర్శంగా ఉన్నత విద్య

బాసర ట్రిపుల్ ఐటీ స్నాతకోత్సవంలో కడియం



బాసర , ప్రభ న్యూస్ : దేశంలోనే ఆదర్శంగా ఉండే విధంగా తెలంగాణలోని ఉన్నత విద్యను అభివృద్ధి చేస్తామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. నిర్మల్ జిల్లా, బాసర ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీలో శనివారం సాట్ భవనంలో 3వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఏకైక ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీ బాసరలో నెలకొల్పడం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంగా మారిందన్నారు. విద్యా ప్రమాణాలు పెంపొందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం యేటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ అభివృద్ధి చేస్తుందన్నారు. ఉన్నత విద్య దేశానికి ఆదర్శంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు సూచనల మేరకు విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రగతి సాధించేలా అధ్యాపక బృందం కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ విభాగాన్ని అభివృద్ధిపరిచేందుకు ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలహయాంలో తెలంగాణలో 354 ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా, 1.75 లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉండగా, 90వేల మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యేవారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం గత మూడు సంవత్సరాల కాలంగా ఇంజనీరింగ్ సీట్లను 1.10లక్షలకు కుదించి 98వేల మంది విద్యార్థులకు ఇంజనీరింగ్ సీట్లలో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థులు ఉన్నత విద్యా ప్రమాణాలు కలిగేలా విశేష కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 420 కోట్లతో యూనివర్సిటీనిలను అభివృద్ధి చేస్తుందన్నారు. బాసర ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీలో 100 ఫ్యాకల్టీ పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి స్నాతకోత్సవ శెరమణి డ్రెస్‌కోడ్‌ను తొలగించేలా చూడాలని కళాశాల అధికారులను కోరారు. కళాశాలలో ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిని కళాశాల వైస్‌ఛాన్సులర్ ఎ.అశోక్, ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అధ్యాపకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కళాశాలలోని అడ్మినిస్ట్రేటివ్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం 499 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను పంపిణీ చేశారు. 7గురికి బంగారు పతకాలు, ఒక విద్యార్థికి కళాశాల టాపర్‌ను సన్మానించారు.

గుడుల్లాంటి బడుల్లో కీచకులు!

- దారి తప్పుతున్న విద్యా వ్యవస్థ
- నిబంధనలకు తిలోదకాలు
- అసాంఘిక శక్తుల రంగప్రవేశం



అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: రాష్ట్రంలో ప్రైవేటుతో పోలిస్తే ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమౌతోంది. ప్రభుత్వ విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఐటి నిపుణులకు, ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీలిస్తున్న జీతాలకంటే అధికంగానే చెల్లిస్తోంది. గతంలో ఉపాధ్యాయులంటే సమాజంలో అత్యంత గౌరవప్రపత్తులుండవేవి. వారు కూడా పిల్లలకు రోల్‌మోడల్‌గా వ్యవహరించేవారు. తమ జీవన విధానాన్ని ఆదర్శనీయంగా తీర్చిదిద్దుకునేవారు. కాగా ఇప్పుడు పాఠశాలలు, రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో ఉపాధ్యాయుల ప్రవర్తన విస్మయానికి గురి చేస్తోంది. పలుచోట్ల ఉపాధ్యాయులే విద్యార్థినిలను శారీరక, లైంగిక వేధింపులకు గురి చేస్తున్న వార్తలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన విద్యార్థినిలను కొందరు ఉపాధ్యాయులు బలవంతంగా గర్భవతుల్ని చేస్తున్న విషయాలు బయటకు పొక్కుతున్నాయి. నిర్దిష్ట విధానంలో పరీక్షలు నిర్వహించి అర్హుల్ని ఎంచి శిక్షణ అనంతరమే వారికి ఉద్యోగాలిస్తున్నారు. అయితే వీరి మానసిక దృక్పధాన్ని మాత్రం ప్రభుత్వం అంచనాలేయలేకపోతోంది. గతంలో బాలికలకు మాత్రం ప్రత్యేకించిన పాఠశాలలు, కళాశాలలు, అలాగే బాలికల సంఖ్య అధికంగా ఉన్న విద్యాసంస్థల్లో పూర్తిగా మహిళా సిబ్బందినే నియమించేవారు. టీచర్ల నుంచి బోధనేతర సిబ్బంది వరకు మహిళలే ఉండేవారు. తప్పనిసరి పరిస్థితుల్లో 50ఏళ్ళుపైబడి, మంచినడవడిక కలిగిన పురుషుల్ని ఈ విద్యాసంస్థల్లో డ్యూటీల్లో వేసేవారు. అప్పట్లో ఇలాంటి వివాదాలుండేవికాదు. విద్యార్థినిలు తమ విద్యాసంస్థల్లో పూర్తిస్థాయి రక్షణ పొందేవారు. కాగా గతకొంతకాలంగా ఈ విధానం మారింది. పైరవీలు, ముడుపుల్తో కొందరు బాలికల పాఠశాలలు, కళాశాలల్లో వార్డెన్లు, ఉపాధ్యాయులుగా నియమితులు కాగలుగుతున్నారు. వీరిలో కొందరు విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, వార్ని లైంగిక వేధింపులకు గురిచేయడాలకు పాల్పడుతున్నారు. గతంలో ప్రైవేటు విద్యాసంస్థల్లోని ఎయిడెడ్ టీచర్ల పోస్టుల నియామకంపై సంబంధిత పాఠశాలల యాజమాన్యాల హక్కును నిరోధిస్తూ ప్రభుత్వం చట్టం చేసింది. వాస్తవానికంతకుముందు ఈ ఎయిడెట్ పోస్టుల్ని సంబంధిత యాజమాన్యాలే నింపుకునేవి. ఈ విధానంలో అనర్హులకు ఉద్యోగాలు రావడంతో పాటు విద్యాసంస్థల్లో కొందరు అసాంఘిక శక్తులుగా వ్యవహరిస్తుండడంతో ఈ విధానానికి ప్రభుత్వం చెక్ పెట్టింది. ప్రభుత్వోద్యోగుల్తో సమానంగానే ఈ ఎయిడెడ్ సిబ్బందికి జీతాలిస్తారు. దీంతో నియామక ప్రక్రియను కూడా ప్రభుత్వమే నిర్వహించేలా చట్టంలో మార్పులు చేసింది. కొన్నాళ్ళ పాటు ఈ విధానం అమలైంది. అప్పట్లో ఎయిడెడ్ సిబ్బందిపై ఎలాంటి ఆరోపణలురాలేదు. కాగా ప్రైవేటు సంస్థల యాజమాన్యాలు, రాజకీయ ఒత్తిళ్ళకు లొంగిన ప్రభుత్వం ఈ నిబంధనల్ని ఎత్తేసింది. తిరిగి నియామక హక్కును యాజమాన్యాలకే దఖ లుపర్చింది. అప్పట్నుంచి ఈ పోస్టుల్ని వీరు బహిరంగవేలంలో అమ్మేస్తున్నారు. ఇలా పదేసి, పదిహేనేసి లక్షల్తో ఈ పోస్టుల్ని కొనుగోలు చేసి నియమితులౌతున్న ఎయిడెడ్ ఉద్యోగులు విద్యార్థినిలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డంతో పాటు విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి విశేషంగా నిధుల్ని కేటాయిస్తున్నా ఇలాంటి లోపాల కారణంగా ప్రభుత్వం ఆశించిన స్థాయిలో విద్యావ్యవస్థ ఫలితాల్ని సాధించలేకపోతోంది.

రుగ్మతులకు డాక్టర్లే బాధ్యులా?

- నిరుపేదలకు అందని మెరుగైన వైద్యం
- లాభదాయకంగా వైద్యవృత్తి
- ప్రభుత్వ విధివిధానాల్లో వైఖరే కారణం
- వాణిజ్య సరుకుగా విద్య
- ట్విట్టర్ వేదికగా రాష్ట్రపతి కోవింద్ ఆలోచనాత్మక సందేశం



న్యూఢిల్లీ : వైద్యో నారాయణ హరి! అనే ఆర్యోక్తి నేటి కాలంలో వర్తించదు. వైద్యం ఇప్పుడు సేవగా కాక, వృత్తిగానే పరిగణింపబడుతోంది. అందువల్ల రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ గత నెల 16వ తేదీన ట్విట్టర్‌లో ఇచ్చిన సందేశం అందరి మనసులను తాకింది.వై ద్యు లుగా మీ సేవలు మీ ఫీజులు ఇచ్చు కోగలిగిన వారికే కాక, సమాజంలో అభాగ్యులు,నిరుపేదలకు కూడా అందేట్టు చూడాలని ఆయన ట్విట్టర్‌లో వైద్యులనుద్దేశించి సలహా ఇచ్చారు.వైద్య విజ్ఞానం ద్వారా సమాజం లాభం పొందాలి కానీ, అందుకు భిన్నంగా ఉండకూడదని ఆయన అన్నారు. ఆయన చెప్పిన దాంట్లో తప్పు పట్టడానికి ఏమీ లేదు.కానీ, సమాజంలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. వాస్తవానికి దశాబ్దాలుగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, రాజకీయ ప్రాధాన్యతలు ఇందుకు కారణం. వైద్య విద్య వాణిజ్య పరమైన సరకుగా మారకూడదని అబ్రహం ఫెల్గ్జనర్ చరిత్రాత్మకమైన పత్రంలో స్పష్టం చేశారు.ఆ పత్రం అమెరికాకేకాక యావత్ ప్రపంచానికీ ప్రామాణికమైనది.వైద్యవిద్య సామాజిక అంశంగానే ఉండాలి తప్ప అందులో మార్కెట్ శక్తులకు ప్రవేశం ఉండ రాదని ఫ్లెగ్జనర్ తన పత్రంలో పేర్కొన్నారు. లాభదాయక ప్రైవేటు పద్దతిలో వైద్యవిద్యను మన పాలకులు వ్యతి రేకించిన సందర్భాలు చాలా తక్కువ. 1980వ దశకం తర్వాత మన దేశంలో పుట్టగొడుగుల్లా ప్రైవేటు వైద్య కళాశాలలు పుట్టుకుని వచ్చా యి. పార్లమెంటు సభ్యుల్లో అధిక సంఖ్యాకులకు ప్రైవేటు వైద్య కళాశాలలు ఉండటమో, లేక ఆ సంస్థల్లో నేరుగా ప్రయోజనాలు ఉండటమో ఇందుకు కారణం.పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారయ్యేందుకు ఇటీవల ప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ వైద్య కమిషన్ నియమనిబంధనలు దోహదం చేసే వి గాఉన్నాయి.ప్రస్తుతం దేశంలో ఆరోగ్య సంక్షణ విధానం ఏడు దశాబ్దాల క్రితం భోరే కమిటీ (1946)లో నివేదికకు విరు ద్ధంగా ఉం ది.దేశంలో వైద్యవిధానానికి ఈ కమిటీ నివేదికే పునాది.స్వాతంత్ర్యానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా ఆ నాటి నివేదికలో లక్ష్యాలకు చాలా దూరంలో ఉన్నాం. భోరే కమిటీ నివేదిక అమ లు జరగకపోవడానికి తగినన్ని వనరులు లేక పోవడమే బలమైన కారణమని రవి దుగ్గాల్ పేర్కొన్నారు. అయితే, వనరుల కేటాయింపును శ్రద్ధగా పరిశీలిస్తే, ఆర్థికవనరులన్నీ పెట్టుబడిదారి విధానం వృద్ధి చెందడానికే కేటాయించడం జరిగిందన్న వాస్తవం వెల్లడవుతుంది. ఈ ధోరణి ప్రబలడంతో 1990వ దశకంలో వైద్య,ఆరోగ్య పరిరక్షణ రంగంలోకి కార్పొరేట్ సంస్కృతి ప్రవేశించింది.మన పాలకులు అందరికీ ఆరోగ్యం అంటూ నినదిస్తున్నారే తప్ప, కార్యాచరణకు పూనుకోవడం లేదు.కేవలం మొక్కుబడి ప్రకటనలే మిగులుతున్నాయి.ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వ రంగం నుంచి ప్రైవేటు రంగానికి తరలి పోయింది. అర్థవంతమైన ఆరోగ్య విధానం అందని దాక్షగానే మిగిలిపోయింది. ఆరోగ్య పరిరక్షణ పరిశ్రమలో వైద్యులు తమ వృత్తికే పరిమితం అయ్యా రు.వైద్య,ఆరోగ్య రంగంలో రుగ్మతలన్నింటికీ వారే బాధ్యులన్న అపవాదు వారిపై పడు తోంది. ఒక్క ఈ రంగంలోనే కాదు.అన్ని రంగాల్లోనూ ఇలాం టి పరిస్థితే.ఒక్క వైద్య రంగానికే కాదు,అన్ని రంగాలకూ నైతి కత,వృత్తిపరమైన బాధ్యతల మధ్య ఉన్న విభజన రేఖను తెలుసుకోవడం అత్యవసరం.

సినీ ఫక్కీలో చోరీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భాగ్యనగర శివారులోని రాజేంద్రనగర్ పరిధి ఆరాంఘర్ బస్టాప్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. ఓ మహిళ శుభకార్యంలో పాల్గొనేందుకు తమ బంధువుల ఇంటికి వెళ్తుండగా బస్టాప్‌లో బంగారు ఆభరణాల ఉన్న బ్యాగ్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితురాలు ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వివరాల ప్రకారం.. బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన నర్మద వనపర్తిలోని బంధువుల ఇంట్లో శుభకార్యంలో పాల్గొనేందుకు బయల్దేరింది. అయితే ఆభరణాలు ఒంటిపై ఉంటే దొంగల భయం పొంచి ఉండటంతో వాటిని ఓ కవర్లో ఉంచి బీఎన్‌రెడ్డి నగర్ నుండి ఆరాంఘర్ చౌరస్తా వరకు వెళ్లింది. ఆరాంఘర్ చౌరస్తాలోని వనపర్తి వెళ్లే బస్సులు నిలిచేస్టాండ్‌లో ఓ బెంచిపై కూర్చుంది. కాసేపటికి బ్యాగు చూసుకునే సరికి అది కోసి ఉండటాన్ని గమనించింది. బ్యాగును తెరచి చూడగా అందులో ఉన్న బంగారు ఆభరణాలు దాచి ఉంచిన కవర్ అదృశ్యమైంది.

దీంతో బాధితురాలు ఈ విషయమై రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బస్సు ఎక్కుతుండగా మహిళ వద్ద ఈ బంగారు నగల సంచి చోరీ జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలు స్తోంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ పుటేజ్‌ల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. నర్మదను బీఎన్‌రెడ్డి నగర్ నుండే దొంగ అనుసరించి అదునుచూసుకుని బ్యాగు ఎత్తుకెళ్లి ఉంటారని అనుమానిస్తున్నారు. అతడు సినిమాలో రైలులో పేపర్ చదువుతున్న సమయంలో బ్యాగు కోసి డబ్బులు దోచు కున్న ఘటన స్ఫురణకు రాక మానదు.

భయం గుప్పిట్లో భాగ్యనగరం

- రెచ్చిపోతున్న నేరగాళ్లు
- కొరవడిన పోలీసుల నిఘా
- ఆందోళనలో నగరవాసులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఈ నగరానికి ఏమైంది? వరుస హత్యలు, దొంగతనాలు, దోపిడీలతో భాగ్యనగర ప్రజలు భయ కంపితులవుతున్నారు. పోలీసుల నిర్లక్ష్య ధోరణిపై వారు తీవ్ర స్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తపరుస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి చోరీ గ్యాంగ్‌లు నగర ప్రవేశం చేస్తూ తమ పని తాము చేసుకునిపోతూ అంతర్థానమవుతున్నాయి. అత్యం త కరడుగట్టిన, భయానకమైన చెడ్డీ బనియన్ గ్యాంగ్ భాగ్యనగరంలో హల్‌చల్ చేసినా.. వారి ఇమేజ్ సీసీపుటేజ్‌లలో లభ్యమైనా ఆ గ్యాంగ్ సభ్యుల ఆచూకీ ఇంత వరకూ పోలీసులకు చిక్కలేదు. టెక్నాలజీతో నేరాలు అరికట్టేస్తామని పోలీసు బాస్‌లు చెప్పే మాటలు నీటి మూటలుగా మిగులుతున్నాయి తప్పించి ఆశించిన స్థాయిలో ఫలితాలనివ్వడం లేదన్నది ప్రజల వాదనగా ఉంది. పోలీసు నిఘా అన్నది భాగ్య నగరంలో లేనే లేదన్నది పలు సందర్భాల్లో నిరూపితమైంది. ఏదైనా ఘటన జరిగిన సందర్భంలోనో లేదా విమర్శలు వెల్లువెత్తిన సందర్భాల్లో అమాత్యులు ఆయా ప్రాంతాల్లో పోలీసు నిఘా పెంచుతామని చిలుకపలుకులు పలుకుతుండటం గమ నార్హం. సంక్రాంతి పర్వ దినాల్లో ప్రజలు ఊళ్లకు వెళ్లిన సందర్భంలో నగరంలో మొత్తంగా దొంగలు 25 ఇళ్ల ను ఊడ్చేసిన సంగతి తెలిసిందే. మళ్లీ రోజూవారీగా [illegible]



చెలరేగిపోతున్నారు. గచ్చిబౌలి బొటానికల్ గార్డెన్ గర్భిణీ మహిళ హత్య కేసులో చిక్కుముడి వీడలేదు. సదరు మహిళ ఊహాచిత్రాన్ని విడుదల చేశారు. ఆచూకీ తెలిపితే లక్ష పారితోషికం ప్రకటించారు కూడా. ఉప్పల్‌లో చిన్నారి తల లభ్యత కేసులో సైతం పూర్తిస్థాయిలో చిక్కుముడి వీడనే లేదు. టెక్నా లజీతోనే నేరాల నియంత్రణ చేస్తామంటూ ఓ మూస పద్దతిలో పోలీసుల వ్యవ హరించడాన్ని సామాన్య ప్రజలు గర్హిస్తున్నారు. ఒక్క సీసీ కెమెరా వందమంది కానిస్టేబుళ్ల పని [illegible] యించి చెప్పారు.. చెబుతున్నారు కూడా. దానిని ఎవరూ కా దనలేరు. అలాగని మొత్తం టెక్నాలజీ మీదే ఆధారపడటం కూడా అంత శ్రేయస్కరం కాదన్నది కూడా పలువురి భావన. సీసీ కెమెరాలున్నా దుండగులు యధేచ్ఛగా తమ పని చక్క దిద్దుకుని ఎంచక్కా ఉడాయిస్తున్నారు. సీసీ కెమెరాలు వచ్చిన తర్వాత పోలీసులకు పనిలేకుండా పోయిందని, ఎంచక్కా వారు ఎంజాయ్ చేస్తున్నారన్న కామెంట్లు సైతం పలువురి నుంచి వినవస్తున్నాయి. సీసీ కెమెరాలు లేని సమయంలో స్టేషన్ వైజ్‌గా పోలీసులు గస్తీలు నిర్వహించేవారని.. రాత్రి వేళల్లో పటిష్ట నిఘా కొన సాగించేవారని.. ఇప్పుడు ఆ పరిస్థితి లేనే లేదన్నది సామాన్య ప్రజలు చెప్పకనే చెబు తున్నారు. నేరం జరిగిన తర్వాత సీసీకెమెరాల ఉపయోగం ఉంటే ఉండవచ్చు కాగా.. నేరాలు జరగకుండా నిరోధించడంలో పోలీసుల గస్తీ అన్నది మాత్రం అనివార్యమన్నది భాగ్యనగర్ వాసుల ఆవేదనగా ఉంది. నేరాలు జరిగిన తర్వాత నేరస్తులను పట్టుకోవడం కాదని.. అసలు నేరాలు జరగకుండా చూడాలని భాగ్య నగర్ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరి ఆ దిశగా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు [illegible]

మిస్ ఇండియా 2018కి ఏపీ యువతులు

విశాఖ బిగ్‌బజార్‌లో అందాల పోటీలు



విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: ఎఫ్‌బిబి కలర్స్ ఫెమినా మిస్‌ఇండియా -2018 అందాల పోటీలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు యువతులు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం విశాఖ బిగ్‌బజార్‌లో అందాల పోటీలు నిర్వహించారు. ఇందులో దాదాపు 80 మందికి పైగా పోటీదారులు పాల్గొన్నారు. ఈ ఆడిషన్‌లకు తెలుగు సినీనటుడు బస్టాఫ్ మూవీ ఫేమ్ ప్రిన్స్‌సెసిల్ జడ్జిగా వ్యవహరించారు. మిస్‌ఇండియా 55వ ఎడిషన్ దేశంలోని మొత్తం 30 రాష్ట్రాల నుంచి 30 మంది పోటీదారులను ఎంపిక చేసి వారికి మిస్ ఇండియా కిరీటం కోసం తుది పోటీలు నిర్వహించడం జరుగుతుంది. విశాఖలో జరిగిన ఆడిషన్స్‌లో కామవరపు శ్రియారావ్, వేగిహర్షిత, ఉప్పులూరి కిరణ్మయిలు రాష్ట్రం నుంచి ఎంపికయ్యారు. దక్షిణాదిన ఎంపికల బాధ్యతలను సినీహీరోయిన్ రకుల్‌ప్రీత్‌సింగ్ చేపట్టనున్నట్లు వీరు వివరించారు. ఈ కార్యక్రమంలో బిగ్‌బజార్ స్టోర్ మేనేజర్ బానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ రంగంలో నూతన ఆవిష్కరణలకు ఆహ్వానం

న్యూఢిల్లీ: సోషల్ ఆల్ఫా ఎనర్జీ చాలెంజస్ కార్యక్రమం కింద విద్యుత్ రంగంలో నూతన ఆవిష్కరణలను, ఔత్సాహిక వ్యవస్థాపకుల కో సం జాతీయ స్థాయి అన్వేషణ చేపట్టినట్లు టాటా ట్రస్టు ప్రక టించింది. ఈమేరకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపింది. సాంకేతిక ఆవిష్కరణలను వెలికితీయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొంది. దేశం ఎదు ర్కొంటున్న విద్యుత్ సవాళ్లకు సరికొత్త పరిష్కారాలు కనుగొనేందుకు ఇది దోహ దం చేస్తుంది. ప్రస్తుత విధానాలు మరింత సమర్థవంతంగా ఉండేలా కొత్త ఆవిష్క రణలు రావాలి. ఎనర్జీ లైఫ్‌సైకిల్, జెనరేషన్, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్, స్టోరేజీ, కన్సప్షన్ ఇలా వివిధ విభాగాల్లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. గృహ అవ సరాలు, వ్యవసాయం, పారిశ్రామికం తదితర రంగాల్లో విద్యుత్ వినియోగానికి విప్లవాత్మక మార్పులు అవసరం అని ఈ ప్రకటన పేర్కొంది. టాటా ట్రస్టు- టాటా పవర్ ఢిల్లీ డిస్ట్రిబ్యూషన్ సంయుక్తంగా నిర్మిస్తున్న స్టార్టప్ ఇంక్యుబేటర్ ద్వారా నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఉంటుందని టాటా ట్రస్టు వివరించింది.



ద్రవ్యలోటుపై బెంగలేదు

- వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పరిస్థితి మెరుగుపడుతుంది
- ద్రవ్య పరపతిపై ఆర్‌బీఐ తటస్థ నిర్ణయం సరైనదే
- ఆర్‌బీఐ బోర్డు సమావేశం అనంతరం జైట్లీ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ద్రవ్యలోటు స్థితిగతులపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ సంతృప్తి వ్యక్తంచేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ద్రవ్యలోటు ఇబ్బందులు ఉండవని, నియంత్రణ పరిధుల్లోనే ఉంటుందని విశ్వాసం వ్యక్తంచేశారు. శనివారం బడ్జెట్ అనంతర కసరత్తు క్రమంలో ఆయన రిజర్వు బ్యాంకు బోర్డుతో సమావేశం అయ్యారు. భేటీ అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరుగున్న క్రమంలో, తక్షణ చర్యల అవసరాన్ని ఆయన తోసిపుచ్చారు. దీనిపై ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ఊహాజనిత పరిస్థితుల ఆధారంగా అంచనాలు వేయలేమన్న ఆయన, చమురు ధరల్లో గత మూడు రోజుల తిరోగమన పరిస్థితులను ప్రస్తావించారు. ఈ దశలో వచ్చే ఆర్థిక సంవత్సరాలకు ఆర్థిక క్షీణత పరిస్థితులపై తానేమీ భయపడటం లేదన్నారు. ఇటీవలి ద్రవ్యపరపతి విధానం ప్రకటనలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచాలన్న ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ నిర్ణయం సమతుల్యమైనదిగా పేర్కొన్నారు. ఇప్పటికైతే ఆర్థిక పరిస్థితి గురించి పెద్దగా ఆందోళన లేదు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి మరింత మెరుగవుతుందని భావిస్తున్నాను. రాబడులు అంచనాలను చేరుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇప్పుడున్న పరిస్థితుల ప్రకారం, ఇకముందు ద్రవ్యలోటు భయాలు ఉండే అవకాశం లేదని జైట్లీ ధీమా వ్యక్తంచేశారు. 2018-19 కేంద్ర వార్షిక బడ్జెట్‌లో ఈ ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటును 3.5 శాతంగా ప్రభుత్వం పేర్కొంది. తొలుత ఈ లక్ష్యాన్ని 3.2గా నిర్దేశించినప్పటికీ, చివరి దశలో 0.3 శాతానికి అంచనాలు సవరించబడ్డాయి. జీఎస్టీ అమలు, స్ప్రెక్ట్రం వేలం వాయిదాలే ఇందుకు కారణం. బడ్జెట్ మేనేజ్‌మెంట్ యాక్ట్ ఆదేశాలు 3శాతంగా ఉన్నప్పటికీ, రానున్న ఆర్థిక సంవత్సరానికి ఆదాయ-వ్యయాల అంతరం (ద్రవ్యలోటు) 3.3శాతంగా ఉం టుందన్నారు.

కనీస మద్దతు ధర అమలు గురించి చర్చించాం..

ఇక వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ని పెట్టుబడి వ్యయానికి ఒకటిన్నర రెట్లుగా ప్రకటించడాన్ని జైట్లీ సమర్థించుకున్నారు. బడ్జెట్‌లో పేర్కొన్నందున, ఈ అంశంపై ఆర్బీఐ బోర్డు సమావేశంలో చర్చించామని తెలిపారు. ఎంఎస్‌పీని ఎలా అమలు చేయాలి? దీని ప్రభావం రైతులమీద, వ్యవసాయ ఉత్పత్తులపైన, ఎగుమతుల్లో పోటీతత్వం మీద ఏమేరకు ఉంటుంది? వంటి అంశాలను సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు. దీర్ఘకాల మూలధన వ్యయ పన్ను గురించి ప్రస్తావించగా, ఇది ఆర్బీఐ బోర్డు పరిధిలోని అంశం కాదు. సెబీ బోర్డులో దీని గురించి చర్చిస్తామని తెలిపారు. బ్యాంకులకు మూలధన సమకూర్పుతో రుణ సామర్థ్యం పెరుగుతుందన్నారు.

దీర్ఘకాల లక్ష్యాల మేరకే పరపతి నిర్ణయం:ఆర్బీఐ గవర్నర్



వడ్డీ రేట్ల అంశంపై ఆర్బీఐ గవర్నర్ స్పందించారు. నిధుల ఆధారిత రుణ వడ్డీరేట్ల ప్రకారం (ఎంసీఎల్ఆర్) బ్యాంకుల నుంచి వడ్డీరేట్ల బదలీ చర్యలు ఉంటాయని ఉర్జిత్ పటేల్ వెల్లడించారు. రెండు రోజుల కిందట పరపతి విధాన నిర్ణయం మేరకు బ్యాంకులు ఎంసీ ఎల్ఆర్‌ను తగ్గించుకున్నాయని అన్నారు. వాస్తవానికి బ్యాంకర్ల నుంచి వినియోగదారులకు వడ్డీరేట్ల బది లీ ఆలస్యమైంది. పెద్దనోట్ల రద్దు తర్వాత ఆర్బీఐ జోక్యంతో బ్యాంకర్లు ఈమేరకు చర్యలు ప్రా రంభించాయని పటేల్ స్పష్టంచేశారు. ద్ర వ్యపరపతి విధానం భవిష్యత్ పరిణామాలకు అనుగుణంగా ఉంటుంది. రోజువారీ ద్రవ్యో ల్బణ హెచ్చుతగ్గుల ఆధారంగా నిర్ణయాలు ఉం డవు. జీడీపీ రేటు ఊర్ధ్వముఖంగానే సాగుతుంది. ద్రవ్యలోటు లక్ష్యాలను చేరుకుంటామన్న నమ్మకం ఉంది. చమురు ధర 45 డాలర్లకు చేరుతుందని గతేడాది జూన్‌లోనే అంచనా వేశాం. అందుకు అనుగుణంగానే పరపతి నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. అంతర్జా తీయ ముడి చమురు ధరలను అంచనా వేయడం కష్టతరం. క్యాపిటల్ మార్కెట్ల నుంచి కంపెనీలు పారదర్శకంగా నిధులు సేకరించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి అని ఉర్జిత్ పటేల్ వెల్లడించారు.

బబుల్ సమస్యలపై నియంత్రణ అవసరం

క్యాపిటల్ మార్కెట్ పెరుగుదల జఠిల సమస్యగా మారకుండా సెబీ నియంత్రణ కలిగివుండాలని పటేల్ సూచించారు. ఈ మధ్య దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో తీవ్ర హెచ్చుతగ్గులను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. మార్కెట్లు ఎటువైపు దిశ మార్చుకుంటాయో చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. గత కొద్ది మాసాలుగా గరిష్ట స్థాయిలను దాటుకుంటూ సరికొత్త రికార్డు స్థాయిలకు చేరిన క్రమంలో సెబీ, ఆర్‌బీఐ అప్రమత్త ంగా వ్యవహరించాలని కోరారు.

ఈ సమావేశంలో జైట్లీతోపాటు ఆర్థికశాఖ సహాయమంత్రి రాధాక్రిష్ణన్, ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అధియా, ముఖ్య ఆర్థిక సలహాదారు అర్వింద్ సుబ్రమణియన్, కార్పోరేట్ వ్యవహారాల కార్యదర్శి ఇంజెటి శ్రీనివాస్, సెబీ బోర్డు సభ్యులు మహాలింగం, అరుణ్ పి సాథే, మధాబి పూరిబుచ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బాండ్ల మార్కెట్‌ను పటిష్టం చేయండి

- సెబీకి జైట్లీ సూచన : రెగ్యులేటరీపని తీరుకు ప్రశంసలు
- సమీపకాలానికి మార్కెట్లలో ఒడిదుడుకులు తప్పవు : త్యాగి



న్యూఢిల్లీ: ఐపీవోలకు ఆదరణ లభిస్తుండటం మంచిపరిణామం. ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాల విక్రయ లక్ష్యాలను చేరుకునేందుకు ఇది తోడ్పడుతుంది. కార్పోరేట్ బాండ్ల మార్కెట్‌ను పటిష్టం చేయండి అని సెక్యూరిటీస్ అండ్ ఎక్సేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ)కి కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ సూచించారు. బడ్జెట్ అనంతర సంప్రదాయ భేటీలో భాగంగా జైట్లీ శనివారం నాడు సెబీ బోర్డుతో సమావేశం అయ్యారు. ఇటీవల కాలంలో మార్కెట్ నియంత్రణకు సెబీ చేపట్టిన నూతన చర్యలను జైట్లీ ప్రశంసించారు. సమావేశం వివరాలను సెబీ చెర్మన్ అజయ్ త్యాగి మీడియాకు వివరించారు. కార్పోరేట్ బాండ్ల మార్కెట్‌ను పటిష్టం చేయడం ద్వారా ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల అమ్మకానికి మార్గం సుగమం చేయాలని, ఆస్తుల అమ్మకం ద్వాని నిధుల సమీకరణ చేపట్టాలని జైట్లీ సూచించారు. గత ఏడాది కాలంలో సెబీ పనితీరును ఆర్థిక మంత్రి ప్రశంసించారు. మార్కెట్ నియంత్రణ సంస్థ ద్వారా నిధుల సేకరణను మెచ్చుకున్నారు. సెబీ కంటే కూడా అంతర్జాతీయంగా క్యాపిటల్ మార్కెట్లు మంచి పనితీరును కనబరిచాయి. బడ్జెట్‌లో పేర్కొన్న సెబీకి పరిధిలోని అంశాల మీద ఈసమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. సమీపకాలంలోనూ క్యాపిటల్ మార్కెట్లలో ఒడిదొడుగులు తప్పకపోవచ్చు. దీర్ఘకాలిక మూలధన పెట్టుబడుల పన్నులకు సంబంధించి మదుపర్ల నుంచి ఎలాంటి వ్యతిరేకత రాలేదని త్యాగి వెల్లడించారు. అయితే దీనిప్రభావం మార్కెట్లపై కొద్దిమేరకే ఉంటుందన్నారు. మార్కెట్లు గరిష్టస్థాయిల్లో ఉన్నందున ఎల్టీసీజీ విధింపునకు ఇదే సరైన సమయమని అభిప్రాయపడ్డారు. 10శాతం పన్ను ద్వారా 20వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

క్రిప్టోకరెన్సీ నియంత్రణకు కొత్త పాలసీ

బిట్‌కాయిన్ ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో, మదుపరుల భద్రత దృష్ట్యా పటిష్ట చర్యలకు సెబీ సిద్ధమవుతోంది. వివిధ నియంత్రణ సంస్థలతో చర్చించిన మీదట, క్రిప్టోకరెన్సీ నిబంధనలను ఖరారు చేస్తామని సెబీ చైర్మన్ త్యాగి వెల్లడించారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటి రోజే, ఆర్థిక వ్యవహారాల విభాగానికి తాము దీనిపై విజ్ఞప్తులు చేశామని చెప్పారు. త్వరలో సమావేశమై తొలి పాలసీని రూపొందిస్తామని అన్నారు. ఆర్థికమంత్రి జైట్లీసైతం క్రిప్టోకరెన్సీ చట్టబద్ధం కాదని చెప్పారని త్యాగి గుర్తుచేశారు.

మొబిక్విక్‌లో జియోఫోన్లు

న్యూఢిల్లీ: మేజర్ మొబైల్ వ్యాలెట్ మొబిక్విక్ రిలయన్స్‌జియోతో చేతులు కలపనుంది. ముఖేష్ అంబానీకి చెందిన జియో మొబైల్ ఫోన్ల విక్రయానికి సిద్ధమైంది. ఈ విషయాన్ని మొబిక్విక్ బిజినెస్ హెడ్ బిక్రంబీర్ సింగ్ శనివారం ఒక ప్రకటనలో మీడియాకు తెలిపారు. జియో ఫోన్లను విక్రయించే తొలి వేదిక మాదే అవుతు న్నందుకు గర్వంగా ఉంది. నాలుగు సులువైన దశల్లో వినియోగదారులు మొబిక్విక్ నుంచి ఫోన్లు ఆర్డర్ చేయొచ్చు. అంతేకాదు మరిన్ని ప్రయోజనాలు కూడా పొందే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేయగానే వారికి కన్ఫర్మేషన్ సందేశంతోపాటు, ఫోన్‌ను ఎక్కడ తీసుకోవాలో తెలిపే అడ్రస్ వివరాలతో మరో సందేశం వారికి చేరుతుంది. వ్యక్తిగత గుర్తింపు పత్రం సమర్పించి ఫోన్ తీసుకోవచ్చు అని బిక్రంబీర్ సింగ్ వివరించారు.



దివాలా తీర్మానాల్లో తాత్కాలిక పరిష్కారాలొద్దు

- నిపుణులకు ఐబీబీఐ చీఫ్ హెచ్చరిక



న్యూఢిల్లీ: తాత్కాలిక పరిష్కారాలతో దీర్ఘకాలిక సేవలకు దూరంగా ఉండే ప్రయత్నం చేయొద్దని, దివాలా తీర్మాన నిపుణులకు ఇన్‌సాల్వెన్సీ బ్యాంక్ రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ) చైర్‌పర్సన్ ఎంఎస్ సాహూ హెచ్చరించారు. నిపుణులకు కొన్నిపరిస్థితుల్లో నిర్వహణ, సేచ్ఛ ఉండటంపై ఆందోళనలు వినిపిస్తున్న నేపథ్యంలో, సాహూ ఈ మేరకు సూచ నలు చేశారు. దివాలా వృత్తిలో వ్యక్తిత్వం ఎంతో ప్రధా నమైనది. బ్యాంక్‌రప్టసి కోడ్ (ఐబీసీ) విధానంలో కాలవ్యవధి పరిష్కారాల్లో నిపుణల పాత్ర ముఖ్యమని ఆయన గుర్తుచేశారు. మనస్ఫూర్తిగా పనిచేయండి.. పటిష్ట తీర్మానాలు చేయండి.. తాత్కాలిక పరిష్కా రాలు చెప్పే ప్రయత్నాలకు దూరంగా ఉండండి అని శనివారం నాడిక్కడ జరిగిన దివాలా ప్రొఫెషనల్స్ సదస్సు ద్వారా సాహు సందేశం ఇచ్చారు. మేధస్సు, వ్యక్తిత్వం అనే రెండు లక్షణాలు ఈ వృత్తికి ప్రధానమైనవి. మీరందించే సేవలకు ఎక్కువ మొత్తంలో ఫీజులు తీసుకోవద్దు. రెండు కోట్ల ఎగవేత చర్యకు, 14 కోట్ల రూపాయలు తీసుకునే ప్రయత్నం చేయకండి. పారదర్శక పద్ధతిలోనే ప్రతిఫలం పొందండి అని నిపుణులకు సూచించారు. ఇతరులతో పోల్చుకుంటే తన ప్రొఫెషన్ ప్రత్యేకమైనదని, ఇందుకు ఉన్నత విలువలు, సమగ్రత, గౌరవం, వ్యక్తిత్వమే ప్రధానమని చెప్పారు. ప్రజలు సందేహించే విధంగా మన పని తీరు ఉండకూ డదన్నారు. ఈ వృత్తిలో పోటీతత్వా న్ని అలవర్చుకోవడంతోపాటు, మారుతు న్న పరిస్థితులకు అనుగు ణంగా పరివర్తన సాధించాలని ఐబీ బీఐ చీఫ్ కోరారు. ఇది ప్రారంభ దశలో ఉన్నందున, పూర్తి అవగాహన కొరవడుతుందని, విమర్శలు, కొత్త సమస్యల నుంచి పాఠాలు నేర్చుకుంటూ తరచూ సవ రణలు చేయాల్సి రా వొచ్చని అభిప్రాయపడ్డారు. ఐబీసీని అమలు చేసేం దుకు ఐబీబీఐ కసరత్తు ప్రారం భించింది. ఇందుకు సంబంధించి 270 రోజుల కాలపరిమితితో తీర్మానాలు చేపట్టింది.

అమరరాజా బ్యాటరీస్ లాభాలు 20శాతం జంప్



న్యూఢిల్లీ: మూడవ త్రై మాసిక సంవత్సరానికి సంబం ధించి అమర రాజా బ్యాటరీస్ లాభాల్లో 20శాతం వృద్ధి నమోదైంది. 2017 డిసెంబర్ మాసంతో ముగిసిన త్రైమా సికానికి సంస్థ 134.45కోట్ల రూపాయల నికర లాభాన్ని ప్రకటించింది. కిందటి యేడా ది ఇదే సమయానికి ఇది 112. 32 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం గతేడాది కంటే 57.6 కోట్ల రూపాయల మేర పెరిగి రూ. 1570.22 కోట్లకు చేరిందని సంస్థ సీఈవో విజయానంద్ చెప్పారు. ఆటోమేటివ్ బ్యాటరీ వ్యాపారంలో సుస్థిర వృద్ధి నమోదు చేయగలిగామన్నారు. అదే సమయంలో పారిశ్రామిక బ్యాటరీ వ్యాపారం కిందటేడాది కంటే పెరిగిందన్నారు.

బడ్జెట్‌లో బడుగులకు విదిలింపులే!


ఫైల్‌ఫొటో

కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పార్లమెం టులో 2018-19 సాధారణ బడ్జెట్‌ని ప్రవేశపెట్టిన తర్వాత దేశ ప్రజలనుద్దేశించి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగిస్తూ, గ్రామీ ణాభివృద్ధికీ, అట్టడుగు వర్గాలకూ ఈ బడ్జెట్ ఎంతో దోహదం చేస్తుందని స్పష్టం చేశా రు.అయితే,ఈ బడ్జెట్‌లో వివిధ పద్దులకు ముఖ్యం గా, దళితులు, గిరిజనులు, గ్రామీణ ప్రజల అభ్యున్నతికి చేసిన కేటాయింపులను నిశితంగా పరిశీలిస్తే, ఈ వర్గాలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైంది.

లబ్ధిదారుల సంఖ్య తగ్గింపు: ఈ పథకం కింద లబ్ధి పొందే షెడ్యూల్డ్ తెగల కుటుంబాల సం ఖ్య2012-13లో 92.33 లక్షలు ఉం డగా, 2016-17లో ఆ కుటుంబాల సంఖ్య 81.19 లక్షల కు తగ్గింది.అంటే, ఈ పథకం పరిధి నుంచి 11.14 లక్షల షెడ్యూల్డ్ తెగల కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి అదే కాలంలో షెడ్యూల్డ్ కులాల కుటుంబాలను 1.08 కోట్ల నుంచి 1.06కి తగ్గించారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన 2 లక్షల కుటుం బాలు తగ్గాయి. ఇందుకు కారణం ఏమని చెప్పారంటే, కేటా యింపులు జరిగిన పనులకు వేతనాలు చెల్లింపులో జాప్యమేనట. అదే మాదిరిగా షెడ్యూల్డ్ తెగల కుటుంబాలకు ఈపథకం కింద గతంలో ఏడాదికి వంద రోజుల ఉపాధి లభించేది. అది ఇప్పుడు 11 శాతం తగ్గింది. 2012-13లో 11 శాతం ఉండగా, 2016 -17లో అది 8.3 శాతానికి తగ్గింది.అలాగే, వందరోజుల పని పొందే షెడ్యూల్డ్ కుటుంబాల సంఖ్య 10 నుంచి 7.5 శాతానికి తగ్గింది. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) ప్రకారం చూ స్తే, 2012-13లో 0.40 శాతం ఉండగా, 2014-15లో (మోడీ అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరం) 0.29 శాతానికి తగ్గింది. ఈ కేటాయింపులు 2018-19లో జిడిపిలో 0.29 శాతం ఉన్నాయి.ఈ పథకా నికి కొత్త బడ్జెట్‌లో 60,000కోట్లు కేటాయించి ఉండాల్సింది.

మధ్యాహ్న భోజన పథకం: చదువు మధ్య లో మానేసే పిల్లల (డ్రాప్ అవుట్స్) కోసం అమలు జేస్తున్న మధ్యాహ్న భోజన పథకం ప్రపంచంలోనే అతి పెద్ద సంక్షేమ పథకం. దీనిని స్థానిక సంస్థల పాఠశాలల్లో,ప్రభుత్వ పాఠశాలల్లో అమలు జేస్తు న్నారు. పౌష్టికాహార లోపం నుంచి పేద వర్గాల పిల్లలను విముక్తం చేయడం కోసం ప్రవేశపెట్టిన ఈ పథకం లక్ష్యాలకు సుదూరంలో ఉన్నాయి. అలాగే,డ్రాప్ అవుట్స్ సంఖ్యను తగ్గించడంలో కూడా ఈ పథకం విఫలమైంది. [illegible], బడులకు వెళ్ళని పిల్లల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఈ పథకానికి 2018-19 సంవత్స రంలో 10, 500 కోట్లు కేటాయించారు.2014-15 లో కేటాయించిన దాని కన్నా ఇది 2,715 కోట్లు తక్కువ.ఈ పథకం కింద 2013-14లో 10.79 కోట్ల మంది పిల్లలు ప్రయోజనం పొందారు. ఈ పథకా నికి నిధులు తగ్గించడం వల్ల 9.6 మిలియన్ పిల్లలు ఈ పథకానికి దూరం అవుతారు.పిల్లలకు పౌష్టికా హారాన్ని అందించడంలో కూడా ఈసారి బడ్జెట్ పూర్తిగా విఫలమైంది.

విద్య: షెడ్యూల్డ్ కులాల పిల్లలకు ప్రీమెట్రిక్ ఉపకార **వేతనాలు:** ప్రాథమిక విద్య దశ నుంచి సెకండరీ విద్యకు చేరే షెడ్యూల్డ్ కులాల పిల్లల సం ఖ్య తగ్గకుండా ఉండేందుకు ఈ ఉపకార వేతనాల పథకాన్ని ప్రవేశపెట్టారు.ఈ పథకానికి 2016-17లో 507.47 కోట్లు కేటాయించగా,2017-18 సవరించిన అంచనాలలో 50 కోట్లు తగ్గిం చారు.2018-19లో ఈ పథకా నికి 125 కోట్లు మాత్రమే కేటా యించారు.

పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్ లు: షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్‌లు గత ఏడాది 3, 348 కోట్లు ఉండగా, కొత్త బడ్జె ట్‌లో 3000 కోట్లు మాత్రమే కేటాయిం చారు.ఈ ప ద్దు కింద 2016-17 చివరకు 8వేల కోట్ల బకాయిల ను చెల్లించాల్సిందిగా సాంఘిక సంక్షేమ శాఖ కోరిన తరుణంలోనే ఈ పద్దుకు నిధులు తగ్గించడం గమనార్హం.

మైనారిటీలకు ప్రీమెట్రిక్ స్కాలర్ షిప్‌లు: ఈ పద్దుకు 2015-16లో కేటాయింపులు 1016 కోట్లు ఉండగా, 2016-17లో 369 కోట్లు కేటాయిం చారు.2017-18 సవరిం చిన అంచనాలు 980 కోట్లు ఉండగా,2018-19లో 980 కోట్లు మాత్రమే కేటాయించారు.

వనబంధు కల్యాణ యోజన : ఇది షెడ్యూల్డ్ తెగల వారి సర్వతోముఖాభివృద్ధికి సంబంధించింది. అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతుధర లభించేందుకు తోడ్పడుతుంది.ఈ పథకానికి 2017-18లో 505కో ట్లు కేటాయించి ,2018-19లో 420 కోట్లకు తగ్గిం చారు. ఈ నేపథ్యం నుంచిచూస్తే దళితులు,గిరి జనులు, [illegible] కొత్త బడ్జెట్‌లో కేటాయింపులు [illegible] తక్కువ.అందువల్ల ఈ బడ్జెట్ అట్టడుగు వర్గాలకు మేలు చేకూర్చేది అన్న ప్రధానమంత్రి మోడీ స్పష్టీకరణలోని డొల్లతనాన్ని ఈ గణాంకాలే బయటపెడుతున్నాయి.

ఉపాధి హామీ పథకం

గ్రామీణ ప్రాంతాల్లో నిరు పేదలకు ఉపాధి కల్పనకు ఉద్దేశించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఉపాధి అవకా శాలను పెంచు తుందన డంలో ఎటు వంటి సందేహం లేదు. అనావృష్టి, అడవుల నరికి వేత, భూసారం తగ్గిపోవడం వంటి కారణాల వల్ల ఉపాధి కోల్పోయిన గ్రామీణ పేదలకు ఈ పథకం ఎంతో మేలు చేస్తుం ది.ఈ పథకానికి బడ్జెట్‌లో 55,000 కోట్ల రూపాయిలు కేటాయించారు. 2017-18 సవరించిన అంచనాల్లో కూడా అంతే మొత్తాన్ని కేటాయించారు. ఈ పద్దుకు కేటాయిం పుల్లో ఎటు వంటి పెరుగుదల లేదు. 2017-18 బడ్జెట్‌లో కేటాయింపులే డిమాండ్‌కి తగినట్టుగా లేనందున కొత్త బడ్జెట్‌లో పెంచు తారేమోనని గ్రామీణ పేదలు ఆశించారు. ఈ పథకా నికి మరిన్ని నిధులు కేటాయించాలని అన్ని రాష్ట్రా ల నుంచి ఒ త్తిడి వస్తోంది.

గతంలో పురమాయించిన పనులకు బిల్లులు చెల్లిం చక పోవడం వల్ల బకాయిలు పేరు కుని పోయాయి. ఈ నెల రెండవ తేదీ నాటికి 52,593.77 కోట్ల రూపాయిలను ఖర్చు చేశారు. 2017- 18లో ఇదే కాలం నాటికి 55,000కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన 2,406.23 కోట్లతో మార్చి 31 వరకూ ఈ పథకాన్ని కొనసా గించాల్సి ఉంటుం ది.అంటే, 2017-18 సవరించిన అంచనాల ప్రకారం ఈ పథకానికి 2,000 కోట్ల నిధులు తక్కువ అవు తాయి. సాధారణంగా మార్చిలోనే గ్రామీణ ప్రాంతాల్లో పనులు ఎక్కువ జరిగేందుకు అనుకూ లమైన వాతావరణం ఉంటుంది.

గిరిజన విద్యార్థులకు రెసిడెన్షియల్ పాఠశాలలు

50 శాతం పైగా గిరిజనులు ఉన్న ప్రతి బ్లాకులోనూ 2022నాటికి ఏకలవ్య మోడల్ రెసిడె న్షియల్ స్కూలును తెరవనున్నట్టు ఆర్థిక మంత్రి ప్రకటించారు.ఈ మాదిరి స్కూల్స్ మొత్తం 271 ఉండగా,190 మాత్రమే పని చేస్తున్నాయనీ,81 పాఠశాలల భవనాలు నిర్మా ణంలో ఉన్నా యనిమంత్రి చెప్పారు. ఈ పాఠశాలలు సక్ర మం గాపని చేయడం లేదని సాంఘిక న్యాయశాఖ నియమించిన కమిటీ పేర్కొంది.దేశంలో గిరిజనులు 50 శాతం పైగా ఉన్న బ్లాకులు 520వరకూ ఉన్నాయి.నవీటిలో 271బ్లా కులకు ఈ మాదిరి పాఠశాలలను మంజూరు చేశా రు.ఈ పాఠశాలలను రాజ్యాంగంలోమని 275 (1) అధికరణం కింద ఏర్పాటు చేశారు.2018-19లో ఈ పాఠశాలలకు 1800 కోట్లు కేటాయించారు.గత ఏడాది కన్నా 300 కోట్లు మాత్రమే ఎక్కువగా కేటా యించారు.

ఆకట్టుకున్న అగ్రిటెక్ ప్రదర్శన

హైదరాబాద్, ఆంధ్రప్రభ :వ్యవసాయ రంగంలో అధునాతన టెక్నాలజీతో రూపొందించిన పలు రకాల పరికరాల ప్రదర్శన రైతులను విశేషంగా ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణంలో శనివారం ఈ ప్రదర్శనకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచిఅధిక సంఖ్యలో రైతులు తరలి వచ్చారు. నూతన వంగడాలు, నీటి యాజమాన్యం, నీటి సాంకేతిక పరిజ్ఞానం, తెగుళ్లు , పురుగులు , సస్యరక్షణ , ఎరువుల యాజమాన్యం తదితరం అంశాలతో కూడిన ఈ ప్రదర్శనను రైతులు ఆసక్తిగా తిలకించారు. వరి,మొక్కజొన్న, అపరాల పంటలు, పశుగ్రాస పంటల లైవ్ మాడళ్లను ఈ సందర్భంగా ప్రదర్శించారు. గృహ విజ్ఞాన విభాగం అధ్వర్యంలో చిరుధాన్యాలతో తయారు చేసిన పదార్థాలను విక్రయానికి ఉంచారు. ఔషధ మొక్కలను కూడా ప్రదర్శ నలో ఉంచారు. రాష్ట్రంలోని కరీంనగర్, కొత్తగూడెం, అదిలాబాద్ , మహబూబ్ నగర్, ఖమ్మం , పెద్దపల్లి జిల్లాల నుంచి రైతులు అధికసంఖ్యలో హజరయ్యారు.



ఉపాధ్యాయుల వేతనాలు పెంచాలి

- ఉద్యోగ భద్రత కల్పించాలి
- కమిషనరేట్‌ను ముట్టడించిన ఉద్యోగులు,సిబ్బంది
- రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డిమాండ్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు(కెజిబివి), అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యుఆర్ఎస్) ఉపాధ్యాయులు, సిబ్బంది వేతనాలను పెంచాలని, ఉద్యోగులపట్ల వివక్ష, వేధింపులను మానుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. కెజిబివి, యుఆర్ఎస్ ఉద్యోగుల వేతనాల పెంపుతోపాటు, ఉద్యోగభద్రత తదితర సమస్యలపై ఉద్యోగులు, సిబ్బంది శనివారం పాఠశాల విద్యా కమిషనరేట్ ముట్టడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె నాగేశ్వర్, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవితోపాటు నాయకులు కె సోమశేఖర్, టి లక్ష్మారెడ్డి, ఎం దేవదాసు, ఆ ంజనేయులు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సు ప్రీంకోర్టు తీర్పు ప్ర కారం స మానపనికి సమాన వేతనం ఇవ్వకుండా కెజిబివి, యుఆర్ఎస్ ఉపాధ్యాయులు, సిబ్బందికి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని నాగేశ్వర్ వి మర్శించారు. వీరికి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వీరి సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చి, ఆ తరువాత పట్టించుకోకుండా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సమస్యల పరిష్కారానికి టిఎస్ యుటిఎఫ్ అధ్వర్యంలో పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 7వ వేతన సంఘం సిఫారసుల మేరకు కనీస వేతనంరూ.18,000ని ర్ణయించినందున రాష్ట్ర ప్రభుత్వం అ మలు చేయాలని యుటిఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. వేసవి సెలవుల్లో కూ డా వేతనం చెల్లించాలన్నారు. హెల్త్ కా ర్డులు జారీ చేసి నగదు రహిత వైద్యం అం దించాలని డిమాండ్ చేశారు. కెజి బివిల్లో పనిచేసే మహిళా ఉపా ధ్యాయులకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల మాదిరిగానే ప్రసూతి సెలవులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ సంఘాలతో కమిషనర్ సమావేశం రసాభాస

హైదరాబాద్,ఆంధ్రప్రభ: విద్యారంగ సమస్యలు, అకడమిక్ క్యాలెండర్‌పై పాఠశాల విద్య సంచాలకులు ఉపాధ్యాయ సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశం రసాభాసగా ముగిసింది. సమావేశం ప్రారంభం కాగానే ఒక పత్రికలో వచ్చిన వార్తా కథనానికి సంబంధించిన ప్రతులను సంఘాల వారికి పంపిణీ చేయించడంతో ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. విద్యారంగ సమస్యలు, అకడమిక్ క్యాలెండర్‌పై చర్చించుదాం అని పిలిచి పత్రికల్లో వచ్చిన వార్తలను చూపి అవమానిస్తారా? అంటూ డైరక్టర్ కిషన్‌పై సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఈవోల ఎదుటనే తమను అవమానిస్తారా? అంటూ మండిపడ్డారు. తక్షణమే క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. దీంతో సమావేశం జరగకుండా రసాబాసగా మారింది. ఈ నేపథ్యంలో సమావేశాన్ని నిర్వహించడం కష్టంగా మారడంతో 15న నిర్వహించాలని వాయిదా వేశారు. వి ద్యారంగ సమస్యలు, అకడమిక్ క్యాలెండర్‌పై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించడం కోసం పాఠశాల విద్యా సంచాలకులు జి కిషన్ శనివారం సర్వశిక్షా అభియాన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు హాజ రయ్యారు. సమావేశంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పి సరోత్తంరెడ్డి, టిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఈ రఘునందన్, టిపిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు మారెడ్డి అంజిరెడ్డి, టిటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణుడు, గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాచారి, టిటియు రాష్ట్ర అధ్యక్షులు మణిపాల్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడీ రాజన్న, టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేతనపెంపు ఉత్తర్వులిప్పించండి

- ఉప ముఖ్యమంత్రి కడియంకు టీ ఆక్టా విజ్ఞప్తి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు పెంచిన వేతనంపై వెంటనే ఉత్తర్వులను ఇప్పించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్(టి- ఆక్టా) ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరికి విజ్ఞప్తి చేసింది. శనివారం టి- ఆక్టా అసోసియేషన్ అధ్యక్షులు ఎం రామేశ్వరరావు నేతృత్వంలో కమిటీ సభ్యులు శనివారం సచివాలయంలో కడియం శ్రీహరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఓయుసీటీఏ అధ్యక్షులు ఎం తిరుపతి, ఎస్ఎఫ్‌టీఏ అధ్యక్షులు సీహెచ్ రాజు, తదితరులు ఉన్నారు.ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ఢిల్లీ నుంచి రాగానే మాట్లాడి ఉత్తర్వులను జారీ చేయిస్తానని హామి ఇచ్చారని రామేశ్వర్ తెలిపారు.

రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటులో అలసత్వం తగదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైతు రు ణ విమోచన కమిషన్ ఏర్పాటు వ్య వహారంలో తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న నాన్చివేత ధోరణిపై హైకోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది. కమిషన్ ఏర్పాటుకు ఆలస్యమెందుకు అ వుతుందో చెప్పాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హై కోర్టు ఆదేశించింది. మూడు నెలల్లో రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేస్తామని ఆగస్టు,2017లో ఇచ్చిన హా మీని అమలు చేయనందుకు గాను చ ట్టప్రకారం ఎందుకు చర్యలు తీసు కోకూడదో చెప్పాలని హై కోర్టు స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె. ఉమాదేవి తో కూడిన ధర్మాసనం మేరకు ఆ దేశాలు జారీ చేసింది.

పురుషోత్తం రెడ్డి అక్రమాస్తులు రూ.300 కోట్లు?

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తోంది. ఈ క్రమంలో పురుషోత్తంరెడ్డి అక్రమాస్తులు రూ.300 కోట్ల పైగానే ఉండవచ్చని ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. కాగా, పురుషోత్తంరెడ్డి విదేశాలకు పారిపోయి ఉంటాడని ఏసీబీ భావించింది. అదే క్రమంలో పురు షోత్తంరెడ్డికి ఎవరూ ఆశ్రయమిచ్చినా వారు నేరస్తులేనని గట్టి హెచ్చరికలు కూడా జారీ చేసింది. ఇంకోవైపు ఇంటర్ పోల్ అధికారులను సైతం పురుషోత్తంరెడ్డి ఆచూకీ కోసం లుక్ అవుట్ నోటీసు జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది. బంజారాహిల్స్‌లోని సాగర్ సొసైటీలో వుంటున్న పురుషోత్తంరెడ్డి ముందస్తు సమాచారంతో ఏసీబీ అధి కారులు వచ్చేసరికి ఇంటి నుంచి పారిపోయారు. దీంతో ఆ ఇంటిని ఏసీబీ అధి కారులు సీజ్ చేశారు. ప్రధానంగా లేఅవుట్లు పర్మిషన్ కోసం తన వద్దకు వచ్చే వారి నుంచి పురుషోత్తంరెడ్డికి లంచం రూపంలో పార్టనర్‌షిప్ ఉందని ఏసీబీ అధి కారు లు గుర్తించారు. మంచిర్యాలలో విల్లాల పేరుతో బిజినెస్ చేసి తద్వారా రూ.100 కోట్లు రాబట్టాలని పురుషోత్తంరెడ్డి యత్నించినట్లుగా వార్తలొచ్చాయి. విదేశాల్లో షాపింగ్‌లు, ఇండియాలోని టాప్ డిజైనర్లతో నగలు చేయించినట్లుగా కూడా ఏసీబీ అధికారులు గుర్తించారు. కాగా, తాజాగా పురుషోత్తంరెడ్డి హైదరాబాద్ శివారులోనే ఆశ్రయం పొందుతున్నాడని తెలుస్తోంది. అయితే, పురుషోత్తంరెడ్డికి ఆశ్రయ మిస్తున్నది ఎవరు? అతని వెనుక ఉన్న గాడ్‌ఫాదర్ ఎవరు? అన్నది కూడా ఏసీబీ అధికారుల దర్యాప్తులోనే తేలాల్సి ఉంది. మరోవైపు పురుషోత్తంరెడ్డి ఆచూకీ కోసం నాలుగు ఏసీబీ ప్రత్యేక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. ఇదిలా ఉండగా, పురుషోత్తంరెడ్డి బావ కూడా పరారీలోనే ఉన్నాడు. అతడు దొరికితే పురుషోత్తంరెడ్డి అక్రమాస్తుల చిట్టా మరింతగా వెలుగుచూసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, పురుషోత్తంరెడ్డికి అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే అండదండ లున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఉద్యమంలో ఉద్యోగ సంఘాల తర పున కీలకంగా వ్యవహరించిన సదరు ప్రజా ప్రతినిధి అండతోనే పురుషోత్తంరెడ్డి అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి.

బినామీలు అరెస్టు.. మరికొందరిపై ఆరా

ఇప్పటికే పురుషోత్తంరెడ్డి బినామీలుగా వ్యవహరిస్తున్న హబ్సిగూడలోని శ్రీ సాయి హరిహర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి యాదవ్‌రెడ్డి, రంగారెడ్డి మంచిరేవుల విలేజ్‌కు చెందిన జి.నిషాంత్‌రెడ్డిలను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వారిపై ఏసీబీతో పాటు బినామీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తున్నారు. వీరు రియల్‌ఎస్టేట్ వెంచర్స్, కనస్ట్రక్షన్ ఫీల్డ్‌లో పురుషోత్తంరెడ్డికి బినామీలుగా వ్యవహరించారని ఏసీబీ అధికారులు గుర్తించారు. పురుషోత్తంరెడ్డి జీహెచ్‌ఎంసీలో అడిషినల్ చీఫ్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న సమయంలో యాదవ్‌రెడ్డి జీహెచ్‌ఎంసీలో శానిటరీ సూపర్‌వైజర్‌గా చేరాడు. తదుపరి శానిటరీ ఇన్‌స్పెక్టరయ్యాడు. అనంతరం జాబ్‌కు రిజైన్ చేసి హబ్సిగూడలో శ్రీ సాయి హరిహర ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్‌ని ప్రారంభించాడు. పురుషోత్తంరెడ్డి భార్య కూడా సదరు కంపెనీలో కొన్నాళ్లు డైరెక్టర్‌గా వ్యవహరించడం గమనార్హం. నిషాంత్‌రెడ్డి తండ్రి రాధాచరణ్‌రెడ్డికి చెందిన సోమాజిగూడలోని చరణ్స్ లైఫ్ డివైసెస్ లిమిటెడ్‌లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మరి కొందరు బినామీలపై ఏసీబీ అధి కారులు ఆరా తీస్తున్నారు. వియ్యంకుడి ఆఫీసులో రోజంతా సోదాలు నిర్వ హించారు. కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఈడీ, ఐటీ విభాగానికి అక్రమాస్తుల వివరాలు

ఇదిలా ఉండగా, తవ్వేకొద్దీ బయటపడుతున్న పురుషోత్తంరెడ్డి అక్రమాస్తులకు సంబంధించిన వివరాలను ఏసీబీ అధికారులు విస్తుపోతున్నారు. వెలుగుచూస్తున్న అక్రమాస్తులు వివరాలను ఎప్పటికప్పుడు ఈడీ, ఐటీ విభాగానికి అందజేస్తున్నారు. ఇదే క్రమంలో ఈడీ, ఐటీ విభాగాలు సైతం పురుషోత్తంరెడ్డి అక్రమాస్తులపై నజర్ సారించాయి.

2009లో పురుషోత్తంరెడ్డిపై కేసు

కాగా, 2009లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పురుషోత్తంరెడ్డిని తాము అరెస్టు చేసినట్లు ఏసీబీ అధికారులు చెప్పారు. దీంతో, 2010 నుంచి 2017 వరకూ జరిగిన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులకు సంబంధించి మాత్రమే పరి గణనలోనికి తీసుకోవడం జరుగుతుందని ఏసీబీ అధికారులు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. జీహెచ్‌ఎంసీ నుంచి ప్రమోషన్‌గా హెచ్‌ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్‌గా పురుషోత్తం రెడ్డి వచ్చారు. అయితే, ఇక్కడ ఇందుకు సంబంధించి రెండు పోస్టు లుండగా తనకు లాభించే విధంగా సెకండ్ పోస్టును పురుషోత్తంరెడ్డి ఎంచు కున్నా డని తెలుస్తోంది. ఈ సెకండ్ పోస్టులో రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన పర్మి షన్‌లను ఇచ్చే అవకాశం ఉంది. దీంతో, ఇతనికి సహజంగానే ప్రముఖ వ్యక్తులతో సంబంధాలున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.

బస్సు బోల్తా.. 27 మంది దుర్మరణం

జకార్తా: ఇండోనేషియా ద్వీపకల్పం జావాలో ఒక బస్సు బోల్తా కొట్టడంతో కనీసం 27 మంది ప్రయాణికులు మరణించారు. 16 మంది గాయపడ్డారని పోలీసులు శనివారం తెలిపారు. పశ్చిమ జావా ప్రావిన్సులో సుబంగ్ ప్రాంతంలో 40 మంది ప్రయాణికులతో కొండవాలున వేగంగా వెళుతున్న ఒక బస్సు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిందని చెప్పారు. ఆ దాటికి బస్సు అనేకసార్లు పల్టీలు కొడుతూ దొర్లిందని తెలిపారు. బస్సు బ్రేకులు పనిచేయకపోవడంతో ప్రవాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. బాధితులందరిని బస్సు నుంచి వెలికితీశారు. వారిలో అత్యధికులను స్థానిక ఆస్పత్రికి తరలించినట్టు అధికారులు చెప్పారు.

ఇద్దరు కాలేజీ విద్యార్థినుల అదృశ్యం

కళాశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లో ఇద్దరు కాలేజీ విద్యార్థినుల అదృశ్యం కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే.. నారాయణగూడలోని రెడ్డి కాలేజీలో డిగ్రీ చదువుతున్న విద్యార్థినులు చామంతి(18), దివ్య(20)లు శుక్రవారం నుంచి కనిపించడంలేదు. కాలేజీకని వెళ్లిన విద్యార్థులు ఇంటికి తిరిగి చేరకపోవడంతో వారి స్నేహితులు, బంధువుల ఇళ్లలో ఆయా విద్యార్థినుల తల్లిదండ్రులు వాకబు చేశారు. అయినా ఫలితం లేకపోయింది. కాలేజీ ముగిసినా ఇంటికి రాలేదని కళాశాల యాజ మాన్యానికి వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కళాశాల యాజమాన్యం పోలీ సులకు ఫిర్యాదు చేసింది. కాగా ఈఘటనపై సహచర విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. అదృశ్యం కేసు కింద పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఏపీ ప్రాజెక్టులకు రూ. 1269 కోట్లు



●పోలవరానికి417.44 కోట్లు ●రెవెన్యూలోటు గ్రాంటు 369.16 కోట్లు ●పట్టణ, స్థానిక సంస్థలకు కనీస గ్రాంటు 253.74 కోట్లు ●అంగన్‌వాడీ, అదనపు పౌష్టికాహారానికి 196.92 కోట్లు ●ఉపాధి హామీకి 31.76 కోట్లు ●ఖాతాల సక్రమ నిర్వహణపై కేంద్రం ఆదేశం ●తనిఖీలపై రిలీజ్ ఆర్డర్‌లో సూచన

అమరావతి: కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు రూ.1,269 కోట్లు విడుదల చేసింది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపుపై ఎన్‌డీఏ, దాని మిత్రపక్షం టీడీపీ మధ్య సంబంధాలు ఊగిసలాడుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ మొత్తాన్ని గత కొద్ది రోజుల్లో విడుదల చేసింది. ఇందులో పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టుకు రూ.417.44 కోట్లు కూడా ఉంది. టిడిపి, బిజెపి మధ్య నలుగుతున్న వివాదాస్పద అంశాల్లో పోలవరం ఒకటి. 2014, ఏప్రిల్ తర్వాత పోలవరం ప్రాజెక్టుకు చెందిన సాగునీటి కాంపొనెంట్‌కు రాష్ట్రం ఇప్పటికే వెచ్చించిన మొత్తానికి రూ.417.44 కోట్లు విడుదల చేయడం జరిగింది అని కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ సీనియర్ జాయింట్ కమిషనర్ ఆర్.పి.ఎస్.వర్మ జారీ చేసిన ఒక ఆర్డరు పేర్కొంది. పోలవరం ప్రాజెక్టును ఒక జాతీయ ప్రాజెక్టుగా గుర్తించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు అథార్టీ ద్వారా ఇప్పటివరకు రూ.4,329 కోట్లను విడుదల చేసింది. అదే ప్రాజెక్టు కోసం తాను రూ.7,200 కోట్లకుపైగా ఖర్చు చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇదే అంశంపై ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి గత మాసంలో ఒక వినతి పత్రం సమర్పించారు. పోలవరంపై ఖర్చు చేసిన రూ.3,217.63 కోట్లను రాష్ట్రానికి తిరిగి చెల్లించలేదని పేర్కొన్నారు. అయితే ఈ మొత్తానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం రూ.417.44 కోట్లు విడుదల చేసిందని ఇక్కడి జలవనరుల విభాగానికి చెందిన ఒక అధికారి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తదనంతర సంక్రమిత రెవెన్యూ లోటు గ్రాంటు కింద రూ.369.16 కోట్లను శుక్రవారం రాత్రి విడుదల చేసింది. 14వ ఆర్థిక సంఘం సిఫారసుకు లోబడి ఆంధ్రప్రదేశ్‌కు ఆ మొత్తాన్ని విడుదల చేసింది. పథకానికి సంబంధించిన ఖాతాలను సక్రమంగా, విడివిడిగా నిర్వహించాలని, అవసరమైనప్పుడు వాటిని సమర్పించాలని కేంద్రం ఆదేశించింది. భారత ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఒక అధికారి తనిఖీ చేయడానికి వాటిని అందుబాటులో ఉంచాలి అని కేంద్ర ప్రభుత్వంలో ఒక సహాయ కార్యదర్శి రిలీజ్ ఆర్డరులో పేర్కొన్నారు. కేంద్రం రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థలకు కనీస గ్రాంటుగా రూ.253.74 కోట్లను కూడా విడుదల చేసింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రెండవ విడత విడుదల చేసిన మొత్తం. దీనికి తోడు అంగన్‌వాడీ సర్వీసుల పథకం, అదనపు పౌష్టికాహార కార్యక్రమం కోసం రూ.196.92 కోట్లు విడుదల చేసింది. అలాగే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యక్రమం కోసం రూ.31.76 కోట్లు విడుదల చేసిందని రాష్ట్ర ప్రభుత్వం అధికారి ఒకరు తెలిపారు.

రైల్వేజోన్‌పై కదలిక

●ఏకాభిప్రాయ సాధనకు అడుగులు ●త్వరలో జోన్‌పై ప్రకటన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: పార్లమెంటు సాక్షిగా ఆంధ్రప్రదేశ్ ఎంపీల పోరాటం ఫలిస్తోంది. కేంద్ర ప్రభుత్వం హామీల అమలుకు నడుం బిగించింది. ముఖ్యంగా రైల్వే జోన్ విషయంపై ముందడుగు పడినట్టు తెలుస్తోంది. శనివారం ఢిల్లీలో ఉన్న కేంద్ర సహాయ మంత్రి, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత వై.ఎస్. చౌదరి (సుజనా) కేంద్ర పెద్దలతో మంతనాలు సాగించారు. తొలుత కేంద్ర ఆర్థిక మంత్రిని కలిసిన ఆయన, అనంతరం పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటీ అయ్యారు. రైల్వే జోన్ ఏర్పాటు విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న రాష్ట్రం ఒడిషా కావడంతో, ఆ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ద్వారా సమస్య పరిష్కారానికి సుజనా ప్రయత్నించారు. రైల్వే జోన్ ఆంధ్ర ప్రజల సెంటిమెంటుగా మారిన నేపథ్యంలో తూర్పుకోస్తా రైల్వేజోన్ పరిధిలో ఉన్న వాల్తేర్ డివిజన్‌ను వదులుకోడానికి ఒడిషా సిద్ధం లేదన్న విషయం తెలిసిందే. ఆ జోన్ మొత్తమ్మీదే కాదు, దేశంలోనే అత్యధిక ఆదాయం సమకూర్చిపెడుతున్న డివిజన్లలో ఇది ఒకటి. తమ ఆదాయం ఎక్కడ కోల్పోతామో అన్న ఆందోళన తూర్పుకోస్తా రైల్వే ఉన్నతాధికారులతో పాటు ఒడిశా ప్రజల్లో ఉంది. అందుకనే వాల్టేర్ డివిజన్‌లో ఆంధ్రప్రదేశ్ భూభాగంలో ఉన్న రైల్వేలైన్లను మినహాయించి మిగతా లైన్లు తూర్పు కోస్తా జోన్ పరిధిలోనే ఉంచేలా మధ్యేమార్గాన్ని తెలుగుదేశం నేతలు ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. తద్వారా ఆ డివిజన్ పరిధిలో జరిగే సరకు రవాణా ద్వారా వచ్చే ఆదాయాన్ని తూర్పు కోస్తా కోల్పోకుండా ఉంటుందని, కొత్త జోన్ ఏర్పాటుకు ఉన్న ఈ ఏకైక అడ్డంకి తొలగిపోతుందని భావిస్తున్నారు. ఇదే అంశంపై ధర్మేంద్ర ప్రధాన్‌తో చర్చించినట్టు సమాచారం.

ఇదిలా ఉంటే శుక్రవారం రాజ్యసభ జరుగుతున్న సమయంలోనే బీజేపీ అధినేత అమిత్ షాతోనూ సుజనా మంతనాలు సాగించారు. జైట్లీతో కూడా సుదీర్ఘంగా చర్చించారు. సభలో జైట్లీ చేసిన ప్రకటనలో రైల్వే జోన్ అంశంపై సంప్రదింపులు జరిపి ఏకాభిప్రాయం సాధించాల్సి ఉందని పేర్కొన్నందున, ఆ దిశగా తెలుగుదేశం నేతలే సంప్రదింపులకు చొరవ తీసుకున్నట్టు అర్థమవుతోంది. సంప్రదింపులు ఫలించి ఏకాభిప్రాయం సాధించిన వెంటనే రైల్వే జోన్ ప్రకటన చేసేందుకు సిద్ధంగా ఉండాలని పీయూష్ గోయల్‌కు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సైతం సూచించినట్టు తెలుస్తోంది. మొత్తానికి జోన్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వంలో కదలిక వచ్చిందని అర్థమవుతోంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే మార్చి 5న మలి విడత బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యేలోపే కొత్త రైల్వే జోన్ ప్రకటన ఉండవచ్చని తెలుగుదేశం వర్గాలు ఆశాభావంతో ఉన్నాయి.

తెలంగాణ ఉద్యమం తరహాలో ప్రత్యేక హోదా పోరాటం

●బోడుగుడిపాడు బహిరంగ సభలో జగన్



నెల్లూరు, ప్రభ న్యూస్ బ్యూరో: తెలంగాణ ఉద్యమం తరహాలోనే రాష్ట్రంలో ప్రత్యేక హోదా సాధన కోసం తాము ఉద్యమం చేస్తామని, ప్రత్యేక హోదా విషయంలో వైసీపీ కట్టు బడి పనిచేస్తోందని వైకాపా అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా శనివారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కావలి నియోజకవర్గం దగదర్తి మండలం బోడగుడిపాడులో జరిగిన బహిరంగ సభలో ఆయన మరోసారి ప్రత్యేక హోదా, తెలుగుదేశం ఎంపీల ఆందోళనపై ఆయన దుమ్మెత్తిపోశారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక హోదాను ఎప్పుడో ఢిల్లీ పెద్దలకు తాకట్టు పెట్టేశారు.. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో ఆయన మళ్లీ కొత్త డ్రామాలు మొదలు పెట్టారని, అయితే ఆయన నాటకాలు, వేషాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటి నుంచి సీఎం బాబు అసలు మీడియా ముందుకే రాలేదని జగన్ ఎద్దేవా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బడ్జెట్ వ్యవహారంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం, వైకాపా ఉద్యమానికి ప్రజలంతా మద్దతు పలకడంతో తెలుగు దేశం కొత్త డ్రామాకు తెరలేపిందన్నారు. నాడు ప్రత్యేక హోదా కోసం వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా దీక్షలు చేస్తే ఇదే చంద్రబాబు నాయుడు ఎగతాళి చేశారని రాష్ట్రం కష్టాల్లో ఉంటే ఉద్యమాలు చేస్తారా అంటూ తమపై ఎదురుదాడికి దిగారన్నారు. అటు వంటి మనిషి ఇప్పుడు ప్రత్యేక హోదా, రాష్ట్రానికి నిధుల కేటాయింపుపై జరిగిన అన్యాయం గురించి టీడీపీ ఎంపీలను ఢిల్లీలో ఆందోళన చేయాలని సూచించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇదే ఆందోళన నాలుగేళ్ల ముందు చేసి ఉంటే ఈ పాటికి నవ్యాంధ్రప్రదేశ్ ఇటువంటి పరిస్థితుల్లో ఉండేది కాదన్నారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు పోరాటం కొనసాగిస్తామని పరోక్షంగా కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రత్యక్షంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా 1.42 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. అలాగే గ్రామ సచివాలయాన్ని ఏర్పాటుచేసి ఆ గ్రామంలో చదువుకున్న యువత కు 10 మందికి తక్కువ లేకుండా స్థానికంగానే ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామన్నారు. పెన్షన్, ఫీజు రీఎంబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న 72 గంటల్లోనే మంజూరు చేస్తామన్నారు.

సన్‌రైజ్ స్టేట్‌గా ఏపీ

ఏపీ మంత్రి శిద్దా రాఘవరావు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ పెట్టుబడిదారులకు స్వర్గధామమని, రాష్ట్రంలో నూతనంగా పరిశ్రమలు ఏర్పాటుచేసేవారికి అనేక రాయితీలు ఇస్తుందని రాష్ట్ర పర్యావరణ, అటవీశాఖా మంత్రి శిద్దా రాఘవరావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను సన్‌రైజింగ్‌స్టేట్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. శనివారం మంత్రి తన సహచర మంత్రి సుజయకృష్ణ రంగారావుతో కలిసి బెంగుళూరులో జరుగుతున్న అంతర్జాతీయ గ్రానైట్ ఫెయిర్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శిద్దా మాట్లాడుతూ, దేశంలో అపారమైన ఖనిజ సంపద ఉందని, ప్రధానంగా గ్రానైట్‌కు అంతర్జాతీయంగా డిమాండ్ ఉందని చెప్పారు. నూతన టెక్నాలజీ ద్వారా గ్రానైట్ పరిశ్రమలు ఎంతో మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు.


గడువులోగానే పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేస్తాం

తారకరామ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఏపీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

అమరావతి, ఆంధ్రప్రభ : ఎన్ని ఇబ్బందులొచ్చినా పోలవరం ప్రాజెక్టును నిర్ధేశిత గడువులోపే పూర్తి చేసి, రాష్ట్ర ప్రజలకు అంకితం చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా నందివాడ మండలం అరిపిరాల వద్ద రూ. 890.30 కోట్ల వ్యయంతో నిర్మించనున్న తారకరామ ఎత్తిపోతల పథకానికి మంత్రి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దేవినేని ఉమా మాట్లాడుతూ 2019 జనవరి నాటికి పోలవరం కాంక్రీట్ ,స్పిల్‌వే పనులను పూర్తి చేయడంతోపాటు 48 గేట్లను కూడా నిర్మిస్తామని చెప్పారు. కేంద్రం నుంచి నిధులు సక్రమంగా రానప్పటికీ ఇప్పటికే రూ.3వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేశామన్నారు. విభజన అనంతరం ఆర్థిక ఇబ్బందులున్నా రైతులకు రూ.24వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు.తారకరామ ఎత్తిపోతల పథకాన్ని రానున్న జూలై మాసాంతానికి పూర్తి చేస్తామన్నారు. దీని ద్వారా 3,597 ఎకరాలకు సాగునీటిని అందించాలని ప్రతిపాదించామన్నారు. ఈ పథకానికి 120 హెచ్‌పి సామర్థ్యం ఉన్న నాలుగు పంపులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.ఈనెల 12 నుంచే చేపట్టే 116 రోజుల పాటు నిర్వహించే జల సంరక్షణ పనుల్లో భాగంగా డ్రైన్లు,కాలువలు, చెరువుల్లో పూడిక పనులు చేపడతామన్నారు.

ఇదే పోరాటాన్ని కొనసాగిద్దాం

●బీజేపీ నేతల తప్పుడు లెక్కలకు ధీటుగా స్పందించండి ●ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ : ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఇప్పుడు చేస్తున్న పోరాటాన్ని కొనసాగించండి. పట్టు విడవద్దు.. అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులు, ముఖ్య నేతలకు సూచించారు. శనివారం ఆయన తన నివాసం నుంచి కేంద్రమంత్రి సుజనా చౌదరి, ఎంపీ సీఎం రమేష్‌తోపాటు మరికొందరు ముఖ్య నేతలతో ఢిల్లీ పరిణామాలపై టెలిఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం కొనసాగిస్తున్న విధానంతో కేంద్రంలో కొంత కదలిక వచ్చిందని, అయితే సోమవారం పార్లమెంట్‌లో ఏ విధమైన ప్రకటన చేస్తారో.. చూసే వరకూ వేచి చూసే ధోరణి అవలంభించాలని మార్గ నిర్దేశం చేశారు. రాష్ట్ర బీజేపీ నేతలు కేంద్రం ఇచ్చిన నిధులపై తప్పుడు లెక్కలు చెబితే ధీటుగా స్పందించాలని నేతలను ఆదేశించారు. రాష్ట్రానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగించాలని స్పష్టం చేశారు. కేంద్రం సానుకూలంగా నిర్ణయం తీసుకోనట్లయితే ఎంత వరకైనా వెళ్లేందుకు సిద్ధమని, ప్రజా ప్రయోజనాల కన్నా ఏవి ముఖ్యం కాదని తేల్చిచెప్పారు. కేంద్రం ఇప్పటి వరకు రాష్ట్రానికి ఇచ్చిన నిధులు, ఇంకా రావాల్సిన నిధులు తదితర అంశాలకు సంబంధించిన లెక్కలతో ఢిల్లీ వెళ్ళాలని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఢిల్లీ పరిణామాలు తన దృష్టికి తీసుకురావాలని ముఖ్య నేతలకు సూచించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు వివివి.చౌదరి, మల్యాద్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మరోసారి హస్తినకు రాష్ట్ర బృందం

కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి సంబంధించి ఒక ప్రతినిధి బృందాన్ని హస్తినకు పంపించే యోచనలో ముఖ్యమంత్రి వున్నారు. ఈ మేరకు మొత్తం 20 డిమాండ్లతో కూడిన ఒక వినతిపత్రాన్ని కేంద్రానికి సమర్పించేందుకు రంగం సిద్ధమవుతోంది. మరో రెండు, మూడు రోజులలో ఢిల్లీకి వెళ్ళనున్న తెలుగుదేశం ప్రతినిధి బృందం కేంద్ర ఆర్థిక, హోం శాఖ మంత్రులతో పాటు ఆర్థిక శాఖ అధికారులను కలుసుకుని ఉన్నతస్థాయిలో సమస్యలను వివరించే అవకాశాలున్నాయి. అయితే అధికారికంగా పంపించే ఈ బృందంలో మంత్రులతో పాటు ఆర్థిక శాఖ అధికారులను సైతం పంపే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం వుంది. ఇదే విషయమై ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోనూ చర్చించారని సమాచారం. విభజన చట్టానికి అనుగుణంగానే డిమాండ్ల కూర్పు వుంటుందనే సమాచారం. కాగా అమిత్ షాతో పాటు కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, పీయూష్ గోయల్‌లతో మంత్రి సుజనా చౌదరి జరిపిన చర్చల ఫలితంగా కొంత సానుకూల వాతావరణం ఏర్పాటైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వానికి ఇంకా నమ్మకం కుదరడం లేదు. తాజా పరిణామాల నేపథ్యంలో మార్చి నెల మొదటి వారం దాకా కేంద్రం తీరుపై వేచిచూసే ధోరణిని అవలంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పార్లమెంట్ సమావేశాలు ముగిసినప్పటికీ, ఎం.పి.లు నిర్వహించిన పాత్రను చంద్రబాబునాయుడు ప్రశంసించారు. ఇంతకాలం తాము బిజెపిని మిత్రపక్షంగానే భావించామని, అయినప్పటికీ, రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగినప్పుడు ఏ విధంగా ముందుకు సాగాలని ముఖ్యమంత్రి పార్లమెంట్ సభ్యులవద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

మూడున్నరేళ్లలో 85శాతం హామీలు పూర్తి

●ఏ రాష్ట్రానికి ఇవ్వనన్ని నిధులు ఇచ్చాం ●రైల్వేజోన్‌పై త్వరలో సానుకూల నిర్ణయం ●ప్రత్యామ్నాయ పద్ధతిలో స్పెషల్ ప్యాకేజీ నిధులు ●బీజేపీ ఏపీ అధ్యక్షుడు హరిబాబు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : దేశ చరిత్రలో ఏ రాష్ట్రానికి ఇవ్వనట్లుగా ఆంధ్రప్రదేశ్‌కు మూడున్నరేళ్లలో నరేంద్రమోడీ ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు అందజేసిందని ఏపీ బీజేపీ అధ్యక్షుడు హరిబాబు తెలిపారు. శనివారం న్యూఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆయన అధికార ప్రతినిధి జివిఎల్ నరసింహారావు, ఎంపీ గోకరాజు గంగరాజుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. మూడున్నరేళ్లలో ఏపీకి ఇచ్చిన నిధులు, సంస్థల వివరాలతో కూడిన 27 పేజీల నోట్‌ను మీడియాకు విడుదల చేశారు. ఏపీ పునర్విభజన చట్టం 13వ షెడ్యూల్‌లోని సంస్థలను పదేళ్లలోపు అమలు చేయాలని ఉన్నప్పటికి తమ ప్రభుత్వం మూడున్నరేళ్లలోనే 85శాతం హామీలను పూర్తిచేసిందని హరిబాబు తెలిపారు. రెవెన్యూ లోటు భర్తీ కింద ఇప్పటికే 4వేల కోట్ల నిధులు విడుదల చేశామని చెప్పారు. అలాగే ప్రత్యేక హోదాకు సమానంగా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ అమలు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికి అయిదు సంస్థలు నెలకొల్పే విషయంలో మాత్రమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. విశాఖ రైల్వే జోన్‌పై త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందన్నారు. దుగరాజపట్నం పోర్టు బదులు వేరే ప్రాంతంను సూచించాలని కేంద్రం కోరిందని చెప్పారు. దుగరాజపట్నంలో ఓడరేవు ఏర్పాటుపై ఇస్రో అభ్యంతరాలు తెలిపిందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ఇప్పటికే 3500 కోట్ల రూపాయలు ఇచ్చామని చెప్పారు. విశాఖపట్నంలో పెట్రో కాంప్లెక్స్ పై అధ్యయనం జరుగుతోందన్నారు. ఏపీకి రెవెన్యూలోటు కింద ఇప్పటి వరకు రూ.3,979.5 కోట్లు ఇచ్చామన్నారు. 14 వ ఆర్థిక సంఘం ద్వారా 2015 నుండి 2020 వరకు 5 సంవత్సరాలకు గాను మొత్తం 22,113 కోట్లు కేంద్రం ఇవ్వనున్నదని చెప్పారు. స్పెషల్ డెవలప్ మెంట్ ప్యాకేజీ కింద రూ.1,050 కోట్లు ఇచ్చామని వెల్లడించారు. పోలవరం కోసం ఇప్పటికే రూ.4662.28 కోట్లు ఇచ్చినట్లు నోట్‌లో తెలిపారు. తిరుపతి ఐఐటీ కి రూ.90.93 కోట్లు కేంద్రం విడుదల చేసిందని చెప్పారు. జాతీయ రహదారుల అభివృద్ధికి వివిధ పథకాల కింద లక్ష కోట్ల రూపాయల విడుదల చేసిందన్నారు. ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద వెనుకబడిన ప్రాంతాలకు జిల్లాకు 350 కోట్ల చొప్పున ఇప్పటికే 1050 కోట్ల రూపాయలు ఇచ్చామని తెలిపారు. స్పెషల్ స్టేటస్ వల్ల కేవలం కేంద్రానికి సంబంధించిన పథకాలకు సంబంధించి 90శాతం నిధులు వస్తాయని చెప్పారు. ప్రత్యేక హోదాకు, సాధారణ రాష్ట్రాలకు సంబధించి 30శాతం నిధుల తేడాను ఈ ఏపీ ద్వారా సర్దుబాటు చేయాలని ఒప్పందానికి వచ్చామని అందులో తెలిపారు

2014 నుంచి పోలవరంలో ఇరిగేషన్‌కాంపొనెంట్ కు సంబంధించి వందశాతం కేంద్రమే భరిస్తుందన్నారు. ఇప్పటికే ఐఐటి, నిట్, ఐఐఐటి నెలకొల్పామన్నారు. అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీకి 10 కోట్లు ఇచ్చామని తెలిపారు. తిరుపతిలో ఐఐఎస్ఈఆర్, విశాఖలో ఐఐఎం, గుంటూరులో వ్యవసాయ విశ్వవిద్యాలయం, వైజాగ్‌లో ఐఐపిఈ ఏర్పాటు చేశామన్నారు. గిరిజన విశ్వవిద్యాలయానికి 10 కోట్లు విడుదల చేశామని తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థకు ఇప్పటికే 70 కోట్లు విడుదల చేశామని చెప్పారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఎక్సైజ్ అండ్‌నార్కోటిక్స్‌ను అనంతపురంలో నెలకొల్పామన్నారు. నెల్లూరు వద్ద ఎస్సో నిట్ సంస్థకు శంకుస్థాపన చేశామని తెలిపారు. నెల్లూరులో ఎన్‌సిఆర్‌టికి చెందిన రీజినల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు.

రిలయన్స్ బ్రాండ్ అంబాసిడర్ మోడీ

●రాజ్యాంగబద్ధ సంస్థలపై బీజేపీ పెత్తనం
●సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి

భీమవరం, ప్రభన్యూస్: ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మతతత్వ, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తూ రిలయన్స్ కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా మారి, జియోహింద్ అంటున్నారని సీపీ ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. సీపీఎం 25వ రాష్ట్ర మహాసభలు పశ్చిమగోదావరి జిల్లా భీమ వరంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన పార్టీ ప్రతినిధుల మహాసభలో సీతారాం ఏచూరి మాట్లాడు తూ జీఎస్టీ వల్ల ఒకే పన్ను విధానం కార్పొరేట్ వ్యాపార ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. ఈ నెలలో జరగనున్న త్రిపుర ఎన్నికల్లో సీపీ ఎం నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి రాకుండా చేయ డానికి అరాచకశక్తులతో కలిసి బీజేపీ పనిచేస్తోందన్నారు. గతంలో పార్లమెంటులో మోడీ మాట్లాడుతూ ఈశాన్య భారత దేశంలో కేంద్రం ఇచ్చే ప్రతీ రూపాయి త్రిపురలో మా త్రమే ప్రజలకు చేరుతోందని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజ్యాంగ బద్ధ సంస్థలపై బీజేపీ జోక్యం పెరిగిపోవడం వల్లే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తులు బయటకు వచ్చి మాట్లాడారన్నారు. త్రిపురలో 8వ సారి కూడా సీపీఎం నేతృత్వంలో వామపక్ష ప్రభుత్వమే ఏర్పడుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ అసెంబ్లీలో కమ్యూనిస్టులు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

సభల ప్రారంభానికి ముందుగా పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్ఏ రుద్రరాజు సత్యనారాయణ రాజు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి. మధు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు, పార్టీ తెలంగాణా రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి. శ్రీనివాసరావు, డా. కె. హే... ఆర్. అరుణ్ కుమార్, ఎం. ఏ. ...

'ప్రత్యేకహోదా' రాజ్యాంగ అవహేళనా!

వైసీపీ నేత బొత్స సత్యనారాయణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తిరుపతి వెంకన్న సాక్షిగా పార్లమెంట్ లోపల ఆనాటి ప్రధాని, బయట ఈనాటి ప్రధాని ఏపీకి ప్రత్యేకహోదాపై ఇచ్చిన మాటలకు విలువ లేకపోతే రాజ్యాంగం అవహేళన అయినట్టు కాదా అని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బొత్స మాట్లాడుతూ విభజన చట్టంలోని అంశాలను ఎప్పటిలోగాపూర్తి చేస్తారో ప్రజలకు టీడీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వెనుక బడిన రాయలసీమ , ఉత్తరాంధ్ర జిల్లాలను పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. పోలవరం పట్ల ఉదాసీనంగా వ్యవహరించటం దారుణం అన్నారు. రాష్ట్రానికి మేలు జరగాలన్న చిత్తశుద్ధితోనే తమ పార్టీ పోరాడుతుందన్నారు.

చిరంజీవి ఇప్పటికైనా మౌనం వీడాలి

నవ్యాంధ్ర యూత్‌ఫోర్స్ డిమాండ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పార్లమెంట్ సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు జరుగుతున్న అన్యాయంపై రాజ్యసభ సభ్యుడు మెగాస్టార్ చిరంజీవి ఇప్పటికైనా మౌనం వీడాలని నవ్యాంధ్రయూత్ ఫోర్స్ కన్వీనర్ టి. సాయికృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రం అట్టుడుకి పోతుంటే బాధ్యతాయుతమైన ఎంపీ పదవిలో ఉంటూ తెలుగు ప్రజల గొంతు పార్ల మెంట్‌లో వినిపించాల్సిన కనీస బాధ్యత మీపై లేదా అని ప్రశ్నించారు. విభజన సమయంలో రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని సరిదిద్దుకోవడానికి అవకాశం వచ్చినా ఎందుకు స్పందించటం లేదన్నారు.

పదవుల బొనాంజా రెడీ



- ఈనెలలోనే పెండింగ్ పదవుల భర్తీ
- కార్పొరేషన్లతో పాటు డైరెక్టర్ పోస్టుల భర్తీకి టీఆర్ఎస్ నిర్ణయం
- ఆఖరి పందేరం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పదవుల పందారానికి రంగం సిద్దమైంది. ఇప్పటికే అనేక కార్పోరేషన్లకు పాలకవర్గాలను నియమించిన ప్రభుత్వం.. ఆఖరి పందారానికి నిర్ణయం తీసుకుంది. ఈ నెలలో ఖచ్చితంగా పదవుల జాబితా వస్తుందని, ఇదే దాదాపు ఆఖరి పందారమని పార్టీవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఖాళీగా ఉన్న కార్పోరేషన్లకు చైర్మన్లను నియమించడంతో పాటు ఇప్పటిదాకా నియమకాలు జరిగిన కార్పోరేషన్లకు డైరెక్టర్లను కూడా నియమించనున్నట్లు సమాచారం. మొత్తంగా ఈ సారి విడుదలయ్యే పదవుల జాబితా వందల్లోనే ఉండే అవకాశముందని పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఒక వేళ.. ఏదైనా కారణంతో డైరెక్టర్ల పదవుల భర్తీ జరగకున్నా.. కార్పోరేషన్ చైర్మన్ల జాబితా మాత్రం వెలువడుతుందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. గత ఏడాది ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదినం సందర్భంగా పలు కార్పోరేషన్లకు చైర్మన్లను ప్రకటించగా, ఈసారి జన్మదినం సందర్భంగా జాబితా వస్తుందా.. లేక మరో వారం తర్వాత మంచిరోజు చూసుకుని జాబితా విడుదల చేస్తారా అన్న చర్చ పార్టీలో జరుగుతోంది. స్టేట్‌ఫైనాన్స్ కార్పోరేషన్‌తో పాటు పలు కీలక కార్పోరేషన్లకు చైర్మన్లను ఖరారు చేయనున్నట్లు సమాచారం. ఐదు నుండి పదిమంది చైర్మన్లను ఈ దఫా నియమించే అవకాశం ఉందని, జిల్లాల నుండి ఇప్పటికే వచ్చిన ప్రతిపాదనల్లో నుండి డైరెక్టర్లను నియమించనున్నారు. జిల్లా మంత్రులు.. ఆయా జిల్లాల ఎమ్మెల్యేలతో చర్చించి పదవులకు సంబంధించి ఆశావహుల, అర్హుల జాబితాలను గతంలో తీసుకున్న విషయం విదితమే. ఆయా జిల్లాల మంత్రులతో గతంలో మంత్రి కెటిఆర్ చర్చించి.. పలు పదవులపై కొన్నిపేర్ల విషయంలో ఏకాభిప్రాయం తీసుకొచ్చినట్లు చర్చ జరుగుతోంది. ఖచ్చితంగా ఇవ్వాల్సిన వారు.. వారివల్ల పార్టీకి కలిగే ప్రయోజనం.. చేసిన సేవలపై చర్చించి పదవుల విషయంలో నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వెలువడే పదవుల జాబితా.. ఆఖరిపందారంగా పార్టీలో చర్చ జరుగుతోంది. ఈ పదవుల జాబితా ప్రకటించి.. పార్టీ కార్యక్రమాల షెడ్యూల్‌ను సిఎం విడుదల చేస్తారని, ఈ టర్మ్‌కు దాదాపు ఇదే ఆఖరి జాబితాగా ఉండవచ్చునని పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. పార్టీ ఆవిర్భావం నుండి వెన్నుదన్నుగా నిలిచిన నేతలకు ఈ సారి పదవుల పంపిణీలో ప్రాధాన్యం దక్కే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

రైతు సమన్వయసమితులు కూడా..

రైతుసమన్వయ సమితి రాష్ట్రకార్పోరేషన్ చైర్మన్‌తో పాటు 30జిల్లాల సమన్వయ సమితి కో-ఆర్డినేటర్లను కూడా ఈ దఫా ప్రకటించనున్నారు. వారం, పదిరోజుల్లోనే ఈ జాబితా విడుదలయ్యే అవకాశముందని పార్టీవర్గాలు తెలిపాయి. సిరిసిల్ల జిల్లాతో పాటు ఇప్పటికే పలు జిల్లాల నుండి జిల్లా కమిటీ ప్రతిపాదనలు రాష్ట్ర కార్యాలయానికి చేరాయి. వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ఆయా జిల్లా మంత్రులకు స్వయంగా ఫోన్‌చేసి.. పేర్లు త్వరగా పంపమని విజ్ఞప్తి చేయడంతో అన్ని జిల్లాల నుండి పేర్లు కార్యాలయానికి చేరుతున్నాయి. ఇక రాష్ట్రరైతుసమన్వయ సమితి చైర్మన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లేనని పార్టీవర్గాల్లో చాలాకాలంగా వినిపిస్తోంది.

బాబ్రీ స్థలం మసీదుదే..!

- ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా రాబే హసని



చాంద్రాయణగుట్ట, ప్రభ న్యూస్ : బాబ్రి మసీదు విషయంలో ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఇప్పటి వరకు ఎలాంటి మార్పురాలేదని, ఒక సారి ఓ స్థలంలో మసీదు నిర్మిస్తే ఆ స్థలంలో ఎప్పుడూ మసీదే ఉంటుందని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలాన రాబే హసని తెలిపారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో మూడు రోజుల ప్లీనరీ సమావేశాలు చాంద్రాయణగుట్ట కంచన్‌బాగ్ లోని సాలారే మిల్లత్ ఆడిటోరియంలో ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం జరిగిన సమావేశానికి దేశవ్యాప్తంగా ఉన్న వివిధ వర్గాల ముస్లిం ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు హసనీ ఓ ప్రకటన విడుదల చేయడం జరిగింది. దీంతో ఏర్పాటు చేసిన విలేకకరుల సమావేశంలో బోర్డు కార్యదర్శి ఉమ్రేణ్ మాట్లాడుతూ.. హిందు మత పెద్దలు, నాయకులు బాబ్రి మసీదు సమస్యల పరిష్కారానికి తమ ముందుకు వచ్చినప్పుడు బోర్డు వారిని స్వాగతం పలికిందన్నారు. అదేవిధంగా తమరు వారితో మసీదు విషయంలో శాంతిపూర్వకంగా సమస్య పరిష్కరిం చాలంటూ బోర్డు డిమాండ్ చేయడం జరిగిందన్నారు. మసీదుకు సంబంధించిన కేసు కోర్టులో నడుస్తుందని న్యాయస్థానమే తమకు న్యాయం కల్పిస్తుందన్నారు. ఈ ఏఐఎంపి బోర్డు ఆధ్వర్యంలో ప్లీనరి సమావేశంలో బోర్డు సభ్యులు వివిధ అంశాలపై, పలు ముస్లిం సమస్యల పరిష్కరించే విధంగా చర్చలు జరపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎంపీ బోర్డు ప్రధాన కార్యదర్శి మహ్మద్ వలి రేహ్మాణి, ప్రతినిధులు అర్షద్ మాదని, మౌలాన సజ్జాద్ నోమాణి, మౌలాన మహ్మద్ మాదని, జాఫర్‌యార్, సాల్మాణ్ ఫారుఖి, మౌలాన రాషేద్ ఫారుంగి మిలాని, మౌలాన ఖాల్లేద్ సైపుల్లా రహ్మాణి, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ, చార్మినార్ ఎమ్మెల్యే అహ్మాద్ పాషా ఖాద్రి, మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మాద్ బాలాల, నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్‌హుస్సెన్ మహరాజ్‌తోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ముస్లిం ప్రతినిధులు పాల్గొన్నారు.

మేధావులు మౌనం వీడాలి

- టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ పిలుపు
- నేను ఉపాధ్యాయ వృత్తి నుంచే రాజకీయాల్లోకి వచ్చా
- సీఎల్పీ నేత జానారెడ్డి
- ప్రొఫెషనల్ కాంగ్రెస్ పై రాహుల్ గాంధీ ఆసక్తితో ఉన్నారు.
- మాజీ మంత్రి గీతారెడ్డి



హైదరాబాద్,ఆంధ్రప్రభ : ప్రొఫెషనల్స్ మౌనంగా ఉండటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ సూచనలను వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో చేరుస్తామని ఆయన తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు.. ప్రొఫెషనల్‌తో సమావేశమయ్యే విధంగా చూస్తామని ఉత్తమ్ చెప్పారు. మాజీ మంత్రి, ప్రొఫెషనల్ కాంగ్రెస్ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జీ గీతారెడ్డి అధ్యక్షతన శనివారం ఒక ప్రైవేట్ హోటల్‌లో ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్, సీఎల్పీ నేత జానారెడ్డి తోపాటు డాక్టర్లు, లాయర్లు, వివిధ రంగాల నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నా యని ఆయన మండిపడ్డారు. ప్రజలు ఏమితినాలో కూడా మోడి ప్రభుత్వం డిసైడ్ చేస్తున్నదని, దీంతో ప్రాథమిక హక్కులను కాలరాస్తోందని ఆయన దుయ్యబట్టారు. సమాజం, దేశం అభివృద్ధి చెందాలంటే ప్రొఫెషనల్స్ పాత్ర కూడా ఎంతో అవసరమని సీఎల్పీ నేత జానారెడ్డి అన్నారు. యుద్ధవిమానాలు నడపటం తేలికయిందని, రాజకీయాలు నడపడం మాత్రం కష్టమైందన్నారు. తాను ఉపాధ్యాయ వృత్తి నుంచే వచ్చానని జానారెడ్డి తెలిపారు. వివిధ రంగాల్లోని ప్రొఫెషనల్స్‌ను కాంగ్రెస్ పార్టీ వైపు కనెక్టు చేయాలనే ఆలోచనతో ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఏర్పాటైందని మాజీ మంత్రి గీతారెడ్డి అన్నారు. గాంధీ, సర్దార్‌వల్లాబాయ్ పటేల్ వంటి ఎంతో మంది ప్రొఫెషనల్స్ రాజకీయాల్లో ఉన్నారని ఆమె తెలిపారు. ప్రస్తుతం 400 మందికి పైగా రాష్ట్రంలో సభ్యులు ఉన్నారని ఆమె వివరించారు. దేశాన్ని గొప్పగా తీర్చి దిద్దేందుకు ప్రొఫెషనల్స్ రాజకీయాల్లోకి రావాలని, దేశానికి సేవ చేయడానికి చక్కని వేదికగా ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు.గతంలో కాంగ్రెస్‌లో ఎంతో మంది కీలకపాత్ర పోషించారని ఆమె వివరించారు. ప్రస్తుత రాజకీయాలకు దూరంగా ఉంటున్నారని గీతారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడి మతప్రాదిపదికన రాజకీయాలు చేస్తున్నారన్నారు. వ్యక్తిగత అలవాట్లు, ఆచార వ్యవహారాల్లోనూ బీజేపీ జోక్యం చేసుకుంటుందన్నారు. ఇంకా ఈ సమావేశంలో టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజ్ శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి తదితరులు మాట్లాడారు.

టెన్త్ విద్యార్థులకు ఉచితంగా టిఫిన్

(మొదటి పేజీ తరువాయి)

నిధుల ద్వారా ఈ కార్యక్రమానికి ఆమె శ్రీకారం చుట్టినట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు 20వేల వరకు ఉండవచ్చని అంచనా వేయగా, తొలి విడతలో 7వేల మందికి ఈ సౌకర్యం కల్పిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణతా శాతాన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా పెంచాలని, పదవ తరగతి పరీక్షల్లో తొలి పది ర్యాంకుల్లో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ పాఠశాలలు ఉండాలని ఇప్పటికే ప్రభుత్వం ఆయా జిల్లాల విద్యా శాఖాధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. మార్చి మొదటివారంలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు మరింత శిక్షణ ఇచ్చేందుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్న సంగతి విదితమే. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులు, నిపుణులతో తరగతులను బోధిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సమీపంలోని గ్రామీణ ప్రాంతాల నుంచి బస్సుల్లో, ఇతర వాహనాల్లో తరగతులకు హాజరవుతున్నందున అల్పాహారాన్ని తీసుకోకుండానే హడావుడిగా ఇంటినుంచి బయలుదేరుతున్నారని దీంతో వారు ఆకలికి అలమటించి చదువుపై అంతగా దృష్టి సారించలేకపోతున్నారన్న విషయాన్ని అధికారులు గుర్తించారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా ఓ సర్వేను నిర్వహించగా ఎక్కువ మంది విద్యార్థులు ఇందులో ముఖ్యంగా బాలికలు ఎటువంటి అల్పాహారం తీసుకోకుండానే ఇంటినుంచి బయలుదేరుతున్నారని, మరికొంత మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి సంబంధించి తల్లిదండ్రులు అన్ని ఏర్పాట్లు చేసినా వాటిని కాదని పాఠశాలలకు వస్తున్నారని తేలింది. పదవ తరగతి పరీక్షలు పబ్లిక్ పరీక్షలని ఇందులో సాధించే మార్కులు అత్యంత ప్రధానమని భావిస్తున్న విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారని దీంతో ఉదయం తీసుకునే టిఫిన్ (అల్పాహారం), మధ్యాహ్నం చేసే భోజనంపై కూడా అంతగా దృష్టి సారించడం లేదని సర్వేలో బయటపడింది. పరీక్షలు జరిగే ఈ రెండు మాసాలు విద్యార్థులు ఎటువంటి అనారోగ్యాలకు లోనుకాకుండా వారికి పౌష్టికాహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో ఉదయం ఉచితంగా విద్యార్థులందరికీ అల్పాహార సౌకర్యం కల్పించాలన్న నిర్ణయానికి వచ్చింది.

ఇడ్లీ, దోసె, వడ వంటి ఆహార పదార్థాలు కాకుండా చిక్కీ, ఉడకబెట్టిన పదార్థాలతో పాటు చిప్స్ వంటి పదార్థాలను పాఠశాలల్లో అందుబాటులో ఉంచి వాటిని విద్యార్థులకు అందించాలని అధికారులు నిర్ణయించారు. తమ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను తరచూ తనిఖీ చేస్తూ విద్యార్థులకు అందించే అల్పాహారంపట్ల తనిఖీలు నిర్వహించాలని ఎక్కడా, ఏ విద్యార్థి నుంచి ఫిర్యాదు, ఆరోపణలు రాకుండా చూసుకోవలసిన బాధ్యత ఆయా శాఖల అధికారులు, సిబ్బందిపై ఉందని కలెక్టర్లు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు. హైదరాబాద్ జిల్లాలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ నూతన ప్రయోగాన్ని తెలంగాణలోనే మిగతా ముప్పై జిల్లాల్లో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకయ్యే ఖర్చును కలెక్టర్లు భరించాలని అదనపు నిధులకోసం ప్రతిపాదనలు పంపిస్తే వాటిని విడుదల చేస్తామని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఏడు లక్షల వరకు ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక పాఠశాలల్లో చదువుతున్న వారు రెండు లక్షలకు మించి ఉండరని వీరందరికీ అల్పాహారాన్ని అందజేసి వారిని పదవ తరగతి పరీక్షలకు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పరీక్షలు జరుగుతున్న సమయంలో కూడా అవసరాన్ని బట్టి ఈ నూతన కార్యక్రమాన్ని అమలు చేయాలని ప్రతిపాదించింది.

ప్రభుత్వం ఎలాగూ సంక్షేమ గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇతరత్రా విద్యాసంస్థల పరిధుల్లో నిర్వహిస్తున్న పాఠశాలల విద్యార్థులకు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని సమకూరుస్తోంది. హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, వరంగల్ నగర పాలక సంస్థల పరిధితో పాటు ఆయా జిల్లా కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు సమీప గ్రామాలు, మురికివాడల నుంచి విద్యార్థులు వెళుతుంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల్లో అత్యధిక శాతం పేద, మధ్య తరగతి వర్గాల వారు మాత్రమే ఉంటారన్న సంగతి నగ్నసత్యం. అప్పటికే ఆర్థిక భారంతో పిల్లలకు పౌష్టికాహారాన్ని కల్పించలేని పరిస్థితి ఉంది. ముందురోజు రాత్రి మిగిలిన అన్నమో లేక ఇతరత్రా ఆహార పదార్థాలను దాచిపెట్టి ఉదయం వాటిని తిరిగి పిల్లలకు అందించి పాఠశాలలకు పంపిస్తున్న దాఖలాలు ఉన్నాయి. కొంతమంది పిల్లలు ఒత్తిడితో అల్పాహారం సిద్ధమైనా తినకుండా పాఠశాలలకు వెళుతున్నారని దీంతో చాలామంది నీరసంతో ఇబ్బంది పడుతున్నట్టు అధికారులు గుర్తించారు. కొన్నిసార్లు విద్యార్థులను ఆసుపత్రులకు తరలించి వైద్యం చేయించిన ఘటనలు కూడా లేకపోలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో పదవ తరగతి చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలన్న ఉద్దేశంతో ఉచితంగా అల్పాహారాన్ని ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.

మహారాష్ట్రలో మావోల షెల్టర్!

- రామన్న సమాచారం కోసం పొరుగు రాష్ట్రానికి ప్రత్యేక బృందం
- మిగతా నేతల ఆచూకీ కోసం ప్రయత్నం
- గ్రేహౌండ్స్, ఎస్ఐబీ అధికారుల ఆలోచన



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అడుగడుగునా నిఘా, నిర్బంధాలను ఎదుర్కుంటున్న మావోయిస్టులు ప్రస్తుతం సేఫ్ జోన్‌లో ఉన్నారా?. ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్లి పూర్వవైభవం కోసం వేచి చూస్తున్నారా? ప్రస్తుతం ఈ విషయాలపై స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎస్ఐబి), గ్రేహౌండ్స్ అధికారులు ఆరా తీస్తున్నారు.

ఛత్తీస్‌ఘడ్‌లో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని నడుపుతున్న మావోయిస్టులు తెలంగాణలోనూ పాగా వేసేందుకు గడచిన మూడేళ్ళుగా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే వరంగల్, కొత్తగూడెం ఎన్‌కౌంటర్లు. మావోయిస్టుల ఉనికి ఏ మాత్రం లేకుండా ఉండేందుకు ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులలో పటిష్ట బందోబస్తుతో పాటు నిరంతర నిఘాను ఉంచారు. చాపకింద నీరులా రిక్రూట్‌మెంట్‌లను నిర్వహిస్తున్న మావోయిస్టులు మారుమూల ప్రాంతాలలో అప్పుడప్పుడు ఉనికిని ప్రదర్శిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఇటీవల భారీ ఎత్తున మందు గుండు సామాగ్రిని కూడా నిఘా విభాగం గుర్తించి స్వాధీనం చేసుకుంది.తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రా లలో నిర్బంధం తీవ్రమైన నేపథ్యంలో అగ్రనేతలు సేఫ్ జోన్‌కు వెళ్ళినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

మావోయిస్టుల ప్రభావం అంతగా లేని ప్రాంతంలో ఉంటే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని అగ్రనాయకత్వం భావిస్తున్నట్లు అధికారులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్రలో తల దాచుకుంటున్న మావోయిస్టు ప్రముఖులు కొందరు ఉద్యమ భవిష్యత్‌పై ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారని అధికారులు అంటున్నారు. కొద్ది రోజుల క్రితం మహారాష్ట్రలోనిపూణే పట్టణం సమీపంలో ఇద్దరు ఇన్‌ఫార్మర్లు పట్టుబడటం, తాజాగా మావోయిస్టుకు ఆయుధ సంపత్తిగా పేరొందిన రామన్న పట్టుబడటం చూస్తుంటే మరింతమంది మావోయిస్టు అగ్రనేతలు మహారాష్ట్రలోని ... ప్రాంతాలలో ఉన్నట్లు స్పష్టమవుతుందని అధికారులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యమంలో కోలుకోలేని విధంగా దెబ్బతిన్న మావోయిస్టులు కొంత కాలంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రా లలో బలోపేతమయ్యేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని పోలీసులకు పక్కా సమాచారం ఉంది. నిఘా అధికారుల అనుమానాలకు అనుగుణంగా తెలంగాణ సరిహద్దులలోని ఛత్తీస్‌ఘడ్‌లో అడపా దడపా కొన్ని హింసా త్మక ఘటనలకు పాల్పడటంతో పాటు ఇన్‌ఫార్మర్ల పేర్లతో కొంత మందినిమావోయిస్టులు హత మారుస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో భయానక వాతావరణం నెలకొల్పితే రిక్రూ ట్‌మెంట్లకు ఎలాంటి ఆటంకాలుండవన్న ఉద్దేశ్యంతో నే ఈ సంఘటనలకు పాల్పడుతున్నారని, సేఫ్ జోన్‌లో తల దాచుకుంటున్న అగ్రనేతలు కింది స్థాయి కేడర్‌ను ఇందుకు ప్రోత్సహిస్తున్నారని పోలీసు అధికారులు అంటున్నారు.

మహారాష్ట్రకు ప్రత్యేక బృందం

మహారాష్ట్రలో మావోయిస్టుల కదలికలు ... తుండటంతో అక్కడకు ఒక అధికారుల బృందాన్ని పంపించాలని అధికారులు నిర్ణయించారు. పూణేతో పాటు ముంబై నగరం పోలీసు అధికారులతో భేటీ కానున్న అధికారుల బృందం సమాచారాన్ని తెలుసుకోవడంతో పాటు తమ వద్ద ఉన్న మావోయిస్టు నేతల వివరాలు, వారి కదలికలు ఎలా ఉంటాయి అనే విషయాలను అందించనున్నారు. 10 రోజుల క్రితం పట్టుబడ్డ మావోయిస్టు సానుభూతి పరుల నుంచి రాబట్టిన సమాచారం, తాజాగా పట్టుబడ్డ రామన్న నుంచి సేకరించిన సమాచారాన్ని తెలుసుకోనున్నారు. మావోయిస్టులకు కావాల్సిన ఆయుధాల రూప కల్పనలో రామన్న సిద్ధహస్తుడు.

తనకున్న నైపుణ్యాన్ని మావోయిస్టు కేడర్‌లో ఎవరికైనా నేర్పించారా? ఆయుధాల తయారీకి కావాల్సిన పరికరాలను ఎక్కడి నుంచి సమకూర్చుకున్నారు. ఇప్పటి వరకు ఎన్ని ఆయుధాలను తయారు చేశారు, ఆయుధాల డంప్ ఎక్కడ ఉందనే విషయాలను రాబట్టేందుకు అవసరమైతే తెలంగాణకు తీసుకు వచ్చే విషయంపై అక్కడి అధికారులతో ...

రూ.650 కోట్లతో బిల్డింగ్ మెటీరియల్ పార్క్

(మొదటిపేజీ తరువాయి)

చైర్మన్ ఫైజల్ ఇ కొట్టికొల్లన్ శనివారం మీడియాకు తెలిపారు.

బిల్డింగ్ మెటీరియల్ ఉత్పత్తి రంగంలో దుబాయ్‌లో ప్రసిద్ధి చెందిన కెఫ్ ఇన్‌ఫ్రా ఏర్పాటు చేయనున్న పార్క్ వల్ల ప్రత్యక్షంగా 10 వేల మందికి, పరోక్షంగా మరో 10 వేల మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి కేటీఆర్ వివరించారు. ఈ పార్క్ ఏర్పాటుకు హైదరాబాద్ పరిసరాలలోని నాలుగు ప్రాంతాలలో స్థలాలు గుర్తించామని, ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది త్వరలోనే ఖరారు చేయనున్నామన్నారు. ఈ పార్క్ ఏర్పాటు వల్ల నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని, శరవేగంగా నిర్మాణ పనులు పూర్తి అవుతాయన్నారు. తమ సంస్థను ఏర్పాటు చేయాలంటూ దేశంలోని పలు రాష్ట్రాలు ఆహ్వానించాయని, అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వ పనితీరు, తీసుకుంటున్న నిర్ణయాలు, పరిశ్రమలకు ఇస్తున్న ప్రోత్సాహకాలు గమనించి ఇక్కడే పరిశ్రమ ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు కెఫ్ ఇన్‌ఫ్రా చైర్మన్ ఫజల్ తెలిపారు. తమిళనాడులో ఒక యూనిట్ ఉందని, అక్కడ 1600 మందికి ఉపాధి కల్పించామన్నారు. తెలంగాణలో ఏర్పాటు చేయనున్న పార్క్ వల్ల పరిసర ప్రాంతాలలో భవన నిర్మాణ వస్తువుల తయారీ పరికరాల అనుబంధ సంస్థలు అనేకం ఏర్పాటవుతాయన్నారు. వచ్చే ఆరు మాసాలలో పార్క్‌ను పూర్తి చేయనున్నామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం పారిశ్రామిక వేత్తలకు ఎంతగానో ఉపయుక్తంగా ఉందన్నారు.

పక్షవాత బాధితులకు పెన్షన్ ఇవ్వాలి

- ప్రభుత్వానికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి సూచన



హైదరాబాద్,ఆంధ్రప్రభ : బోదకాలు వారికి కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే పెన్షన్ సౌకర్యం కల్పించినట్లు మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. అప్పటి పథకాన్నే సీఎం చంద్రశేకర్‌రావు పునరుద్ధ రిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పక్షవాతంతో ఇబ్బందులు పడుతున్నవారికి పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బోదకాలు వారికి రూ. 1500 పెన్షన్ ఇవ్వాలన్నారు. 50 సంవత్సరాలు దాటిన బీడీ కార్మికులకు కూడా జీవన భృతి కల్పించాలని, ఆసర పెన్షన్ రూ. 1000 నుంచి 2 వేలు, వికలాంగులకు రూ 3 వేల వరకు పెంచాలన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయకపోతే.. 2019లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అమలు చేస్తామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చుతామన్నారు.

కవితకు తెలంగాణ సమస్యలు పట్టవా..?

- ఏఐసీసీ కార్యదర్శి హనుమంతరావు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని పార్లమెంట్‌లో మాట్లాడిన టీఆర్ఎస్ ఎంపీ కవితకు.. తెలంగాణ సమస్యలు కనపిండచం లేవా..? అంటూ ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు ప్రశ్నిం చారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. విభజన హామీలను విస్మరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. బయ్యారం ఉక్కుపరిశ్రమ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తదితర సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదని ఆయన నిలదీశారు. హైదరాబాద్ అభివృద్ధికి సీఎం కేసీఆర్ చేసింది శూన్యమన్నారు. నగరంలో వసూలు చేసిన పన్నులను మిషన్ భగీరథకు ఖర్చు పెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కార్పోరేటర్లను డమ్మీలు చేసి మంత్రి కేటీఆర్ జీహెచ్ఎంసీపై గుత్తాధి పత్యం కొనసాగిస్తున్నారని ఆయన విమర్శించారు. స్టడీ సర్కిల్లో అవినీతి అక్రమా లు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

లోఫర్.. బ్రోకర్ పార్టీలు కలిసి ఎందుకు పోటీ చేశాయి: రావుల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాంగ్రెస్ లోఫర్ పార్టీ అని, తెరాస బ్రోకర్ పార్టీ అంటూ పరస్పరం విమర్శించుకుంటున్న ఆ రెండు పార్టీల నేతలు 2004 ఎన్నికల్లో కలిసి ఎలా పోటీ చేశారని తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి ప్రశ్నించారు. ప్రజా సమస్యలను లేవనెత్తడంలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ, వాటిని పరిష్కరించడంలో అధికార తెరాస విఫలమయ్యాయని ప్రాణహిత-చేవెళ్ళ జాతీయ ప్రాజెక్టు, బయ్యారం స్టీల్‌ప్లాంట్, హార్టికల్చర్, ట్రైబల్ యూనివర్సిటీలు ఏదశలో ఉన్నాయని చెప్పలేని పరిస్థితిలో రాష్ట్రప్రభుత్వం ఉందన్నారు. ఎయిమ్స్, కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీకి ఎలాంటి హామీ రాలేదని రావుల గుర్తుచేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల గ్రాఫ్ తగ్గినప్పుడల్లా ఏదో ఒక సర్వే విడుదల చేయడం, పొగిడించుకుని ప్రచారం చేసుకోవడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు.

మద్దతు ధర ఇచ్చేదాకా పోరుబాట కొనసాగిస్తాం

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బట్టి విక్రమార్క



మోర్తాడ్, ప్రభన్యూస్: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించే వరకు రైతులకు అండగా నిలిచి కాంగ్రెస్ పోరుబాట వీడదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బట్టి విక్రమార్క అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా, మోర్తాడ్‌లో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఈరవత్రి అనిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు మహా ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి రైతులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలోనే పసుపు, ఎర్రజొన్న పంటలు సాగు చేయడంలో బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గ రైతుల ఆదర్శప్రాయులన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాట ధరకై రెండు నియోజకవర్గాల రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తుంటే జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీయేనని వచ్చిన తెలంగాణలో రైతుల మేలు జరుగుతుందని నిధులు, నీళ్లు, ఉద్యోగాలు, గిట్టుబాటు ధరలు, అభివృద్ధి జరుగుతుందని ప్రజలు ఆశించి తెరాసకు అధికారం కట్టబెడితే అన్ని వర్గాల ప్రజలకు మాయచేస్తూ మోసం చేస్తున్నారని వారన్నారు.

కాంగ్రెస్ అధికారంలో వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పసుపు పంటకు రూ.15 వేలు, ఎర్రజొన్నకు రూ.5 వేలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్సేనన్నారు. రూ.1 కోట్ల ఎర్రజొన్న బకాయిలు ఇప్పించిన ఘనత తమదేనంటు సంకలు కొడుతున్న ఆర్మూర్, బాల్కొండ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు సీఎం కెసీఆర్ గిట్టుబాటు ధర ఎందుకు కల్పించడంలేదని వారు ప్రశ్నించారు. ఎర్రజొన్న పంటను దళారులు కొనుగోలు చేయకుండా శ్రీకాకుళంలో మాకం వేసి జల్సాలు చేస్తున్నారని ఈ విషయం ప్రభుత్వ నేతలకు తెలిసిన ఎందుకు పట్టించుకోవడంలేదని, మిషన్ భగీరథ, యంత్రలక్ష్మీ పేరుతో సొమ్ము చేసుకుంటున్న ఆర్మూర్, బాల్కొండ ఎమ్మెల్యేలు, మంత్రి, పసుపు, ఎర్రజొన్న పంటకు సీఎం వద్దకు తీసుకువెళ్లి రూ.300 కోట్లు చెల్లించి కొనుగోలు చేసే విధంగా ఏందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతుల అభివృద్ధికి కృషి చేసిందన్నారు.

తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో రైతులకు గిట్టుబాటు ధర, నిరుద్యోగులకు ఉద్యోగాలు, అభివృద్ధి చేసింది ఎక్కడ అని వారన్నారు. రైతులకు పండించి పంటలకు గిట్టుబాటు ధర కల్పించే వరకు పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా రైతులకు అండగా నిలిచి ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీస్పీకర్ కెఆర్.సురేష్‌రెడ్డి, మాజీప్రభుత్విప్ ఈరవత్రి అనిల్, ఎమ్మెల్సీలు ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి, రైతు నాయకుడు కోదండరాం, రాజారాంయాదవ్, పలువురు నాయకులు, వందలాది కార్యకర్తలు పాల్గొన్నారు.

రైళ్లలో మోడీ టీ విక్రయం

- రికార్డుల్లో లేదని భారతీయ రైల్వే స్పష్టీకరణ
- కాంగ్రెస్ మద్దతుదారు ఆర్టీఐ దరఖాస్తుకు ప్రత్యుత్తరం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బాల్యంలో రైళ్లు లేదా రైల్వే స్టేషన్లలో టీ విక్రయించినట్టుగా సూచిస్తూ తన వద్ద ఎలాంటి అధికారిక రికార్డు లేదని భారతీయ రైల్వే తెలిపింది. కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుడు తెహసీన్ పూనావాలా సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) ద్వారా చేసుకున్న దరఖాస్తుకు రైల్వే పై విధంగా స్పందించింది. రైళ్లు లేదా రైల్వే స్టేషన్లలో టీ విక్రయించడాన్ని అనుమతిస్తూ మోడీకి జారీ చేసిన రిజిస్ట్రేషన్ నంబరు లేదా అధికారిక పాస్‌కు సంబంధించి ఏదైనా రికార్డు ఉందా అని దరఖాస్తులో పూనావాలా అడిగారు. రైల్వే బోర్డు టూరిజం మరియు కేటరింగ్ డైరెక్టరేట్‌కు చెందిన టిజి-111 బ్రాంచ్‌లో అలాంటి సమాచారం ఏదీ అందుబాటులో లేదని భారతీయ రైల్వే బదులిచ్చింది. ఆర్టీఐ ప్రత్యుత్తరాల విడుదలపై పూనావాలా శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. ఆసక్తికరంగా ఆగస్టులోనే పూనావాలా ఆర్టీఐ ప్రత్యుత్తరాన్ని పొందారు. దానిపై 2014, ఆగస్టు 22వ తేదీ అని ఉంది.

పాక్ చేతిలో అమెరికా క్షిపణులు

ట్రంప్ సర్కారుకు తెలియజేప్పే అవకాశం



న్యూఢిల్లీ: పాకిస్తాన్ సైన్యం జమ్మూ కాశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంబడి భారతీయ బలగాలను లక్ష్యంగా చేసుకోవడంలో అమెరికా తయారు చేసిన యాంటీ ట్యాంక్ గైడెడ్ క్షిపణులను(ఏటీజీఎంలు) వినియోగిస్తున్న వైనాన్ని భారత్ ట్రంప్ ప్రభుత్వం ఎదుట లేవనెత్తే అవకాశం ఉందని కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ వర్గాలు ఆదివారం సూచించాయి. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని రాజౌరి జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి భారతీయ సైనిక బృందంపై పాక్ సైన్యం ఏటీఎంజీలతో గత ఆదివారం భారీగా జరిపిన దాడుల్లో ఒక కెప్టెన్‌తో పాటుగా నలుగురు సైనిక సిబ్బంది మరణించారని వారు తెలిపారు. ఆ సందర్భంగా పాక్ సైన్యం 120 ఎం.ఎం. మోర్టార్లు, ఏటీజీఎంలను వినియోగించిందని సైనిక వర్గాలు వెల్లడించాయి. మామూలుగా అయితే నియంత్రణ రేఖ వెంబడి భారతీయ సైన్యాన్ని లక్ష్యంగా చేసుకున్నప్పుడు 80 ఎం.ఎం. మోర్టార్లను పాకిస్తాన్ వినియోగిస్తుండేదని వారు చెప్పారు. భారత్, అమెరికా మధ్య వ్యూహాత్మక సంబంధాలు విస్తరిస్తున్న తరుణంలో అమెరికా తయారు చేసిన ఏటీజీఎంలను పాకిస్తాన్ వినియోగిస్తుండటాన్ని ఇక్కడి భారతీయ భద్రత వ్యవస్థ తీవ్రంగా పరిగణించినట్టు సమాచారం. మేం ఈ అంశాన్ని వారి(అమెరికా) ముందు లేవనెత్తుతాం అని సైనిక వర్గాలు తెలిపాయి. భారత్, అమెరికా మధ్య రక్షణ, భద్రత సంబంధాలు ఊపందుకుంటున్నాయి.

ఏప్రిల్ 27న కాలా విడుదల

చెన్నై: తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న కాలా చిత్రం ఏప్రి ల్ 27వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుం ది. తమిళంలో కాలా కరికా లన్, తెలుగులో కాలా పేరిట నిర్మాణం జరుపుకుంటున్న ఈ చిత్రానికి కబాలి ఫేమ్ రంజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. వండర్‌బార్ ఫిలింస్ పతాకంపై రూపొం దుతున్న ఈ చిత్రానికి సంతోష్ నారాయణ్ సంగీతం అందిస్తు న్నారు. కాలా విడుదల తేదీని రజనీకాంత్ అల్లుడు, నటుడు, చిత్రనిర్మాత ధనుష్ నిర్ధారించారు. ఈ మేరకు శనివారం ట్వీట్ చేశారు. నల్లని వస్త్రాలు ధరించిన రజనీకాంత్ ఒక కుర్చీలో కూర్చొని, పక్కన ఉన్న శునకంపై చేయి వేసినట్టుగా ఉన్న సినిమా స్టిల్‌ను ట్వీటర్‌లో విడుదల చేశారు.



మావోయిస్టు ఇన్‌ఛార్జి రామన్న అరెస్టు

నాగ్‌పూర్: మావోయిస్టు పార్టీ టెక్ ఇన్‌ఛార్జి రామన్న అరెస్టయ్యాడు. చంద్రపూర్ జిల్లా బల్లార్షాలో రామన్న అలియాస్ శ్రీనివాస్ మదురుతో పాటు అతని భార్య పద్మను మహారాష్ట్ర పోలీసులు అరెస్ట్ చేశారు. రామన్న బస్తర్ కార్యదర్శిగా కూడా పని చేస్తున్నాడు. మావోయిస్టు రామన్నపై రూ.25లక్షలు, పద్మపై రూ.6లక్షల రివార్డు ఉంది.

'హల్వా' తిని ఐదుగురు మృతి

జైపూర్: రాజస్థాన్‌లోని భుటేలాలో విషాద సంఘటన జరిగింది. హల్వా తిని ఐదుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. భిల్వారా జిల్లా భుటేలా గ్రామంలోని బంధువుల ఇంటికి ఐదుగురు వ్యక్తులు వెళ్లారు. అతిథులు వచ్చారని మర్యాద కోసం ఆ కుటుంబీకులు హల్వా చేసి పెట్టారు. హల్వా తిని ఐదుగురు అక్కడే ప్రాణాలు కోల్పో యారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రికి తరలించారు. ఫుడ్ పాయిజన్ కారణంగానే ఈ ఘట న జరిగిందని వైద్యులు తెలిపారు. అయితే కేసు నమోదు చేసు కున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వచ్చిన బంధువులపై విష ప్రయోగం ఏదైనా చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

3,400 ఏళ్ల నాటి మమ్మీకి 3డీ రూపం

లండన్: మమ్మీ అనగానే అమ్మ గుర్తుకొస్తుంది.. అదే ఈజిప్ట్ మమ్మీ అనగానే శవపేటికలు గుర్తుకొస్తాయి. వేల సంవత్సరాలుగా చెక్కుచెదరకుండా ఉన్న ఈ మమ్మీలకు ఇప్పుడు త్రీడి టెక్నాలజీతో రూపం ఇచ్చారు. ఈ ప్రయోగాన్ని బ్రిస్టోల్ యూనివర్సిటీ సైంటిస్టులు చేశారు. 3వేల 400 ఏళ్ల క్రితం ఈజిప్ట్ రాణి నెఫర్ టిటీ.. మమ్మీ ఆధారంగా ఆమె ముఖం ఎలా ఉంటుందో.. ఎలాంటి ఆభరణాలు ధరించి ఉండేదో 3డీ టెక్నాలజీతో తీర్చిదిద్దారు. ఈమె టుటన్ కామున్ తల్లి. ఈమె ఈజిప్ట్‌ను 3,300 ఏళ్ల క్రితం పరిపాలించింది. ఈజిప్ట్ మమ్మీకి 3డీ ఇమేజింగ్ టెక్నాలజీ ద్వారా ఓ రూపం ఇవ్వటం ఇదే మొదటిసారి. మమ్మీ ముఖం ఆధారంగా.. అప్పట్లో రాణి నెఫర్ టీటీ ఇలా ఉండేదని సైంటిస్టులు చెబుతున్నారు.

నాగాలాండ్‌లో బీజేపీకి 3 నుంచి 6సీట్లు

కొహిమా: నాగాలాండ్ ఎన్నికల్లో బీజేపీకి కేవలం 3 నుంచి 6 సీట్లు మాత్రమే వస్తాయని రాష్ట్ర హోంమంత్రి, నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) నేత కుజో లుజో నీనూ అన్నారు. ఈ ఎన్నికల్లో కూడా నాగా పీపుల్స్ ఫ్రంట్‌కే అధికారం సిద్ధిస్తుందని నీనూ అన్నారు. ఈ ఎన్నికల్లో తాము 30 సీట్ల కంటే అధికంగా గెలుచుకుంటామని నీనూ చెప్పారు. 60 సీట్లు ఉన్న నాగాలాండ్ శాసనసభ కు ఈ నెల 27వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. బీజేపీ 19 మంది అభ్యర్థు లను నిలబెట్టిందని, ఆ పార్టీకి 3నుంచి 6 సీట్లు లభించే అవకాశాలు ఉన్నాయ ని, ఆ పార్టీ మిత్రపక్షమైన నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ) 38 సీట్లకు పోటీ చేస్తుండగా 8 సీట్లలో విజయం సాధించే అవకాశం ఉందని నీనూ అన్నారు.

ఘనంగా శ్రీవారి కళ్యాణోత్సవం

- తరించిపోయిన భక్తులు..
- గోవింద నామస్మరణతో మార్మోగిన అంబర్‌పేట..
- భక్తులతో కిటకిటలాడిన మున్సిపల్ గ్రౌండ్..



నల్లకుంట, ప్రభ న్యూస్: శ్రీవారి కళ్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. గోవిందనామస్మరణతో అంబర్‌పేట మార్మోగింది. వేలాది మంది భక్తులు తరలిరావడంతో అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ కిటకిటలాడి పోయింది. తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యం లో అంబర్‌పేట ఎంఎల్ఏ జి. కిషన్‌రెడ్డి పర్యవేక్షణలో శనివారంనాడు అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్స్‌లో జరిగిన శ్రీ వేంకటేశ్వర కళ్యాణోత్సవం అంగరంగవైభంగా జరిగింది. టీటీడీ ఆధ్వర్యంలోనే చేపట్టిన కళ్యాణ వేదిక, గ్రౌండ్ డెకరేషన్ ఏర్పాట్లు అందరిని ఆకట్టుకున్నాయి. కండ్లు మిరుమిట్లు గొల్పే విద్యుత్ కాంతులతో భూదేవి, శ్రీదేవి సమేతంగా శ్రీవారు వేదికపై శోభాయమానంగా వెలుగొందుతూ భక్తులను మైమరిపించారు. తిరుమల నుంచి వచ్చిన వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారి కళ్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. మధ్యాహ్నం మూడు గంటలకు అంబర్‌పేట మహంకాళి దేవాలయం నుంచి స్వామి ఉత్సవ మూర్తులను భారీ ఊరేగింపుతో అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్స్ వేదికకు తీసుకుపోయారు. కళ్యాణోత్సవంలో స్వామివారికి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఎనిమిదిన్నర గంటల ప్రాంతంలో గవర్నర్ నర్సింహ్మన్ దంపతులు కళ్యాణోత్సవానికి హాజరై స్వామివారిని దర్శిం చుకున్నారు. ఎంఎల్ఏ కిషన్‌రెడ్డి దంపతులు గవర్నర్ దంప తులకు స్వాగతం పలికి శాలువాతో ఘమంగా సత్కరించారు. శ్రీనివాస కళ్యాణం ఆద్యంతం ఆసక్తికరంగా కమనీయంగా సాగింది. వేలాది మంది భక్తులు గోవిందనామ స్మరణచేస్తూ కళ్యాణోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో తిలకించారు. కళ్యాణోత్సవానికి హాజరైన వేలాది మంది భక్తులకు స్వామివారి కంకణం, లడ్డూ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన శ్రీనివాసం నృత్యరూపకం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీమంత్రి బండారుదత్తాత్రేయ, రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంఎల్ఏ తీగలకృష్ణారెడ్డి, ఎంఎల్సీ ఎన్. రాంచందర్‌రావు, టీవీ5 చైర్మన్ బి.ఆర్. నాయుడు, బిజెపి నాయకులు బి. పవన్‌కుమార్‌రెడ్డి, కన్నె రమేష్‌యాదవ్, ఆనంద్‌గౌడ్, ఎక్కాల నందు, అజయ్‌కుమార్, పి. గోవర్ధన్‌రెడ్డి, గిరి, సింగీతం నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అబుదాబీతో ఐదు ఒప్పందాలు

భారత ప్రధాని మోడీకి అబుదాబి యువరాజు ఘన స్వాగతం



అబుదాబీ: ప్రధాని నరేంద్ర మోడీ యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్(యూఏఈ)లో రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం ఇక్కడకు చేరుకున్నారు. జోర్డాన్ నుంచి అబుదాబీ విమానాశ్రయానికి చేరుకున్న మోడీకి యువరాజు మొహమ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్, రాచ కుటుంబానికి చెందిన ఇతర సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా.. యూఏఈ చేరుకున్నాను.

ఈ పర్యటనలో భారత్, యూఏఈ మధ్య సం బంధాలపై ఒక సానుకూల ప్రభావం చూపించే విస్తృతస్థాయి కార్యక్రమాలు చోటు చేసుకుంటాయి. నన్ను ఆహ్వానిం చడంలో ప్రత్యేక అభిమానం చూపిన గౌరవనీయ మొహమ్మ ద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్‌కు ధన్యవాదాలు తెలుపుకుం టున్నాను అని ప్రధాని ట్వీట్ చేశారు.

మోడీకి స్వాగతం పలుకుతూ యువరాజు సైతం ట్వీట్ చేశారు. అబుదాబీ చేరుకు న్న మరుక్షణం యువరాజుతో సమావేశమయ్యే నిమిత్తం అధ్యక్ష ప్రాసాదానికి ప్రధాని నరేంద్ర మోడీ చేరుకున్నారు. స్వాగతం పలుకుతున్నట్టుగా నగరంలోని కీలకమై న భవ నాలు త్రివర్ణాలను ఆపాదించుకున్నాయి. యువరా జుతో మో డీ సమావేశమైన అనంతరం ఇరు దేశాల ప్రతినిధు లు ఇంధన రంగం, రైల్వేలు, మానవ వనరులు, ఆర్థిక సేవలకు సంబం ధించిన ఐదు ఒప్పందాలపై సంతకాలు చేశారు.

ఆధార్ లేదని గెంటేస్తే..

ఆసుపత్రి గేటు వద్దే ప్రసవం



గుర్గావ్: ఆధార్ కార్డు లేదని ఓ గర్భిణిని అడ్మిట్ చేసుకోడానికి నిరాకరిస్తే.. ఆసుపత్రి గేటు వద్దే ప్రసవించింది. గుర్గావ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. మున్ని కేవాత్ (25) అనే గర్భిణికి శుక్రవారం ఉదయం పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఆమె కుటుంబసభ్యులు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే.. వారు మిన్నికేవాత్ ఆధార్ కార్డును ఇంటి వద్దే మరచిపోయి వచ్చారు. ఆమె ఆధార్ కార్డు ఉంటేనే అడ్మిట్ చేసుకుంటామని ఆసుపత్రి సిబ్బంది ఖరాకండీగా చెప్పేశారు. ఆధార్ నంబర్ చెప్తామని, కార్డు తర్వాత తీసుకొచ్చి చూపెడతామని ఆమె భర్త రామ్‌సింగ్ ఎంతగా వేడుకున్నా వాళ్లు కనికరించలేదు. అప్పటికే మున్నికి పురిటి నొప్పులు తీవ్రమవడంతో.. హాస్పిటల్ గేటు వద్దే ప్రసవించింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది.

ఈ తతంగాన్నంతా అక్కడున్న కొంతమంది తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించి.. ఆసుపత్రి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా రు.'ఆధార్ కార్డు తర్వాత తీసుకొస్తానని, మున్నీకి వైద్యం అందించాలని ఎంతగా వేడుకున్నా వాళ్లు పట్టించుకోలేదు. నా భార్యకు నొప్పులు ఎక్కువ కావడంతో కాజువాల్టీ వార్డుకు తీసుకెళ్లా. మున్నీని అక్కడ కూర్చోడానికి కూడా అనుమతిం చలేదు. దీంతో ఎమర్జెన్సీ వార్డు గేటు బయటే ఆమె ప్రసవించింది. దేవుడి దయవల్ల తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు.' అని రామ్‌సింగ్ చెప్పాడు. ఘటనపై విచారణ చేపట్టిన హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రాజోరా.. అందుకు కారణమైన మహిళా డాక్టర్, నర్సులను సస్పెండ్ చేశారు. గర్భిణి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి, వైద్యం చేయ డానికి నిరాకరించిన డాక్టర్, నర్సులపై కఠిన చర్యలు తీసుకో వాలని బాధితురాలి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

త్రిపుర ఎన్నికల్లో 35మంది కోటీశ్వరులు



న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాలు చాలా చిన్నవి కావడంతో వాటికి ప్రధాన మీడియా ఇచ్చే కవరేజీ చాలా తక్కువే. అయితే అసోసియేషన్ ఆఫ్ డెమక్రటిక్ రీఫార్మ్స్(ఏడీఆర్), ఎలక్షన్ వాచ్ మాత్రం ఎప్పటిలాగే తన విశ్లేషణ, పరిశోధనను ఈ చిన్న రాష్ట్ర అభ్యర్థులపై సైతం దృష్టి ఉంచారు. దాదాపు 297 మంది అభ్యర్థులు సమర్పించిన స్వయం ధ్రువీకృత అఫిడవిట్లను విశ్లేషించారు. త్రిపుర రాష్ట్రానికి జరగనున్న ఎన్నికల్లో 297 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారు. సాధారణంగా ఈశాన్య రాష్ట్రాలంటే చాలా ప్రశాంతంగా ఉంటాయనేది అందరి భావన. అది నిజం కూడాను. అయితే అక్కడ సైతం వివిధ పార్టీల తరపున నేర చరిత్ర కలిగిన అభ్యర్థులు పోటీ చేయడం విస్మయం కలిగిస్తోంది.

ఏడీఆర్ విశ్లేషణలోని ముఖ్యాంశాలు

- మొత్తం 297 మందిలో 22 (7శాతం) మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు.
- వీరిలో 17 (6శాతం) మంది మాత్రం సీరియస్ క్రిమినల్ కేసులున్నట్లు చెప్పారు.
- ఒక అభ్యర్థి ఐపీసీ 302 కింద మర్డర్ కేసు ఉన్నట్లు అఫిడవిట్‌లో తెలిపారు, హత్యాయత్నం కేసు ఆరుగురి మీద ఉంది.

పార్టీల వారీగా నేరచరితులు

దేశీయ పీపుల్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర తరపున సాధారణ క్రిమినల్ కేసులు 2(22శాతం), తీవ్రమైన క్రిమినల్ కేసులు ఇద్దరి(22శాతం)మీద ఉన్నాయి. ఇంకా భాజపా 51 మంది అభ్యర్థుల్లో 11 మంది(22శాతం) పైన క్రిమినల్ కేసులుండగా, 9 మందిపై(18శాతం) తీవ్రమైన క్రిమినల్ కేసులున్నాయి. ఈ రెండు పార్టీల నుంచి ఎక్కువ మంది నేరచరితులు ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల్లో సాధారణ క్రిమినల్ కేసులు 4 మందిపై, తీవ్రమైన నేరారోపణలు ముగ్గురిపై ఉన్నాయి.

అభ్యర్థుల ఆర్థిక స్థితిగతులు

- రూ.5 కోట్లు ఆపై ఆస్తులు కలిగిన వారి సంఖ్య 5గా ఉండగా, వారి శాతం 2గా ఉంది.
- రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల మధ్య ఆస్తులు కలిగిన వారు 13 మంది ఉండగా, వారి శాతం 4.
- రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్ల మధ్య ఆస్తులు కలిగిన వారు 44 (15శాతం) మంది ఉన్నారు.
- రూ.10 లక్షల నుంచి రూ.50 (29శాతం) లక్షల మధ్య ఆస్తులు కలిగిన వారు 86 మంది ఉన్నారు.
- రూ.10 లక్షల కంటే తక్కువ స్థాయి ఆస్తులు కలిగిన వారి సంఖ్య 149 (50శాతం)గా ఉంది.

పార్టీల వారీగా కోటీశ్వరులు

మొత్తం కోటీశ్వరుల్లో ఎక్కువ మంది భాజపా తరపు నుంచే పోటీ చేస్తున్నారు. భాజపా నుంచి 18(35శాతం), కాంగ్రెస్ నుంచి 9(15శాతం), ఐఎన్పీటీ 2 (13శాతం), ఐపీఎఫ్టీ 1 (11శాతం), సీపీఐ(ఎం) నుంచి ఒకరు (7శాతం), ఏఐటీసీ నుంచి ఒకరు (4శాతం) చొప్పున ఉన్నారు.

ఆప్ వికాస్ యాత్ర

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధికారం చేపట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని నియోజక వర్గాల్లో ఆదివారం నుంచి వికాస్ యాత్రలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మంత్రి గోపాల్ రాయ్ చెప్పారు. పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు అందరూ ఈ వికాస్ యాత్రలో పాల్గొంటారని ఆయన అన్నారు. 20 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడటంతో ఉప ఎన్నికలు జరిగే అవకాశాలున్న నేపథ్యంలో ఆ పార్టీ వికాస్ యాత్ర తలపెట్టింది.

గోరఖ్‌పూర్, ఫూల్పూర్‌లలో విజయం మాదే

లక్నో: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫూల్పూర్ లోక్‌సభ నియోజక వర్గాల్లో విజయం తమదేనని మూడు ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ్‌ప్రసాద్ మౌర్య రాష్ట్రంలో పదవులు చేపట్టి లోక్‌సభ సభ్యత్వాలకు రాజీనామా చేయడంతో ఈ నియోజక వర్గాలకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో విజయం తమదేనంటూ బీజేపీ, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు చెబుతున్నాయి.

జక్కంపూడి ఎకనామిక్ జోన్‌లో పురోగతి

అమరావతి, ఆంధ్రప్రభ: విజయవాడ రూరల్ మండలంలోని జక్కంపూడి గ్రామంలో ఏపీ టిడ్కో నిర్మించనున్న జక్కంపూడి ఎకనమిక్ టౌన్‌షిప్‌కు భూకేటా యింపులో తొలి అడు గు పడింది. రాష్ట్రంలో 9 టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేయాలని ప్రాథ మికంగా ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈనెల 2న జరిగిన మంత్రివర్గంలో వీటిలో మూడు టౌన్‌షిప్‌ల నిర్మాణాలను వెనువెంటనే ప్రారంభించాలని నిర్ణయం తీసుకు న్న సంగతి విదితమే. ఈ నేపథ్యంలోనే జక్కంపూడిలో ఎకనమిక్ టౌన్‌షిప్ ఏర్పా టులో తొలి అడుగు పడింది. ఈ టౌన్‌షిప్ ఏర్పాటుకు అవసరమైన భూములను సేకరించేందుకు అధికారులు శనివారం సర్వే చేశారు. అయితే, గత నాలుగేళ్లుగా ఇన్ ఫ్రా కంపెనీల యాజమాన్యాలకు తమ కంపెనీల ఏర్పాటుకు స్థలం కేటాయింపు [illegible] ఇబ్బందిగా మారింది. [illegible] సంబంధించి పేపర్ వర్క్ మొ త్తం పూర్తయినప్పటికీ అవసరమైన స్థలం అందుబాటులో లేకపోవడంతో సదరు కం పెనీల యాజమాన్యాలు డోలాయమానంలో కొట్టుమిట్టాడు తున్నాయి. తొలిసారిగా జక్కంపూడి టౌన్‌షిప్‌కు స్థల సేకరణకు అనువైన స్థలం దొరకడం, అందుకు రైతులు కూడా సుముఖత వ్యక్తం చేయడం శుభపరిణామంగా మారింది. జక్కంపూడి టౌన్‌షిప్ నిర్మాణం కోసం వేమవరం గ్రామ రెవెన్యూలోని 196 ఎకరాలను తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈమేరకు కృష్ణా జిల్లా కలెక్టర్ బి. లక్ష్మీకాంతం శనివారం జిల్లా అధికారులతో కలిసి నిర్ణయించిన భూముల్లో పర్యటించారు. కొత్తూరు తాడేపల్లి పరిధిలోని వేమవరం గ్రామంలో 196 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, తొలుత ఈ టౌన్‌షిప్ కోసం 16[illegible] ఎకరాలను [illegible] ప్రభుత్వం నిర్ణయించింది. అయితే రైతులు తమ మొత్తం భూమిని ఈ టౌన్‌షిప్ నిర్మాణానికి ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో పలు దఫాలుగా విజయవాడ రూరల్ డిప్యూటీ కలెక్టర్ ఏ. రవీంద్రరావు రైతులతో ధర నిర్ణ యించడంపై చర్చించారు. ఎకరాకు రూ. 1.20 కోట్లు చెల్లించాలని తొలుత రైతులు ప్రతిపాదించగా, అందుకు ప్రభుత్వం ససేమిరా అంది. దీంతో రూ. 90 లక్షలు ఇచ్చి మొత్తం 196 ఎకరాలను తీసుకోవాలని రైతులు కోరారు. మొత్తం భూమిని సేకరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి తనకు పంపాల్సిందిగా ఆదేశించారు. మార్కెట్ ధర రూ. 79.91 లక్షలు చెల్లించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. దీంతో డిప్యూటీ కలెక్టర్ రవీంద్రరావు వేమవరం రెవెన్యూ పరిధిలోని భూముల సేకరణకు ప్రతిపాదనలు [illegible]

రూ. 250 కోట్లు ఇవ్వండి

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేవాదాయశాఖకు 2018-19బడ్జెట్‌లో రూ.250కోట్లు కోరాలని గృహనిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన సమీక్షా సమావేశంలో నిర్ణయించారు. శనివారం దేవాదాయ శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో బడ్జెట్ ప్రతిపాదనలు, ఖర్చులు, అంచనాలపై చర్చించారు. ఆలయ ఉద్యోగులు, అర్చకుల వేతనాలు, ధూపదీప నైవేద్యం, నూతన ఆలయాల నిర్మాణాలను దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ఎంచుకున్న ప్రాధాన్యతల మేరకు ఈ సంవత్సరం కావాల్సిన బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు మంత్రికి అధికారులు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.250కోట్ల అంచనా వ్యయంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. కొత్తగా మూడువేలఆలయాలకు ధూపదీప నైవేద్యపథకం వర్తింపుప్రక్రియపై జిల్లాస్థాయిలో త్వరితగతిన నివేదికలు సిద్ధం చేసి దేవాదాయ శాఖ కమిషనర్‌కు సమర్పించాలని మంత్రి ఆదేశించారు. మరోవైపు ఆలయాల్లో ప్రసాదాల మీద జిఎస్టీ విధించడంపై సంబంధిత అధికారులతో అవగాహనాసదస్సు ఏర్పాటుచేసి చర్చించి పరిష్కారం చూడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ శివశంకర్, అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, జాయింట్ కమిషనర్ కృష్ణవేణి, ఈఎన్‌సి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పర్యాటక సాహసయాత్ర బేష్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ పర్యాటకరంగాన్ని ప్రపంచానికి తెలియజేయడానికి నలుగురు తెలంగాణ యవతులు మోటారుబైకులపై సాహసయాత్ర చేయడం అభినందనీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి అజ్మీరా చందూలాల్ తెలిపారు. శనివారం సచివాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 11న ఉదయం 7గంటలకు పర్యాటకభవనం నుండి సాహసయాత్ర ప్రారంభించడం జరుగుతున్నదన్నారు. ఈ నలుగురు మహిళలు మోటారుబైకులపై 7దేశాల్లో రోడ్డుమార్గం ద్వారా సాహసయాత్ర నిర్వహిస్తారన్నారు. సాహసయాత్ర కొనసాగే ప్రాంతాల్లో భారతదేశం, తెలంగాణ పర్యాటకరంగ విశేషాలను ప్రచారం చేస్తూ.. 17వేల కిమీ దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు తూర్పు ఆసియాలో పర్యటించనున్నారన్నారు. సాహసయాత్రలో భాగంగా ఇండియా, బంగ్లాదేశ్, మయన్మార్, థాయ్‌లాండ్, లావోస్, కంబోడియా, వియత్నాం దేశాలలో పర్యటించి తెలంగాణ పర్యాటకరంగాన్ని చాటిచెప్పడం జరుగుతుందన్నారు. ఈ యాత్ర నిర్వహిస్తున్న సమయంలో వీరు 19యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్లు, 35యునెస్కో సైట్లను సందర్శిస్తారన్నారు. పర్యాటక సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ నలుగురు మహిళలు 50రోజుల్లో 7దేశాల్లో దాదాపు 17వేల కిమీ పర్యటించి వస్తారన్నారు. వీరికి 400సిసి బైక్‌లను బజాజ్ కంపెనీ అందిస్తున్నదన్నారు. మహిళలు సురక్షితంగా పర్యటనలు నిర్వహించడానికి యాత్ర దోహదపడుతుందన్నారు. వీరు పర్యటించే రాష్ట్రాలు, దేశాల అధికారులతో మాట్లాడి వీరికి అవసరమైన సౌకర్యాలు కల్పించేవిధంగా రాష్ట్ర పర్యాటక శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రయాణమార్గంలో గుర్తించిన ప్రాంతాల్లో తెలంగాణ పర్యాటక శాఖకు సంబంధించిన వీడియోలు ప్రదర్శిస్తారన్నారు. తెలంగాణ పర్యాటకరంగాన్ని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుతీసుకురావడమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మోటార్ బైక్ సాహసయాత్ర బృందానికి జైభారతి నేతృత్వం వహిస్తున్నారు.

జమ్మూలో ఆమ్రపాలి వివాహం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వరంగల్ అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలి వారం రోజుల్లో పెళ్లి కూతురు కానున్నారు. ఈ నెల 18న ఐపీఎస్ అధికారి సమీర్‌శర్మతో ఏడడుగులు వేసేందుకు సర్వం సిద్ధమైంది. ఆమె వివాహ ఏర్పాట్లు చకాచకా జరుగు తున్నాయి. 2011 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సమీర్‌శర్మ ప్రస్తుతం డయ్యూ డామన్‌లో ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 18న ఆయన సొంత రాష్ట్రం జమ్మూ కాశ్మీర్‌లో వీరి వివాహం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఇరు కుటుంబాలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం ఫిబ్రవరి 15నుంచి మార్చి 7 వరకు ఆమె సెలవులో ఉండనున్నారు. పెళ్లి జమ్మూలో జరిపిన తర్వాత ఇక్కడి బంధుమిత్రులకు, సన్నిహితులకు గ్రాండ్‌గా పార్టీ ఇచ్చేందుకు ఆమె కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 23న వరంగల్‌లో, 25న హైదరాబాద్‌లో ఆమ్రపాలి విందు ఇవ్వనున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో రిసెప్షన్ నిర్వహించేందుకు నిర్ణయించిన తేదీల్లో హోటళ్లను బుక్ చేశారు. వివాహం, విందు తర్వాత ఫిబ్రవరి 26నుంచి మార్చి 7 వరకు సమీర్‌శర్మతో కలిసి ఆమె టర్కీ పర్యటనకు వెళ్లనున్నట్లు తెలిసింది.

వెంకన్న సేవలో మంత్రి హరీశ్



రేణిగుంట, ప్రభ న్యూస్: తెలంగాణ నీటి పారుదల శాఖా మంత్రి హరీష్‌రావు శనివారం మధ్యాహ్నం తిరుపతికి వచ్చారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన తిరుమల చేరుకుని అక్కడ బస చేశారు. ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనంలో శ్రీవారిని దర్శించుకోనున్నారు. రేణిగుంట విమానాశ్రయంలో హరీష్‌రావుకు చంద్రగిరి వైకాపా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాజంపేట వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి, పీలేరు వైకాపా ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, తదితరులు స్వాగతం పలికారు.

అమ్మాయిలు బీరు తాగుతున్నారు

భయమేస్తుందని గోవా సీఎం వ్యాఖ్య

పనాజీ: మాదకద్రవ్యాల మహమ్మారిపై తమ ప్రభుత్వం మడమతిప్పని పోరాటం చేస్తుందని గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ ప్రతినబూనారు. అదే సమయంలో ఈ రోజుల్లో అమ్మాయిలు మద్యం తాగడంపై ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్ర లెజిస్ట్రేచర్ డిపార్ట్‌మెంట్ శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన స్టేట్ యూత్ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆఖరికి అమ్మాయిలు సైతం బీరు తాగడం మొదలుపెట్టేసరికి నాకు భయం పుట్టుకొస్తున్నది. హద్దులు మీరుతున్నారు. నేను అందరినీ అనడంలేదు. అలాగని ఇక్కడ కూర్చున్నవారి గురించి మాట్లాడటం లేదు అని మనోహర్ పారికర్ వ్యాఖ్యానించారు. గోవాలో మాదక ద్రవ్యాల వ్యాపారం గురించి మాట్లాడుతూ అది పూర్తిగా సమసిపోతుందంటే నేను నమ్మను. కళాశాలల్లో మాదకద్రవ్యాలను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారంటే విశ్వసించను అని ముఖ్యమంత్రి తెలిపారు. మాదక ద్రవ్యాల అక్రమ తరలింపు అభియోగంపై పోలీసులు 170 మందిని అరెస్టు చేశారని మనోహర్ చెప్పారు.

పాలస్తీనాలో శాంతి చేకూరాలి

- ఇజ్రాయెల్, పాలస్తీనా భారత్‌కు మిత్ర దేశాలే
- శాంతిస్థాపనకు మావంతు కృషి: ప్రధాని మోడీ
- మోడీకి పాలస్తీనా అత్యున్నత పురస్కారం
- గ్రాండ్‌కాలర్‌తో అబ్బాస్ సత్కారం
- ప్రపంచ వ్యాప్తంగా భారత్‌కు ఎనలేని ఆదరణ
- ఐరాసలో సహకారం మరువలేనిది
- మోడీతో ద్వైపాక్షిక చర్చల్లో పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్



రామల్లా (పాలస్తీనా) : ప్రధాని నరేంద్రమోడీ పాలస్తీనా పర్యటనలో భాగంగా ముందుగా ఆ దేశ అధ్యక్షుడు మహమౌద్ అబ్బాస్‌ను శనివారం కలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. 50 మిలియన్ డాలర్ల విలువ చేసే ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేసుకున్నాయి. ఒప్పందంలో 30 మిలియన్ డాలర్ల విలువ చేసే సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ నిర్మాణం కూడా ఉంది. దీనికి ముందుకు పాలస్తీనా అధ్యక్షుడు మహమౌద్ అబ్బాస్, ప్రధాని నరేంద్ర మోడీకి అధికారిక లాంఛనాలతో సాదర స్వాగతం పలికారు. పాలస్తీనాకు అధికారిక పర్యటన నిమిత్తం వెళ్లిన మొదటి భారతదేశ ప్రధానిగా నరేంద్రమోడీ చరిత్ర సృష్టించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల అధ్యక్షులు కలిసి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. పాలస్తీనా ప్రజల అభిరుచులకు అనుగుణంగా తాము ఉన్నామని, ఈ విషయమై ఎలాంటి మార్పు ఉండబోదని పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్‌కు హామీ ఇస్తున్నానని చెప్పారు. ఈ ప్రాంతంలో మళ్లీ శాంతిసామరస్యం వెల్లివిరిసేలా భారత్ కోరుకుంటుందని అన్నారు. ఇది అంత సాధ్యమైంది కాదని, కానీ తాము ఇదే కోరుకుంటున్నామని మోడీ చెప్పారు. భారత్ ఎప్పుడూ పాలస్తీనాలో శాంతినే కోరుకుంటుందని, ఇది తనకు తెలుసని అబ్బాస్ అన్నారు. అనంతరం పాలస్తీనా అధ్యక్షుడు మహమౌద్ అబ్బాస్ మాట్లాడారు. పాలస్తీనా ఎల్లప్పుడే స్వేచ్ఛే కోరుకుంటుందని, అదే లక్ష్యంగా ప్రభుత్వం కూడా ముందుకు వెళ్తున్నదని అన్నారు. ఇజ్రాయిల్‌లో శాంతి నెలకొల్పేందుకు భారత్ కూడా సహాయ సహకారాలు అందజేయాలని ఈ సందర్భంగా ప్రధానిని పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్ కోరారు.

అంతర్జాతీయ స్థాయిలో తనదైన ముద్ర

అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ స్థానం చాలా శక్తివంతమైందని, సమైక్యత ఉద్యమ విషయంలో కూడా అంతర్జాతీయ ఫోరంలో భారత్ గట్టి వాణి వినిపిస్తుందని, మరింత శక్తివంతమైన దేశంగా అభివృద్ధి చెందాలని కోరుతున్నట్టు అబ్బాస్ చెప్పుకొచ్చారు. బీట్ సహూర్‌లో 30 మిలియన్ డాలర్లతో సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. మహిళా సాధికారత పెంపొందించేందుకుగాను 5 మిలియన్ డాలర్లతో విశాలమైన భవనం ఏర్పాటుకు ఇరు దేశాల అధ్యక్షులు నిర్ణయించుకున్నారు. విద్యారంగ అభివృద్ధికి గాను 5 మిలియన్ డాలర్లు ఖర్చు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. అదేవిధంగా రామల్లాలో జాతీయ స్థాయి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు, దాని మిషనరీ కొనుగోలు కోసం ఒప్పందంలో భాగంగా నిధులు కేటాయించారు.

● మోడీకి సాదర స్వాగతం

ఇద్దరు ప్రధానులు ఇరు దేశాల జాతీయ గీతాలపన అనంతరం గౌరవ వందనం స్వీకరించారు. పాలస్తీనా ప్రధాని నివాసం అయిన ముకాటాలో ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాథలిక్ చర్చ్ ఆర్చ్ బిషప్ పౌల్స్ మార్కుజ్జో, అల్-అక్సా మసీదు నాయకులు ప్రధాని మోడీని కలుసుకున్నారు. జోర్డాన్ ఆర్మీ తమ హెలికాప్టర్‌లో మోడీని అమ్మాన్ నుంచి రమల్లాకు తీసుకెళ్లింది. అనంతరం పాలస్తీనా ప్రధాని రమీ అమ్దుల్లా సాదరంగా స్వాగతం పలికారు. మోడీ చాపరకు ఇజ్రాయిల్ ఎయిర్ ఫోర్స్ చాపర్స్ ఎస్కార్ట్ కల్పించాయి. దిగిన అనంతరం మోడీ మాట్లాడుతూ.. పాలస్తీనా పర్యటన చారిత్రాత్మకం అని, ఇది ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలం చేకూరుస్తాయని అన్నారు. అనంతరం పాలస్తీనాలో పేరు ప్రఖ్యాతులు పొందిన నాయకుడు యాసిర్ ఆరాఫత్ సమాధిని సందర్శించారు. దీన్ని నవంబర్ 10, 2007లో పాలస్తీనా అధ్యక్ష భవనం కాంపౌండ్‌లో ఏర్పాటు చేశారు. గత ఏడాది మోడీ ఇజ్రాయిల్ పర్యటనకు వచ్చిన సమయంలో రమల్లాను సందర్శించలేదు. ప్రస్తుత పాలస్తీనా పర్యటనతో తమకు పాలస్తీనా, ఇజ్రాయిల్ రెండూ సమానమే అని భారత్ చెప్పుకొచ్చింది.

ఇజ్రాయెల్‌తో దోస్తీ.. పాలస్తీనాకు లాభం

ఇజ్రాయెల్‌తో భారత్ దోస్తీ చేయడంతో పాలస్తీనా లాభం పొందుతుందని పలువురు నిపుణులు చెబుతున్నారు. ప్రధాని మోడీ పర్యటన నేపథ్యంలో పాలస్తీనా, ఇజ్రాయెల్ మధ్య శాంతి పూర్వక వాతావరణ నెలకొనే అవకాశం ఉంటుంది. పాలస్తీనా ప్రభుత్వం కూడా భారత్ మధ్యవర్తిత్వం తో ఇజ్రాయెల్‌తో కలిసిపోవడానికి యోచిస్తున్నట్టు నిపుణులు భావిస్తున్నారు. డొనాల్డ్‌ట్రంప్ ఇజ్రాయిల్ రాజధాని జెరూసలెం అని ప్రకటించిన తరువాత భారత్ ప్రధాని నరేంద్ర మోడీ పాలస్తీనాలో అడుగుపెట్టడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. అంతర్జాతీయ ఫోరం సమావేశం లో రాజధాని జగడం నేపథ్యంలో భారత్, పాలస్తీనాకు అనుకూలంగానే ఓటేసింది. దీంతో స్నేహపూర్వకంగా ఉన్న ఇజ్రాయిల్ కాసింత ఆందోళనకు కూడా గురైంది.

ఇజ్రాయిల్, భారత్ మధ్య బంధం బలపడితే పాలస్తీనాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు అహ్మద్ మజ్‌దలానీ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం భారత్, ఇజ్రాయిల్‌కు వెన్నుదన్నుగా ఉందని, ఇద్దరి మధ్య సానుకూల వాతావరణం కూడా ఉందని, ఇజ్రాయిల్‌తో చర్చలు జరిపితే పాలస్తీనాకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని జెరూసలెంను ఉద్దేశం మజ్‌దలానీ వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయిల్-పాలస్తీనా సంబంధాల విషయమై రమల్లాలోని చాలా మంది అధికారులతో మాట్లాడటం జరిగిందని, పరిస్థితులను విన్నవించినట్టు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా భారత్ తిరుగులేని శక్తిగా అవతరిస్తున్నది.

● సత్తాచాటుతున్న భారత్: పాలస్తీనా

గణతంత్ర దినోత్సవంలో ఆసియాన్ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. బ్రిక్స్‌లో కూడా సభ్యత్వం పొందింది. అంతర్జాతీయ ఫోరం సమావేశాల్లో కీలక భూమిక పోషిస్తున్నది. ఇండియా ప్రపంచలో తిరుగులేని శక్తిగా అవతరిస్తున్నదని అనడంలో ఎలాంటి సందేహం లేదని పాలస్తీనా అధికారులు అభిప్రాయపడ్డారు. మరో అధికారి భారతదేశ నైతిక స్థితి గురించి వివరించారు. జోర్డాన్, ఈజిప్ట్‌లు ఇజ్రాయిల్‌తో మంచి సంబంధాలు కొనసాగిస్తున్నాయి.. మోడీ, ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమెన్ మధ్య మంచి సంబంధాలు ఉన్నా... ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనీయులకు వెన్నుదన్నుగా నిలవడం ఎంతో ఆనందదాయకమని అభిప్రాయపడ్డారు. ఇటీవల ఐక్యరాజ్య సమితిలో జెరూసలేం రాజధాని విషయమై నిర్వహించిన ఓటింగ్‌లో కూడా పాలస్తీనాకు భారత్ అండగా నిలిచింది. 128 దేశాలు దీన్ని ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకించాయి. ఈ విషయమై ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమెన్ ఢిల్లీలో తన నిరాశ వ్యక్తపరిచారు.

మోడీకి గ్రాండ్ కాలర్‌తో సత్కారం



'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది స్టేట్ ఆఫ్ పాలస్తీనా'ను పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్, ప్రధాని మోడీకి బహూకరించారు. ఈ తరహా బహుమానాలు కేవలం విదేశీ ప్రతినిధులు, రాజులకు మాత్రమే పాలస్తీనా అందజేస్తుంటుంది. అదేవిధంగా ప్రభుత్వంలో అత్యున్నత స్థాయి అధికారికి కూడా దీన్ని బహూకరిస్తారు. ఈ ఘనత పాలస్తీనాను మొదటిసారి పర్యటించిన మొదటి ప్రధాని అయిన మోడీకి దక్కింది. ఇంతటి అత్యున్నత పురస్కారం తో భారత్, పాలస్తీనా మధ్య బలం మరింత పటిష్టం కావడానికి దోహదపడుతుంది. ద్వైపాక్షిక చర్చల అనంతరం పాలస్తీనా అధ్యక్షుడు మహమౌద్ అబ్బాస్ దీన్ని ప్రధాని మోడీ మెడలో వేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రధానుల్లో మోడీకి తన మదిలో అత్యున్నత స్థానం ఉందని అబ్బాస్ చెప్పుకొచ్చారు. పాలస్తీనాకు సంబంధించిన అత్యున్నత పురస్కారంతో మోడీని సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దీన్ని పాలస్తీనా ఎంతో గౌరవప్రదంగా యోచిస్తున్నట్టు తెలిపారు.

అనంతరం మోడీ మాట్లాడుతూ... పాలస్తీనా అత్యున్నత పురస్కారంతో తనను సత్కరించడంతో భారత్ ఎంతో గర్వంగా భావిస్తున్నదని అన్నారు. ఇది తమ ఇరు దేశాల స్నేహంపై ఎంతో ప్రభావం చూపుతుందని అన్నారు. గతంలో సౌదీ అరేబియా రాజు సాల్మన్‌ను పాలస్తీనా గ్రాండ్ కాలర్‌తో సత్కరించింది. అలాగే బహ్రెయిన్ హమద్‌తో పాటు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను కూడా గ్రాండ్ కాలర్‌తో సత్కరించారు.

పూరీ జగన్నాథునికి కస్తూరి కష్టమే

సరఫరాపై నేపాల్ చివరిరాజు స్పష్టీకరణ



పూరి: స్థానిక శ్రీ జగన్నాథ దేవస్థానానికి కస్తూరిని సరఫరా చేయడం నేపాల్‌కు సాధ్యం కాదని నేపాల్ దేశపు ఆఖరి రాజు జ్ఞానేంద్ర బీర్ బిక్రమ్ షా దేవ్ తెలిపారు. కస్తూరి సుగంధ ద్రవ్యాన్ని కస్తూరి జింక గ్రంథి నుంచి సేకరిస్తారని, కానీ చట్టం జింకను చంపడంపై నిషేధం విధించిందని చెప్పారు. దాంతో జగన్నాథ దేవస్థానానికి ఆ సుగంధ ద్రవ్యాన్ని సరఫరా చేయడానికి న్యాయపరమైన అడ్డంకులు ఏర్పడ్డాయని విలేకరులతో అన్నారు. 12వ శతాబ్దానికి చెందిన శ్రీ జగన్నాథ దేవస్థానంలో దేవాలయ సంప్రదాయాలకు లోబడి గర్భగుడిలోని మూల విరాట్టులకు ఏడాది మూడు సార్లు కస్తూరి లేపనాన్ని రాస్తారు. తద్వారా క్రిమికీటకాదులు, క్షయం నుంచి విగ్రహాలను పరిరక్షిస్తుంటారు. ఒకప్పటి నేపాల్ రాజ కుటుంబం కస్తూరిని సరఫరా చేస్తుండేది. కానీ 2008లో రాచరిక పాలనకు తెరపడటంతో సరఫరా నిలిచిపోయింది. దేవస్థానానికి కస్తూరి కొరత ఏర్పడింది. ఇదే విషయాన్ని 2017, ఏప్రిల్‌లో దేవస్థాన పాలకమండలి నేపాల్ అధ్యక్షుడు బిద్యాదేవి భండారికి వివరించింది.

ఔరంగజేబు టెర్రరిస్టు: ఎంపీ మహేశ్ గిర్రీ



న్యూఢిల్లీ: మొఘలు చక్రవర్తి ఔరంగజేబు ఒక టెర్రరిస్టు అని బీజేపీ ఎంపీ మహేశ్ గిర్రీ అన్నారు. ఔరంగజేబు సోదరుడు ధారా షికోయ్ గొప్ప ఉదారవాది అన్నారు. ఆయన తన జీవితాంతం సర్వమానవాళి సమానత్వం కోసం కృషి చేశారన్నారు. ధారా షికోయ్‌ను ధారా షుకో అని కూడా పిలిచేవారన్నారు. చరిత్రలో మరుగున పడిపోయిన గొప్ప ముస్లిం చక్రవర్తి ధారా అన్నారు. తూర్పు ఢిల్లీకి చెందిన బీజేపీ ఎంపీ గిర్రీ 'ఔరంగజేబు మరియు ధారా షికోయ్ - ఇద్దరు అన్నదమ్ముల కథ' పేరిట జరిగిన సదస్సు, ప్రదర్శన కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఔరంగజేబు ఒక ఉగ్రవాది అని అతడు చేసిన అకృత్యాలకు ఈరోజు మనం శిక్షించలేకపోయినా కనీసం అతని పేరిట ఢిల్లీలో ఉన్న ఔరంగజేబు రోడ్డు పేరును అయినా మార్చాలన్నారు. సమావేశంలో పాల్గొన్న సభికులను ఉద్దేశించి ఎంపీ గిర్రీ మాట్లాడుతూ తాను కూడా ఎన్నో అడ్డంకులను, బెదిరింపులను ఎదుర్కొన్నాను అన్నారు.గొప్ప ఉదారవాది అయిన ధారాను 1659 లో ఔరంగజేబు చంపేశాడన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఔరంగజేబు గురించి బోధించే సమయంలో ధారా గొప్పతనం గురించి కూడా వారికి వివరించాలన్నారు. అప్పుడే విద్యార్థులు మంచితనం, చెడ్డతనం మధ్య ఉన్న తేడాను గ్రహిస్తారన్నారు.

ప్రాణం ఖరీదు 10 రూపాయలు

ముంబై: మనిషి ప్రాణం గడ్డిపోచకన్నా హీనంగా మారిపోయింది. మానవత్వాన్ని మంట గలుపుతూ సరదా కోసమో, బిర్యానీ పొట్లం కోసమో హత్యలు చేస్తున్న నరరూప రాక్షసులను మించి పోయాడు ముంబాయిలోని ఓ దుర్మార్గుడు. కేవలం 10 రూపాయలను ఎగ్గొట్టడానికి స్నేహితుణ్ణి కొట్టి చంపిన ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. పొవై ప్రాంత పోలీస్ ఇన్‌స్పెక్టర్ అనిల్ పోహ్లా తెలిపిన వివరాల మేరకు ముంబాయికి చెందిన దినేష్ లక్ష్మణ్ జోషీ(30), జీవన్ మోర్(35) స్నేహితులు. బుధవారం సాయంత్రం ఈ ఇద్దరూ నగర సబర్బన్ ప్రాంతంలోని పొవైకి సమీప గ్రామం సాయి బంగుర్దాలో మద్యం కొనుగోలు చేశారు. అనంతరం వీరు దగ్గరలోని ఓ హోటల్‌లో ఆహార పదార్థాలు కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన బిల్లును ఇరువురూ సమానంగా పంచుకోవాలనే నిబంధన మేరకు జీవన్‌ను మరో 10 రూపాయలు తనకు చెల్లించాలని జోషీ కోరాడు. దీంతో కోపోద్రిక్తుడైన జీవన్ అందుబాటులో ఉన్న కర్రతో మిత్రుడిపై దాడిచేసి, తీవ్రంగా గాయపరిచాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు జోషీని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం మృతి చెందడంతో జీవన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు అతనిపై 302 సెక్షన్ క్రింద కేసు నమోదు చేశారు.

కాలుష్యానికి 'నీలిరంగు'తో చెక్

ముంబై : రోజు రోజుకూ పెరిగిపోతున్న వాయు కాలుష్యం, ఇంధన వృథా అటు ప్రకృతితో పాటు, ఇటు మానవ జీవితాలను కూడా అతలాకుతలం చేస్తూ వివిధ రోగాలకు, ఆర్థిక భారానికి కారణమౌ తున్నాయి. దీనికి పరిష్కారానికి వివిధ స్థాయిల్లో సాధ్యమైన పరిష్కారాలు కనుగొనే ప్రయత్నం జరుగుతూనే ఉంది. కాలుష్య నియంత్రణను సామాజిక బాధ్యతగా తీసుకున్న ముంబాయికి చెందిన శివాని కోట్(19), ఆషా కోట్(14) అనే సోదరీమణులు ఓ సరికొత్త పరిష్కారాన్ని కనుగొన్నారు. అదే నీలిరంగు సిగ్నల్ లైట్. ఇప్పటి వరకూ మనం ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను మాత్రమే చూశాం. వీటికి అదనంగా నీలిరంగు సిగ్నల్‌ను తెరమీదకు తెచ్చారు ఈ పిల్లలు. వీరి తండ్రి ముంబాయిలో అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్.కె. సోమయ్యా కాలేజీలో మనస్తత్వశాస్త్రం అభ్యసిస్తున్న శివాని కోట్ మీడియాకు వివరిస్తూ.. నగరాల్లో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగి పోతోంది. నగర కాలుష్యంలో వాహనాలు ప్రథమ స్థానంలో నిలుస్తున్నాయి. ఇందులోనూ ముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనాలు ఆగడంవల్ల కాలుష్యం విపరీతంగా పెరిగి పోతోంది. అందుకే సిగ్నల్స్ వద్ద వాహనాలు ఆగినప్పుడు వాటి ఇంజన్‌లను ఆఫ్ చేయడం ద్వారా చాలా మరకు సమస్యను తగ్గించే అవకాశం ఉంది. ఇందు కోసం మేం నీలి రంగు సిగ్నల్ ప్రతిపాదను తీసుకు వచ్చాము.

అమిత్‌షా ర్యాలీని అడ్డుకుంటాం: జాట్

చండీగఢ్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా రాష్ట్రంలో చేపట్టే బైక్ ర్యాలీని అడ్డుకుంటామని జాట్ వర్గీయులు ప్రకటించింది. సుమారు 50 వేల ట్రాక్టర్లతో అమిత్ షా నిర్వహించాలనుకున్న ర్యాలీని అడ్డుకుంటామని ఆల్ ఇండియా జాట్ ఆరక్షన్ సంఘర్ష్ సమితి అధ్యక్షుడు యష్పాల్ మాలిక్ ప్రకటించారు. తాము చేసిన అనేక డిమాండ్లను పరిష్కరించకపోవడంతో ర్యాలీని అడ్డుకోవాలని నిర్ణయించినట్లు మాలిక్ చెప్పారు. ఈ పరిస్థితిని ఎదుర్కోవడం కోసం 150 కంపెనీల కేంద్ర బలగాలను పంపించాల్సిందిగా హర్యానా ప్రభుత్వం కేంద్ర సహాయాన్ని అభ్యర్థించింది.

అత్యాచార నిందితుడికి 40 ఏళ్ల జైలు

భువనేశ్వర్: ఒడిశాకు చెందిన ఒక మహిళా భక్తురాలిపై అత్యాచారం చేసిన కేసులో బర్సానాలోని శ్రీ రాధారాణి ఆలయానికి చెందిన ఇద్దరు ఉద్యోగులకు ఇక్కడి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు 40 ఏళ్ల చొప్పున జైలు శిక్ష విధించింది. చెరొక లక్ష రూపాయిల జరిమానా విధించింది. ఆలయంలో నివసిస్తున్న ఒక మహిళపై కన్హయ్య, రాజేంద్ర అనే ఇద్దరు ఉద్యోగులు అత్యాచారం చేశారు. ఈ కేసు విచారించిన ఫాస్ట్‌ట్రాక్ న్యాయమూర్తి వివేకానంద శరణ్ త్రిపాఠీ ముద్దాయిలకు 40 ఏళ్ల చొప్పున జైలు శిక్ష, లక్ష రూపాయిల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మూడు ప్రశ్నలకు మోడీ జవాబివ్వాలి

- కావాలనే స్నేహితుడికి 'రాఫెల్' కాంట్రాక్ట్
- వ్యక్తిగతంగా ఫ్రాన్స్ వెళ్లి మరీ అప్పగింత
- మోడీపై రాహుల్ ధ్వజం
- కర్నాటకలో జన్ ఆశీర్వాద్ యాత్ర ప్రారంభం

కర్నాటక : రాఫెల్ జెట్ ఫైటర్ కుంభకోణం విషయమై ఎన్‌డీఏ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం రాఫెల్ కుంభకోణం అనేది చాలా పెద్దదిగా ఆయన అభివర్ణించారు. ఎన్నికల నేపథ్యంలో బల్లారీ జిల్లాలోని హోసాపేట్‌లో ఎలక్షన్ క్యాంపెయిన్‌ను రాహుల్ ప్రారంభించారు. మోడీ ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లిన సమయంలో వ్యక్తిగతంగా కాంట్రాక్టును అతని స్నేహితుడికి అప్పగించినట్టు రాహుల్ ఆరోపించారు. రాఫెల్ డీల్ విషయంలో వేసిన మూడు ప్రశ్నలకు ఇప్పటికీ ఎందుకు సమాధానం ఇవ్వలేదని మోడీని రాహుల్ ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఎన్నికల క్యాంపెయిన్‌లో భాగంగా కర్నాటకలో 'జన్‌ఆశీర్వాద్ యాత్ర'ను రాహుల్ ప్రారంభించారు. రాఫెల్ కుంభకోణంకు సంబంధించిన కొన్ని విషయాలు తనకు తెలుసని, అవి వివరించారు. ప్యారిస్‌లోని ఫ్రాన్స్‌కు వెళ్లిన మోడీ కాంట్రాక్టును కావాలనే బదలీ చేయించారని అన్నారు. గతంలో రాఫెల్ కాంట్రాక్టును డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ ఆధ్వర్యంలో పని చేస్తున్న బెంగుళూరుకు చెందిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఎఎల్) అప్పగించడం జరిగింది. ఈ సంస్థ భారతీయ భారతీయ విమానయాన సంస్థకు 70 ఏళ్లుగా సేవలు అందిస్తున్నది. ప్రస్తుతం బెంగుళూరు ఈ పరిస్థితుల్లో ఉండటానికి కారణం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ అని వివరించారు. హెచ్‌ఎఎల్‌కు కాంట్రాక్టు ఇవ్వడం ఇష్టంలేని మోడీ ఆ ఒప్పందాన్ని బెంగుళూరు నుండి అతని మిత్రుడికి అప్పజెప్పారు అని రాహుల్ ఆరోపించారు.



రైల్వే ఉద్యోగులకు ప్రోత్సాహకాలు

న్యూఢిల్లీ: రైల్వే ఉద్యోగులపై ఉన్నతాధికారులు వరాల జల్లు కురిపించారు. ఉద్యోగుల పనితీరును ప్రోత్సహించేలా నూతన సమీక్ష విధానాన్ని ప్రతిపాదించామని సీనియర్ అధికారులు తెలిపారు. బోనస్, ఇన్సెంటివ్, బ్యాడ్జ్ ఆఫ్ హానర్ తదితర ప్రోత్సహకాలు ఉద్యోగులకు అందించ టం వల్ల వారి ప్రతిభ రెట్టింపు అవుతుందన్నారు. దేశంలో పెద్ద రవాణా సంస్థ రైల్వేలో 13లక్షల మంది ఉద్యోగులు ఉన్నారని వీరంతా వారి మెరుగైన పనితీరు ప్రదర్శన కోసం ప్రమోషన్ల కోసం నిరీక్షిస్తున్నారన్నారు. ఉద్యోగులకు మెరుగైన గృహ వసతి, వైద్య సౌకర్యాల పెంపు, ఉద్యోగుల తల్లిదండ్రులకు ఉచిత ప్రయాణం వీటితోపాటు స్టాఫ్‌కు ఆర్థికసాయం కూడా అందించేందుకు ప్రతిపాదన చేశామన్నారు. నిర్ణీతకాలంలో ఉద్యోగుల పనితీరు సమీక్షించే విధానంలో కూడా పలు సూచనలు చేశామని వారు తెలిపారు. లోయర్ గ్రేడ్ ఉద్యోగులకు అందిస్తున్న బోనస్ విధానం గ్రూప్ ఏ, గ్రూప్ బీ అధికారులకు కూడా అందించేలా ప్రతిపాదించామన్నారు. గ్యాంగ్ మెన్, ట్రాక్ మెన్‌లకు ఉద్యోగ నిర్వహణలో 10సంవత్సరాలు ఎటువంటి యాక్సిడెంట్ ఫ్రీ రికార్డు కలిగి ఉంటే వారికి తగిన గుర్తింపుతో సత్కరించాలన్నారు. గత డిసెంబర్లో రైల్వే జనరల్ మేనేజర్ల సమావేశంలో తీసుకున్న పద్నాలుగు నిర్ణయాలను బోర్డు ఆమోదించాల్సి ఉందన్నారు.

ఆర్మీ క్యాంప్‌పై ఉగ్రదాడి

- అమరులైన ఇద్దరు జవాన్లు
- అధికారి కుమార్తె సహా ఆరుగురికిగాయాలు
- వెంటనే తేరుకున్న బలగాలు
- ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతం
- దాడి వెనక జైషే ఈమహ్మద్ ఉగ్రసంస్థ హస్తం?



శ్రీనగర్: జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి తెగబడ్డారు. జమ్ము నగర శివారులోని సుంజ్వాన్ ఆర్మీ క్యాంప్‌పై శనివారం తెల్లవారుజామున ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఇద్దరు జూనియర్ కమిషన్డ్ అధికారులు అమరులు కాగా.. ఆరుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో ఆర్మీ అధికారి కుమార్తె, కొలోనెల్ ర్యాంక్ ఆర్మీ అధికారి హవాల్దార్ అబ్దుల్ హమీద్, లాన్స్ నాయక్ బహదూర్ సింగ్ కూడా ఉంది. ఉగ్రదాడిలో అమరులైన కొలోనెల్ ర్యాంక్ అధికారులు సుబేదార్ మదన్‌లాల్ చౌదరి, సుబేదార్ మహ్మద్ అష్రఫ్ మీర్ అని జమ్ము కాశ్మీర్ శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి అబ్దుల్ రెహమాన్ వీరి తెలియజేశారు. ఈ దాడి జైషే ఈ మహ్మద్ ఉగ్రవాదుల పనే అని అధికారులు భావిస్తున్నారు. దాడిలో నాలుగు నుంచి ఐదుగురు ఉగ్రవాదులు పాల్గొని ఉంటారని జమ్ము కాశ్మీర్ డీజీపీ ఎస్పీ వైద్ తెలిపారు. ఆర్మీ క్యాంప్ లోని ఫ్యామిలీ క్వాటర్స్ చివర నుంచే అక్కడి పరిస్థితులను ముందుగా అంచనా వేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఉగ్రదాడి సమాచారం అందిన వెంటనే ఎస్‌వోజీ బలగాలు ఘటనా స్థలానికి చేరుకుని ఉగ్రవాదుల కోసం అణువ ణువునా గాలించాయి.ఉగ్రవాదులకు, ఆర్మీకి మధ్య ఎదురుకాల్పులు జరిగాయి.. ఎదురు కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. హౌసింగ్ కాలనీలో మహిళా, చిన్నారులు ఉండటంతో వారిని ఉగ్రవాదుల కాల్పుల నుంచి తప్పించేందుకు చాలా సేపు ప్రయత్నించారు. దాడి నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా సమీప పాఠశాలలను మూసివేశారు. జమ్ము నగరంలో హై అలర్ట్ ప్రకటించిన పోలీసులు.. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. 2013 ఫిబ్రవరిలో ఉరి తీయబడిన జైషే ఈ మహ్మద్ ఉగ్రవాది అఫ్జల్ గురు వర్ధంతి నేపథ్యంలో ఆర్మీ క్యాంపులు, భద్రతా బలగాలపై దాడులు జరగవచ్చని నిఘావర్గాలు ముందే హెచ్చరించాయి.



గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న జమ్ము సీఎం

తుపాకుల మోత ఉలిక్కిపడిన స్థానికులు

జమ్ము నగర శివారులోని సుంజ్వాన్ ఆర్మీ క్యాంప్‌లో తెల్లవారు జామున ఉగ్రవాదులు- భద్రతాబలగాలకు మధ్యజరిగిన భీకర పోరుతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. రోజూ మాదిరిగానే ఆర్మీ క్యాంప్ లో ప్రాక్టీస్ చేస్తున్నారని భావించిన స్థానికులకు ఉగ్రదాడి ఘటన తెలియగానే నిద్రమత్తు వదిలింది. ఉదయం4.30 గంటల నుంచి పెద్దఎత్తున తుపాకుల మోత వినిపించడంతో జనం భయంతో వణికిపోయారు. దాడి సమయంలో నిద్రలేచిన స్థానికుడు మహ్మద్ యాసిర్ మాట్లాడుతూ... తెల్లవారు జామున నాలుగున్నర గంటల సమయంలో పెద్దపెద్ద శబ్దాలు వినిపించాయి. తుపాకులు పేలుతున్నా యి. అయితే మొదట రోజులాగే ఆర్మీ ప్రాక్టిస్ జరుగుతుందనుకున్నా. తుపాకుల మోత ఎక్కువ సేపు వినిపించడంతో ఏదో జరుగుతుందని అనుమానించా.. ఉదయం 8.30 గంటల వరకు ఎదురుకాల్పులు జరుగుతున్నట్లు శబ్దం వినిపించింది. తెల్లవారేసరికి అసలు విషయం తెలిసింది.. ఉగ్ర వాదులు ఆర్మీ క్యాంప్‌పై దాడి చేశారని తెలిసిందని అన్నాడు..

జమ్ము అసెంబ్లీలో పాక్ జిందాబాద్ నినాదాలు

ఆర్మీ క్యాంప్‌పై మిలిటెంట్ల దాడుల నేపథ్యంలో జమ్ము కాశ్మీర్ అసెంబ్లీ పాకిస్తాన్ వ్యతిరేక నినాదాలతో అట్టుడికింది. ఉగ్రదాడిని ఖండిస్తూ ఎమ్మెల్యేలంతా నినదాలు చేశారు. బీజేపీ ఎమ్మెల్యేలు ఏకదాటిగా పాకిస్తాన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండటంతో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మహ్మద్ అక్బర్ లోన్ పాకిస్తాన్ జిందాబాద్ అంటూ దాయాదిదేశానికి అనుకూలంగా నినాదాలు చేశారు. దీంతో బీజేపీ ఎమ్మెల్యేలు ప్రతిపక్ష సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. అసెంబ్లీలో బీజేపీ, నేషనలిస్ట్ సభ్యులు పోటాపోటీగా ఆందోళనకు దిగడంతో స్పీకర్ కవీందర్ గుప్తా సభను పలుమార్లు వాయిదా వేశారు. ఎన్సీ సభ్యుడి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని ఇతర సభ్యులు పట్టుబట్టారు. సన్నితమైన అంశంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అక్బర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అయితే ఆ తర్వాత అక్బర్ వివరణ ఇచ్చుకున్నారు.




బీజేపీ జాతికి క్షమాపణ చెప్పాలి: ఒమర్

జమ్ములోని సుంజ్వాన్ ఆర్మీ క్యాంప్‌పై ఉగ్రదాడి నేపథ్యంలో జమ్ము కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా బీజేపీ లక్ష్యంగా విమర్శలు సంధించారు. జమ్ము విషయంలో బీజేపీ వైఖరిని తప్పుబడుతూ ఆ పార్టీ వెంటనే జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

బలగాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయి: రాజ్‌నాథ్

సుంజ్వాన్ ఆర్మీ క్యాంప్‌పై ఉగ్రదాడిపై కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. ఉగ్రవాదులను భద్రతా బలగాలు సమర్థవంతంగా ఎదుర్కొన్నాయని, ఏ ఒక్క భారతీయుడికి హాని కలగకుండా భద్రతాబలగాలు, సైన్యం పరస్పర సహకారం పు [illegible] చేస్తున్నాయని చెప్పారు. గాయపడిన వారి పరిస్థితిపై రాజ్‌నాథ్ ఆరా తీశారు. దాడి నేపథ్యంలో జమ్ము కాశ్మీర్ డీజీపీ తో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉగ్రవాదులకు భారత [illegible] జవాబిచ్చారు.

ఆర్థిక వ్యవస్థ నేల చూపులు



న్యూఢిల్లీ: మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం ఎన్డీఏ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థ నేలచూపులు చూస్తోందని మండిపడ్డారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో దేశ వృద్ధి రేటు దూసుకుపోయిందన్న చిదరంబరం.. ప్రస్తుతం ప్రభుత్వ విధానాల తో యూపీఏ హయాంలో కంటే 10 ఏళ్ల కనిష్ఠానికి చేరుకుందన్నారు.ట్విట్టర్ వేదికగా ఎన్డీఏ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించిన చిదంబరం ప్రపంచ బ్యాంక్ మాజీ చీఫ్ ఎకనామిస్ట్ కౌశిక్ బసు పేర్కొన్న అంశాలను గుర్తు చేశారు. దేశ ఆర్థిక వృద్ధి రేటు 30 ఏళ్ల కనిష్ఠానికి పడిపోయిందని కౌశిక్ విశ్లేషిస్తే ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ మాత్రం వృద్ధి రేటు ఆశాజనకంగానే ఉందని వ్యాఖ్యానిస్తున్నారని మండిపడ్డారు. ఎన్డీఏ ప్రభుత్వంపై ట్విట్టర్ లో ప్రశ్నల వర్షం కురిపిస్తూ.. ఎన్డీఏ ప్రభుత్వ నాలుగేళ్ల సగటు వృద్ధి రేటు ఎంత. అది 7.3 శాతం కంటే తక్కువే. అంటే యూపీఏ హయాంలోని వృద్ధిరేటు కంటే తక్కువ. వృద్ధిరేటు విషయంలోఎన్డీఏ సూచనలు ఏంటీ.. పెట్టుబడులా.. పొదుపా.. క్రెడిట్ వృద్ధా..వీటన్నింటిలోనూ నేలచూపులే. అని విమర్శించారు. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థ బాగుందని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ వ్యాఖ్యానించడాన్ని చిదంబరం తప్పుబట్టారు.

క్రీడాప్రభ

నాల్గో వన్డేకు వర్షం అడ్డంకి



భారత్ 7/289

దక్షిణాఫ్రికా లక్ష్యం డి/ఎల్ ప్రకారం 28 ఓవర్లలో 153

జొహన్నెస్‌బర్గ్: నాలుగో వన్డేకు వరుణుడు అంతరాయం కలిగించాడు. భారత ఇన్నింగ్స్‌లో ఒకసారి వర్షం రాగా ఆట 47 నిమిషాలు నిలిపేశారు. అనంతరం దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ప్రారంభించిన తర్వాత మరోసారి వర్షం రావడంతో ఆటను నిలిపివేశారు. 7.2 ఓవర్లు బౌలింగ్ జరిగిన తర్వాత వర్షం రావడం గంటా 20 నిమిషాలసేపు ఆట ఆగిపోయింది. 8 ఓవర్లో బుమ్రా వేసిన రెండో బంతికి మర్‌క్రమ్(22) వికెట్లముందు ఎల్బీడబ్ల్యుగా దొరికిపోయాడు. అప్పటికి సఫారీల స్కోరు వికెట్ నష్టానికి 43 పరుగులు. పలుమార్లు గ్రౌండ్ పరిస్థితిని పర్యవేక్షించిన అంపైర్లు డి/ఎల్ నిబంధనల ప్రకారం దక్షిణాఫ్రికా లక్ష్యాన్ని 28 ఓవర్లలో153 పరుగులకు కుదించారు. హషీం ఆమ్లా, డుమినీలు బ్యాటింగ్ చేస్తున్నారు. కడపటి వార్తలు అందేసరికి దక్షిణాఫ్రికా 17 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. ఆమ్లా 24 పరుగులతో, డుమిని 5 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు. ఉదయం భారత్ టాస్ గెలిచి బ్యాటింగ్‌ను ఎంచుకుంది. ఓపెనర్ రోహిత్ శర్మ మరోసారి విఫలమయ్యాడు. 5 పరుగులు చేసి రబాడా బౌలింగ్‌లో అతనికే రిటర్న్ క్యాచిచ్చి ఔటయ్యాడు. రెండో వికెట్‌గా వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లీ మరోసారి బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ధావన్, కోహ్లీలు జాగ్రత్తగా ఆడుతూ స్కోరును ముందుకు పరుగెత్తించారు. ఇన్నింగ్స్ 19వ ఓవర్లో ధావన్ వన్డేల్లో తన26వ అర్ధ శతకంను పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరి భాగస్వామ్యంను విడగొట్టడానికి సఫారీల కెప్టెన్ మర్‌క్రమ్ పలువిధాల బౌలింగ్‌ను మార్చినప్పటికి ఫలితం లేకపోయింది. కోహ్లీ తన అర్ధ శతకంను 56 బంతుల్లో పూర్తి చేసుకున్నాడు. 25 ఓవర్లు ముగిసే సరికి భారత స్కోరు వికెట్ నష్టానికి 150 పరుగులు. 32 ఓవర్లో క్రిస్ మోరిస్ వేసిన బంతిని కోహ్లీ కవర్స్ మీదుగా ఆడబోయి మిల్లర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కోహ్లీ 83 బంతుల్లో 75 పరుగులు చేశాడు. మూడో వికెట్‌గా అజింక్యా రహానే వచ్చి ధావన్‌కు జత కలిశాడు. ఇన్నింగ్స్ 32వ ఓవర్లో ధావన్ తన 13వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. 35వ ఓవర్లో మేఘాలు కమ్ముకొని ఉరుములు, మెరుపులు సంభవించడంతో ఆటను 47 నిమిషాలు నిలిపివేశారు. అనంతరం ఆట ప్రారంభమైన కొంచెం సేపటికే ధావన్(109) మోర్కెల్ బౌలింగ్‌లో డివిల్లియర్స్‌కు క్యాచిచ్చి ఔటయ్యాడు. అనంతరం శ్రేయాస్ అయ్యర్ బ్యాటింగ్ వచ్చాడు. 37వ ఓవర్లో భారత్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఎన్గిడి బౌలింగ్‌లో రబాడాకు క్యాచిచ్చి రహానె(8) ఔటయ్యాడు. ధోని బ్యాటింగ్‌కు వచ్చాడు. 44వ ఓవర్లో శ్రేయాస్ అయ్యర్ 18 పరుగులు చేసి ఎన్గిడి బౌలింగ్‌లో మోరిస్ క్యాచిచ్చి ఔటయ్యాడు. హార్దిక్ పాండ్యా బ్యాటింగ్‌కు వచ్చాడు. 47 ఓవర్ చివరి బంతికి పాండ్యా(9) రబాడా బౌలింగ్‌లో మర్‌క్రమ్‌కు క్యాచిచ్చి ఔటయ్యాడు. అప్పటికి భారత స్కోర్ 262/6. పాండ్యా స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన భువనేశ్వర్ 5 పరుగులు చేసి రనౌట్ అయ్యాడు. 50 ఓవర్లు ముగిసే సరికి ధోనీ 42 పరుగులతో, కులదీప్ యాదవ్ పరుగులేమి చేయకుండా క్రీజ్‌లో ఉన్నారు.


భువనేశ్వర్‌ను రనౌట్ చేస్తున్న మోరిస్

స్కోరుబోర్డు

భారత్ బ్యాటింగ్: రోహిత్ శర్మ (సి అండ్ బి) రబాడా5, శిఖర్ ధావన్ రనౌట్ (సి)డివిల్లియర్స్ (బి)మోర్కెల్ 109, విరాట్ కోహ్లీ(కెప్టెన్)75 (సి) మిల్లర్(బి) మోరిస్, ఆజింక్యా రహానే (సి)రబాడా (బి) ఎన్గిడి 8, హార్దిక్ పాండ్యా (సి) రబాడా(బి)మర్‌క్రమ్ 9, ఎంఎస్ ధోనీ నాటౌట్ 42, భువనేశ్వర్ కుమార్ రనౌట్(డుమిని/మోరిస్) 5, కుల్దీప్ యాదవ్ నాటౌట్ 0 ఎక్స్‌ట్రాలు 18, (మొత్తం 50 ఓవర్లలో 289/7)
వికెట్ల పతనం 20-1,178-2,206-3,210-4, 247-5,262-6, 282-7
బౌలింగ్: రబాడా 10-0-58-2,ఎన్గిడి 10-0-52-2,మోరిస్ 10-0-60-1, పెహ్లుక్‌వాయెూ 6-0-38-0,జెపి డుమిని 4-0-20-0, మోర్కెల్ 10-0-55-1
దక్షిణాఫ్రికా బ్యాటింగ్: మర్‌క్రమ్ ఎల్బీడబ్ల్యు (బి) బుమ్రా(22) ఆమ్లా బ్యాటింగ్ 24, డుమి4 బ్యాటింగ్

వింటర్ ఒలింపిక్స్‌లో స్వీడన్‌కు తొలి స్వర్ణం



ప్యోంగ్ చాంగ్: శీతాకాల ఒలింపిక్స్ క్రీడల్లో తొలి స్వర్ణం స్వీడన్ చేజిక్కుంచుకుంది. మహిళ స్కియథ్లాన్ ఈవెంట్ క్రాస్ కంట్రీ రేస్‌లో స్వీడన్ క్రీడాకారిణి చార్లొట్టి కల్లా నార్వే దేశానికి చెందిన మ్యారిట్ జోయిర్‌జెన్‌ను ఓడించి నేరుగా స్వర్ణ పతకంను గెలుచుకుంది. రెండవ స్థానంలో నిలిచిన మ్యారిట్ రజతం గెలుపొందగా, ఫిన్లాండ్ క్రీడాకారిణి క్రిస్టా పర్మాకోస్కి కాంస్య పతకంను గెలుచుకుంది. తొలి రోజు మొత్తం నాలుగు స్వర్ణ పతకాలు ఆయా క్రీడాకారులు గెలుపొందారు. నెదర్లాండ్స్‌కు చెందిన స్కేటర్ కార్లింజ్ ఎచ్‌టెరిక్టే 3000 మీటర్ల స్కేటింగ్ పోటీలో డిఫెండింగ్, ప్రపంచ ఛాంపియన్ ఐరీన్ వుస్ట్‌ను ఓడించి స్వర్ణ పతకంను కైవసం చేసుకుంది. బైథ్లాన్ ఈవెంట్‌లో జర్మనీకి చెందిన లారా డెహ్లామెయిర్ స్వర్ణంను గెలుపొందింది. 1500 మీటర్ల షార్ట్ ట్రాక్ పోటీలో లిమ్ హ్యో జున్ దక్షిణ కొరియాకు తొలి స్వర్ణాన్ని అందించింది.

నిరాశపర్చిన మహిళా జట్టు

- మూడో వన్డేలో సఫారీలు 7 వికెట్ల తేడాతో గెలుపు
- ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మిగ్నన్ డు ప్రీజ్



పొట్చెఫ్‌స్ట్రూమ్: భారత మహిళా జట్టు చివరి శనివారం జరిగిన చివరి వన్డేలో నిరాశపర్చారు. దక్షిణాఫ్రికా, భారత్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఐసీసీ మహిళా ఛాంపియన్ షిప్‌లో భాగంగా దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ఆడుతున్న భారత్ సెన్వాస్ పార్క్‌లో జరిగిన చివరి వన్డే ఆడింది. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచ్ చివరివరకు గెలుపు రెండు జట్ల మధ్య దోబూచులాడింది. చివరికి సఫారీలు ఇంకా 4 బంతులు ఉండగానే లక్ష్యాన్ని ఛేదించి సిరీస్‌లో తొలివిజయాన్ని సాధించారు. కాగా 3 సిరీస్‌లో భారత్ ఇప్పటికే రెండు గెలిచి 2-1 తేడాతో రబ్బర్ సాధించింది. ఉదయం మిథాలి సేన టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50 ఓవర్లో 240 పరుగులు చేసి ఆలౌట్ అయింది. భారత ఇన్నింగ్స్‌లో గత రెండు వన్డేల్లో రాణించిన స్మృతి మంధాన ఈసారి సున్నా పరుగులకే అవుటౌ నిరాశ పరిచింది. అయితే మరో ఓపెనర్ డిబి శర్మ రాణించింది. 76 పరుగులు చేసి భారత ఇన్నింగ్స్‌కు పునాది వేసింది. సఫారీల బౌలింగ్ ఈ మ్యాచ్‌లో చెలరేగిపోయారు. పకడ్బంధీగా బౌలింగ్ చేయడంతో భారత బ్యాట్స్‌మన్లు పరుగులు చేయటంలో కష్టపడ్డారు. భారత బ్యాట్స్‌మన్లలో వి. కృష్ణమూర్తి 56 పరుగులు(60బంతులు), హర్మీందర్ కౌర్ 25 పరుగులు, ఎస్ పాండే 31 పరుగులు చేశారు. ఒక దశలో ఇన్నింగ్స్ ప్రారంభించిన 3 బంతులకే వికెట్ కోల్పోయిన భారత్ 35 ఓవర్లు పూర్తయ్యే సరికి 140 పరుగులకు 4 వికెట్లు కోల్పోయింది. చివరి ఐదు ఓవర్లలో ఐదు వికెట్లను భారత్ వేగంగా కోల్పోయింది. నిర్ణీత 50 ఓవర్లలో భారత జట్టు 240 పరుగులు చేసి ఆటౌటయింది. సఫారీల పాస్ట్ బౌలర్ షబనమ్ ఇస్మాయిల్ నాలుగు వికెట్లు తీయగా, ట్రెయాన్, రెండు వికెట్లు, వ్యాన్ నెకెర్క్, ఎన్టోజాకె, ఖాకలు తలో వికెట్‌ను తీశారు. పూనం యాదవ్ రనౌట్ అయింది. ఎస్ పాండే 31 పరుగులు చేసి నౌటౌట్ నిలిచింది. అనంతరం 241 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన సఫారీ జట్టు ఓపెనర్లు లీ, వల్వార్ట్ జంట భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. లీ పాండే బౌలింగ్‌లో 10 పరుగులు చేసి బిస్త్ కు క్యాచిచ్చి ఔటయ్యింది. ఆమె స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన స్టెయిన్, వల్వార్ట్‌తో కలసి స్కోరును ముందుకు కదిలించారు. 15.2 ఓవర్లో దక్షిణాఫ్రికా రెండవ వికెట్‌ను కోల్పోయింది. స్టెయిన్ 30 పరుగులు చేసి పూనం యాదవ్ బౌలింగ్‌లో ఆమెకే రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఔట్ అయింది. అప్పటికి సఫారీల స్కోరు రెండు వికెట్లకు 51 పరుగులు. స్టెయిన్ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన డు ప్రీజ్ ,వల్వార్ట్‌తో కలిసి దూకుడుగా బ్యాటింగ్ చేసింది. మరో 23 ఓవర్ల వరకు వారి బ్యాటింగ్ నిరాటంకంగా కొనసాగింది. 39 ఓవర్ చివరి బంతికి వల్వార్ట్ సబ్‌స్టిట్యూట్ ఫీల్డరుకు క్యాచ్ ఇచ్చి ఔట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ నెకెర్క్ జట్టును విజయ తీరంవైపు పయనింపచేసింది. ఒక దశలో దక్షిణాఫ్రికా 40 ఓవర్లు పూర్తయ్యేసరికి మూడు వికెట్లకు 174 పరుగులు సాధించింది. ఇంకా విజయం సాధించడానికి 60 బంతుల్లో 67 పరుగులు చేయాల్సి ఉంది. ఇక్కడ నుంచి నువ్వానేనా అన్నట్లు సాగింది. నెకెర్క్, ప్రీజ్‌లు ఎక్కువ శాతం సింగిల్స్‌ను తీశారు. 40 నుంచి 49 ఓవర్ల మధ్యలో ఆరు ఫోర్లు సఫారీలు కొట్టారు. 48 ఓవర్లు పూర్తయ్యే సరికి సఫారీలు 12 బంతుల్లో 12 పరుగులు చేయాల్సి ఉంది. బిస్త్ వేసిన 49 ఓవర్లో సఫారీ బ్యాట్స్‌మన్లు 10 పరుగులు సాధించి వారి విజయాన్ని పక్కా చేసుకున్నారు. చివరి ఓవర్లో రెండు పరుగులు చేయాల్సి ఉండటంతో ప్రీజ్. నెకెర్క్ తలో పరుగు చేసి జట్టుకు విజయం సాధించి పెట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును 90 పరుగులు చేసిన మిగ్నన్ డి ప్రీజ్ అందుకుంది.

ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణకు పన్నులు అడ్డు

దుబాయ్: భారత్‌లో 2021 ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణకు పన్నులు ఆటంకం కల్గిస్తున్నాయి. ఈ క్రీడలను భారత్ నిర్వహించాల్సి ఉంది. ఈ ఈవెంట్ నిర్వహణపై ప్రభుత్వం పన్ను మినహాయింపు ఇవ్వకుంటే ఈ ఈవెంట్ నిర్వహణ ఇతర దేశాలు దక్కించుకునే అవకాశాలున్నాయి. ఐసీసీ ఇప్పటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. పన్ను మినహాయింపులో భారత ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరిపై ఐసీసీ బోర్డు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారని పేర్కొంది. అయితే భారత ప్రభుత్వంతో ఈ విషయంపై బీసీసీఐతో కలసి తమ సంప్రదింపులు కొనసాగిస్తామని ఐసీసీ ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా జరిగే ఐసీసీ ఈవెంట్లలో పన్ను మినహాయింపులు ఆయాదేశాల ప్రభుత్వాలు ప్రకటిస్తాయనిఐసీసీ తన ప్రకటనలో పేర్కొంది. గత ఏడాది బీసీసీఐ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో 2021 ఛాంపియన్స్ ట్రోఫీ, 2023 ప్రపంచ కప్‌ను నిర్వహించేందుకు తీర్మానించింది. ఛాంపియన్స్ ట్రోఫీకి పన్ను మినహాయింపు ఇవ్వకుంటే ఐసీసీ కనీసం 100 మిలియన్ డాలర్ల మేర నష్టపోతుందని అంచనా. కాగా భారత ప్రభుత్వం 2016లో నిర్వహించిన టీ 20 ప్రపంచకప్‌కు పన్ను మినహాయింపు ఇవ్వలేదు.

అఫ్ఘనిస్తాన్, ఐర్లాండ్‌కు కేటాయింపుల పెంపు

2017 జూన్‌లో ఐసీసీ పూర్తి స్థాయి సభ్యత్వం పొందిన అఫ్ఘనిస్తాన్, ఐర్లాండ్ జట్లకు సవరించిన ఆర్థిక ప్యాకేజీని ప్రకటించనున్నట్లు ఐసీసీ ప్రకటించింది. దీని ప్రకారం అంచనా వేసిన మిగులులో ఈ రెండు దేశాలకు ప్రతీ ఏడాది 40 మిలియన్ డాలర్లు ఇవ్వడం జరుగుతుంది. ఇది 8 ఏళ్ల వాణిజ్య హక్కుల ప్రక్రియలో భాగాంగా జరుగుతుంది. నేపాల్‌పై విధించిన నిషేధంపై ఐసీసీ వ్యాఖ్యానిస్తూ.. మార్చి నెలలో ఐసీసీ సాధారణ సమావేశంలో ఐసీసీ నిబంధనల సవరణ జరుగుతుందని అనంతరం నేపాల్ సభ్యత్వంపై నిర్ణయం జరుగుతుందని తెలిపింది. ఈ ప్రక్రియ అంతా మార్చి నెలాఖరు వరకు కొనసాగుతుందని తెలిపింది. జూన్‌లో జరిగే వార్షిక సమావేశంలో నేపాల్ తిరిగి ఐసీసీలో చేరుతుందని పేర్కొంది.

రాజకీయాలు మా స్నేహాన్ని నిర్వచించలేవు



సెయింట్ మార్టిజ్(స్విట్జర్లాండ్): ఇండో-పాక్ సరిహద్దుల్‌ఓ సరిహద్దుల్లో ఉద్రిక్తలు ఇరు దేశాల మధ్య క్రికెట్ ఒప్పందాలను నిలిపివేయవచ్చు. కాని భారత కెప్టెన్ విరాట్ కోహ్లీతో తనకున్న స్నేహపూర్వక సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపవని పాక్ మాజీ క్రికెటర్ షాహిద్ ఆఫ్రిది అన్నాడు. ఇక్కడ జరుగుతన్న సెయింట్ మార్టిజ్ ఐస్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న ఆఫ్రిది మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ.. 'విరాట్‌తో నాకున్న సంబంధాలను రాజకీయ పరిస్థితులు నియంత్రించవు. విరాట్ అద్భుతమైన మనిషి. భారత దేశానికి క్రికెట్ అంబాసిడర్‌గా విరాట్ ఉన్నట్లే నేనుకూడా నాదేశానికి అంబాసిడర్‌గా ఉన్నాను' అని ఆఫ్రిది అన్నాడు. కోహ్లీ అన్నివేళలా తనకు గౌరవం ఇచ్చాడని.. షాహిద్ ఆఫ్రిది ఫౌండేషన్‌కు తన సంతకంతో ఒక జెర్సీని ఇచ్చాడని తెలిపాడు. షాహిద్ ఆఫ్రిది ఫౌండేషన్ పాకిస్తాన్‌లోని బలహీన వర్గాలకు శుభ్రమైన, తాగునీటిని సరఫరా చేసే ఒక స్వచ్ఛంద సంస్థ. విరాట్‌తో కలసి మాట్లాడే అవకాశం ఎక్కువ మార్లు దొరకనప్పటికి. సమయాను సారం పరస్పరం సందేశాలను పంచుకుంటామని ఆఫ్రిది తెలిపారు. ఇటీవల విరాట్ వివాహం సందర్భంగా తాను శుభాకాంక్షలు తెలిపానని ఆఫ్రిది చెప్పాడు.

ఫెడరేషన్ కప్ గ్రూప్‌లో భారత్ స్థానం పదిలం



న్యూఢిల్లీ: ఫెడరేషన్ కప్ టోర్నీలో భాగంగా ఆసియా/ఓసియానా గ్రూప్ 1లో జరిగిన ప్లే ఆఫ్ మ్యాచుల్లో అంకిత రైణా, కర్మన్ కౌర్‌లు చైనాకు చెందిన తమ ప్రత్యర్థులపై విజయం సాధించి గ్రూప్-1లో తమ స్థానాలను నిలుపుకున్నారు. శనివారం జరిగిన మ్యాచ్‌లో కర్మన్ కౌర్ థాండి చైనీస్ క్రీడాకారిణి లీ పెయ్ చిపై 7-6(4), 6-3 తేడాతో ఓడించింది. భారత్‌కు 1-0 ఆధిక్యం సంపాధించిపెట్టింది. మరో మ్యాచ్‌లో ప్రపంచ నంబర్ 224 అంకిత, ప్రపంచ నంబర్ ర్యాంక్ 377 క్రీడాకారిణి చెయ్ యుహ్ సుపై 6-4, 5-7, 6-1 తేడాతో విజయం సాధించింది. కాగా, జపాన్, కజకిస్తాన్ క్రీడాకారులపై 2-1 తేడాతో విజయం సాధించి ప్రపంచకప్ ప్లే ఆప్‌కు అర్హత సాధించింది. ఇరు జట్లు వాటి పూల్స్‌లో విజేతలుగా నిలిచాయి. అంకిత తాను ఆడిన 4 మ్యాచుల్లో విజేతగా నిలిచి తన టెన్నిస్ కెరియర్‌లో అత్యుత్తమ ప్రతిభను నమోదు చేసుకుంది. ఎడమ చేతి వాటమైన తన ప్రత్యర్థి చెయ్ యుహ్ సును ఎదుర్కొనేందుకు అంకిత తన వ్యూహాన్ని మార్చింది. ప్రారంభం సెట్‌లో అంకిత నిలదొక్కుకోవడానికి కొంత సమయం పట్టింది. టోర్నీలో తొలిసారిగా ఆమె 0-2 తేడాతో వెనుకబడ్డప్పటికి, అనంతరం పుంజుకుని 3-2 లీడ్ సంపాదించి మరింత ముందుకు దూసుకెళ్లింది. ఎట్టకేలకు యుహ్ సుపై తొలి సెట్‌లో 6-4 తేడాతో విజయం సాధించింది. రెండో సెట్లో ఇరువురి మధ్య పోటీ హోరా హోరీగా సాగింది. అంకిత 4 బ్రేక్ పాయింట్లు కాపాడుకున్నప్పటికి ఫలితం లేకపోయింది. చివరగా సెట్‌ను హుయ్ సుకు 5-7తో కోల్పోయింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో 6-1 తేడాతో విజయం సాధించింది. వీరి మధ్య ఆట రెండు గంటల 54 నిమిషాల పాటు సాగింది. కర్మన్ కౌర్ థాండి(284ర్యాంక్) 450 ర్యాంకు కన్నా కిందున్న లీ పెయ్ చి మధ్య జరిగిన తొలి సెట్ హోరాహోరాగా సాగింది. స్కోరు సమానమైన సమయంలో టై బ్రేకర్‌లో భారత క్రీడారిణి నెగ్గి సెట్ కైవసం చేసుకుంది. రెండో సెట్లో కౌర్‌కు తన ప్రత్యర్థినుంచి అంతగా ప్రతిఘటన ఎదురుకాలేదు 6-3 తేడాతో నెగ్గి మ్యాచ్‌ను గెలిచింది.

తైక్వాండోలో టీఎస్ జట్టు ప్రపంచ రికార్డు

- మార్చిలో 20వేల మందితో భారీ ప్రదర్శన
- తెలంగాణ బోర్డు ఛైర్మన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తైక్వాండో క్రీడల పోటీల్లో తెలంగాణ రాష్ట్రానికి మరో అరుదైన కీర్తి దక్కింది. ఈ పోటీల్లో ప్రపంచ రికార్డును సాధించి 36మందితో కూడిన జట్టు గిన్నిస్ బుక్‌లో చోటును సంపాదించుకుంది. శనివారం జరిగిన సక్సెస్ మీట్‌లో తెలంగాణ రాష్ట్ర తైక్వాండో బోర్డు అధ్యక్షుడు కె.వెంకటేశం మాట్లాడుతూ గత ఏడాది తైక్వాండో పోటీల్లో గంట వ్యవధిలో 49మంది 58వేల కిక్స్‌తో గిన్నిస్ బుక్ రికార్డును నెలకొల్పగా ఈ సారి తెలంగాణ రాష్ట్ర తైక్వాండో జట్టు 36మందితోనే గంట వ్యవధిలో 89400కిక్స్ ఇచ్చి గత రికార్డులను బ్రేక్ చేయటమే కాకుండా సరికొత్త రికార్డు సాధించారన్నారు. తెలంగాణ రాష్ట్రం గర్వపడేలా సాధించిన ఈ ఘనత వెనుక తైక్వాండో బోర్డు కార్యదర్శి , కోచ్ ఎంఆర్ బొబ్బిలి కృషి ఎంతగానో ఉందన్నారు. ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్ది బంగారు పతకాలను సాదించిపెట్టడంతో పాటు రాష్ట్రతైక్వాండో పేరు నిలిపిన బొబ్బిలి తెలంగాణ అంతటా తైక్వాండో క్రీడాకారులను తయారు చేయాలని కోరారు. వచ్చేనెల గచ్చిబౌలి స్టేడియం కేంద్రగా 20 వేలమంది క్రీడాకారులతో తైక్వాండో ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ఈకార్యక్రమంలో తైక్వాండో లో శిక్షణ పొందిన టాలీవుడ్, బాలీవుడ్ నటులు కూడా పాల్గొంటారన్నారు.

ఏటీపీ చాలెంజర్ టోర్నీలో విష్ణువర్ధన్ ముందంజ



చెన్నై: స్థానికంగా జరుగుతున్న చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నీలో ఒలింపియన్ విష్ణువర్ధన్ సహా ఐదుగురు ఆటగాళ్లు ఫైనల్ క్వాలిఫైయింగ్ రౌండ్‌కు అర్హత సాధించారు. నాల్గో సీడ్ విష్ణు వర్ధన్ (ప్రస్తుతం 152 ర్యాంకు) రామక్రిష్ణన్ రంగరాజుపై 6-3, 6-0 తేడాతో విజయం సాధించాడు. తర్వాత మెయిన్ డ్రాలో ఐదో సీడ్ సిద్ధార్ధ రావత్‌తో ఆడనున్నాడు. రావత్ తన సహచరుడు షాబాజ్ ఖాన్(ఇండియా) ను ఓడించాడు. అంతగా ప్రాచుర్యం పొందని స్థానిక ఆటగాడు అభినవ్ సంజీవ్ షన్ముగం అమెరికన్ క్రీడాకారుడు టెలర్ హోచ్‌వాల్ట్‌ను ఓడించి అనంతరం ఎనిమిదో సీడ్ ఆటగాడు సయీద్ ఆర్యన్ గోవియాస్‌ను 7-6, 4-1(గోవియాస్ మధ్యలోనే విరమించుకున్నాడు) తేడాతో ఓడించాడు. తర్వాత రౌండ్లో షన్ముగం సెర్బియాకు చెందిన నికోలా కాసిక్‌ను ఢీకొంటాడు. క్వాలిఫైయింగ్‌లో టాప్ సీడ్ వైషయా ట్రోంగచారో ఎన్ చాయకుల్(థాయ్‌లాండ్) స్థానిక ఆటగాడు గోకుల్ సురేష్‌ను 6-2, 6-4 తేడాతో ఓడించాడు.ఏడోసీడ్ హాడిన్ సలీం బావా జాతీయ ఛాంపియన్ దల్వీందర్ సింగ్‌ను 6-0, 7-6(5)తేడాతో ఓడించాడు. మెయిన్ డ్రాలో రెండో సీడెడ్ యుకి బంబారితో సహా ఇతర భారత క్రీడాకారులు సుమిత్ నాగల్, ప్రజనెష్ గుణేస్వరణ్, సాకేత్ మైనేని, శశికుమార్ ముకుంద్ ఇంకా ప్రాక్టీసు చేస్తూ మ్యాచ్‌లకు సన్నద్ధమవుతున్నారు.

వింటర్ ఒలింపిక్స్ 34 స్థానంలో కేశవన్



ప్యోంగ్‌చాంగ్: శీతాకాల ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారుడు కేశవన్ ల్యూజ్ క్రీడలో రెండు రౌండ్లు పూర్తయ్యే సరికి 34వ స్థానంలో నిలిచాడు. శనివారం జరిగిన పురుషుల ల్యూజ్ క్రీడలో పాల్గొన్న కేశవన్ తొలి హీట్‌లో 36వ స్థానం పొందగా, రెండవ హీట్‌లో 31వ స్థానంలో నిలిచాడు. ఓవరాల్‌గా చూస్తే 34వ స్థానం పొందాడు. నేడు జరుగనున్న రెండు హీట్లలో విజేతలు ఎవరో తెలియనున్నది. కేశవన్ తన కెరియర్‌లో పాల్గొంటున్న చివరి ఒలింపిక్స్ ఇవే. గతంలో ఐదుసార్లు వింటర్ ఒలింపిక్స్‌ల్లో పాల్గొన్నాడు. 36 ఏళ్ల కేశవన్ తొలి రౌండ్ పూర్తయ్యే సరికి 1,344 మీటర్ల ట్రాక్‌ను 50.578 సెకండ్లలో పూర్తి చేశాడు. రెండో హీట్‌లో కొంచెం మెరుగుపడి 48.690 సెకండ్లలో పూర్తి చేశాడు. స్టాండ్లలో కేశవన్ మద్దతుదారులు, కుటుంబ సభ్యులు భారత జెండాను పట్టుకొని హర్షధ్వానాలు చేస్తూ ప్రోత్సహించారు. అయినప్పటికి కేశవన్ నిరాశపర్చాడు. నేడు జరుగనున్న మరో రెండు హీట్లలో కేశవన్ మెరుగైన ప్రతిభను ప్రదర్శించాలని భారత అభిమానులు కోరుకుంటున్నారు. 2006లో ఇటలీలో జరిగిన టురిన్ శీతాకాల ఒలింపిక్స్‌లో కేశవన్ 25స్థానం పొందాడు. కాగా శీతాకాల ఒలింపిక్స్ పోటీల్లో వరుసగా రెండు స్వర్ణపతకాలు సాధించిన జర్మనీ ల్యూజర్ ఫెలిక్స్ లాచ్ మూడో స్వర్ణం సాధించే దిశలో సాగుతున్నాడు. రెండు హీట్ల తర్వాత ఫెలిక్స్(1:35.299) తన సమీప ప్రత్యర్థి ఆస్ట్రియాకు చెందిన డేవిడ్ గ్లేయిర్స్‌చెర్‌పై 0.188 లీడ్‌ను సాధించాడు. తొలి హీట్ తర్వాత ఫెలిక్స్ 47.674 సెకండ్లతో రెండో స్థానంలో నిలువగా, రెండో రౌండ్ తర్వాత 47.625 సెకండ్లతో మొదటి స్థానంలోకి దూసుకొచ్చాడు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/1 Koneint Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23555683. Editor: Y.S.R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively Interaction For Ever
లైఫ్
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
I
ఆదివారం 11 ఫిబ్రవరి 2018



ఘట్టమనేని..ఈ పేరుకు తెలుగు చిత్ర పరిశ్రమలో ఓ చరిత్ర ఉంది. తెలుగు తెర అభివృద్ధిలో సుదీర్ఘ ప్రయాణం చేసిన సూపర్ స్టార్ కృష్ణ ఇంటిపేరది. ఆ పేరు నిలబెట్టాలని, ఘనతను కొనసాగించాలని ఆయన వారసులు అనుకోవడం సహజం. నిర్మాతగా, నటిగా, ప్రస్తుతం దర్శకురాలిగా అలాంటి ప్రయత్నమే చేస్తున్నారు మంజుల ఘట్టమనేని. జాతీయ పురస్కారం పొందిన షో చిత్రంతో నటిగా పరిచయమైన మంజుల...ఆ తర్వాత నాని, పోకిరీ చిత్రాలతో నిర్మాతగా విజయపథంలో నడిచారు. తాజాగా 'మనసుకు నచ్చింది' చిత్రంతో దర్శకత్వ బాధ్యతలూ చేపట్టారు. మంజుల సాగిస్తున్న ఈ ప్రయాణంలోని విశేషాలు ఆంధ్రప్రభ లైఫ్ పాఠకులకోసం

పవన్‌తో సినిమా చేయాలని వుంది!

- మంజుల ఘట్టమనేని

సినిమాలపై ఆసక్తి....

చిన్నప్పటి నుంచి సినిమా అంటే ఇష్టం. సెలవుల్లో నాన్న సినిమాల చిత్రీకరణలు జరిగే ప్రదేశాలకు వెళ్లేదాన్ని. షూటింగ్‌లు ఎలా జరుగుతున్నాయో చూడటం చాలా ఆసక్తికరంగా అనిపించేది. ముఖ్యంగా దర్శకత్వంపై ప్రేమ మొదలైంది. దర్శకురాలిగా మారాలని అప్పుడే నిర్ణయించుకున్నా. అయితే అదంత సులువు కాదని తెలుసు. కథలో అన్ని రకాల భావోద్వేగాలను చూపించి ప్రేక్షకులను మెప్పించడం చాలా కొద్దిమంది దర్శకులు మాత్రమే చేయగలరు. నేనూ అలా మెప్పించే సామర్థ్యం పొందిన రోజునే దర్శకత్వం చేయాలనుకున్నాను. అప్పటికి నాది చిన్న వయసు. జీవితాన్ని చూసింది తక్కువే. అయితే దర్శకురాలిగా మారేందుకు వయసు నిబంధనలు ఏవీ ఉండవు. అందుకే బాగా నేర్చుకున్న తర్వాత... సినిమాలు తెరకెక్కించాలని భావించాను.

చదివి నేర్చుకోవాలనుకున్నా....

సాంకేతికంగా సినిమా గురించి అవగాహన తెచ్చుకునేందుకు పూణె ఇనిస్టిట్యూట్‌లో చేరాలని ప్రయత్నించాను. మూడు సార్లు ప్రవేశం దొరకలేదు. నాన్న పలుకుబడి ఉపయోగించడం నాకు ఎప్పుడూ ఇష్టముండదు. ఏదైనా మనకు మనమే కష్టపడి సాధించాలని అనుకుంటాను. ఆ తర్వాత దర్శకత్వ శాఖ గురించి నేర్చుకునేందుకు విదేశాలకు వెళ్లాలనుకున్నాను. అయితే సినిమా తీయడంలో వాళ్ల దృక్పథాలు, మనకూ చాలా తేడా ఉంది. మనం మన జీవితాలనే తెరపై చూపించాలనుకుంటాం. వాళ్లు ఫాంటసీకి వెళ్తారు, సాంకేతికంగా ప్రయోగాలు చేస్తారు. దాంతో....విదేశాలకు వెళ్లే ఆలోచనే మానుకున్నాను..

నాన్నకు చెబితే...

అనుభవం తెచ్చుకున్నాకే దర్శకత్వం చేయాలనుకున్న ఆలోచనతో... ఇక నా మనసు నటనపైకి మళ్లింది. ఎలాగైనా పరిశ్రమలో ఉండాలని అనుకున్నాను. ఈ విషయం నాన్నకు చెబితే...నటన అంత సులువు కాదు చాలా కష్టపడాలి అని చెప్పి వద్దన్నారు. రెండోసారి అడిగినా... అలాగే చెప్పి పంపారు. అలా జగపతిబాబు, బాలకృష్ణలతో చేయాల్సిన సినిమాలు వద్దనుకున్నా. ఒక రోజు దర్శకుడు నీలకంఠ షో కథను తీసుకొచ్చి చెప్పారు. రెండు పాత్రల మధ్యే సినిమా అంతా సాగుతుంది. ఆ కథలో సాధారణ చిత్రంలో ఉండే వాణిజ్యఅంశాలు లేవు. సహజంగా ఉంది. ఈ కథను నాన్నకు చెప్పి షో లో నటిస్తానని చెప్పాను. అందుకు నాన్న అంగీకరించారు. అలా షో చిత్రం మొదలైంది. జాతీయ స్థాయిలో ఉత్తమ కథనానికి పురస్కారం అందుకుంది..

ఒక అపజయం, మరొక విజయం..

నటిగా మారిన తర్వాత మహేష్ బాబు కథానాయకుడిగా చిత్ర నిర్మాణంలో అడుగుపెట్టాను. నేనూ నా భర్త సంజయ్ స్వరూప్ కలిసి ఇందిరా ప్రొడక్షన్స్ సంస్థలో నాని చిత్రాన్ని నిర్మించాం. ఈ సినిమా నిర్మాణ రంగంలోని ఇబ్బందులు ఎలా ఉంటాయో చూపించింది. మంచి వినోదం, అమ్మ సెంటిమెంట్, ఆకట్టుకునే ఆడియో ఇవన్నీ ఉన్నా...నాని ఎందుకో ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఈ సినిమా అపజయం నన్ను మానసికంగా కుంగదీసింది. చాలా బాధపడ్డాను. అయితే తొలినాళ్లలోనే ఇలాంటి ఫ్లాప్ రావడం నాకు మంచి అనుభవాన్ని నేర్పించింది. స్టార్ హీరోతో సినిమా చేయడం అంత సులువు కాదనే విషయాన్ని తెలియజేసింది. ఇలాంటి పరిస్థితుల్లోనూ నేను స్థిరంగా నిలబడ్డాను. జరిగింది మంచికే అనుకుని స్థిమితపడ్డాను. మా సంస్థలో నిర్మించిన రెండో సినిమా పోకిరీ ఘన విజయాన్ని



అందుకుని...నాని ఫలితాన్ని మర్చిపోయేలా చేసింది. ఈ సినిమా కథ చెప్పిన పూరీ జగన్నాథ్...ఈ సినిమా అద్భుత విజయాన్ని సాధిస్తుంది అని భరోసా ఇచ్చారు. అయితే అంత పెద్ద ఫలితాన్ని నేను ఊహించలేకపోయాను. పోకిరీ విజయంతో ఒక ఫ్లాప్, ఒక హిట్‌తో నిర్మాతగా నా కెరీర్ సమతూకం అయ్యింది...

దర్శకురాలే ఎక్కువ మెప్పించగలదు...

దర్శకురాలు అవ్వాలనే నా కల 'మనసుకు నచ్చింది' చిత్రంతో తీరుతోంది. ఎన్నో సినిమాలు, ఎంతోమంది నిర్మాతలు దర్శకులను నేను చూశాను. పరిశ్రమలో స్థిరపడిన కుటుంబంలో పుట్టాను. ఏదో ఒక సినిమా చేయాలనే ఆలోచనతో ఈ చిత్రాన్ని రూపొందించలేదు. కథలో మంచి విషయం ఉండబట్టే దర్శకురాలిగా బాధ్యతలు



తీసుకున్నాను. పేరుకోసం సినిమాలు చేయాల్సిన అవసరం నాకు లేదు. ఇది చాలా చాలా మంచి చిత్రం. తెరపైకి వచ్చాక ఎందుకు ఇలా చెబుతున్నానో అర్థమవుతుంది. హృదయం ఉన్న ప్రతి ఒక్కరికీ నచ్చే సినిమా అవుతుంది. మా ఆయన సంజయ్, పాప జాన్వి ప్రత్యేక పాత్రల్లో



నటించారు. నాకు ప్రేమ కథలు అంటే ఇష్టం. పురుషుల కంటే మహిళలు ఎక్కువ భావోద్వేగాలను కలిగి ఉంటారు. వాటన్నింటినీ తెరపైకి తీసుకు రాగలిగితే ప్రేక్షకులను మరింత మెప్పించవచ్చు. ఇలా చూస్తే దర్శకుల కంటే దర్శకురాళ్లే ఎక్కువ విజయాలు సాధిస్తారు. అయితే మన దగ్గర మహిళా దర్శకులు చాలా తక్కువ.

కుటుంబమే నాకు గొప్ప బలం...

మహిళ ఏది సాధించాలన్నా, ఏ రంగంలో రాణించాలన్నా కుటుంబ సహకారం అవసరం. ముఖ్యంగా సినిమా పరిశ్రమలో ఎక్కువ సమయం చిత్రీకరణలో ఉండాల్సి వస్తుంది. ఈ విషయంలో అర్థం చేసుకునే భర్త ఉండాలి. నా భర్త సంజయ్ స్వరూప్ ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకుంటారు. నన్ను ప్రోత్సహిస్తారు. దర్శకురాలు కావాలనే నా కల ఆయన ప్రోత్సాహం లేకుంటే నెరవేరేది కాదు. మా సొంత ప్రొడక్షన్స్ పనుల్లో మేమిద్దరం చెరో బాధ్యత తీసుకుంటాం. ఒకరి బాధ్యతల్లో మరొకరం కలగజేసుకోము.

అప్పుడు మహేష్‌కు కథ చెబుతా...

నేను దర్శకురాలిని అవుతున్నానంటే మహేష్‌బాబు నమ్మలేదు. అయితే మనసుకు నచ్చింది టీజర్స్, ట్రైలర్స్ చూసి బాగున్నాయని చెప్పాడు. ఒక మంచి హిట్ సినిమా చేశాక...అప్పుడు కథ తీసుకెళ్లి మహేష్‌కు చెబుతాను.

ఇద్దరిలో ఎవరు గొప్పంటే...

మహేష్‌బాబు, కృష్ణ... నటనలో ఇద్దరినీ పోల్చలేం. నాన్న తెరపై గొప్పగా ఉండేవారు. ఆయన సాధించిన ఘనతను మహేష్ కొనసాగిస్తున్నారు. మహేష్ అత్యంత సహజంగా నటిస్తారు.


పవన్‌తో సినిమా చేయాలని ఉంది...

పవన్ కళ్యాణ్ నిజాయితీ గల వ్యక్తి. ఆయన వ్యక్తిత్వం అద్భుతం. పవన్‌కు సరిపోయే ఓ మంచి కథ నా దగ్గరుంది. ఆ కథ వింటే పవన్ తప్పకుండా నటిస్తారు. ఈ ఒక్క సినిమా చేశాక పవన్ రాజకీయాల్లోకి వెళ్లిపోవచ్చు.

✍ రమేష్ గోపిశెట్టి











ఒంటరితనం... మధుమేహంతో జోడీ కడుతుంది!

మధుమేహం రావడానికి వైద్య పరిశోధకులు ఇప్పటివరకు రకరకాల కారణాలు చెబుతున్నారు. వాటి వరుసలో మరొకటి వచ్చి చేరింది. అది ఒంటరితనం. నలుగురితో కలవటం ఇష్టంలేనివారికి ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడేవారికి టైప్ టు డయాబెటిస్ వచ్చే అవకాశాలు ఎక్కువని బిఎమ్‌సి పబ్లిక్ హెల్త్ అనే పత్రిక ప్రచురించింది. చాలా విస్తృతంగా నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం...సామాజిక సంస్థలు, క్లబ్బులు లాంటివాటికి దూరంగా ఉండే మహిళల్లో టైప్ టు డయాబెటిస్ వచ్చే అవకాశాలు 112శాతం ఎక్కువగా ఉన్నట్టుగా ఈ పత్రిక ప్రచురించింది. ఇదే పరిస్థితిలో మగవారు ఉంటే..మధుమేహం వచ్చే అవకాశం 42 శాతం పెరుగుతుందట.

ఇక మగవారు పూర్తిగా ఒంటరిగా జీవిస్తుంటే వారికి టైప్ టు మధుమేహం వచ్చే అవకాశం 94 శాతం పెరుగుతుందని ఈ అధ్యయనం చెబుతోంది. టైప్ టు డయాబెటిస్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నవారు సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాలుపంచుకోవాలని అలాగే స్నేహితుల సంఖ్యని పెంచుకోవాలని ఈ అధ్యయన నిర్వాహకులు సలహా ఇస్తున్నారు. అయితే ఇలా ఎందుకు జరుగుతుంది... అనే విషయంలో పరిశోధకులు మరింత విస్తృతంగా పరిశోధనలు జరుపుతున్నారు.

జీడిపప్పులో... వాడి ఎంతో!

ఎన్నో అనారోగ్యాలకు రుచికరమైన ఔషధం

జీడిపప్పు అనగానే మనకు దాని రుచే గుర్తొస్తుంది కానీ...ఇది అంతకు మించిన ఆరోగ్యాన్ని ఇస్తుంది. దీనిలోని పోషకాల గురించి తెలుసుకుంటే...దీన్ని ఆహారం కాదు...రుచికరమైన ఔషధమనే అనాలనిపిస్తుంది.

-ఇందులో ట్యూమర్ కణాలపై పోరాడే శక్తి ఉన్న అంశాలు ఉన్నాయి. అలాగే జీడిపప్పులో రాగి శాతం ఎక్కువగా ఉండటం వలన క్యాన్సర్ కణాలకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ముఖ్యంగా కొలోన్ క్యాన్సర్‌ని నివారిస్తుంది.

-ఇతర నట్స్‌తో పోల్చుకుంటే ఇందులో ఫ్యాట్ తక్కువగా ఉంటుంది. వీటిలో చెడు కొలెస్ట్రాల్ లేకపోవడమే కాకుండా...యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటం వలన జీడిపప్పు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

-జీడిపప్పులో ఉన్న మెగ్నీషియం...అధిక రక్తపోటుని తగ్గిస్తుంది.

-ఇందులో ఉన్న రాగి...జుట్టుకి నల్ల రంగుని ఇవ్వటంలో కీలక పాత్ర పోషిస్తుంది. అంటే జీడిపప్పు తినేవారిలో చిన్న వయసులో జుట్టు తెల్లబడే సమస్య రాదన్నమాట.

-ఇందులో ఉన్న మెగ్నీషియం ఎముకలను శక్తిమంతగా ఉంచుతుంది. మెగ్నీషియం ఎముకలపై పొరగా ఉంటుంది. దాంతో క్యాల్షియం... నాడీ కణాల్లోకి చేరకుండా కాపలా కాస్తుంది. దీనివలన రక్తనాళాలు కండరాలు ఆరోగ్యంగా ఉంటాయి. మెగ్నీషియం తగిన మోతాదులో లేకపోతే క్యాల్షియం రక్తనాళాల్లోకి చేరి... అవి ముడుచుకుపోయేలా చేస్తుంది. దాంతో అధిక రక్తపోటు, మైగ్రేన్ తలనొప్పి లాంటి సమస్యలు వస్తాయి.



-జీడిపప్పు రోజూ తీసుకుంటూ ఉంటే గాల్ బ్లాడర్‌లో రాళ్లు ఏర్పడకుండా ఉంటాయి.

-జీడిపప్పులో ఉన్న మంచి కొలెస్ట్రాల్ బరువు తగ్గడానికి దోహదం చేస్తుంది.

-ఇందులో జీర్ణశక్తిని పెంచే శక్తి కూడా ఉంది.

-జీడిపప్పులో ఉన్న మెగ్నీషియం ఎముకలకే కాదు...పళ్లు చిగుళ్ల ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది.

-జీడిపప్పు మన శరీరం ఇనుమును సరిగ్గా వినియోగించుకునేలా చేస్తుంది. అలాగే మన ఆరోగ్యానికి హాని చేసే ఫ్రీ రాడికల్స్‌ని [illegible]

సయాటికా మోకాళ్ల నొప్పులకు ఉపశమనం...

సుప్త పాదాంగుష్ఠాసనము

యోగా టైమ్

మొదట వెల్లకిలా పడుకుని కాళ్లను నిటారుగా స్థిరంగా నేలకు ఆనేలా చాపాలి. శ్వాస తీసుకుంటూ ఎడమకాలుని నిదానంగా పైకి ఎత్తాలి. కుడికాలి మోకాలు వంగకుండా నేలపై స్థిరంగా ఉండేలా చూసుకోవాలి. కుడిచేతిని కుడి తొడమీద ఉంచాలి. ఇప్పుడు పైకి ఎత్తిన ఎడమకాలి పాదాన్ని ఎడమచేత్తో పట్టుకోవాలి. ఈ స్థితిలో తల భుజాలను నేలపై నుండి పైకెత్తి...ఎడమ మోకాలికి దగ్గరగా వచ్చేట్టుగా తీసుకురావాలి. ఇలా 20 సెకన్లపాటు ఉండాలి. శ్వాస సాధారణంగా ఉండాలి. తరువాత ఎడమకాలిని కిందికి దించి...కుడికాలుతో కూడా ఇలాగే చేయాలి. కాళ్లను మార్చుతూ నాలుగు నుండి ఎనిమిది సార్లు చేయాలి.

ప్రయోజనాలు:


-నడుముకి కాళ్లకు రక్తప్రసారం బాగా జరుగుతుంది. దాంతో నరాలు ఉత్తేజితం అవుతాయి.

-పక్షవాతం, సయాటికా, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నవారికి ఈ ఆసనంతో ఉపశమనం కలుగుతుంది.

-హెర్నియా ఏర్పడకుండా నిరోధిస్తుంది.


స్త్రీ పురుషులిరువురు ఈ ఆసనాన్ని సాధన చేయవచ్చు.

- మోడల్ యోగాట్రైనర్ గాయత్రి





చీకటిని ఆస్వాదిద్దాం



ఈ ధరణిపైన ప్రతిమతం, ప్రతి సంస్కృతి భగవంతుని సర్వాంతర్యామి తత్త్వం గురించి చెబుతుంటాయి. మనం చూసినప్పుడు వాస్తవంగా వ్యాపించి వున్నదంతా ఒక్కటే. ఏదైతే అంతటా వుందో అది కేవలం చీకటి...శూన్యం. సాధారణంగా లౌకిక శ్రేయస్సు కోరేటప్పుడు మనం దైవాన్ని వెలుగుగా భావిస్తాం. లౌకిక శ్రేయస్సు కాకుండా, ఎప్పుడైతే మన జీవిత పరమావధి విలీనం కావడం, ఆరాధన, సాధనల లక్ష్యం లీనమైపోవడమవుతుందో అప్పుడు దైవాన్ని చీకటితో అభివర్ణిస్తాం.

సద్గురుబోధ



మహాశివరాత్రి ఒక పగలు కాదు. ఎన్నో అవకాశాలు కలిగించే రాత్రి. ప్రతినెలా అమావాస్యముందు వచ్చే పద్నాలుగవ రోజు శివరాత్రి అని అందరికీ తెలుసు. నెలలో ఇది అత్యంత చీకటైన రాత్రి. శివరాత్రిని ప్రతినెలా జరుపుకోవడం, ప్రత్యేకంగా మహాశివరాత్రిని జరుపుకోవడం, చీకటిని పండుగలా జరుపుకోవడమన్నమాట. తార్కిక ఆలోచనలు గల వారెవరైనా చీకటిని నిరోధిస్తారు. సహజంగా వెలుగును ఆహ్వానిస్తారు. కానీ, 'శివ' అంటే యదార్థంగా చెప్పాలంటే ''ఏదైతే లేదో''. ''ఏదైతే వుందో'' అది ఉనికి... సృష్టి. ''ఏదైతే లేదో'' అది శివ.

ఏదైతే లేదో- అంటే మీరు కళ్లు తెరిచి చుట్టూ చూసినప్పుడు, మీ దృష్టి చిన్న విషయాలపై పడుతుంది. మీకు సృష్టించబడినవి అనేకం కనిపిస్తాయి. మీ దృష్టి నిజంగా పెద్ద విషయాల మీద పడినట్లయితే ఉనికిలో అతి విస్తృతమైన విషయం మహాశూన్యం. కొన్ని చుక్కల్లాగా మనకు పాలపుంతలు కనిపిస్తాయి. కానీ, ఏ మహాశూన్యమైతే వీటన్నింటినీ ఇముడ్చుకుందో అది ఎవరి ధ్యాసలోకీ రాదు. ఈ విశాలమైన మహాశూన్యమే 'శివ'. నేడు ఆధునిక విజ్ఞానం నిరూపించేదేమిటంటే, శూన్యం నుంచే సమస్తం వస్తుందని...మళ్లీ శూన్యంలోకే వెడుతుందని. ఈ సందర్భంగానే 'శివ', ఈ మహాశూన్యాన్ని మహాదేవుడిగా అభివర్ణిస్తాం. ఈ ధరణిపైన ప్రతిమతం, ప్రతి సంస్కృతి భగవంతుని సర్వాంతర్యామి తత్త్వం గురించి చెబుతుంటాయి. మనం చూసినప్పుడు వాస్తవంగా వ్యాపించి వున్నదంతా ఒక్కటే. ఏదైతే అంతటా వుందో అది కేవలం చీకటి...శూన్యం. సాధారణంగా లౌకిక శ్రేయస్సు కోరేటప్పుడు మనం దైవాన్ని వెలుగుగా భావిస్తాం. లౌకిక శ్రేయస్సు కాకుండా, ఎప్పుడైతే మన జీవిత పరమావధి విలీనం కావడం, ఆరాధన, సాధనల లక్ష్యం లీనమై పోవడ మవుతుందో అప్పుడు దైవాన్ని చీకటితో అభివర్ణిస్తాం.


వెలుగు మనసులో జరిగే క్షణికమైన ఘటన. వెలుగు శాశ్వతం కాదు. అది పరిమితమైన సంభావ్యత. ఎందుకంటే అది జరుగుతుంది. ముగుస్తుంది. ఈ భూమిపై వెలుగుకు ఆధారం సూర్యుడు. కానీ ఆ వెలుతురును కూడా మీరు చేత్తో ఆపి, చీకటితో కూడిన నీడను ఏర్పరచవచ్చు. చీకటి అంతటా వ్యాపించి వుంది. సర్వత్రా వుంది. ప్రపంచంలో పరిణతిలేనివారు చీకటి ని దయ్యంతో పోలుస్తారు. ఎప్పుడైతే మీరు దైవాన్ని 'సర్వాంతర్యామి'గా ప్రస్తావిస్తున్నారో, అప్పుడు మీరు దైవాన్ని 'చీకటి'గా సూచిస్తున్నారన్న మాట. ఎందు కంటే చీకటి ఒక్కటే సర్వవ్యాప్తమైనది. ఇది అంతటా వుంది. దీనికి ఏ విధమైన ఆసరా అవసరం లేదు. వెలుగుకు ఎప్పుడూ ఒక ఆధారముంటుంది. అది తనం తట తాను కాలి వెలుగు నిస్తూ క్షీణిస్తుంది. దీనికి ఆది, అంతమూ వున్నాయి. దీని ఆధారం ఎప్పుడూ పరిమితం. చీకటికి ఆధారం లేదు. దానికి అదే ఆధారం. ఇది సర్వవ్యాప్తమైనది. అంతటా వుంది. సర్వాంతర్యామి. ఎప్పుడైతే శివ అంటామో అది ఉనికిలోని మహాశూన్యం. ఈ మహాశూన్యం ఒడిలో సృష్టి సంభవించింది. ఆ శూన్యం ఒడినే మనం 'శివ' అని అభివర్ణిస్తాం. మన భారతీయ సంస్కృతిలో ప్రాచీన ప్రార్థనలన్నీ మనల్ని మనం కాపాడుకోవడం, రక్షించుకోవడం, పురోగతి సాధించడం గురించి కాదు. ప్రాచీన ప్రార్థనలన్నీ ''ఓ ఈశ్వరా, నేను నీలా అవటానికి నన్ను నాశ(న)ం చేయి'' అని. మనం శివరాత్రి అనగానే, నెలలో అత్యంత చీకటైన రాత్రి. మన పరిమితుల్ని విలీనం చేసే అవకాశం, ఎల్లలు లేని సృష్టిమూలం ఏదైతే ప్రతి మనిషిలోనూ బీజమై వుంటుందో దాన్ని అనుభవించే అవకాశం ఇది. మహాశివరాత్రి ఒక తరుణం. ఒక అవకాశం, ప్రతి మనిషిలోను వుండే ఆ మహాశూన్యాన్ని అనుభవించేందుకు. అదే శూన్యం...సృష్టికి ఆధారం. శివుడు ఒకవైపు వినాశకారుడు. మరోవైపు కరుణామయుడు. ఆయన గొప్ప వరాలిచ్చేవాడు. యోగుల కథలలో పలుమార్లు శివుడు దయామయుడుగా చెప్పబడ్డాడు. ఆయన పలువిధాల కురిపించిన కరుణ నమ్మశక్యంగాని విధంగాను, ఆశ్చర్యం గొలిపేలాగాను ఉంటుంది.

మహాశివరాత్రి, స్వీకరించేందుకు కూడా ఒక ప్రత్యేకమైన రాత్రి. ఇది మా కోరిక. దీవెన. ఈ రాత్రి మీరు మహాశూన్యాన్ని అంటే ''శివుణ్ని'' క్షణం పాటైనా అనుభూతి పొందకుండా ఈ రాత్రి గడవకూడదని. ఈ రాత్రి జాగరణలో గడవడమే కాదు, ఈ రాత్రి మిమ్మల్ని మేలుకొలిపే రాత్రి కావాలి.

- సద్గురు జగ్గీవాసుదేవ్

విశ్వామిత్రునికి బ్రహ్మర్షిత్వం

సంక్షిప్త రామాయణం



విశ్వామిత్రుడు కఠోర దీక్షపూని మరల తపస్సు ప్రారంభించాడు. కేవలం గాలిని మాత్రమే ఆహారంగా గ్రహిస్తూ, ఊర్ధ్వబాహుడై ఎండాకాలంలో పంచాగ్ని మధ్యంలో, వర్షాకాలంలో శరీరంపై ఆచ్ఛాదన లేకుండా, చలికాలంలో నీళ్లలో నిలచి, రాత్రింబవళ్లు ఘోర తపస్సు చేశాడు. విశ్వామిత్రుని ఘోర తపస్సు చూసి ఇంద్రుడు చలించిపోయాడు. తపోభంగం చేయమని రంభను ఆజ్ఞాపించాడు. విశ్వామిత్రుని మోహ పరవశుని చేయమన్నాడు. ఆ మాట వినగానే రంభ విశ్వా మిత్రుని కోపాన్ని తలచుకుని వణికిపోయింది. వెనుకంజ వేసింది. అయితే 'నీకు తోడుగా మన్మథుడు వస్తాడు. నేను కోకిల రూపంలో సాయపడ తాను' అని ఇంద్రుడు ప్రోత్సహిం చాడు. మన్మథునికి వసంతుడు తోడయ్యాడు. రంభ ఆకర్షణీయంగా అలం కరించుకుని వచ్చింది. చిరు నవ్వులతో, నయగారాలతో, విశ్వామిత్రుని ఆకర్షించడానికి విశ్వ ప్రయత్నం చేసింది. పూల వాసనలు, కోకిలల కుహుకుహు రావాలు తోడయ్యాయి. రంభ కోకిలతో పోటీపడి పాడి, ముగ్ధ మనోహరంగా నాట్యం చేసింది.

రంభ చేష్టలను చూసి, అది ఇంద్రుని పన్నాగమే అని విశ్వా మిత్రుడు గ్రహిం చాడు. పదివేల సంవత్సరాలు రాయివై పడి ఉంటావు అని రంభను శపించాడు. వెంటనే పశ్చాత్తప్తుడై వసి ష్ఠుడు నీకు శాప విముక్తి ప్రసాదిస్తాడు అని అనుగ్రహించాడు. తోడుగా వచ్చిన మన్మథుడు, కోకిల రూపంలో ఉన్న ఇంద్రుడు గుట్టు చప్పుడు కాకుండా జారుకున్నారు. ఎంత ప్రయత్నించినా క్రోధాన్ని జయిం పలేకున్నానే అని విశ్వా మిత్రుడు చింతించాడు.

విశ్వామిత్రుడు తూర్పు దిశకు వెళ్లాడు. వాయు వును నిరోధించి, నిరాహారుడై శరీరాన్ని శుష్కింపజేసుకుంటూ వేయి సంవత్సరాలు కఠోర తపస్సు చేశాడు. అతని శరీరం శుష్కించి కట్టె వలె అయిపోయింది. క్రోధానికి లోబడకుండ దృఢదీక్షపూని తపస్సు చేసి పారణ చేయడానికి సిద్ధపడ్డాడు. ఇంద్రుడు కపట బ్రాహ్మణుడై వచ్చి అన్నాన్ని యాచించాడు. మౌన వ్రతాన్ని వీడకుండానే బ్రాహ్మణునికి అన్నాన్ని సమర్పించాడు. ఇంద్రుడు అన్నాన్ని పూర్తిగా తిన్నాడు. దీనితో విశ్వామిత్రుడు వ్రత నియమాన్ని అనుసరించి పారణ చేయలేకపోయాడు. నియమాన్ని పాటించనందున వెయ్యేళ్ళ తపస్సు వ్యర్థమయింది. అయితే అతనిలో క్రోధం పొడసూపలేదు. నిశ్చింతుడై, ఏకాగ్రచిత్తుడై, ప్రాణ నిరోధం చేసి తపస్సు చేశాడు. ప్రాణ నిరోధం వల్ల అతని శిరస్సు నుంచి వెలువడిన అగ్నికి ముల్లోకాలూ తపించాయి. దేవతలు బ్రహ్మ వద్దకు వెళ్ళి విశ్వామిత్రుని స్థిర చిత్తాన్ని, దృఢసంకల్పాన్ని, కార్యదీక్షను తెలిపారు. బ్రహ్మ ప్రత్యక్షమై 'నీవు బ్రహ్మర్షివి అయ్యావు' అన్నాడు. విశ్వామిత్రుడు సంతోషించాడు. 'వసిష్ఠుడు వచ్చి నన్ను బ్రహ్మర్షీ అని సంబోధించాలి' అన్నాడు. దేవతల తలంపు తెలుసుకుని వసిష్ఠుడు ప్రత్యక్షమయ్యాడు. 'బ్రహ్మర్షీ' అని విశ్వామిత్రుని సంబోధించాడు. అభినందించాడు. విశ్వా మిత్రుడు సంతోషించి వసి ష్ఠుని పూజించాడు. విశ్వా మిత్రుడు బ్రహ్మర్షి అనిపించుకోవడానికి ఎన్ని అవరోధాలు ఎదురైనా సఫల మనో రథుడు అయ్యాడు' అని శతానందుడు చెప్పాడు. సంధ్యాకాలం సమీపి స్తున్నందున అగ్నికార్యాలు తీర్చడానికి జనకుడు వారిని వీడ్కొలిపాడు. 'రేపు ఉద యమే నేను మిమ్మల్ని దర్శింపగలను' అన్నాడు. మరునాడు ఉదయం జనకుడు విశ్వా మిత్రుని విడిదికి వెళ్లి, సగౌరవంగా తోడ్కొని వచ్చాడు. నా కర్తవ్యమేమి అని అడిగాడు. రామ లక్ష్మణులు శివధనుస్సును చూడ గోరుతున్నారు. వారి ముచ్చట తీర్చమన్నాడు విశ్వామిత్రుడు.

- కె ఓబులేశు
9052847742

ధర్మం-మర్మం



పోయిన వస్తువులు లభించేందుకు మంత్రం

తప్పిపోయిన వ్యక్తులు, పోయిన వస్తువులు లభించుటకు పఠించవలసిన మంత్రము

కార్తవీర్యార్జునో నామ రాజా బాహు సహస్రవాన్।
తస్య స్మరణ మాత్రేణ గతం నష్టం చ లభ్యతే॥

మంత్ర జప విధానం

ప్రాతఃకాలమునే లేచి స్నానాదులు ముగించుకుని పరిశుద్ధమైన వస్త్రాలు ధరించి నుదుట తిలకం దిద్దుకుని పూజా మందిరంలో దీపారాధన చేసి తమ నిత్యకృత్యములైన సంధ్యా వందనాది కార్యక్రమములను ముగించుకుని నిశ్చలమైన, పరి శుద్ధమైన మనస్సుతో శక్తికి అనుగుణంగా మంత్రాన్ని జపించాలి.



- డా॥ [illegible]

భగవద్గీత



లగ్నమనస్కులకు మరణ సమయంలోనూ ఎరుక

అధ్యాయం 7

శ్లోకం 30:

సాధిభూతాధిదైవం మాం
సాధియజ్ఞం చ యే విదుః।
ప్రయాణకాలే పి చ మాం
తే విదుర్యుక్తచేతసః॥

తాత్పర్యం

నా యందు సంలగ్నమైన చిత్తము కలిగినవారు దేవదేవుడనైన నన్నే భౌతిక జగత్తును, సర్వ దేవతలను, సమస్త యజ్ఞములను నియమించువానిగా తెలిసికొని మరణ సమయంలోనూ నన్ను దేవదేవుడు అనే అవగాహనతో ఎరిగి ఉంటారు.

భాష్యం: కృష్ణ చైతన్యాన్ని పాటించే భక్తుడు కృష్ణుణ్ని అర్థం చేసుకొనటంలో ఎప్పుడూ పొరపాటు పడడు. ఈ మార్గము నుండీ వైదొలగడు.

సరైన సాధు సాంగత్యంలో అతడు దేవాదిదేవుడే ఈ భౌతిక జగత్తు, ఇందులోని వస్తువులకు, దేవతలకు అధిపతి, నియామకుడు అని గుర్తించగలుగుతాడు. ఈ విధంగా భగవంతుణ్ణి యదార్థంగా అర్థం చేసుకున్న అట్టి కృష్ణ చైతన్యవంతుడు మృత్యు సమయంలో తప్పక కృష్ణుణ్ని స్మరిస్తాడు. ఈ విధంగా అతడు సహజంగానే భగవంతుని ధామమైన గోలోక బృందావనమును చేరుకుంటాడు.

(ఏడవ అధ్యాయం సంపూర్ణం)

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

ప్రారబ్ధం



(గత సంచిక తరువాయి భాగం)

శిష్య,భక్త, ఉదాసీన, పాపాత్మాది నాల్గుతర గతులవారున్నూ వారి అనుగ్రహ రక్షితులే.

శిష్యులు గురుభావంతో సేవించి, తత్త్వమెఱిగి తరిస్తారు. భక్తులు భగవత్స్వరూపునిగ భజించి, పావనులౌతారు. ఉదాసీనులు వినగా వినగా ఉద్రేకం కలిగి భక్తులౌతారు. దుష్టులు అటూ, యిటూ వచ్చిపోయే వారి మాటల వల్ల వీరి కథాకలాపాలు చెవిసోకి, పాపవిముక్తులౌతారు. ఈ నాల్గుతరగతుల వారున్నూ జ్ఞానుల అనుగ్రహ రక్షితులే'నన్నారు భగవాన్.

''దుష్టులు, పాపవిముక్తులౌతారని సెలవిచ్చారే. ఇతరులనుకుంటే వినుట వల్లనా? వాళ్లే మాట్లాడుకుంటూనా?'' అన్నారొకరు. ''ఇతరులనుకుంటే వినుట వల్లనే. వాళ్ళసలు పాపులు గదా? సజ్జనుల మాట ఎట్లా చెప్పుకుంటారు?'' అన్నారు భగవాన్. ''పాపులకు విమోచనం కలుగుతుందన్నారే, శరీర బాధల నుంచా? మనస్సుకా?'' అన్నారు నిన్నటివారు. ''మనస్సుకేనండీ, మనస్సు సరిగా ఉంటేనే అన్ని సుఖాలున్నూ. మనస్సు సరిలేకుంటే, ఏదెట్లాగున్నా శాంతిలేదు. వారి వారి అర్హత ననుసరించి క్రమంగా మనస్సు పరిపక్వ స్థితికి వస్తుందన్న మాట. నాస్తికుడు ఆస్తికుడౌతాడు. ఆస్తికుడు భక్తుడౌతాడు. భక్తుడు జిజ్ఞాసువౌతాడు. జిజ్ఞాసువు జ్ఞాని ఔతాడు. ఈ రక్షణ మనస్సుకే చెప్పాలిగాని, శరీరానికి చెప్పి లాభమేమున్నది? తన మనస్సు సుఖంగా ఉంటే, శరీరమే గాక లోకమంతా సుఖమయంగానే ఉంటుంది. అందువల్ల, ముందు తాను సుఖంగా ఉండే మార్గం చూచుకోవాలి. తానెవరో విచారించి తెలుసుకుంటే గాని, అది తెలియదు. అది విచారించక లోకాన్ని మరమ్మతు చేయాలనటం ఉన్నదే, లోకంలో ఉన్న రాళ్లూ, ముళ్లూ ఉంటవి. తోలుతో కుట్టిన చెప్పులు కాళ్లకు తొడుక్కుంటే తీరే పనికి భూమంతా తోలుతో కప్పాలన్నట్లుంది. ఎండకు నెత్తిన గొడుగు పట్టుకుంటే పోయేదానికి, ఆకాశమంతా చాందినీ కట్టాలని యత్నిస్తే సాధ్యపడునా? తాను తన స్థితిని ఎరిగి, ఉన్నట్లుంటే, జరిగేది జరుగుతుంది. జరగనిది జరగదు. ఉన్న శక్తి ఒక్కటే. మనం దానికి భిన్నంగా ఉన్నమనుకుంటేనే ఇన్ని చిక్కులూనూ'' అన్నారు భగవాన్.

సింహస్వప్నం

18-5-47

ఈ మధ్యాహ్నం మూడుగంటలకు మళ్లీ 'ప్రారంభించారు' ప్రశ్న పరంపరలు. ''బ్రహ్మము, సచ్చిదానంద స్వరూపమంటారు గదా, భావమేమిటి?'' అన్నారొకరు. ''అవును అంటారు. అసులున్నది సత్తు ఒక్కటే. దానినే బ్రహ్మమంటారు. ఆ సత్తు యొక్క ప్రకాశమే చిత్తు, స్వభావమే అనందం. ఈ రెండూ సత్తు కన్న భిన్నం కాదు. మూడిటినీ కలిపి సచ్చిదానందమంటారు. జీవగుణాలూ అంతే. సత్త్వము, ఘోరము, జడము, ఘోరమంటే రజోగుణం, జడమంటే తమోగుణం. ఈ రెండూ సత్త్వానికి అంగాలన్నమాట. ఈ రెండూ తోసివేస్తే ఉండేది సత్త్వమొకటే. అది సత్యమైనదీ, నిత్యమైనదీ, స్వచ్ఛమైనదీను. దాన్నే ఆత్మ అను, బ్రహ్మమను, శక్తి అను, ఏదన్నా అను. అదే నీవని తెలుసుకుంటే అంతా ప్రకాశమే. అంతా ఆనందమే'' నన్నారు భగవాన్.

''తన ఆ సత్యస్థితి నెఱుగ నెంచు సాధకునకు శ్రవణ, మనన, నిదిధ్యాసాదులు కడవరకు ముఖ్యావశ్యకములంటారు గదా పెద్దలు?'' అన్నారా పృచ్ఛకులు. ''ఆవశ్యకములంటే, పైన వచ్చే విషయాదులను పోగొట్టే నిమిత్తం సాధన మాత్రంగా ఉండాలే గాని, తన్ను తెలుసుకునేందుకు కాదు. తానెప్పుడూ ఎక్కడా ఉండనే ఉన్నాడు. అడ్డు వచ్చే విషయాదులను త్రోసివేసే నిమిత్తమే శ్రవణాదులు గ్రహించాలి గాని, అవే ముఖ్యమని భావిస్తే, నేను పండితుడను, గొప్పవాడను అనే అహంకారానికి కారణమౌతవి. అదొక పెద్ద సంసారం.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచికార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: తెలివైన నిర్ణయాలు తద్వారా విజయాలు చేకూరుతాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

వృశ్చిక రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపార పరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఆకస్మికం. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: నూతన ఉత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభవ్యయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: ఋణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



సంస్కృతి

మహాశివరాత్రి పర్వదినమును భారతదేశములోని అన్ని శైవ క్షేత్రముల యందు వైభవముగా జరుపుకొనుట హైందవాచారము. కానీ, కోటప్పకొండ క్షేత్రమునకు ఓ ప్రత్యేకత వున్నది. కోటప్పకొండ క్షేత్రమునకు సమీప గ్రామాల ప్రజలు ప్రభలను నిర్మించుకొని మొక్కులు చెల్లించుకోవడం సాంప్రదాయం. దాదాపు 65 అడుగుల నుండి 75 అడుగుల వరకు ఎత్తైన ప్రభలను విద్యుత్ దీపాలతో అలంకరించుకొని కోటప్పకొండకు తీసుకొని వెళ్తారు. ఈ ప్రాంతంలో 18కిలోమీటర్ల దూరంలో వున్న పురుషోత్తమ పట్నం గ్రామం నుండి 10 ప్రభలు బయలుదేరి వెళ్తాయి. దాదాపు 2కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఈ ప్రభలను ఆ గ్రామప్రజలు నిర్మిస్తారు. ఇంకా...కావూరు, కమ్మవారిపాలెం, కనపర్రు, అమీకి సాహెబ్ పాలెం మొదలైన గ్రామాల ప్రజలు కూడా ప్రభలు కట్టి మొక్కులు చెల్లించుకుంటారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో వున్న బంధువులు, స్నేహితులు "మహాశివరాత్రి తిరుణాల"కు ఈ గ్రామాలకు ప్రత్యేకంగా వస్తారు.



ప్రభల వెలుగుల్లో

కోటప్పకొండ తిరుణాల

"చేదుకో కోటయ్యా...! మమ్మాదుకో కోటయ్యా...!" అని నినదించే భక్తుల కొంగుబంగారం

"కోటప్పకొండ శ్రీ త్రికూటేశ్వరుడు!"

"కోటాజన్మకృతం పాపం-కోటిక్షేత్రేవినష్యతి
కోటిక్షేత్రేకృతం పాపం-కుంభీపాన వినష్యతి
త్రికోటేశ్వరః కోమలాకారః కోటిసూర్య సమప్రభా
కోటి బ్రహ్మాండ సంచారః కోటేశ్వర నమోస్తుతే!!"

పిలిస్తే పలికే దైవము, భక్తుల కోర్కెలు తీర్చే అనురాగమూర్తి, కష్టాల నుండి కాపాడే ఆపద్బాంధవుడు, సంతాన ప్రదాతగా యుగయుగాల నుండి పూజలందుకుంటున్న మహాశివుడు కోటప్పకొండపై కొలువై వున్నాడు. పార్వతి లేని శివునిగా... దక్షిణామూర్తిగా కోటప్పకొండపై స్వయంభువుగా వెలసిన పరమేశ్వరుడే, త్రికోటేశ్వరస్వామిగా 11వ శతాబ్దం నుండి పూజలందుకుంటున్నాడని స్థలపురాణం పేర్కొంటున్నది. అభీష్ట వరప్రదాత శ్రీ త్రికోటేశ్వరుని...దక్షిణామూర్తిగా భావించి ఆరాధించిన వారికి మోక్షసిద్ధి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

శ్రీ త్రికోటేశ్వరుని పురాణ ప్రాశస్త్యము గురించి అద్భుతమైన గాథ శివపురాణములో నెలకొని ఉన్నది.

దక్షయజ్ఞము ధ్వంసమైన తదుపరి పరమశివుడు ఈ త్రికూటాద్రిపై మధ్యమ శిఖరమైన "రుద్ర శిఖరము"న బిల్వ వనములోని వటవృక్షము క్రింద బ్రహ్మాది దేవతలకు జ్ఞానబోధ చేసినట్లు ప్రతీతి. దక్షయజ్ఞ సమయము నందు శివుడు లేకుండా భుజించుట వలన వచ్చిన పాపమును పోగొట్టుకొనుటకు బ్రహ్మ, విష్ణువు ఆదిగా గల దేవతలు శివుని గురించి ఘోరతపస్సు చేశారు. వారి తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమైన ఆ ప్రదేశమునందు తనే త్రిశూలంతో గుచ్చి నీటిధారలను ప్రవహింపజేశాడు. ఆ తరువాత వారిని...అందులో స్నానం చేయమని, తద్వారా వారి పాపాలు నశించగలవని తెలిపాడు. అప్పుడు దేవతలందరూ పరమే శ్వరుణ్ణి ఆ క్షేత్రముపై లింగముగా అవతరించమని వేడుకున్నారు. వారి కోరికను మన్నించి శివుడు లింగముగా అవతరించి వారిని సంతృప్తి పరిచినాడు. అప్పటి నుండి ఆ లింగము "పాపవినాశనలింగము"గా తీర్థము "పాపవినాశనతీర్థము"గా ఆ క్షేత్రము "పాపవినాశనక్షేత్రము"గా అలరారుచున్నది. రుద్ర శిఖరమునకు ఇరువైపులనున్న కొండ శిఖరములపై బ్రహ్మదేవుడు.. శ్రీమహావిష్ణువు కొలువై వుండి పరమేశ్వరుని సాక్షాత్కారము కోసం తపస్సు చేసినారని స్థలపురాణం తెలియజేయుచున్నది. అందుకే ఈ క్షేత్రమునకు "త్రికూటాచలం" అను పేరు స్థిరపడినది.


పూర్వం సాలంకయ్య, ఎల్లముని, ఎల్లమంద అనే ముగ్గురు సోదరులు త్రికూటాచలం పాదాల చెంత నివసించేవారు. పరమేశ్వరుని భక్తులైన ఈ ముగ్గురు సోదరులు పూజ చేయడానికి పూలు తీసుకురావడానికి అడవిలోనికి వెళ్లారు. అప్పుడే కుండపోతగా వర్షం కురియసాగింది. వానకు భయపడి ముగ్గురూ దగ్గరలో వున్న గుహలో తలదాచుకున్నారు. అప్పుడు వారికి ఆ గుహలో "లంకెబిందె" దొరికింది. దానిని తీసుకొని అన్నదమ్ములు ముగ్గురూ తమ నివాసానికి వెళ్లిపోయారు. ఈ సంఘటన జరిగిన కొన్ని రోజులకు సాలంకయ్య శివుని పూజిస్తుండగా లింగము నుండి ఓ జంగమయ్య ప్రత్యక్షమైనాడు. ఆయనను శివునిగా తలచి తన ఇంటికి తీసుకుపోయి రోజూ అర్చిస్తూ ఉండేవాడు. ఓ ఉదయాన సాలంకయ్యతో చెప్పకుండా ఆ జంగమయ్య అదృశ్యమైపోయాడు. ఈ విపరీత పరిణామానికి దుఃఖిస్తూ జంగమయ్య కోసం కొండలూ, గుట్టలు తిరుగుతూ ఆహారం తీసుకోవడం కూడా పూర్తిగా మానివేశాడు సాలంకయ్య.

త్రికూటాద్రి (కోటప్పకొండ) కి సమీపాన "కొండకావూరు" అను గ్రామం కలదు. ఆ గ్రామానికి చెందిన ఆనందవల్లి అను యాదవ వనిత చిన్న వయసు నుండి శివభక్తురాలు. త్రికూటాద్రికి దక్షిణాన ప్రవహించే "ఓంకార" నదిలో స్నానమాచరించి, ప్రతిరోజూ కొండపై వేంచేసి వున్న కోటప్పస్వామి (శ్రీమేధాదక్షిణామూర్తి) వారికి పాలు, తేనె, పుష్పాలు, నైవేద్యం, సమర్పిస్తూ వుండేది. ఎండ, వాన, చలి... అన్ని కాలములయందు, శ్రమను దూరంగా పెట్టి కొండపైకి వెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పిస్తూ ఉండేది. పరమశివుడు, ఆనందవల్లిని పరీక్షింపదలచి ఆమెకు "మాయా గర్భం" సృష్టించాడు. నెలలు నిండుతున్నప్పటికీ...ఎవరి మాటనూ లక్ష్యపెట్టక..ఆనందవల్లి కొండపైకి వెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించుచున్నది.

ఒకరోజు ఆమె పర్వతం పైకి ఎక్కడం ప్రారంభించగానే... ఈదురుగాలులు, పిడుగులతో కూడిన భయంకరమైన వర్షం కురియసాగింది. అయిననూ చలించక ఆనందవల్లి స్వామివారిని దర్శించి పుష్పాలు, పాలు, నైవేద్యం సమర్పించింది. ఆమె భక్తికి మెచ్చిన శివుడు ఆమెతో "శివలింగం" నుండే మాట్లాడాడు.

"తల్లీ! ఆనందవల్లీ! ఈ జడివానను సైతం లెక్కచేయక మమ్ములను దర్శించుకున్నావు...నీకు ఏ వరం కావాలో కోరుకో!" శివలింగం అంతర్భాగం నుండి వెలువడిన ఆ మాటలను విని ఆనందవల్లి సంభ్రమాశ్చర్యాలతో నోటమాటరాక ఆ శివలింగం ముందు మోకరిల్లింది. "తండ్రీ...సాంబశివా! నీవాక్కుతో నా జన్మధన్యమైనది. నాది ఒక్కటే కోరిక...ప్రతిదినమూ ఈ కొండపైకి ఎక్కలేకపోతున్నాను. స్వామీ! నీవు నా గృహమునకు వచ్చిన యెడల జీవితాంతం సేవించుకుంటాను!". ఆమె ప్రార్థన విన్నంతనే శివుడు..."అమ్మా, ఆనందవల్లీ! నీ అభ్యర్థన మన్నించి నీ ఇంటికి వస్తాను..కానీ నీవు వెనుకకు తిరిగి చూడకుండా వెళ్లుము!" అని ఆమెకు వరమిచ్చినాడు. వెంటనే ఆనందవల్లి సంతోషంతో కొండ దిగడం ప్రారంభించింది. వెనుక. భయంకరమైన శబ్దాలు, మెరుపుల్లాంటి దివ్య కాంతులు వెలువడుతున్నాయి. సరిగ్గా బ్రహ్మ శిఖరంపైకి రాగానే ఆనందవల్లి భయంతో వెనుదిరిగి చూసింది. అంతే...! శివుడు ఆ ప్రదేశంలో "శివలింగం"గా మారిపోయాడు. అదే... నూతన కోటేశ్వర స్థానము. వెనువెంటనే, ఆనందవల్లి నుండి ఒక దివ్యశక్తి శ్రీ త్రికోటేశ్వరస్వామిలో ఐక్యం చెందింది. వెనుకకు చూస్తున్న భంగిమలో ఆనందవల్లి శిలాకృతి పొందినది.





జంగమయ్య కోసం తిరుగుతోన్న సాలంకయ్య అవస్థను చూసిన పరమేశ్వరుడు అతని ముందు ప్రత్యక్షమై తను ఉనికిని చాటుకున్నాడు. "సాలంకయ్యా! నీ భక్తికి మెచ్చినాను. నేను నీవాడనే! నీ ఇంటి నుండి బైలుదేరిన నేను...గొల్లభామకు దర్శనమిచ్చి శివైక్యమును ప్రసాదించాను. నేను ఈశిఖరము నందే స్థిరముగా వుంటాను. నీవు నన్ను త్రికోటేశ్వరునిగా "శివలింగం" రూపంలో పూజింపుము. మహాశివరాత్రి పర్వదిన మున ఉపవాస దీక్షతో నన్ను అభిషేకించి, రాత్రి జాగరణ చేసి, సంకీర్తనలతో నన్ను మెప్పించి అన్నదానం చేయము. ఆనందవల్లికి కూడా దేవాలయమును నిర్మించుము. నన్ను దర్శించుకోవాలని వచ్చే భక్తులు ముందుగా ఆమెను సేవించుకొని...ఆ తదుపరి నా చెంతకు వస్తారు. ఈ క్షేత్రమున నన్ను దర్శించుకొని, నాకు మొక్కులు చెల్లించుకొను భక్తులను నేను నిరంతరమూ వెన్నంటి వుంటాను. వారి కోరికలు తీర్చి సిరిసంపదలను అనుగ్రహిస్తాను. నీవు ఈ జన్మాంతరమున నాలో ఐక్యమవుతావు...!" అని పలికి అదృశ్యమైనాడు.

పరమేశ్వరుడు స్వయంభువుగా వెలిసిన ఈ పవిత్ర పుణ్య క్షేత్రం పావన కృష్ణానదీ తీరమున గుంటూరు జిల్లాలోని నరసరావుపేట పట్టణానికి 14కి.మీ దూరంలో ఎల్లమంద, కొండకావూరు గ్రామాల మధ్య "త్రికూటాచలం"గా అలరారుచున్నది.

ఈ పర్వతానికి ఓ ప్రత్యేకత ఉంది. దీనిని మూడు వైపుల నుండి చూసినా మూడు కూటాలుగా కనిపిస్తుంది సృష్టి, స్థితి, లయ కారకులైన త్రిమూర్తుల శిఖరాలుగా పురాణ ప్రాశస్త్యం కలిగిన శిఖరాలు.

మహాశివరాత్రి పర్వదినమును భారతదేశములోని అన్ని శైవ క్షేత్రముల యందు వైభవముగా జరుపుకొనుట హైందవాచారము. కానీ, కోటప్పకొండ క్షేత్రమునకు ఓ ప్రత్యేకత వున్నది. కోటప్పకొండ క్షేత్రమునకు సమీప గ్రామాల ప్రజలు ప్రభలను నిర్మించుకొని మొక్కులు చెల్లించుకోవడం సాంప్రదాయం. దాదాపు 65 అడుగుల నుండి 75 అడుగుల వరకు ఎత్తైన ప్రభలను విద్యుత్ దీపాలతో అలంకరించుకొని కోటప్పకొండకు తీసుకొని వెళ్తారు. ఈ ప్రాంతంలో 18కిలోమీటర్ల దూరంలో వున్న పురుషోత్తమ పట్నం గ్రామం నుండి 10 ప్రభలు బయలుదేరి వెళ్తాయి. దాదాపు 2కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఈ ప్రభలను ఆ గ్రామప్రజలు నిర్మిస్తారు. ఇంకా..కావూరు, కమ్మవారి పాలెం, కనపర్రు, అమీకి సాహెబ్ పాలెం మొదలైన గ్రామాల ప్రజలు కూడా ప్రభలు కట్టి మొక్కులు చెల్లించుకుంటారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో వున్న బంధువులు, స్నేహితులు "మహాశివరాత్రి తిరుణాల"కు ఈ గ్రామాలకు ప్రత్యేకంగా వస్తారు.


ఉభయ తెలుగు రాష్ట్రాలలో శివరాత్రి సందర్భముగా జరిగే తిరుణాలల్లో "కోటప్పకొండ తిరుణాల" అగ్రగణ్యమైనది. ఇంత పెద్ద తిరుణాల మరి ఏ క్షేత్రంలోనూ జరగదంటే అతిశయోక్తి కాదు. దాదాపు 20 లక్షల మంది భక్తులు ఈ సందర్భంగా కోటప్ప స్వామిని దర్శించుకుంటారు. విద్యా, వ్యాపార, ఆరోగ్య ప్రాప్తికోసం, సంతానప్రాప్తి కోసం భక్తులు శ్రీ పరమేశ్వరస్వరూపంతో వున్న కోటప్పస్వామిని ప్రార్థిస్తారు. వారి కోరికలు తీరిన తర్వాత శ్రీస్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటాము. ప్రతి మనిషీ జీవితంలో ఒక్కసారైనా "కోటప్పకొండ తిరుణాల"ను తప్పని సరిగా చూడాలి. కోటప్పస్వామి ఆశీస్సులు పొందాలి.

- విడదల సాంబశివరావు
9866400059

ప్రాచీన ఆలయాల నిలయం జైపూర్

భారతదేశ పర్యాటక ప్రదేశాలలో ప్రధాన ఆకర్షణ గల నగరం జైపూర్. అంతర్జాతీయ పర్యాటకులను, దేశీయ పర్యాటకులను విశేషంగా ఈ నగరం ఆకర్షిస్తున్నది. అనేకమంది ప్రజలు ఇక్కడి కోటలు, జ్ఞాపక చిహ్నాలు, దేవాలయాలను సందర్శించి భారతీయ పురాతన శిల్పకళా, నిర్మాణ కళా వైభవానికి ముగ్ధులవుతుంటారు. జైపూర్ నగర ఆర్థిక వనరులలో పర్యాటక రంగం ప్రధానమైనది. పర్యాటకుల సంఖ్యను పెంచటానికి అదనపు సౌకర్యాలు, ఆకర్షణలు అధికం చేయాలని నగర పాలకులు ఆలోచనలు చేస్తున్నారు. జైపూర్‌లో అనేక కోటలు, రాజభవనాలు, జ్ఞాపక చిహ్నాలు కనిపిస్తాయి. హవామహలు, అంబర్ ఫోర్ట్, జైఘర్ ఫోర్ట్, నహర్గర్ ఫోర్ట్, చిటీ ప్యాలెస్, జల్ మహల్, రామ్బర్ఫ్యాలెస్, సెంట్రల్ మ్యూజియమ్ వంటివి పర్యాటకులను విపరీతంగా ఆకర్షించే ప్రదేశాలలో కొన్ని.

జైపూర్ నగరమంత అసంఖ్యాకంగా ఆలయాలు, ఆరాధనా ప్రదేశాలు ఉన్నాయి. ప్రతి ఒక్క వీధిలో చక్కని ఆలయాన్ని దర్శించవచ్చు. మతపరంగా ప్రజలు ఈ నగరాన్ని చిన్న కాశి నగరంగా భావిస్తారు. జైపూర్ నగరంలోని ప్రధాన ఆలయాలుగా గోవింద్ దేవ్‌జీ ఆలయం, గల్తాజీ ఆలయం, శ్రీకాళి ఆలయం, సంగనేరి ద్వారం, లక్ష్మీనారాయణ మందిరం (బిర్లామందిర్)ఘర్ తిహోల్, రాధాగోవింద్‌జీ ఆలయం, క్రైస్తవ సమాజం కొరకు 130 సంవత్సరాలకు పూర్వం నిర్మించబడిన సెయింట్ చర్చి. ఇలా ప్రతి వీధిలో ఆలయాలు దర్శనమిస్తాయి. ఒకరకంగా జైపూర్ ఆలయాలకు నిలయంగా చెప్పవచ్చు. ఈ ఆలయాల నిర్మాణంలో భారతీయ శిల్ప,వాస్తుకళలు కనిపిస్తాయి. జైపూర్ నగరం అంతా అందమైన పూదోటలు, ఉద్యానవనాలతో నిండి ఉంటుంది. రామ్‌నివాస్ గార్డెన్, సిసోలియా రాకి గార్డెన్, ప్యాలెస్, విద్యాదర్ గార్డెన్, కనకబృందావన్, సెంట్రల్ పార్క్, మానసరోవర్‌లో టెక్నాలజీ పార్క్, గోనర్ వద్ద ఉన్న విద్యాదర్ కా బాగ్ మొదలైనవి ప్రధానమైనవి. ఇవి కాకుండా చాంద్ బయోరి (మెట్లబావి) ఛోకోదాని (గ్రామీణ విశ్రాంతి గృహం) జైపూర్ నగర్ స్లమ్ అయిన కత్పుత్లి స్లమ్, రాజ్‌మందిర్ సినిమా వంటివి కూడా పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. జైపూర్‌లో ప్రధాన మతాలు హిందూ, ముస్లిమ్, జైనమతాలు. హిందువులు 78శాతం, ముస్లింలు 17శాతం, జైన్లు 4శాతం, సిక్కులు 0.5శాతం మంది ఉన్నారు.



జైపూర్ భారతీయ సంస్కృతికి ప్రధాన కేంద్రం. ముఖ్యంగా జవహర్ కళా కేంద్రం, రవీంద్ర మంచ్ ఐక్య రాజస్థాన్ సంస్కృతిని ప్రజలకు చేరువ చేస్తున్నాయి. ఆబర్ట్‌హాల్లో మ్యూజియమ్ ప్రభుత్వ సెంట్రల్ మ్యూజియమ్‌లో అనేక కళలను, పురాతన కళాఖండాలను చూడవచ్చు. హవా మహల్‌లో రాష్ట్రప్రభుత్వ వస్తు కళా ప్రదర్శనశాలలో విరాటనగర్‌లో కళా ప్రదర్శనా నెలకొని ఉంది. టౌన్‌హాల్ (పాత విధానసభ)ను వస్తు కళా ప్రదర్శన శాలగా మార్చబడింది. నగరంలోని వివిధ ప్రదేశాలలో వివిధ రూపాలలో సంస్కృతి ప్రతిబింబిస్తూ ఉంటుంది. నగరంలోని ఫ్లైఓవర్లు కూడా ఆకర్షణీయంగా వుంటాయి. ఇవి వివిధ రూపాల్లో సంస్కృతిని ప్రతిబింబిస్తూ ఉంటాయి.

రాజస్థాన్‌ను పాలించినవారు కళాపోషకులుగా పేరు పొందారు. వారు పలుకళలను, కళాకారులను ఆదరించి ప్రోత్సహించారు. దేశం నలుమూలల నుంచి అలాగే అంతర్జాతీయంగా నైపుణ్యం కలిగిన, కళాకారులను, చేతిపనివారిని ఆహ్వానించేవారు. వివిధ సమూహాలకు చెందిన ప్రజలు రాజస్థాన్ చేరి అక్కడ స్థిరపడ్డారు. బంధాని, బ్లాక్ ప్రింటింగ్ (అచ్చుల సాయంతో అద్దకము) రాతి చెక్కడము, శిల్పాలు, టర్కిష్ (లోహ పాత్రల ఆలంకరణ, కొయ్య సామాను అలంకరణ) జరీపని, గోటుపని, కినారి, జర్ధారి, వెండి ఆభరణాలు, రత్నాలు, ఎనామిల్ పని, ఆభరణాలు, సూక్ష్మవర్ణ చిత్రాలు, బ్లూ పాటరీ (మృత్తిక కళాఖండాలు) దంతపు పని, షెల్లార్ పని (జిగురుతో చేసే పని) తోలు వస్తువుల తయారీ మొదలైన వాటిని ప్రముఖంగా చెప్పుకోవచ్చు. జైపూర్‌లో కథక్ మరియు ఇతర నృత్యాలు ఉన్నాయి.

జైపూర్ నోరూరించి పలు ఆహార పదార్థాలకు ప్రసిద్ధి. అంతర్జాతీయంగా పర్యాటకులను ఈ ఆహారపదార్థాలు ఆకర్షిస్తాయి. ఇక్కడ లభించే డాల్ భోటికుర్మా, మిస్సీరోటి, గేవర్ ఫేని, గజక్,చౌగుణికీ లడ్డూ, మూరిగ్‌తాల్ వంటి తీపి పదార్థాలు ఇక్కడ వంటకాల్లో చోటు చేసుకుంటాయి.

రాజస్థాన్ సంప్రదాయాల్లో సంస్కృతుల్లో సంవత్సరం పొడుగునా పండగలుంటాయి. గ్యాంలార్ ఫెస్టివల్, జైపూర్ రచయితల ఉత్సవాలు, కైట్ ఉత్సవం, శీతల మతా ఉత్సవం, చాక్సు సంత, గజోత్సవం మొదలైనవి ముఖ్యమైన పండుగలు.

నియోగి
9553097319

రసవంతం

పాండవ విజయం


'పాండవ విజయం' తిరుపతి వేంకట కవుల భారత నాటకాలలోనిది. 1909 ప్రాంతంలో తొలుత వీరు ఈ నాటకాన్ని రాశారు. దీనితో ఉద్యోగాన్ని కలిపి పాండవోద్యోగ విజయాలు అని ప్రదర్శించటం ఒక అలవాటు ఉంది. మొక్కపాటి వేంకటరత్నం గారు రాసిన ద్రౌపది మాన సంరక్షణలో మల్లాది అచ్యుత రామ శాస్త్రిగారి రాజసూయం, ద్రౌపదీ వస్త్రాపహరణం' కలిపి పాండవోద్యోగ విజయాలు రాత్రి పది నుంచి తెల్లవారిందాకా మేటి నటుల కలయికతో వాడవాడలా ప్రదర్శించిన ఘట్టాలు ఉన్నాయి.

బందరు డి.వి.సుబ్బారావుగారు పాండవ విజయం ఒక్కటే తాను కృష్ణుడు వేసి ప్రదర్శించేవారట. అందులో పింగళి లక్ష్మీకాంతంగారు, తిరుపతి వేంకట కవుల శిష్యులు ధర్మరాజు పాత్రధారణ జేసేవారు. పాండవ విజయంలో కృష్ణులుగా బెల్లంకొండ సుబ్బారావు, బందా కనకలింగేశ్వరరావు, అబ్బూరి వరప్రసాదరావు, పీసపాటి నరసింహమూర్తి, పాపరాజు రమణయ్య, గుడిపాటి సాంబయ్య, ఎ.వి.సుబ్బారావు, షణ్ముఖ ఆంజనేయరాజు మొదలైనవారు,



ధర్మరాజుగా అద్దంకి శ్రీరామమూర్తి, ముప్పవరపు కందుకూరి చిరంజీవిరావు, శివలెంక రాజేశ్వరరావు, జి.ఎస్.ఎస్. శాస్త్రి, అర్జునులుగా పంచాంగం రామానుజాచార్యులు, పులిపాటి వేంకటేశ్వర్లు, బి.వి.రంగారావు, కలప్రరు వేంకటేశ్వర్లు, పసుపులేటి స్వామినాయుడు, తంగిరాల శ్రీరామమూర్తి, మొదలైనవారు ఎంతో రసవంతంగా నటించేవారు. వీర కరుణ రస నాటకం పాండవ విజయం తిరుపతి వేంకట కవుల కవితా మాధుర్యానికి మచ్చుతునక.

- అయ్యదేవర పురుషోత్తమరావు
9290448444



మణిరత్నం మల్టీస్టారర్

క్రియేటివ్ డైరెక్టర్ మణిరత్నం కొంత విరామం తర్వాత కొత్త చిత్రాన్ని ప్రారంభిస్తున్నారు. ఈసారి మల్టీస్టారర్ సినిమా తీస్తున్నారు. ప్రేమకథల నుండి కమర్షియల్ సినిమాలకు మారారు. యాక్షన్ థ్రిల్లర్ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఆయన తాజా చిత్రం పేరు నవాబ్. ఇందులో అరవింద్ స్వామి, విజయ్ సేతుపతి, శింబు, ఫాహద్ ఫాజిల్ హీరోలుగా నటిస్తున్నారు. జ్యోతిక, ఐశ్వర్య నాయికలుగా నటిస్తారని తెలిసింది. ఈ సినిమా ఫస్ట్‌లుక్ విడుదల చేశారు.

మణిరత్నం సినిమా అనగానే అంచనాలు అధికంగా ఉంటాయి. మధ్యలో ఆయన సరైన సక్సెస్‌లు ఇవ్వలేనప్పటికీ, బ్రాండ్ ఇమేజ్ ఏ మాత్రం తగ్గలేదని సినీ వ్యాపార వర్గాలు అంటుంటాయి. మణిరత్నం సినిమాకు ఎ.ఆర్. రెహమాన్ స్వరరచన చేయడం కొత్తకాదు. వరుసగా 14వ సారి రెహమాన్ మణిరత్నం సినిమాలు పనిచేస్తున్నారు. తెలుగు, తమిళ, మళయాల భాషల్లో ఏకకాలంలో రూపొందే ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది.

రానా, అఖిల్ కలిసి



రానా, అఖిల్

రానా, అఖిల్ కలిసి ఓ సినిమా చేయబోతున్నారు. అయితే వీళ్లిద్దరూ కలిసి నటించే మల్టీస్టారర్ చిత్రం కాదిది. ఒకరు నిర్మాతగా బాధ్యతలు వహిస్తుండగా.. మరొకరు కథానాయకుడిగా నటించబోతున్నారు. అఖిల్ హీరోగా, రానా ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నారు. ఇది టాలీవుడ్‌లో ఓ ఆసక్తికరమైన సినిమా కానుంది. ఈ చిత్రానికి మరో వారసుడు దర్శకత్వం వహించబోతున్నారు. దర్శకుడు రవిరాజా పినిశెట్టి వారసుడు సత్య పినిశెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. సత్య పినిశెట్టి గతంలో తన సోదరుడు ఆది పినిశెట్టి కథానాయకుడిగా మలుపు అనే చిత్రాన్ని రూపొందించారు. థ్రిల్లర్ కథతో సాగే ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది. హలో చిత్రంతో తెరపైకి వచ్చిన అఖిల్...తన మూడో సినిమా సిద్ధం కాబోతున్నారు. తెలుగు, తమిళం, హిందీలో నటుడిగా తీరిక లేకుండా సినిమాలు చేస్తున్న రానా...నిర్మాతగా మారడమే ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇకగత రెండు చిత్రాలకు ప్రేమ కథలను ఎంచుకున్న అఖిల్...కొత్త సినిమాలో భిన్నమైన సినిమా చేయబోతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ సినిమా పూర్వ నిర్మాణ కార్యక్రమాలు మొదలవనున్నాయి.

పోలీసుల్లో రౌడీ

పవన్‌కల్యాణ్ నటించిన కొమరం పులి సినిమా గుర్తుందా... అందులో గ్లామర్‌తో చలాకిగా పోలీస్ పాత్రలో నటించిన నిఖిషా గుర్తుకువస్తుంది. ఆమె అందానికి, అభినయానికి తగినట్టుగా అవకాశాలు రాలేదు. దాంతో మరుగునపడింది. తాజాగా లేడీ ఓరియంటెడ్ సినిమాలో నటిస్తోంది.ఇందులో కూడా పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తోంది. దీనికి రౌడీ పోలీస్ అనే టైటిల్ నిర్ణయించారు. పవర్‌ఫుల్ పోలీస్ అధికారి కథ అని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో రిస్కీగా సాకే రోప్ యాక్షన్స్ సీన్స్ కూడా ఉంటాయట. వాటిని డూప్ లేకుండా నిఖిషా నటించిందని నిర్మాత చెప్పారు. మరో ప్రధాన పాత్రలో సీనియర్ నటుడు భానుచందర్ నటిస్తున్నారు. జానీ అనే దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆర్. ఎ. ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం పతాక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం ముజీర్, నిర్మాత వేణు, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం జానీ.



నిఖిషా



పవన్‌కల్యాణ్

సందిగ్ధంలోనే సినిమా నిర్ణయం

అజ్ఞాతవాసి విడుదలైన దరిమిలా...రాజకీయాల్లో తలమునకలయ్యారు పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్. ఈ నేపథ్యంలో వెండితెరపై ఆయన దారెటు అనేది అభిమానులు తేల్చుకోలేకపోతున్నారు. వాస్తవానికి ప్రజారాజ్యం పార్టీ పెట్టిన సమయంలోనే సినిమాలు వదిలేసి పూర్తిస్థాయి రాజకీయ జీవితానికి సిద్ధపడ్డారు పవన్. ఆ తర్వాత పార్టీ అనుకున్నంత ప్రజల్లోకి వెళ్లకపోవడంతో ఆ నిర్ణయాన్ని తాత్కాలికంగా పక్కనపెట్టారు. ఇటీవల మళ్లీ పవన్ మనసులో వెండితెర నుంచి తప్పుకోవాలనే ఆలోచన మెదులుతోంది. గత రెండు చిత్రాల ప్రచార కార్యక్రమాల్లో ఇదే విషయాన్ని అభిమానులకు చెప్పే ప్రయత్నం చేశారు పవన్. ఏ స్టార్ హీరో అయినా కొత్త సినిమా చేసే సన్నాహాల్లో ఉంటే చాలా ముందుగానే ఆ విషయం బయటకొస్తుంటుంది. అజ్ఞాతవాసి తర్వాత పవర్‌స్టార్ చిత్రమేదీ చర్చల్లో ఉన్నట్లు సమాచారం లేదు. అయితే గతంలో మైత్రీ మూవీస్‌కు పవన్ ఒక చిత్రాన్ని చేస్తానని అంగీకారం కుదుర్చుకున్నారు. చెప్పిన మాట ప్రకారం ఆ సినిమాకు పవన్ ముందుకొస్తే....మరో చిత్రాన్ని పవన్ అభిమానులు తెరపై ఆస్వాదించవచ్చు. సాధారణంగా ఒక చిత్రాన్ని చేయడానికి పవన్‌కు ఏడాది సమయమైనా పడుతుంది. అంటే మళ్లీ కొత్త ఏడాదిలో చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తుంది. అదే ఏడాదిలో సాధారణ ఎన్నికలు జరుగుతాయి. పవన్ కొత్త సినిమా చేస్తే దాని ప్రభావం ఆయన రాజకీయ గమనంపై పడుతుంది. పూర్తిగా ప్రజా జీవితంలోకి వెళితే మరో రెండేళ్ల తర్వాత గానీ ఆయన సినిమా చేయలేరు. ఇదంతా చూస్తుంటే ప్రస్తుతానికి చిత్రరంగంలో పవన్ గమనం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.



అదితీరావ్ హైదరీ

కైకాలకు విశ్వనట సమ్రాట్ బిరుదు



దిగ్గజ నటుడు కైకాల సత్యనారాయణకు విశ్వ నట సమ్రాట్ బిరుదును ప్రదానం చేయాలని నిర్ణయించినట్లు ఎంపీ, కళాబంధు సుబ్బిరామిరెడ్డి తెలిపారు. మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 13,14వ తేదీల్లో విశాఖపట్నం సముద్రతీరాన జరిగే కోటి లింగాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో కైకాలకు ఈ బిరుదును ఇవ్వనున్నట్లు సుబ్బిరామిరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమ వివరాలను హైదరాబాద్ పార్క్ హయత్ హోటళ్లో సుబ్బిరామిరెడ్డి తెలియజేశారు. ఆయనతో పాటు ఈ కార్యక్రమంలో మురళీ మోహన్, కైకాల సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బిరామిరెడ్డి మాట్లాడుతూ....సినిమాకు గొప్ప ఆకర్షణా బలముంది. అలాంటి చిత్ర రంగంలో దశాబ్దాల పాటు నటుడిగా వెలిగారు కైకాల సత్యనారాయణ గారు. నాకు మంచి మిత్రులు. ఎన్నో రకాల పాత్రలు చేసి ప్రేక్షకులను మెప్పించారు. కైకాల గారికి విశ్వనట సమ్రాట్ అనే బిరుదును ఇచ్చి సత్కరించాలనుకుంటున్నాము. విశాఖ తీరంలో లక్షలాది జనం మధ్యలో మహాశివరాత్రి పర్వదినాన కైకాల గారిని సత్కరించుకుంటాం. అన్నారు. మురళీ మోహన్ మాట్లాడుతూ...నాకు తెలిసి కైకాల గారు అజాత శత్రువు. ఎన్నో విభిన్నమైన పాత్రలు చేశారు. నిర్మాతలకు అనుకూలంగా ఉన్నారు. నా లాంటి వాళ్లకు పరిశ్రమలో ఎలా నడుచుకోవాలో హితవులు చెప్పారు. ఆయనకు విశ్వనట సమ్రాట్ బిరుదు ఇవ్వడం ఎంతైన సముచితం. అన్నారు. కైకాల సత్యనారాయణ మాట్లాడుతూ....నాకు 85 ఏళ్లు. దాదాపు నా జీవితం సినిమాల్లోనే గడిచింది. తెలుగు సినిమాను ప్రపంచ వ్యాప్త ప్రేక్షకులు ఆదరిస్తూ వస్తున్నారు. అందుకే నాకు విశ్వనట సమ్రాట్ బిరుదు ఇస్తున్నారు. ఇది పద్మ పురస్కారాల కంటే గొప్పగా భావిస్తాను. అన్నారు.

2018 యష్ చోప్రా స్మారక పురస్కారం....ఈ ఏడాది యష్ చోప్రా స్మారక పురస్కారాన్ని గాయని ఆశాభోంస్లేకు ఇవ్వనున్నట్లు సుబ్బిరామిరెడ్డి తెలిపారు. ఈ నెల 16వ తేదీన ముంబై మారియట్ హోటళ్లో ఈ పురస్కార ప్రదాన కార్యక్రమం జరగనుంది.

సమ్మోహన సుందరి

సినిమాలో సినిమా జరిగే కథలు చూస్తూనే ఉంటాం. అలా ఓ నాయిక తన చిత్రంలో నాయికగా నటించడం మరో విశేషం. ఈ ప్రత్యేక పాత్రను పోషిస్తోంది బాలీవుడ్ భామ అదితీరావ్ హైదరీ. దక్షిణాది చిత్రాలతో కెరీర్ ప్రారంభించిన అదితీ...మలయాళ, తమిళ సినిమాలు చేసి, ఆ తర్వాత బాలీవుడ్ వెళ్లి అక్కడ పేరున్న నాయిక అయ్యింది. పలు విజయవంతమైన చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం మళ్లీ టాలీవుడ్ చేరి సుధీర్‌బాబు సరసన నటిస్తోంది. సమ్మోహనం అనే పేరుతో దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమా మూడో షెడ్యూల్ ఇటీవలే పూర్తయింది. కథ ప్రకారం ఈ చిత్రంలో హీరోయిన్ పాత్రలో నటిస్తోంది అదితీ. సుధీర్‌బాబు కామిక్ బుక్ ఇలస్ట్రేటర్‌గా కనిపించనున్నారు. ఈ రెండు పాత్రలు ఎలా సన్నిహితమయ్యాయన్నది ఆసక్తికరంగా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు. ఇక తన నట ప్రయాణంలో ఇన్ని భాషల్లో నటించడంపై అదితీ మాట్లాడుతూ...సినిమా కథలు మనిషి భావోద్వేగాలను చూపిస్తాయి. ఈ అనుభూతులకు భాషా బేధాలు ఉండవు. సంతోషాలకు, బాధలకు మనుషులంతా ఒకేలా స్పందిస్తారు. నేను ఎంచుకునే చిత్రాలకూ హద్దులు చూడను. భాష, ప్రాంతం లాంటి తేడాలు నన్ను నటించకుండా అడ్డుకోవడం ఇష్టముండదు. మరింత మంది గొప్ప దర్శకులతో పనిచేయాలని ఉంది. అని చెప్పింది.